TPL 1936
398

పల్లెవాసి

★

గ్రంథాలయం
కృష్ణాజిల్లా

రచన:
కొసరాజు శేషయ్య

★

ప్రచురణ:
వీన గ్రంథమాల, విజయవాడ 2.

ప్రథమ ముద్రణ
అక్టోబరు 1961

CIII

6

వెల : 3-50

ముద్రణ :
రాజా ప్రెస్, విజయ

పరిచయం

కామ్రేడ్ కొసరాజు శేషయ్యగారు ముప్పదేళ్ళ రాజకీయ జీవితంలో నాకు సహచరులు, ఆప్తమిత్రులు. దేశభక్తి స్వప్రయోజనాలకు వినియోగించడం, ప్రజాసేవ పేరుతో పదవులకొరకు ఎగబ్రాకడం ఎరుగనివారు శేషయ్యగారు.

జీవితానుభవంలో తమదృష్టికివచ్చిన ఘటనలను, ఘర్షణలను తెలుపుతూ శేషయ్యగారు అనేక కథలను, నవలను వ్రాశారు. వారికథలు 'చిత్రగుప్త', 'ప్రజాబంధు', 'ప్రభ', 'నవశక్తి', 'ప్రజాశక్తి', 'విశాలాంధ్ర' పత్రికల్లో ప్రచురించబడి ప్రజాదరణ పొందాయి. జాతీయ స్వాతంత్రోద్యమంలో వచ్చినపరిణామం, మార్పులు వ్యక్తులపై ఎలాంటిప్రభావం కలిగించాయో తెలుపుతూ, "తారుమారు" అనే నవలను శేషయ్యగారు వ్రాశారు. ఆనవల ఆదర్శగ్రంథ మండలివారిచే ప్రచురితమై ప్రజాభిమానం చూరగొన్నది.

"పల్లెవాసి" అను ఈ చిన్న నవలలో పల్లెటూరు సామాజిక జీవితంలోవస్తున్న మార్పులను చిత్రించడానికి రచయిత ప్రయత్నించారు. గ్రామకక్షలు–మున్సబ్, కరణం పార్టీల మధ్య ఘర్షణల ఫలితంగా వ్యవసాయకూలీ పల్లెలో

కూడ చీలికలు వస్తాయి. కోట్లాటల్లోను, క్రిమినల్ కేసుల్లోనూ బీదప్రజలు నలిగిపోతారు. ఐనప్పటికీ క్రమక్రమంగా చైతన్యవంతులై పల్లెవాసులు ఐకమత్యం సాధించుతారు. బంజరుభూమి సాగుకు వ్యవసాయకూలీలు చేసే ప్రయత్నాలను భగ్నం చేసేందుకు భూస్వాముల కుట్రలను, అధికారుల పక్షపాతాన్ని "పల్లెవాసి" నిరూపించింది.

మిత్రులు శేషయ్యగారి యితర రచనలవలెనే "పల్లెవాసి" నవలను తెలుగుప్రజలు ఆదరించుతారని ఆశించుతాను. క్రొత్తగా పుస్తక ప్రచురణకు పూనుకున్న "నవీన గ్రంథమాల" వారి కృషి ఫలించాలని కోరుతాను.

అభివందనాలతో,

మద్దుకూరి చంద్రశేఖరరావు.

21-10-1961

౧

ప్ర క ర ణ ం 1

మృగశిర కార్తె ప్రవేశించి రెండుదినాలైంది. ఆ రాత్రి వచ్చిన పెద్ద గాలీవానకు పల్లెలో వున్న పాకలన్నీ చాలావరకు కప్పులు కొట్టుకుపోయాయి. దళ్ళు, పెనకలు నేలమీద కూలాయి. చెట్లు కొమ్మలు విరిగి, ఆకులు రాలి బోడిగా అగుపించాయి. వీధులన్నీ చెత్తా చెదారంతో చికాకుగా వున్నాయి. గుంటలు, పల్లాలు నీటితో నిండాయి. పిల్లలు గుంటలుచుట్టూ పోగై కప్పలను తరుముతూన్నారు. "కప్పలను చంపితే అప్పలు చచ్చిపోతారు" అన్నాడు గుర్నాథం గుంటలో దిగిన రాముడినీ, రంగడినీ రాజన్ననూ చూస్తూ.

గుర్నాథానికి పది సంవత్సరా లుంటాయి. తెల్లగా వుతికిన చొక్కా, నిక్కరు తొడుక్కుని గుంటవొడ్డున తాపీగా కూచున్నాడు. రాముడు, రంగడూ, గుర్నాథం వయస్సు వాళ్ళే కాని రాజన్న మాత్రం వారికంటె రెండుమూడు సంవత్సరాలు చిన్నవాడు. గుర్నాథం అన్నమాటతో ముగ్గురూ నిశ్చేష్టులై అతనివైపు చూచారు. రంగడు పండ్లు యికిలిస్తూ "నాకేం, నాకు అసలు అప్పలు లేరుగా" అన్నాడు.

"నీ యమ్మ! మీ కమలప్ప లేదంటరా!" చిన్నోడు రాముడు ముక్కులో చీమిడి ఎగరేస్తూ అన్నాడు.

"ఓస్ ? అది మా సొంతప్ప కాదుగా, మా పిన్నాం కూతురమ్మే" అంటూ మళ్ళీ పండ్లికిలించాడు రంగడు.

"రాజన్నా, నువ్వురా!" ప్రశ్నించాడు గుర్నాథం. రాజన్న గుడ్లు మిటకరించాడు. కొంచెంసేపు ఆలోచించి "నేను కప్పలను చంపడంలేదుగా. పట్టుకుంటున్నా నయ్యే!" అన్నాడు రాజన్న గుర్నాథంవైపు చూస్తూ.

"ఏయ్! నువ్వు ఇందాక ఆ గోండు కప్పను చంపలా" అన్నాడు రంగడు రాజన్నను సవాలుచేస్తూ. రాజన్న గుడ్లు తేలేశాడు. "అబ్బో-అబ్బో, నేనెందు కయ్యిందమ్మా! నేనేమో దాని కాలికి తాడు కట్టాను. రాముడు దానిని పట్టుకుని గిరాగిరాతిప్పి నేలకేసి బాదాడు. అది చచ్చింది. నాకేం. ఆ పాపం రాముడికే తగులుతుంది." అన్నాడు రాజన్న.

రాముడు రాజన్న ముఖంలోకి చురచురా చూశాడు. "ఒరేయ్! నీయమ్మా, నాయాలా! రాజిగా! ఎందుకురా పొద్దున్నే అబద్దాలాడతావు. అసలు ఆ కప్పను పట్టుకుంది నువ్వు. దాని కాలికి తాడు కట్టి గిరాగిరా తిప్పింది నువ్వు. అదేమో చచ్చింది. ఆ తరువాత నేను దాన్ని నేలకేసి కొట్టాను. అసలు దాన్ని చంపింది నువ్వేగా అన్నాడు రాముడు.

రాజన్న కళ్ళల్లో నీళ్ళు దిరిగాయి. ఉక్రోషంతో ముఖం జేవురించింది." నీ యమ్మా! దొంగనా కొడకా! దాన్ని నువ్వు చంపి పైగా నామీద పెడతావా?" అంటూ యింత బురద తీసి రాముడు మీదికి విసిరాడు. రాముడు రాజన్నమీద కలియబడి జుట్టు పట్టుకుని అటూ, ఇటూ ఊపాడు. రాజన్న ఉక్కిరి బిక్కిరయ్యాడు. రాముడి చెయ్యి

పట్టుకుని గట్టిగా కరిచాడు. రాముడు చెయ్యి విదిలించుకుని రాజన్నను బురదలో పడేసి పైనఎక్కి తొక్కాడు.

బావిదగ్గర బట్టలు వుతుకుతున్న నీలం పరుగెత్తుకు వచ్చింది. నలుగురూ పోగయ్యారు.

"ఓశమ్మో! పిల్లాడిని చంపేశాడే"లబలబ లాడింది అచ్చమ్మ. "ఓ కోటమ్మో! మా రాజిగాడిపాణం నిలువునా తీశాడే లచ్చికొడుకు రామిగాడు" శోకంపెట్టింది ముసలమ్మ.

నీలం రాముడిని యివతలకు లాగి రాజన్న ముఖం మీది బురద తుడిచివేసింది. రాముడితల్లి లచ్చి, రాజన్నతల్లి కోటమ్మా అంతా పోగయ్యారు.

లచ్చి కొడుకును అదమాయించింది. "ఒరే! పోనమాకలోడా, పనిలోకి చావకుండా పొద్దున్నే యిద్యాం పెంటతగువులా" అంటూ రాముడ్ని పట్టుకోబోయింది. కాని వాడు తప్పించుకుని పరుగు తీశాడు.

కోటమ్మ దవడలు నొక్కుకుంది. "అబ్బో! చూశావా అచ్చమ్మత్తా! నేను నోరన్నా మెదిపానా! యీ నా సైతి చూడు ఎట్టా వాగుతుందో. పొద్దున్నే పెంట తగువంట. దాని కొడుకేమో నాపిల్లాడిని పట్టుకొని నుగ్గునుగ్గు చేసే. పైగా ఎదురు రంకా! దీనినోరు నొక్కుకుపోనూ. అది అన్నం తినే నోరై తేగా సరయినమాటలు రాడానికి, గడ్డితినే నోరయ్యె!" అంది కోటమ్మ నలుగురివంక చూస్తూ.

కొడుకును పట్టుకునే యత్నం మాని లచ్చి కోటమ్మ దగ్గరకు వచ్చి ఎదురుగా నిలబడింది. కోటమ్మ రాజన్నను చంక నెత్తుకుని రెండోచెయ్యి ఆడిస్తూ చుట్టూ వున్నవారి

నందరిని వుద్దేశించి "చూడండి అమ్మల్లారా! నా బిడ్డే మయ్యాడో. ఆడి కాష్టంకాలా, నా నాయన్ని బురదలో పడేసి కూరాడే! ఏముంది. ఆ నీలంఅడ్డంపోకపోతే నాబాబు ప్రాణాలు నిలువునా తీసేవాడే. పొద్దున్నే లేచి ఎవరి ముఖం చూశాడో నా నాయన ఆడి చేతులు యిరిగిపోను." అంటూ కొంగుతో రాజన్న తల, మొఖము, ముక్కు, చెవులు అన్నీ తుడిచింది కోటమ్మ.

"అబ్బో, చెవులనిండా మట్టే!"

"చెవులేమిటే! నోరు, ముక్కు అన్నీ బురదలో కూరితేనూ!"

"ఏడికేం పోయేకాలమే!"

"ఈ లచ్చికొడుకు పిల్లలను కూనీలు చేస్తాడు."

"చచ్చినాడిని ఇరగదీసి దాలిగుంటలో పెట్టాలి."

"అమ్మో! ఆడు మనకు దొరుకుతాడూ?"

"పోలీసులకు చెప్పి జేలులో పెట్టిస్తే సరి! అంటూ నలుగురు నాలుగు విధాలా ఆడిపోసుకున్నారు. కాని లచ్చి వారి మాటలను లక్ష్యపెట్టలేదు. ధీమాగా నిలబడి నలుగురి వైపు చూస్తూ "ఇదుగో! అమ్మల్లారా! నేనొక్కమాట చెపుతా యింటారా! యేదో పిల్లచచ్చినోళ్ళు పోట్లాడుకున్నారు. వాళ్ళు తిట్టుకున్నారో, కొట్టుకున్నారో మనం చూడలేదు. అట్టాటప్పుడు యేమీ తెలుసుకోకుండా నన్ను, నా బిడ్డను ఎందుకు అట్టా ఆడిపోసుకుంటారు" అంది నిష్కర్షగా.

"ఇంకా తెలుసుకునే దేమిటే! పిల్లాడిని చూస్తే తెలవ టంలా నోరు, ముక్కూ, చెవులు అన్నీ బురదలో కూరుకు పోతేను" అంది కోటమ్మ సాగదీస్తూను.

పక్కనే నిలబడివున్న నీలం యేదో చెప్పబోయింది. "యేమ్మా నీలం, నువ్వేమైనా చూశావా?" అంటూ లచ్చి ప్రశ్నించింది.

"లేదు వదినా, వాళ్ళు కలబడి కొట్టుకుంటూండగా మాత్రమే నేను చూశాను. అంతేకాని ఆ మంగమ్మకొడుకు రంగడు లేడూ, వాడూ వీళ్ళతో పాటు వున్నాడు. వాడిని అడిగితే తెలుస్తుంది. తప్పు ఎవరిదైంది" అంది నీలం.

అందరిదృష్టి రంగడివాడికి మళ్ళింది. "ఒరే, రంగయ్యా, అసలు యీ దెబ్బలాట ఎట్టా జరిగిందో చెప్పరా అయ్యా" అంది అచ్చమ్మ రంగడి తల నిమురుతూ.

"అబ్బాయ్ పక్షపాతం లేకుండా వున్నది వున్నట్టు చెప్పాలి" అంది నీలం. రంగడు పండ్లు యికిలిస్తూ నలుగురి వంకా చూశాడు. ముక్కులో చీమిడి ఎగపీల్చాడు. "మరేమో రాజన్న కప్పను చంపాడు. రాముడేమో దాన్ని దూరంగా విసిరేశాడు. కప్పలను చంపితే అప్పలు చచ్చిపోతాయని గుర్నాథం చెప్పాడు. దానిమీద రాజన్న కప్పలను తను చంపలేదన్నాడు. "నువ్వేగా" అన్నాడు రాముడు. రాజన్న బురద తీసి రాముడి ముఖానకొట్టాడు. రాముడు రాజన్న జుట్టుపట్టుకు లాగాడు. రాజన్న వాడి చెయ్యి పట్టుకు కరిచాడు. వాడువీడిని బురదలో పడేసి తొక్కాడు. అంతే!" అని చెప్పాడు రంగడు గుక్కతిప్పుకోకుండా.

"ఓరి యీడి జిమ్మలాగ, సీమ మిరపకాయల్లే కూస్తి లేడు. ఎంత పని చేశాడు."

"ఓ కోటమ్మో, నీ కొడుకు వల్లమాలినాడే తల్లో".

"అబ్బో మనిషికాటుకు మందు లేదంటారు. లచ్చి! నీకొడుకును చూసుకోయేపోయి గంట్లు దిగినయ్యేమో!" తలా ఒక మాటా అన్నారు.

లచ్చి కోటమ్మ ముఖంలోకి చూస్తూ అంది. "యేం కోటమ్మా యిప్పుడైనా తెలిసిందా, నిజమేమిటో, తప్పంతా నీ కొడుకుది. పైగా నువ్వేమో నా సయితి, గియితి అంటూ నోరు పారేసుకున్నావు. ఎవళ్ళకైనా అంత తొందర పనికి రాదు."

నలుగురూ అవునంటే అవునన్నారు.

కోటమ్మ రుసరుస లాడింది. "అబ్బో! మీూ యిచ్చ కాల మాటలు నాకు చెప్పబోకండి. నే నేమంత తీసేసిలేను. లచ్చి మొత్తలావుచూసి మీరంతా దానికి తాళం వేస్తు న్నారు. యేం, దాని కొడుకు నా బిడ్డను పిసికి బురదలో తొక్కడే. ఆ నీలం పుణ్యమా అంటూ అది వచ్చి విడిపించ బట్టిగాని లేకపోతే నా బిడ్డ యేమయేవాడో! మీూ కేమన్నా తోచుబడి అయిందా అంటా?" అంటూ నలుగురి ముఖాల్లోకి చూసింది.

ముసలి అచ్చమ్మ అందుకుంది "ఓలమ్మో యీూ పాటికి యిక కట్టిపెట్టండే. యేదో పిల్లచచ్చినాళ్లు కీచులాడు కున్నారు. అయిపోయింది. ఆ మాత్రానికి పెద్దాళ్ళ జగడం ఎందుకులేవే తల్లీ!" అంటూ సర్ది చెప్పింది.

"అబ్బో చెప్పావులే! మాలావు తీరుపు" అంది కోటమ్మ యీసడింపుగా.

"ఓలమ్మ! యిక నోరు మూసుకోవే. ఇంక శాన గాని" అంది అచ్చమ్మ మందలిస్తూ.

ఎవరిదారిని వారు వెళ్ళిపోయారు. నీలం బట్టలు వుతుకు తూంది. నీలం పెద్దమాల సుబ్బయ్య కూతురు. పదహారు సంవత్సరాల వయస్సు. చామనచాయ రంగు, గుండ్రని మొహం, ఆరోగ్యంగా పుష్టిగా వుంటుంద.

పల్లెలోని యువకుల కళ్ళెప్పుడూ నీలం మీదే వుంటాయి. కాని సుబ్బయ్య తన కూతురుని ఆ పల్లెలో వాళ్ళకు యివ్వనని చెప్పేశాడు. పైగా కొడుకు ఆనందానికి యింకా పెళ్ళి కాలేదు "ముందు వాడిపెళ్ళి చేసిగాని తరు వాత పిల్లపెండ్లి చెయ్యను" అని అంటూ వుంటాడు.

నీలం బట్టలు వుతకటం పూర్తి అయ్యింది. బట్టలన్నీ పిండి రాతిమీద పెట్టింది. పంతులుభార్య సుందరమ్మ బిందె భుజాన పెట్టుకొని వయ్యారంగా నడుస్తూ బావి దగ్గరకు వస్తూంది. ఆమెను చూచి నీలం పాట అందుకుంది.

సుందరమ్మా - సుందరీ
చూడ చక్కని - సుందరీ
కడపాక గదిలో నున్నదీ
వచ్చి పోయేవారిని - వాలుచూపులు చూస్తదీ!

సుందరమ్మ బిందె బావి దగ్గర పెట్టి నీలం వైపు చూస్తూ అంది "ఏమిటి నీలం ! నీకు కవిత్వం కూడా వచ్చునే !"

"అందమైన నీ ముఖారవిందం చూస్తుంటే కవిత్వం రాకుండా వుంటుందా వదెనా!"

"అది సరేగాని నీలం, మరి హైయ్యరు ట్రైనింగుకు పోతావా? యీసారైనా!"

"యేమో వదెనా! మా అయ్యేమో వద్దంటున్నాడు. అన్నయ్య పంపిస్తా నంటున్నాడు. అయినా మనకు ఉద్యోగం ఎవరు యిస్తారు వదెనా!"

"సరే! ట్రైనింగు పూర్తి చేసుకుంటే ఎప్పుడో ఒక సారి ఉద్యోగం దొరక్కపోతుందా! యీ చదివేవాళ్ళంతా ఎందుకు చదువు తున్నారంటావు?

"వుద్యోగాల కోసమే అనుకో! కాని రెండుసంవత్స రాలనుండి నీవు కాళీగానే వుంటున్నావు గదా! ఆ దయావతి సంవత్సరానికి ఎప్పుడో ఒక నెలో రెండు నెలలో చేసివచ్చి యింటో కూచుంటాంది. ఆ యేసుగారి మేరీ సెకండరీగ్రేడు పరీక్ష అయింది. నిరుడు అంతా ఖాళీగానేవుందిగదా! ఇక యీ సంవత్సరము ఏమవుతుందో!"

"మీ అన్నయ్య యేమి చేస్తాడు ఈ సంవత్సరం"

"అదే గొడవగా వుంది వదెనా!"

"ఏమిటే! ఆ గొడవ?"

అన్నయ్యేమో కాలేజీలో చేరి బి. ఎ. చదువుతా నంటున్నాడు. మా అయ్య ఉద్యోగం చేస్తూ రెండేళ్ళ తరువాత బి. ఎ. పరీక్షకు పొమ్మంటున్నాడు. రోజూ గొడవగా వుంది. యీ గొడవలో నా ట్రైనింగు సంగతి ఎవరూ ఆలోచించటంలేదు."

"అవును. మీ అన్నయ్యకు క్లాసు వచ్చిందిగా! కాలేజీలో సీటు తేలిగ్గా దొరుకుతుంది."

"సీటు దొరకగానే అయ్యిందా! డబ్బు కావద్దూ!"

"మీ అయ్యకు డబ్బుందటగా!"

"ఏమి వుందో! ఏమి లేదో! మా పెళ్ళిళ్ళు చెయ్యడానికే అప్పు చెయ్యాలంటున్నాడు మా అయ్య."

"మీకేం కరణంగారు ఎంతకావాలన్నా యిస్తారు."

"యిస్తారనుకో! మళ్ళీ ఆ అప్పు తీర్చడానికి మా అయ్య అవస్తపడాలిగా! అయినా కరణంగారి దగ్గర తెచ్చే అప్పుతోనే మా అయ్య పెళ్ళిళ్ళు చేస్తానంటున్నాడు. అన్నయ్య 'పెళ్ళి చేసుకోను బి. ఎ. చదువుతా' నంటున్నాడు. యింకా ఏమీ తేలలేదు. యివ్వాళ యిద్దరూ కలసి కరణంగారి దగ్గరకు పోతారట! మరి కరణంగారు ఏమి చెపుతారో!"

"కరణంగారు ధర్మరాజులాంటివారు నీలం"

"అయ్యో వదినా! ఆ మాటంటే యీ పల్లెలో మనల్ని బ్రతకనిస్తారా!"

"ఏమి చేస్తారు బ్రతకనివ్వక? ఎవరికివుండే అభిప్రాయాలు వారికి వుంటాయి. సరేగాని నీలం, యింతకుముందు ఇక్కడ జనం పోగయ్యారు ఏమిటి?"

"అదా! పిల్ల చచ్చినాళ్ళు కొట్టుకున్నారు."

"ఎవరి పిల్లలు?"

"లచ్చి కొడుకు రాముడు, మా కోటమ్మ కొడుకు రాజిగాడు."

"మరి కోటమ్మ జగడం వేసుకోలా ?"

"ఎందుకు వేసుకోలా! 'సయితీ, గియితీ' అంటా లేచింది. కాని లచ్చి సర్దుకుపోయింది."

"అబ్బో సీలం; యీ కోటమ్మ మహా వల్లమాలిన దమ్మా."

"యేమో వదెనా! మా రాఘవులు బావయ్య దానితో ఎట్లా యేగుతున్నాడో, యేమిటో పాపం! రోజూ గొడవేగదా!"

"యేమి గొడవో సీలం! నిన్న సాయంకాలం మా యింటిముందు పిల్లలు ఆడుకుంటున్నారు. నేను పందికి కుడితి పోసి చిట్టుచేట వసారాలో పెట్టాను. కోళ్ళు ఆ చిట్టు చిమ్మేస్తుంటే 'ఆ కోళ్ళను కాస్త కొట్టండిరా అబ్బాయిలూ!' అని ఆ పిల్లలకు చెప్పాను. అందులో ఒకడు ఒక గెడ్డ వేశాడు. యీ కోటమ్మతల్లి ఎక్కడ చూచిందో గలగలమంటూ వచ్చిపడింది. సీలం, అయ్యో ఒకమాటా ఒకతిట్టా! 'మీకు కోళ్ళులేవా,' అంది, 'గొడ్డులేవా' అంది, 'మీపందిమావాకిట్లోకి వస్తే కాళ్ళు విరగగొడతా'నంది, 'మీ కళ్ళు మాడిపోను, నా కోళ్ళమీదేపడ్డాయా కళ్ళు' అంది. దాని యిష్టంవచ్చినట్లు తిట్టింది సీలం."

సీలం చిన్నగా నవ్వింది. "మరి నువ్వు కల్పించుకోలా వదెనా ?"

"అబ్బో సీలం! ఆ గయ్యాళిగంపతో నేను ఎక్కడ గెలుస్తాను ?"

సీలం రాతిమీదపెట్టిన బట్టలు దులిపి భుజాన వేసింది.

"ఆ పచ్చరంగుచీరె అప్పుడే వెలిసిపోయిందే నీలం" అంది సుందరమ్మ.

"మరే, వదెనా! దొంగ చచ్చినోడు రంగు వెలవనే వెలవదు అని చెప్పి పద్దాలుగు రూపాయిలు వేసుకు పోయాడు."

"వూడుపులొచ్చాయిగా! యీ వూడుపుల్లో యిరవై రూపాయిలు పోగుచేసి నేనుకూడ ఒక జత చీరలు కొనుక్కుంటాను నీలం"

"మరి వుద్యోగానికి పోవలసి వస్తేనో?"

"వుద్యోగమా! పాడా! రెండేండ్లనుండి రాని వుద్యోగం యిప్పుడు మాత్రం ఎక్కడనుండి వూడిపడుతుం దనుకుంటాం!"

ఒకచేతిలో కడవ, రెండవ చేతిలో చేంతాడు పుచ్చుకుని లచ్చి ఇసురుగా వచ్చింది. నీలాన్ని, సుందరమ్మను చూచి నవ్వుతూ అంది. "ఇదుగో! అమ్మాయిలూ! బావికాడ ముచ్చట్లు మొదలుపెట్టారా?"

"నువ్వు కూడా వచ్చి చేరు వదెనా, మాతోపాటు" అంది నీలం.

"ఓలమ్మో! మీ కేం పనీ పాటలేదు. నాకు ఎక్కడ తీరుతుందీ! యిప్పుడు కూడు వండి అక్కడ పెట్టి వూళ్ళోకి పరిగెత్తాలి."

"దేనికంటా వూళ్ళోకి?" సుందరమ్మ ప్రశ్నించింది.

"కృష్ణారావుగారు మొన్న వడ్లు ఎండబోశారట. అవి బాగుచేసి పొమ్మనమని వారి తల్లి కబురు చేసింది."

ముగ్గురూ బిందెలు భుజాలనెత్తుకొని బయలుదేరి పోయారు.

♦ ♦ ♦ ♦

కరణంగారి పల్లపుపొలం పదియకరాలు తడిసింది. సుబ్బయ్య పల్లెలో కూలీలను పిలిచాడు.

"రేటు ఏమిటి ?" కొందరు ప్రశ్నించారు.

"నలుగురితోపాటు" అన్నాడు సుబ్బయ్య.

అదే ఆనలుగురితోపాటు ఏమిటో తేల్చిచెప్పాలి" అన్నారు అవతలి వాళ్ళు.

"యీ చచ్చువెవ్వారం ఎందుకెహే! రెండురూపాయలు యిస్తేనే వస్తామని కరాకండిగా చెప్పరాదంటశ్నా! యేసుదాసు కల్పించుకున్నాడు.

నలుగురు యేసుదాసుమాట ఖాయమనుకున్నారు.

సుబ్బయ్య గ్రామంలోకి పోయి కరణంగారితో "రేటు సంగతి తేలితేనేగాని కూలీలు రాము అంటున్నారండీ, రెండురూపాయలు కావాలని కొందరఁగారు" అని చెప్పాడు.

కరణంగారు విస్తుపోయిచూశాడు. "అయిందీ! అడుగులోనే హంసపాదూ! ఒకవైపు పొలాలు తడవలేదు. ఎక్కడా కూలీలను పిలిచేవాడులేడు. అయినా వాళ్ళకు రెండు రూపాయలు కావాలటనా !"

"కావాలనే అంటున్నారు, దొరో! ఆళ్ళు."

"రెండు లేదు, మూడూ లేదు. ఆ ప్రభుత్వం నిర్ణయించిన రేటువుందిగా. ఆ రేటుకు వస్తే రమ్మను. లేకపోతే సాయంకాలం పొరుగుపల్లెలకు కబురుచేద్దాం"

"సరేలెండి. సాయంకాలం మళ్ళీవచ్చి కలుసుకుంటాను."

"అయితే సుబ్బాయి! చేనుబాగుచేత యింకాఎన్ని రోజులు పడుతుంది!"

"ఆఁ రెండుమూడు రోజులదాకా పడుతుంది."

అయితే మనకు తొందరేముంది! రేపు మునసబుగారి డొంకదరిచేను పూడుస్తున్నారు. వాళ్ళు ఏరేటు యిస్తే మనమూ అదేయిద్దాం."

"అంతేలెండి". సుబ్బయ్య కర్రబుజాన పెట్టుకొని బయలుదేరి నాలుగడుగులు వేశాడు. కరణంగారు అతన్ని "ఇదిగో! సుబ్బాయ్ మాట!" అంటూ వెనుకకు పిలిచాడు. సుబ్బయ్యపోయి కరణంగారిముందు నిలబడ్డాడు." మీ ఆనందం యిప్పుడేవచ్చి వెళ్ళాడు. బి. ఏ. చదువుతాడటగా! అన్నాడు కరణంగారు.

"ఆఁ ఆడిమొహంలెండి"

"అదేమిటి సుబ్బాయ్! వాడు చదువుతానంటూంటే నువ్వు వాడి మొహం అంటావేమిటి?"

"ఆడికేం, దొరో! అట్టాగే అంటాడు. యిప్పుడు నెలకు ఎనభై రూపాయలు తెచ్చుకుంటున్నాడు అవి తెచ్చుకుంటూనే నిరుడు ఒకక్లాసు పరీచ్చకు కట్టి చదివి అది పరీచ్చ

అయ్యాడు. 'యిది కూడా అట్టాగే మిడకరాబాబూ!' అని బతిమాలతన్నానండీ! యింటంలేదు."

"నేను యిప్పుడే రెండువందలిచ్చి పంపించాను. యింకా అవసరమైతే సెలవుల్లో వచ్చితీసుకెళ్ళమని చెప్పాను సుబ్బాయ్!

"అయ్యబాబోయ్! ఎంతపని చేసారు దొరగోరూ!"

కరణంగారు చిన్నగా నవ్వాడు. "ఇదిగో సుబ్బాయ్, నేను ఒకమాట చెబుతాను వింటావా! మన మునసబుగారి అబ్బాయి వున్నాడుచూడు. ఆ ప్రసాదరావు. అతనికి దాదాపు పాతికేళ్ళు వచ్చాయి. అయినా మూడు సంవత్సరాలనుండి ఆ యింటరు పరీక్ష కాలేక నానా అవస్తలు పడుతున్నాడు. ఇక ఆ పెత్తందారుగారబ్బాయి మోహనరావు వున్నాడు చూశావూ? అతగాడు మూడుసార్లు యస్. యల్. సి. తప్పాడు. రెండుసార్లు మెట్రిక్ పరీక్షకు కడితే అదీ ఎదుర్రైంది. యిప్పుడు యింకా ఏదో వెలగబెడతానంటూ హైదరాబాదు వెళ్ళాడు. వీళ్ళనందరినీ చూచిన తరువాత మీ ఆనందాన్ని గురించి ఆలోచిస్తే వాడుచాలా యోగ్యుడనే చెప్పాలి. వాడికియింకా యిరవై సంవత్సరాలు నిండినయ్యో లేదో యస్. యల్. సి. పరీక్ష కావడం, బేసిక్ ట్రైనింగు, తరువాత రెండేళ్ళ ఉద్యోగమూ, అది చేస్తూనే ఇంటరు ఫస్టుక్లాసురావడమూ గొప్పవిషయంకాదూ! వాడు బి. ఏ. కాదు యం. ఏ. చదివినా నేనుచెప్పిస్తాను. నువ్వేమీ కల్పించుకోబోకు!" అన్నాడు కరణంగారు.

సుబ్బయ్య నిర్విణ్ణుడై చూస్తూ నిలబడిపోయాడు. రెండునిముషాల తరువాత అతను తేరుకొని తలపాగతీసి కరణంగారి పాదాలముందువంగి "దొరో! మీ పాలేరోణ్ణి! మీ రుణం యెట్టా తీర్చుకొంటానో?" అన్నాడు. అతని కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

"మరేం ఫర్వాలేదు. నువ్వుపోయిరా సుబ్బాయ్." అన్నాడు కరణంగారు తాపీగా.

మునసబు స్వయంగా పల్లెకు పోయి కూలీలను పిలిచాడు. "కూలిరేటు ఎంత?" అని అడిగినవాళ్ళులేరు. ఒకరిద్దరు సణిగారు. "ఒరేయి, నెయ్యి అణ్ణంతినే దొరలు; ఆరికి తెలవదంటరా? పదండశ్శా" అన్నాడు ఒకముసలాడు.

రెండురోజుల తర్వాత కరణంగారి తరఫున కూలీలను పిలిచాడు సుబ్బయ్య "రేటు సంగతి తేల్చాలి" అన్నారు.

"మునసబు గారితో పాటు" అన్నాడు సుబ్బయ్య.

"ఆ మునసబుగారి సంగతి మీకు ఎందుకు. మీకరణంగారు ఏమియిస్తారో ముందు తేలాలి." అన్నాడు ఏసుదాసు.

"మునసబుగారు రూపాయికంటె ఎక్కువ పెట్టొద్దు అని అంటున్నారే!" అన్నాడు సుబ్బయ్య.

కూలీలు తలోకమాట్టా విసిరారు.

"యేం, మీ మునసబుగారి లావు ఏంటీ! మనకు ఏమైనా ధర్మం యిస్తాడా? ఆయన!"

"ఆ రూపాయి కూడా ఆయనన్నే వుంచుకోమను. ఇంకోమేడ కడతాడు."

"ఆయన గవర్నమెంటు మనిషేగా, గవర్నమెంటు చెప్పిన రేటు ఎందుకివ్వడూ ?"

అసలు ఆరోజున రేటు తెల్సుకోకుండా పోవటం మనదే తెలివి తక్కువ."

సుబ్బయ్య అందుకున్నాడు. "ఒరేయ్ అబ్బాయిలూ ! ఆ మునసబుగారు ఏమి యిస్తారో, మీరు యేమి తెచ్చుకుంటారో దాంతో మాకు పనిలేదు. మా కరణం గారు మాత్రం గవర్నమెంటోరు చెప్పిన రేటు యిస్తారు. అందుకు యిష్టపడినవాళ్ళు రండి. లేనివాళ్ళను మేము పిలవదలుచుకోలేదు. ఆ రేటుకు మీరు రాకపోతే పొరుగు పల్లెల నుండి కూలీలను పిలుస్తాం; బాగా ఆలోచించుకోండి" అన్నాడు సుబ్బయ్య.

"యేమయ్యా సుబ్బయ్యా ! మీ కరణంగారి తరఫున మమ్ములను బెదరించి పోటానికి వచ్చావల్లే వుందే" అన్నాడు యేసుదాసు.

"అంతమాట ఎందుకు ? యేసుదాసూ! మిమ్ములను బెదరించే వుద్దేశం మా కరణంగారికి యే కోశానా లేదు. అసలు ఆ మారాజు అట్లాటి మనిషి కానేకారు. అట్లా బెదరించి చేయించుకునేవాళ్ళు యేరే వుండనే వుంటారు. మేము యిచ్చే రేటు చెప్పాం. యిష్టమైన వాళ్ళు వస్తారు, లేనివాళ్ళు మానేస్తారు. నేను ఆ విషయం మొదట్లోనే చెప్పేశాను గాదంటయ్యా" అన్నాడు సుబ్బయ్య.

"సుబ్బయ్యమామా ! మా తూరుపువైపు వాళ్ళందరము వస్తాము" లచ్చి గంభీరంగా అంది.

"అబ్బా! బయలుదేరిందిరా కమ్యూనిస్టు నాయకు రాలు. తూరుపువేపు అంతా వస్తారంట. తూరుపువేపు ఏవి పడేడిసింది." అన్నాడు యేసుదాసు ఎటకారంగా.

లచ్చి యేసుదాసువైపు కొరకొరలాడుతూ చూచింది.

"ఇదిగో యేసుదాసూ! నీ నోటికి సరిగ్గా వస్తయి. ఎందుకు అట్టా పేలుతావు! ఆ మాటకొస్తే నీ మునసబు కాంగ్రెసు, నువ్వు కాంగ్రెసు అసలు మీరు జస్టిసుపార్టీ వాళ్లు, కాంగ్రెసు ప్రభుత్వం యేర్పడ్డాక మీరు దాంటో మారారు. మీ మునసబు రూపాయి కూలీ యిస్తానంటే నువ్వు నోరు మూసుకు కూచున్నావు. కరణంగారు రూపా యన్నర యిత్తానంటాంటే నీ నోరెట్టా ఆడింది అంట యింత పిచ్చిగా వాగడానికి అయినా నీ నోటికి సుద్దీ బద్దీ లేదు." అంది లచ్చి.

"ఒక్క తూరుపువేపు రావటమేమిటి? అంతా వస్తా రులే సుబ్బమ్మా!" అన్నాడు పడమటివైపు పెద్ద.

"కరణం కూలీ రేటు పెంచాడు." అంటూ ప్రచారం లేవదీశాడు మునసబు.

"కరణంగారు పెంచిం దేముందీ! ప్రభుత్వమే కూలీ రేటు నిర్ణయించింది గదా!" అన్నారు కరణంగారి వైపు వారు.

గ్రామంలో కాంగ్రెసుపార్టీ నాయకుడు మునసబు. కరణంగారు కమ్యూనిస్టుపార్టీ నాయకుడు కాకపోయినా కమ్యూనిస్టు సానుభూతిపరుడు. ఎన్నికల సమయంలో వారికి మద్దతు యిస్తూ వుంటాడు.

"యీ కరణానికి యేమి రోగం పట్టుకుందిరా! గొడ్డును కోసుకునేవాళ్ళను పందులను కాసుకునేవాళ్ళనూ చేరదీస్తాడు" అంటూ విమర్శిస్తాడు మునసబు.

మొత్తం గ్రామానికి కరణం, మునసబు లిద్దరే పెద్ద ఆసాములు. కరణంగారి అరవై యకరాలు సుక్షేత్రమైన మాగాణిభూములు, పది యకరాలు మెట్టభూములువున్నాయి. మునసబుగారికి వంద యకరాలకు పైగానే వుంది. అందులో ఆయన స్వంతం పది యకరాలు మాత్రమే. మిగిలినది అంతా ఆయన చేరదీసిన ముండమోపికి, ఆవిడ కొడుకులకు సంబంధించినది. ఆ ముండమోపి భర్తే పూర్వం గ్రామానికి మునసబుగా వుండేవాడు. అతని మరణానంతరం ఆవిడ తాలూకు బంధువు అయిన యీ వెంకట్రామయ్య ఆమె దగ్గరకు చేరాడు. నాటినుండీ వెంకట్రామయ్యగారే గ్రామానికి మునసబుగా చలామణీ అవుతున్నాడు.

పల్లెలో వున్న మాల మాదిగలకు కరణం, మునసబుగార్లిరువురు వారి అవసరాలకు అప్పుడప్పుడు అప్పులు యిస్తూ వుంటారు. కరణంగారు జీవకారుణ్య దృష్టితో ఎవరు అడిగినా కొద్దో-గొప్పో యిచ్చి పుచ్చుకుంటూంటాడు. మునసబు పార్టీ ప్రాబల్యం కోసం తన పలుకుబడిని పెంచుకోడానికి యే ఒకరుయిద్దరికో అప్పు యిస్తాడు. వాళ్ళు ఆ బాకీ యిచ్చినా, యివ్వకపోయినా అతను తిరిగి వాళ్ళను వత్తిడి చెయ్యడు. కాని వాళ్ళు తన చెప్పుచేతలనుండి దూరమైతే వాళ్ళను నిర్భంధించి అవసరమైతే కొంపా, గోడూ అమ్మించి అయినా సరే తన బాకీ రాబట్టుకుంటాడు మునసబు.

గ్రామంలో రెండుపార్టీ లున్నట్లుగానే పల్లెలోను రెండుముఠా లున్నాయి. ఒక ముఠాకు కరణంగారి పాలేరు సుబ్బయ్యా నాయకుడైతే, రెండో ముఠాకు మునసబుగారి ఏజంటు ఏసుదాసు నాయకుడు. ఏసుదాసు కూతురు మేరీ సెకండరీ గ్రేడు పరీక్ష అయి సంవత్సరానికి పైగా అయింది. ఆమెకు ఉద్యోగం సంపాదించే భాధ్యత మునసబు గారిమీద పెట్టాడు ఏసుదాసు. "చూద్దాం, చూద్దాం అంటూనే మునసబుగారు సంవత్సరం గడిపాడు. కాని మేరీకి ఉద్యోగం దొరకలేదు.

స్కూళ్లు తెరిచారు. యేసుదాసు మునసబుగారి యింటిచుట్టూ తిరుగుతూ ఒకటిరెండు సార్లు మునసబుగారిచ్చిన జాబులు పుచ్చుకొని పరిషత్ ఆఫీసుల చుట్టూ తిరిగి వచ్చాడు. కాని పని జరుగలేదు. ఒకసారి అతను మునసబుతో మాట్లాడుతూ "యేం, దొరో! యిక యీయేడు కూడా పిల్ల ఇంటిదగ్గర వుండిపోవలసిందేనా? ఉద్యోగం దొరకదు అంటారా?" అన్నాడు.

"యేసుదాసూ, తొందరపడితే ఎట్లా, కాస్త ఓపికపట్టి చూద్దాం" అన్నాడు మునసబు తాపీగా.

"యేమో దొరో! ఇక్కడికి ఏటినర్థంనుండీ చూస్తూనే వున్నాంగా!"

"నిజమే! యేసుదాసూ! యేమిచేస్తాం. ఆ కమిటీ స్కూళ్ళన్నా కూలబడివుంటే ఎవరినో ఒకరిని సెలవుపెట్టించి మీ మేరీకి ఉద్యోగం సంపాదించే వాళ్లం. కాని యిప్పుడేమో పరిషత్తులు అంటూ వచ్చిపడ్డాయి. మన తలల పైగాబోయే

నాయకులంతా ఉద్యోగాలకోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతూన్నారు. వాళ్ళకే దిక్కు లేకుండా వుంది. ఇక మన మొహం చూసేదెవడు? అయినా కొంతకాలం వేచి చూద్దాం. కొద్ది రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయిగదా! ఓట్లు, ఓట్లు అంటూ దొరలు కార్లమీద దిగుతారు. అప్పుడు మనం పాచిక వేదాం. మా మేరీకి ఉద్యోగం యిస్తేనే గాని పల్లెలో ఓట్లు మనకు పడవు అని చెప్పేద్దాం. ఉద్యోగం రాక ఏమిచేస్తుందో, తస్సా చెక్కా చూస్తాను" అన్నాడు మునసబు.

యేసుదాసు గొణుక్కుంటూ లేచాడు. "వుద్యోగం రాకబోతే రాకపోయింది. పిల్లకు పెండ్లి అయినా చేశాను కాదు" అనుకున్నాడు అతను.

యేసుదాసుకు ఒక్కగాను ఒకబిడ్డ. ఆమె 'మేరీ'. ఏసుదాసు మేరీని అతి గారాబంతో పెంచి పెద్దను చేశాడు. విద్యా, బుద్ధులు చెప్పించాడు. యస్. యస్. యల్. సి. పరీక్ష కాగానే సెకండరీ గ్రేడు ట్రైనింగుకు పంపించాడు. ఎన్నడూ కూలికి, నాలికి పోనిచ్చేవాడు కాదు. మేరీకి పెద్ద అందచందాలు లేకపోయినా ఆరోగ్యంగా, పుష్టిగాఉంటుంది.

ఏసుదాసుకు పిత్రార్జితం రెండెకరాలు భూమి వుంది. ఒక్కగాను ఒక్కకుమార్తె. అల్లుడు ఏ రెవిన్యూ యిన్స్పెక్టరో, ఏ మేజిస్ట్రేటో అయి వుండాలని అతను కలలు కనేవాడు.

ఒక్కొక్కప్పుడు ఏసుదాసు కూతురు మేరీకి సుబ్బయ్య కొడుకు ఆనందానికి మధ్య రాయబారాలు నడిచాయి. ఆ

రాయబారాలతో పెద్దలకేమీ సంబంధం లేదు. ఆనంద్ అప్పుడే బేసిక్ ట్రైనింగు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చాడు. మేరీ యాస్. యస్. యల్. సి. పరీక్ష వ్రాసి వచ్చింది. ఆనంద్ అందచందాలు, గుణగణాలు చూచి మేరీ అతనిమీద దృష్టి నిలిపింది. కొద్ది రోజులు గడిచాయి. మేరీ ఆనంద్‌కి ఒక చీటి పంపించింది.

"ఆనంద్! నీతో కొన్ని విషయాలు మాట్లాడా లను కుంటున్నాను. నీ అభిప్రాయ మేమిటి!" అంటూ ఆ చీటీలో వ్రాసింది.

ఆనంద్ వెంటనే జవాబు పంపించాడు. "మేరీ! మాట్లాడటానికి నాకేమీ అభ్యంతరము లేదు కాని మీ నాయనకు తెలిస్తే వూరుకోడేమో! అనుకుంటున్నా" అంటూ ఆనంద్ తన జవాబులో సందేహం వెలిబుచ్చాడు.

ఆ తరువాత ఒకరి నుండి ఒకరు ఎన్నో చీటీలు అందుకున్నారు.

"ఆనంద్! నేను నిన్ను ప్రేమిస్తున్నా!" మేరీ తన అభి ప్రాయం వెల్లడించింది.

"ప్రేమ అంటే ఏమిటో నాకు తెలియదు మేరీ! ఆనంద్ భయపడుతూ రాశాడు.

"నేను నిన్ను పెండ్లి చేసుకోవా లనుకుంటున్నాను ఆనంద్!" "నిన్ను పెండ్లి చేసుకోవడం నాకూ యిష్టమే మేరీ! కాని మన పెద్దలు కూడా అందుకు అంగీకరించాలి గదా!"

"ముందు మనం లేచిపోయి ఎక్కడైనా పెండ్లి చేసుకుందాం. తరువాత పెద్దలు ఆమోదించక ఏమిచేస్తారంటావు; ఆనంద్!"

"మనం అస్వతంత్రులం మేరీ! మనకు డబ్బు ఎక్కడనుండి వస్తుందీ? డబ్బు లేకుండా మనం ఎక్కడకుపోయి అక్కడ ఏమి చేయగలుగుతాం, ఎలా వుండగలుగుతాం. ఆలోచిస్తే అదేమీ అంత మంచిపని కాదనుకుంటాను మేరీ!"

ఆ రాయబారాలు బయిటికి పొక్కాయి. ఏసుదాసు మండిపడ్డాడు. "యీ పాలేరుతనం చేసుకునే యదవకి నా పిల్లను యిస్తానా! యీసారి మళ్లీ ఉత్తరం, గిత్తరం రాస్తే బొకిలు యిరగదంతాను" అన్నాడు ఏసుదాసు.

తరువాత కొద్ది రోజులకు ఆనంద్ పల్లె వదలిపెట్టి ఉద్యోగానికి పోయాడు. రెండు సంవత్సరాలు గడిచాయి. ఆనంద్ యింటరు పాసై బి. ఎ. చదువుతూన్నాడు. ఏసుదాసు ఆలోచనలు ఆనంద్‌పైకి పోయాయి. మేరీని అతను వివాహం చేసుకుంటే బాగుండును అనుకున్నాడు. కాని ఆనాడు తను చాలా దురుసుగా మాట్లాడాడు. "మా మేరీని మీ ఆనంద్‌కి చేసుకోండి అని యిప్పుడు తను సుబ్బయ్యను అడగ గలుగుతాడా! అతని అభిమానం అడ్డు తగిలింది. "అసంభవం" అనుకున్నాడు అతను.

—:—

ప్రకరణం 2

పల్లెలో వున్న వారిలో లచ్చి మంచి మాటకారి ఆమె నోటికి భయపడి సామాన్యంగా ఎవ్వరూ ఆమె ప్రమేయం ఎత్తరు. లచ్చికూడా కల్పించి కయ్యం పెట్టుకునే తరహాకు చెందిందికాదు. యేదైనా సమస్య వచ్చినపుడు తనకు న్యాయమని తోచింది ఆమె నిష్కర్షగా చెప్పేస్తుంది. మొహమాటాలు ఆమెకు పనికిరావు.

లచ్చి వయస్సు పాతిక సంవత్సరాలకు పైగావున్నా మనిషి సన్నగా, బారుగా, ఆరోగ్యంగా వుంటుంది. ఆమెకు ఒకేఒక బిడ్డ. వాడికి పది సంవత్సరాలు, పేరు రామారావు. కాని అందరూ రామిగా అనో, రాముడు అనో పిలుస్తుంటారు. లచ్చికి భర్త లేడు. పది సంవత్సరాలకు పూర్వం వచ్చిన గ్రామ తగాదాలలో మునసబు పార్టీకి వ్యతిరేకంగా నిలబడి ఆమెభర్త వెంకటేసు బలి అయ్యాడు?

వెంకటేసు ఆ రోజులలో గరిడీ నేర్చాడు. కర్ర త్రిప్పడంలో అతను మనగాడు. ఒకనాడు గ్రామంలో గరిడీ పందేలు జరిగాయి. గెలుపు వెంకటేసుది అయ్యింది. కాని మునసబు కల్పించుకుని పేచీపెట్టి అది రద్దు చేయించాడు. మునసబు జోక్యాన్ని వెంకటేసు వ్యతిరేకించాడు. "మధ్యవర్తులుండగా యీ యనెవమూ! కల్పించుకోటానికి!" అంటూ ప్రశ్నించాడు వెంకటేసు.

మునసబు ముందుకువచ్చి వెంకటేశును మందలిస్తూ అన్నాడు. "తెల్లారి లేచినకాడనుండి కూలీ నాలీ చేసుకుని బ్రతుకుకే వెధవకి యీ సాము గరిడీలు ఎందుకోయ్ ! పైగా నీ బ్రతికిక్కతోడు పందేలా ? "

వెంకటేశు ధీమాగా నిలబడి సమాధానంచెప్పాడు. "నా బతుకు, నీ బతుకు నలుగురికి తెలుసులేవయ్యా ! మాలావు చెప్పవచ్చావు. నేను పడి శహబాష్‌గా బ్రతుకుతున్నా. నీకుమల్లే చేసుకున్న పెళ్ళాన్ని వదిలేసి ఒక ముండ మోపి దగ్గరచేరి దాని ఆస్తిమీద పెత్తనంచేస్తూ రొమ్ము విరుచుకు తిరగడంలేదు. యిదేగా నీ బ్రతుకు!" అంటూ దులిపేశాడు.

మునసబుకు తల తీసివేసినంతపని అయింది. అతను పక్కనున్నవాడి చేతిలో కర్ర లాక్కున్నాడు. వెంకటేశు మొరాయించాడు. నలుగురు సర్దేశారు. తరువాత నాలుగు మాసాలు గడిచాయి. పల్లెఅంతా పండుగ వేడుకల్లో వుండగా మునసబు మనుష్యులు బరిసెలు, బల్లేలు, పుచ్చుకుని పల్లెమీద పడ్డారు. నడి బజారులో వెంకటేశును ఖూనీ చేశారు.

ఆ రోజున లచ్చి పురిటి మంచంమీద వుంది. వెంకటేశు చావువార్తవిని ఆమె గిలగిలకొట్టుకుంది. "మునసబు ప్రాణాలు తోడేస్తాను" అంటూ కత్తి ఒకటి పుచ్చుకుని బజారున పడింది. నలుగురూ పోగై బలవంతంమీద ఆమెను ఆపు చేశారు.

వెంకటేసుతో ఆమె వివాహం చాలా విచిత్రపరిస్థితులలో జరిగింది. లచ్చిని వివాహం చేసుకునేందుకు పల్లెలోని యువకులు అనేకమంది ముందుకు వచ్చారు. కాని లచ్చి అందరినీ తిరస్కరించింది. వెంకటేసు తనే స్వయంగా లచ్చియింటికిపోయి వాళ్ళ తల్లిని అడిగాడు. "యేం! యీరమ్మత్తా! మీ లచ్చిని నేను పెండ్లాడతాను. మెళ్లో అడ్డిగలు, కాళ్ళకు కడియాలు పెడతాను. మీకు యిష్టమేనా?" అన్నాడు.

"నువ్వు పొగరుబోతాడివి. నీకు నా పిల్లను ఇవ్వను" అని చెప్పేసింది వీరమ్మ.

అయినా వెంకటేసు పట్టుదలతో ప్రయత్నాలు సాగిస్తూనే వున్నాడు. వెంకటేసుతల్లి మాలక్ష్మి ఒకనాడు కొడుకుతో అంది. "ఓరయ్యా! ఆ యీరమ్మకూతురు లచ్చి ఒట్టి పోనమాకలదిరా! దానిజోలి మనకి వద్దురా నాయనా! దానిఅమ్మ నాలుగు మనువులు పోయింది. ఒక్క మొగుడికైనా సరిగా కూడేసిన పాపాన బోలేదు. ఇక దాని కూతురు యీ లచ్చి యేమి ఎలగబెడుతుందని దాని కోసం అట్టా ఎగబడుతుండావు. దానికోసం ఆశపడమాకరా తండ్రీ!"

"నీయమ్మ! నీకేం తెలుసులే వుండవే!" అన్నాడు వెంకటేసు.

కొద్దిరోజులు గడిచాయి. ఒకనాటి ఉదయం వెంకటేసు చేలో గట్లు పెడుతున్నాడు. లచ్చి చంకన తట్టబెట్టి పుల్లలకు బయలుదేరింది. వెంకటేసు అది పసికట్టాడు. అతను

పని వదిలేసి లచ్చి పొయ్యేదారికి వెళ్ళి ఒక చెట్టుచాటున కూచుని లచ్చి సమీపించగానే లేచి నిలబడ్డాడు. లచ్చి బిత్తరపోయింది.

అతను నెమ్మదిగా అన్నాడు

"లచ్చీ! నేను నిన్ను యేమిచేశానే?"

"నువ్వు నన్నేమిచేస్తావు?"

"మరి నన్నెందుకు పెండ్లి చేసికోవూ?"

"మాఅమ్మకు యిష్టంలేదు."

"పోనీ, నీకుయిష్టమేనా"

"అబ్బో! నువ్వు రౌడీవి"

"నేను ఏం రౌడీపనులుచేశాను. పల్లెలో ఒక్క ఆడదాన్నికూడా నేను ఈ రోజువరకు కొంగు పట్టుకొని ఎరగనుగదా! నేను చేసిన రౌడీపను లేమిటో నువ్వే కాస్త చెప్పులచ్చీ!" అతను జాలిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"ఏమో, నువ్వంటే నాకు భయం"

"నేను ఏమీ చేయనిదే భయపడటం ఎందుకు లచ్చీ! నీ మీద నాకు చాలా భ్రమగావుంది." ఆమె కొరకొరలాడుతూ చూచింది.

"ఆ పిచ్చివేషాలు యేమీ సాగవు." అంటూ ఆమె తప్పుకొని పోవటానికి ప్రయత్నించింది.

కాని అతను ఆమెను అమాంతంగా వాటు వేసుకున్నాడు. ఆమె నోరెత్తి అరవబోయింది. అతను చేతితో ఆమె నోరు మూశాడు. ఆమె ఆ చేతిని గట్టిగా కరచింది. అతను లక్ష్యపెట్టలేదు. చేతికి బాగా గాట్లు దిగాయి. లచ్చి

నోటికి అతని రక్తం ఉప్పగా తగిలింది. ఆమె చెయ్యివదలి క్రిందికిచూస్తూ వుమ్మివేసింది. అంతా రక్తమే అతను సునాయాసంగా ఆమెను భుజాలమీదికి ఎత్తుకుని పొదల చాటుకు నడిచాడు.

అరగంట తరువాత అతను పనిలోకి పోయాడు. ఆమె తట్టపుచ్చుకు పల్లెకు తిరిగిపోయింది. అతను భయపడ్డాడు. పనిచేయడంమాని పల్లెవైపు చూస్తూ కూచున్నాడు. ఒకటి, రెండు గంటలు జరిగిపోయాయి. పన్నెండుగంటలు దాటింది. ఎండ తీవ్రంగావుంది. అతను పలుగు భుజాన పెట్టి పల్లెవైపుకు నడిచాడు. అతనికి యింకా సందేహంగావుంది. లచ్చివైపు మనుష్యులు కర్రలతో, కత్తులతో వచ్చి తనను యెదుర్కొంటారని. కాని అదేమీ జరగలేదు.

రెండు మూడు దినాలు గడిచాయి. వెంకటేసు ఆలోచనలన్నీ లచ్చిమీదే వున్నాయి. కాని ఆమెను కలుసుకోవడం అతనికి సాధ్యపడలేదు. ఒక సాయంకాలం అతను పనిలోకి పోయేసమయంలో లచ్చితల్లి వీరమ్మ కుండ భుజాన పెట్టుకుని బావికి బయలుదేరింది. వెంకటేసు వెనకకు తిరిగి లచ్చి యింటిముందు ఆగాడు. లచ్చి గుమ్మంలో కూచుని వుంది. వెంకటేసు సరాసరి ఆమె ముందుకుపోయి నిలబడ్డాడు. లచ్చి నిర్లక్ష్యంగా చూచింది. అతను చిన్నగా నవ్వుతూ "లచ్చీ! నా మీద యింకా కోపంగా వుందా!" అన్నాడు. ఆమెనుండి సమాధానం రాలేదు. అతను ఆమె భుజాలు రెండూ పట్టుకొని లేపి నిలబెట్టాడు. ఆమె అభ్యంతరం చెప్పలేదు. అతను ఆమెను చేతుల్లోకి తీసుకున్నాడు. లచ్చి తల

అతని గుండెలకాన్చి వలవల విలపించింది. అతను సముదాయించాడు. పెండ్లి ఖాయం చేసుకుంటానని చెప్పాడు. మెడలోకి అడ్డిగలు, చెవులకు దుద్దులు, కాళ్ళకు కడియాలు తెచ్చి పెడతానని చెప్పాడు. అతను గుమ్మందాటి బయటికి నడిచాడు. ఎదురుగా లచ్చితల్లి వీరమ్మ.

అమె కుండ దింపుతూ అంది "ఒరేయ్, సిగ్గుమాలి నోడా! నా వాకిట్లోకి రావద్దని చెప్పలేదంటరా?"

"పెళ్ళి ఖాయం చేసుకుపోదామనివచ్చాను ఈరమ్మత్తా"

అదుగో ఆకూతే కుయ్యొద్దని చెపుతున్నా"

"సరిలే అత్తా"

"అదుగో మళ్ళీ ఆ మాటే అంటాడూ"

లచ్చి బయటికి వచ్చి అంది "అమ్మా! నేను వెంకటేసు బావయ్యను చేసుకుంటానే!"

వీరమ్మ దవడలు నొక్కుకుంది. "ఓలమ్మో, యిదె క్కడి సోద్దెమే! మొన్నటిదాకా చచ్చినోడు, రాలినోడు అన్నకూతురు యియ్యాల బావయ్య అంటూందా! యేదో మందు చల్లి మాయజేశాడే తల్లో!" అంటూ రాగాలు తీసింది.

లచ్చి తల్లిని మందలించింది. కాని వీరమ్మ పెద్దగా శోకాలు పెట్టింది. "ఓ కొండపల్ల కోటమ్మా! ఓ మంగమ్మ గారి చిన్నమ్మో! ఓ కొప్పుల రావమ్మో! ఆ మాలచ్చిం కొడుకు ఎంకటేసు నా కొంప తీశాడే తల్లో! నా కూతురికి మచ్చుమందు చల్లాడే అమ్మో! ఇంకేముంది నా తల్లో!"

అప్పటికప్పుడు పదిమంది పోగయ్యారు. వెంకటేసు నవ్వుతూనిలబడ్డాడు. వచ్చినవారు వివరాలుఅడిగారు వీరమ్మ శోకాలు మాని అన్నీ చెప్పింది.

నలుగురూ నాలుగు మాటలు అన్నారు.

"మందూలేదు, నీ బొందాలేదు! ఆళ్ళిద్దరు యిష్టపడి పెళ్ళి చేసుకుంటా మంటూంటే నీశోకా లేమిటే మధ్యలో!" అంది పొరుగింటి కొప్పుల రామమ్మ.

"అది కాదే తల్లో!" అంటూ సోకంపెట్టింది వీరమ్మ మళ్ళీ.

"ఒలే! యీరమ్మా! ఇంక ఆనగాని నోరుముయ్యి." అంటూ ముసలి అచ్చమ్మ మందలించింది.కొండపర్ల కోటమ్మ అందుకుంది. ఒరే అబ్బాయి! ఎంకటేసూ! పిల్లను చేసుకుం టానని అంటన్నావు. బాగానేవుంది. మరి పతానం యేమి పెడతావు?"

"మెడలోకి అడ్డిగెలు, చెవులకు దుద్దులు, కాళ్ళకు కడియాలు పెడతాను." వెంకటేసు గుక్క తిప్పుకోకుండా చెప్పేశాడు.

"ఇదుగో వెంకటేసు బావయ్యా! యిప్పుడు కాళ్ళకు కడియాలు ఎవ్వరు పెట్టడం లేదుగా! పాంజేబుపట్టాలు తీసుకో. మన పంతులు పెళ్ళాం పెట్టుకుంటాంది చూశావా! అట్టాటివి అయితే పదేళ్ళపాటు మొద్దులల్లే పడివుంటాయి." మంగమ్మగారి చిన్నమ్మ సూచించింది.

"మా లచ్చి యేది కావాలంటే అదే తెస్తాను" అన్నాడు వెంకటేసు నలుగురివైపు చూస్తూ.

"ఓ లమ్మో! యీ గుడే మాలచ్చిమ్మ కొడుకు ఎంకటేసు ఎంతలావు మగోడు అయ్యాడే తల్లో!" అంటూ దవడలు నొక్కుకుంది ముసలి అచ్చమ్మ.

తగవులు, మూకలు లేకుండా పెండ్లి జరిగిపోయింది. కాని పదిమాసాలైనా సరిగా గడవలేదు. పండుగ పూట, పట్టపగలు, నడివీధిలో మునసబు మనుష్యులు వెంకటేసును దొంగచాటుగా వచ్చి పొడిచి చంపారు.

ఆ ఘోర హత్యనుగురించి ఆలోచిస్తూ లచ్చి అనుకుం టూంది "యీ కుక్కల కొడుకుల రక్తం కళ్ళచూచి కాని నేను చావ కూడదు."

కొద్ది సంవత్సరాలు గడిచాయి. లచ్చి ఆరోగ్యం, అందచందాలు చూచి చాలమంది ఆమెను వివాహమాడేం దుకు సిద్ధపడ్డారు. కాని లచ్చి అందరినీ తిరస్కరించింది. ఆమె కూలీ నాలీ చేస్తూ కొడుకు రాముడిని పెంచిపెద్దవాడిని చేసింది. అతనికి పది సంవత్సరాలు దాటేయి. గ్రామంలో పది కాపుగొడ్లను మాట్లాడి వప్పజెప్పింది. రాముడు ఎప్పు డైనా బద్ధకిస్తే తను వాడికి సాయం పోతుంది.

లచ్చి అభిమానుల్లో క్రిష్ణారావు ఒకడు. క్రిష్ణారావు కమ్మ యువకుడు. కమ్యూనిస్టుపార్టీ సభ్యుడు. అతను తరచు పల్లెకు వస్తూ పోతూ వుంటాడు. వ్యవసాయ కూలీ సంఘ సభ్యులను చేర్పించడంలో లచ్చి చొరవ తీసుకునేది. పార్టీ నిధికి వరికోత కొయ్యాలంటే ఆమే ముందు నిలబడేది.

క్రిష్ణారావు ఒకనాడు ఆమెతో అన్నాడు. "లచ్చీ! నిన్ను కమ్యూనిస్టుపార్టీలో సభ్యురాలిగా చేర్పించాలను కుంటున్నాను. అభ్యంతర మేమీ వుండదుగా."

లచ్చి నవ్వేసింది. "నా కెందుకయ్యా శాబూ! ఆ పార్టీలు, గీర్టీలు. యేదో యిట్టా కూలీ-నాలీ చేసుకు బతక నియ్యి."

కమ్యూనిస్టుపార్టీ ఆశయాలను, సిద్ధాంతాలను గురించి క్రిష్ణారావు నాలుగు దినాలు యేకరువు పెట్టాడు. ఆమెను అక్కడక్కడా జరిగే పార్టీసభలకు, సమావేశాలకు పంపించాడు. కొంతకాలానికి ఆమె పార్టీలో సభ్యురాలిగా చేరింది.

ఒకసారి ఆమె క్రిష్ణారావును అడిగింది. "ఏమయ్యా! క్రిష్ణారావుగారూ! కమ్యూనిస్టుపార్టీ కష్టజీవులపార్టీ అని చెబుతున్నారుగదా! అట్లాంటప్పుడు యీ భూస్వాముల అబ్బాయిలు, పట్టణాలలో పెద్దపెద్ద చదువులు చదివిన వారూ యీ పార్టీలో ఎందుకు చేరినట్టూ! నాకు కొంచెం చెప్పరూ!"

క్రిష్ణారావు తాపీగా చెప్పాడు. "నేటి సమాజంలో అట్టడుగునపడివున్న పీడిత ప్రజానీకానికి విముక్తి కలగాలన్నా, సమాజాభివృద్ధికి ఆటంకాలుగా వర్గ, కుల, మతవివక్షతలను రూపుమాపి విశ్వమానవ సౌభ్రాతృత్వం పెంపొందించాలన్నా ఒక్క కమ్యూనిస్టుపార్టీ ద్వారానే సాధించగలమనే విశ్వాసం వారికి కలిగివుంటుంది. అందుకే వారు పార్టీలో చేరివుంటారు."

"అబ్బో! ఆ పెద్దకబుర్లు నాకెందుకు చెబుతావు లేవయ్యా! అసలు విషయం వేరే వుండనే వుంది. నన్ను చెప్పమంటావా?" అంటూ ఆమె క్రిష్ణారావు కళ్ళల్లోకి చూసింది.

అతను చిన్నగా నవ్వాడు. "చెప్పు లచ్చి" అన్నాడు. ఆమె చెప్పుకుపోయింది. "నాకు పెద్ద పెద్ద విషయాలు అంతగా తెలియవనుకోండి. అయినా నాకు అగుపిస్తున్న దేమిటంటే ప్రస్తుతం అధికారంలోవున్న కాంగ్రెసును ఆ స్థానంనుండి తొలగించి మీరు అధికారంలోకి రావాలని తాపత్రయపడుతున్నారు. ఇది నిజమంటారో! కాదంటారో చెప్పండి" అంటూ ఆమె అతనివైపు చూచింది.

అతను మళ్ళీ నవ్వుతూ అన్నాడు. "అవును లచ్చి! ఆశయసాధనకు అధికారం చేజిక్కించుకోవడం అవసరమే గదా!"

"అయితే మీలో మీకు అభిప్రాయభేదాలు, ఆ తగవులు ఎందుకో కాస్త చెప్పండి."

"పార్టీ పోలసీమీద అప్పుడప్పుడు తగవులు, అభిప్రాయ భేదాలు వచ్చేమాట నిజమే లచ్చి!"

"అంతేగాని, మీలో మీకు నాయకత్వంకోసం పెనుగులాట లేదంటారు. యేమోనబ్బా! యీ మధ్య జరిగిన కొన్ని సంఘటనలు చూస్తే కమ్యూనిస్టుపార్టీలో కూడా ఎంత కుటిలత్వం ప్రబలిపోయిందో చెప్పడానికి వీలు పడదు" అంది లచ్చి.

క్రిష్ణారావు నవ్వుతూ సంభాషణ మార్చాడు. "రాముడు నైటుస్కూలుకు పోతున్నాడా లచ్చీ!" అని ప్రశ్నించాడు.

"ఆఁ! పోవడంలేదు క్రిష్ణారావుగారూ! పగలంతా తిరిగి తిరిగి వచ్చి రాత్రి తిండితినగానే పడుంటున్నాడు. అప్పు డప్పుడు నేనే కాసేపు పాఠాలు చెబుతూవుంటా" అంది ఆమె.

♦ ♦ ♦ ♦

గ్రామంలోవున్న మోతుబరి కుటుంబాలలో కృష్ణా రావుగారిది కూడా ఒకటి. నలభై యకరాలమాగాణీ, కొద్దిగా మెట్టభూములూ వున్నాయి. క్రిష్ణారావు తండ్రి గోపయ్య అమాయకుడు. క్రిష్ణారావు పెద్దవాడు. అతను బి. ఏ; వరకు చదివాడు. కాని రాజకీయాలలో ప్రవేశిం చడంతో అతనిపరీక్ష పోయింది. అతనిని మళ్ళీ చదువుకు పంపించడానికి తల్లి వెంకాయమ్మ యెన్నోవిధాల ప్రయత్నిం చింది. కాని అతను ససేమిరా అన్నాడు. క్రిష్ణారావుకు యిద్దరు చెల్లెళ్ళు, ఒకతమ్ముడు వున్నారు. పెద్దచెల్లెలు పుష్పా వతిని తనస్నేహితుడు మోహనరావుకు యిచ్చి వివాహం చేశాడు క్రిష్ణారావు. అప్పటికి మోహనరావు బి. యస్. సి; చదువుతున్నాడు. క్రిష్ణారావు అడిగినంతనే మోహన రావు పుష్పావతిని వివాహం చేసుకోడానికి అంగీకరించాడు. వివాహసమయంలో కట్నాలు, కానుకలు చదివించక పోయినా క్రిష్ణారావు చెల్లెలికి నాలుగు యకరాలు కేటా యించాడు. తరువాత మోహనరావు యం. యస్. సి; పరీక్ష అయి కాలేజీలో లెక్చెరరుగా చేరాడు.

క్రిష్ణారావు వయస్సు పాతికసంవత్సరాలు వుంటాయి. అతనికి పిల్లనిస్తామంటూ ఎందరో వచ్చారు కాని అతను సమ్మతించలేదు. తల్లి ఎప్పుడైనా గోలపెడితే "అమ్మా! మన చిన్నమ్మాయి పెండ్లికూడా చేసినతరువాత నాపెండ్లి విషయం ఆలోచిద్దాములే" అంటూవుంటాడు.

క్రిష్ణారావు తాలూకా కమ్యూనిస్టుపార్టీ ముఖ్యులలో ఒకడు. పార్టీవారు కూడా క్రిష్ణారావుకు పెండ్లిసంబంధాలు మాట్లాడారు. కాని క్రిష్ణారావు వారిసలహాలను తోసి పుచ్చాడు.

తండ్రి గోపయ్యగారు అమాయకుడే అయినా తల్లికీ తండ్రికీ చెప్పకుండా క్రిష్ణారావు ఏపనీ చేసేవాడుకాదు. అతని తల్లివైపువారు ముఖ్యంగా మేనమామలు కాంగ్రెసు వాదులు. క్రిష్ణారావు వట్టిచేతకానివాడని వారిఅభిప్రాయం. ఒకసారి క్రిష్ణారావు మేనమామ రామయ్యచౌదరి తన తోబుట్టువు వెంకాయమ్మతో అన్నాడు. "వెంకాయమ్మా! నీపెద్దకొడుకు వట్టి అప్రయోజకుడమ్మా, మీ ఆస్థి వాడిచేతికి వప్పజెప్పారంటే సంవత్సరం తిరగకుండానే అర్పిపారేస్తాడు. వాడిచేతికి యినప్పెట్టితాళంచేతులు మాత్రం యివ్వకు. ఒక వేళ యిచ్చావో, మీకొంప క్లోజే!"

తనబిడ్డను గురించి అన్నగారు అలాఅన్నందుకు వెంకాయమ్మ చిన్నబుచ్చుకుంది. కాని ఆమె అన్నగారికి సమాధానం చెప్పకుండా వుండలేక పోయింది.

"ఏమో, అన్నయ్యా! వాడు ఇంటికి పెద్దబిడ్డ. పెరిగి పెద్దవాడయ్యాడు. చదువు, సంధ్యలు అబ్బాయి.

ప్రయోజకుడైనా, అప్రయోజకుడైనా ఇంటిపెత్తనం వాడు చెయ్యాల్సిందే. వాడంటే వాళ్ళనాన్నగారికి పడిచచ్చేంత ప్రేమ. మాతో సంప్రదించకుండా వాడు ఏపనీ చెయ్యడు. మా పెద్దమ్మాయికి సంబంధంచూడమని మీా అందరికీ యెన్నోసార్లు చెప్పాను. కాని మీారుయెవ్వరూ పట్టించుకో లేదు. నాబిడ్డ తనస్నేహితుడిని ఒప్పించి పిల్లనిచ్చి పెండ్లి చేశాడు. ఆ పిల్ల ఇప్పుడునిక్షేపంగా కాపురం చేసుకుంటూంది. "అంతకంటె యేమికావాలి అన్నయ్యా? నా బిడ్డ కమ్మా నిష్టు అవడంచేత మీాకు వాడు గిట్టకపోవచ్చు. కాని మా బిడ్డను మేము కాదనుకోలేముగా!"

"మరివాడు ఎందుకు పెండ్లి చేసుకోలేదు?"

"యేమో! వాడికి మనసుకుదరాలిగదా! కుదిరితే యెందుకు చేసుకోడు?"

"ఆఁ యే మాలదాన్నో కట్టుకుంటాడు."

"మాలదాన్ని యెందుకు కట్టుకుంటాడు. ఒకవేళ కట్టు కున్నా మేము చెయ్యగలిగిందేమీాలేదుఅన్నయ్యా. వాళ్ళ నాన్నగారు వాడిని వదిలివుండలేరు."

"బాగానేవుంది వరస!" అన్నాడాయన వ్యంగ్యంగా.

—:—

ప్రకరణ 3

కరణం రామచంద్రరావు గారికి పురుషసంతానం లేదు. ఒకేఒక కుమార్తె. ఆమెకూడా వితంతువు. కరణంగారికి ప్రాపంచికజ్ఞానంఎక్కువ. అభ్యుదయ భావాలున్నాయి. కాని బంధువులకు భయపడి ఆయనకుమార్తెకు రెండోవివాహం చెయ్యలేకపోయాడు.

కరణంగారు కుమార్తె సుశీలను పట్టణంలో ప్లీడరుగారి కొడుకు మోహనరావుకుయిచ్చి ఎంతోవైభవంగా వివాహం చేశారు. కట్నాలు, కానుకలకు యిరవై వేలకుపైగా ఖర్చుపెట్టారు. కాని ఆరు మాసాలైనా జరగకుండా అల్లుడు మోహనరావు టైఫాయిడ్ జ్వరంతో మరణించాడు. అప్పటికి సుశీల వయస్సు పదహారు సంవత్సరాలు. కూతురుకు సంభవించిన దుర్గతికి తల్లి వరలక్ష్మమ్మ కుమిలి కుమిలి మంచంపట్టి సంవత్సరం తిరగకముందే మరణించింది. భార్యా మరణంతో కరణంగారికి మతి పోయినంత పని అయింది. అప్పటికి ఆయన వయస్సు నలభై అయిదు సంవత్సరాలు. బంధువులంతాపోగై ఆయనను తిరిగి వివాహం చేసుకోవలసిందని వత్తిడి తెచ్చారు. కాని కరణంగారు లొంగలేదు. పైగా వ్యతిరేకించారు.

"ముక్కుపచ్చలారని నాబిడ్డను అలావదలివేసి యీ వయస్సులో నేను మళ్ళీ వివాహంచేసుకొని ఎక్కడ తల ఎత్తుకు తిరగగలను. నేను వివాహం చేసుకునేకంటే నా

బిడ్డకే వివాహంచేస్తే నాకే చీకూచింతా వుండదు." అన్నాడు కరణంగారు.

కరణంగారు ఆ మాటలన్నప్పుడు బంధువులు నలుగురూ ఆయనను అపహాశ్యం చేశారు. ఇంట్లో తిష్టవేసిన విధవ తోబుటువు శాంతమ్మగారు దవడలు నొక్కుకుంది.

"ఒరే, తమ్ముడూ! దాని కర్మ అలా రాసివుంది. అందుకు మనమేంచేస్తాంరా నాయనా! "నొసటన్ వ్రాసిన వ్రాతకన్న కలదే నూరేండ్లు చింతించినన్" అని పెద్దలు వట్టినే అన్నారటయ్యా! అయినా వైధవపిల్లకు పెండ్లిచేసి ఎక్కడ తలయెత్తుకు తిరగ గలుగుతామయ్యా! అయ్యో అయ్యో, నీవు ఆ పనిచేస్తే మన వంశమర్యాద మంటకలసి పోదూ! యేమోనాయనా! నీవుగనుక దానికి మళ్ళీ వివాహం తలపెడితే మేము ఎవ్వరమూ నీ వాకిట్లో అడుగు పెట్టము. మాకర్మ యేమికాలింది గనక నీతోపాటు మేమూ వెలిలో వుండడానికి" అంది శాంతమ్మగారు.

"తిరిగి వివాహం చేసుకోనేందుకు నాబిడ్డ అంగీకరించాలేగాని మీ వెలీ గిలీ నన్నేమీ చెయ్యావు శాంతమ్మక్కా! అంతేకాదు. మీరు అందరు కట్టుకట్టి నాయింటికి రాకపోయినా, నాకేమీ యిబ్బంది లేదు. నాలుగు వందలు పారేస్తే ఆ బ్రాహ్మలే నలుగురు చేరతారు. ప్రాయశ్చిత్తం అంటూ యేదోతంతు జరుపుతారు సరిపోతుంది. నేను ఆ విధంగా యేమీ భయపడనమ్మోయ్"! అన్నాడు కరణంగారు.

శాంతమ్మగారు నెత్తిబాదుకుంది. "అవ్వ! యిదెక్కడి ప్రారబ్ధమురా తండ్రీ! అయితే యిక మన బ్రాహ్మణ్యం మంట కలిసినట్టే! ఇదిగో అబ్బాయ్! నేను చెబుతున్నాను కాస్తవిను. యీ వెధవముండకు తిరిగి పెండ్లిచేస్తే పితృదేవతలు శపిస్తారు. పరలోకంలోనున్నవారికి పిండోపక క్రియలు కావించే అర్హతను నీవు కోల్పోతావు. నీకుమళ్ళీ పునర్జన్మ అంటూ వుండదు. యే నరకానికో గురి అవుతావురా నాయనా! పెద్దదానిని చెప్తున్నాను. ముండమోపి పెండ్లి ప్రయత్నం విరమించుకోవడం, మనకూ మన పితృదేవతలకు కూడా మంచిదిరా తమ్ముడూ!"

"అదేమీ లాభంలేదు శాంతమ్మక్కా! అక్కడెక్కడో పరలోకంలో తిష్టవేసుకు కూచున్న నా పితృదేవతలను తృప్తిపరచడానికి నాబిడ్డను బలియివ్వబోను. అది మట్టుకు యదార్థం" అన్నాడు కరణంగారు.

శాంతమ్మ రాజీమార్గం సూచించింది. "పోనీ లేవయ్యా, రెండో వివాహానికి నీకు అభ్యంతరం అయితే జ్ఞాతుల పిల్లవాడిని ఒకడిని తీసుకువచ్చి దత్తత చేసుకో. అవసానదశలో వాడు యిన్ని నీళ్ళు చల్లితే నీవూ, నేనూ, మన పెద్దలుకూడా తరిస్తారు" అంది.

కరణంగారు చిన్నగా నవ్వాడు. "నాకు అలాంటి భ్రమలేమీ లేవు శాంతమ్మగారు! కన్నబిడ్డను కాదని ఎవడో పరాయివాడికి యీ ఆస్తంతా కట్టబెట్టేంతటి ఛాందసుడిని మాత్రం కాదు నేను. నా బిడ్డకుయేదో ఒకదారి చూడాలి. అందుకు నేనేమీ వెనకాడను" అన్నాడాయన.

"యేమిటి నాయనా! నీవుచూసేదారి. గోదారి చూడాలి. దారిచూస్తాట్ట, దారి" అంటూ శాంతమ్మ అక్కడి నుండి లేచిపోయింది.

శాంతమ్మగారు దృష్టి మేనకోడలు సుశీలమీద కేంద్రీకరించింది. శాస్త్రాలూ, ధర్మాలూ అన్నీ ఆమెకు బాగా నూరిపోసింది. ఇంట్లో పురాణకాలక్షేపం యేర్పాటు చేసింది. కొద్దినెలలు గడిచాయి. శాంతమ్మగారి కృషి ఫలించింది. సుశీల ఒకసారి తండ్రితో అంది "నాన్నగారూ మీరుయింకా ఎంతకాలమని ఏకాంతజీవితం గడుపుతారు! మీరు తిరిగి వివాహంచేసుకోవడం మంచిదని అనుకుంటున్నాను నాన్నా! యీ విషయంలో మీరు సందేహించడం, కూడదు నాన్నగారూ!" అంది.

కరణంగారు ఆమెవైపు విస్తుపోయి చూచాడు. అవును లే అమ్మా! ఆలోచిద్దాం" అనిమాత్రం అనగలిగారు.

ఒకటిరెండు సంవత్సరాలు దొర్లిపోయాయి. సుశీల ప్రారంభంలో పురాణగ్రంథాలు చదివింది. అనంతరం ఆమె దృష్టి నవలలవైపుకు మళ్ళింది. కరణంగారు ఆమెకొరకు పెద్ద లైబ్రరీ సేకరించారు. తెలుగు, హిందీనవలలు యెన్నోచదివింది. వీరేశలింగం, టాగూరు, ప్రేమచంద్, గోర్కీ, టాల్‌స్టాయ్ మొదలగు వారి రచనలు చాలావరకు చదివింది.

ఒకసారి కరణంగారు కూతురుతో సూచనప్రాయంగా అన్నారు. "అమ్మాయీ, బాల్యంలో భర్తలు పోయినవారు తిరిగి వివాహంచేసుకోవడం శాస్త్రవిరుద్ధమాత్రంకాదు తల్లీ! నీవుకూడా తిరిగి వివాహం చేసుకోవడం మంచిదని నా అభి

ప్రాయం. ఏకాకి జీవితం ఎడారిలాంటిదమ్మా! బాగా ఆలోచించుకో తల్లీ!"

సుశీల వెంటనే సమాధానం చెప్పింది. "నాన్నగారూ! నాకూ శాస్త్రాలమీదా, ధర్మాలమీదా అంతగా నమ్మకం లేదు. అయినా మనసాంప్రదాయాలంటూ కొన్నివున్నాయిగా. వాటినతిక్రమించడం నాకుయిష్టంలేదు. అదిగాక తిరిగి వివాహం చేసుకోవాలనేఅభిలాష నాకు యేమాత్రమూ లేదు. మీరుత్వరలో వివాహం చేసుకోవాలనేదే నాఅభిలాష నాన్నగారూ" అంది.

కరణంగారు యేమీ సమాధానం చెప్పలేదు. కొద్ది వారాలు గడిచాయి. శాంతమ్మగారు యింట్లో చీటికి మాటికి చికాకు పడుతూంది. సుశీలను నోటికివచ్చినట్లు తిట్టడం సాగించింది.

శాంతమ్మ కుమార్తెను కరణంగారి జ్ఞాతులలో ఒకరికిచ్చి వివాహం చేశారు. ఆమెకు నలుగురు సంతానం. అందులోఒకరిని కరణంగారికి దత్తతు చేయించాలని శాంతమ్మగారి అభిలాష; కాని కరణంగారు దత్తత చేసుకోడానికి పూర్తిగా వ్యతిరేకించారు. సుశీలమీద శాంతమ్మగారి పలుకుబడి క్రమంగా తగ్గిపోయింది. యిటీవల శాంతమ్మగారి మాటలను, సలహాలను సుశీల కాతరు చేయడంలేదు. తనపాచిక పారలేదనే వుక్రోషంతో శాంతమ్మగారు విజృంభించింది. తమ్ముడిని యేమీ అనలేక సుశీలమీద విరుచుకు పడటంసాగించింది.

కరణంగారు ఎవ్వరితోనూ సంప్రతించకుండా ఒకనాడు పట్టణానికి వెళ్ళి పత్రికకు అడ్వర్టైజుమెంటు యిచ్చారు.

యాభై వేల ఆస్థిగల బాల్య వితంతువునకు వరుడు కావలెను.

నియోగులు, వాశిష్టగోత్రం, పద్ధెనిమిది సంవత్సరాల బాల్యవితంతువు. అందముగానూ; ఆరోగ్యముగాను వుంటుంది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలు బాగా చదువను వ్రాయనువచ్చు. యోగ్యుడైన నియోగి వరుడు కావలెను.

పోస్టుబాక్సు నెం. బి. 26458.

కరణంగారు వారానికి రెండుసార్లు పట్టణానికిపోయి పోస్టుబాక్సుతీసి జాబులు తీసుకువచ్చేవారు. ఆ జాబులు చదువుతూ ఆయనగారు తనలోతాను విపరీతంగా నవ్వుకునేవాడు. వాటిలోఆయన దృష్టిని ఆకర్షించినవి కూడా కొన్నివున్నాయి.

బెంగుళూరులో విమానసర్వీసు తరిఫీదు పొందుతూన్న యువకుడు, ఫోటోకూడ పంపించాడు. అతనిది విశాఖపట్నం. తండ్రి జిల్లా సర్జను. బి. యస్. సి. పాసై ప్రస్తుతం బెంగుళూరులో విమానసర్వీసు తరిఫీదు పొందుతున్నాడు. నియోగులు. వయస్సు ఇరవై రెండు. ఫోటోలో ఎంతో ఆకర్షణీయంగా అగుపిస్తున్నాడు.

కరణంగారు ఆ ఫోటోను సుశీలకు చూపించి, "ఇతనిది విశాఖపట్టణం. జిల్లాసర్జనుగారిఅబ్బాయి. బెంగుళూరులో

విమానసర్వీసు తర్ఫీదు పొందుతున్నాడు. నీకు యిష్టమైతే నిన్ను వివాహం చేసుకునేందుకు సిద్ధంగావున్నాడు." అని చెప్పాడు. సుశీల బెదురుతూ తండ్రివంక చూచింది. మరు క్షణంలో ఆమెకళ్ళు కిందికి దించుకుంది. ఆమె కళ్ళమ్మట నీళ్ళు జలజలరాలాయి.

కరణంగారు నొచ్చుకున్నారు. "నీకు యిష్టం లేక పోతే మానేద్దాం అమ్మా!" అంటూ బిడ్డను సముదాయించారు.

"నాన్నగారూ! మీరు మళ్ళీ వివాహం చేసుకుని మన ఇంటిపేరు నిలబెట్టండి. నాకు అంతకంటే వేరే అభిలాష యేమీలేదు" అంది సుశీల.

ఆ మాఘమాసంలో కరణంగారు రెండో వివాహం చేసుకున్నారు. పెండ్లికూతురు శకుంతలకు పదిహేను సంవత్సరాల వయస్సు. పచ్చగా, సన్నగా, బద్దకర్రలావుంది. శకుంతల అత్తవారి యింటికివచ్చిన కొద్ది కాలానికే సుశీల, శకుంతల అక్క, చెల్లిండ్రకంటె యెక్కువగా కలసి మెలసి తిరిగారు

సుశీల ఒకరోజున శకుంతలను అడిగింది. ఏమోయ్! నేను నిన్ను ఏమని పిలవాలటా!"

"నీ యిష్టం వచ్చినట్టు పిలువు."

"నీవు, నాకు తల్లితో సమానం"

"కాని వయస్సులో చిన్నదానిని గదా!"

"అయితే యిది పెద్దసమస్య యేనే!"

"సమస్య యేముందీ! నీవు శకుంతలా అని పిలిస్తే, నేను సుశీలా అని పిలుస్తాను."

ఇద్దరూ ఏకమై నవ్వుకున్నారు.

శకుంతలతండ్రి గుమస్తా ఉద్యోగంచేస్తూ చని పోయాడు. తల్లి సీతమ్మ ఆమెను పెంచి పెద్దను చేసింది. వారికి పెద్దగా ఆస్థిపాస్తులేమీలేవు. ఒక చిన్నయిల్లు, కొద్ది భూవసతి వున్నాయి. కాని దానికి మించిన అప్పులుకూడా వున్నాయి. శకుంతల వారి యేకైక సంతానం. శకుంతల అత్తవారి యింటికి వెళ్ళిన కొద్దిరోజుల తరువాత సీతమ్మ ఆస్థిపాసులన్నీ తెగటాగ్చుకుని తనుకూడా కూతురి దగ్గరకే చేరింది.

సీతమ్మ వయస్సు ముఫ్ఫైకి పైగా వుంటాయి. పచ్చగా పండిన దబ్బపండు చాయ, గుండ్రనికళ్ళు, ఎర్రని పెదాలు, ఆకర్షణీయమైన వక్షస్థలం, బలమైన నడుము, ఒక ప్పుడు అందాలరాణే అన్నట్టుగా అగుపిస్తుంది. కాని ఆమె తల వెంట్రుకలు తీసివేసినందున ఆ అంద చందాలన్నీ అణ గారిపోయాయి.

సీతమ్మ కరణంగారి యింటిలో కాలుపెట్టిన కొద్ది రోజులకే శాంతమ్మ వైదొలగింది. ప్రారంభంలో సీతమ్మ గారు కరణంగారి కంటపడకుండా తప్పుకుతిరిగేది. కాని కొద్ది రోజులు గడిచేసరికి కరణంగారియింటికి ఆమె సర్వాధికారిణి అయింది.

సీతమ్మ వంటయింటిలో ప్రవేశించిన తరువాత అల్లుడి అభిరుచులన్నీ తెలుసుకొని అతనికి యిష్టమైన వంట

లన్నీ చేసిపెట్టేది. కాలందొర్లిపోయింది. అల్లుడిమీదఅత్త గారికీ, అత్తగారిమీదఅల్లుడికీ ఆదరాభిమానాలు పెరిగాయి. సీతమ్మగారి నిండైనవిగ్రహం ఆమెనుచూచిన కంటితో శకుంతలను చూచినప్పుడు కరణంగారికి ఆమె రోగిష్టిలా అగు పించేది. ఆ అసంతృప్తితో శకుంతల ఎప్పుడైనా దగ్గరకు వస్తే ఆయన కసరుకునేవాడు. ఆమెబాధపడేది. కళ్ళనీళ్ళు పెట్టేది. ఆయన జాలిపడేవాడు. అయినా ఆమెతో సన్ని హితంగా మెలగలేకపోయాడు

కరణంగారిది పెద్ద డాబాయిల్లు. ముందుతలచావిడి, ఉత్తరపువైపున ధాన్యపుకొట్లు వున్నాయి. నెలలుగడిచాయి. ఎండల తీవ్రతహెచ్చింది. కరణంగారు యింట్లో వుక్కగా వుంటుందని తనపడక తలచావట్లోకి మార్చారు. అంతకు ముందే సీతమ్మ అక్కడపరుండేది శకుంతల, సుశీల లోపలి గదులలోనే పరుండేవారు.

అల్లుడిమీద అత్తగారికీ, అత్తగారిమీద అల్లుడికీ వ్యామోహం పెరిగింది. కాని కరణంగారు సంకోచించారు. సీతమ్మ చొరవచేసింది. అల్లుడికి చుట్టలు చుట్టి అందించింది. విసినకర్రతో విసిరింది. కాళ్ళు పట్టింది. రోజులు గడిచాయి. శకుంతల ఉనికిని వారు పూర్తిగా విస్మరించారు. వారే భార్యాభర్తలలా వ్యవహరించారు.

ఒకరోజున కరణంగారు అన్నారు. “సీతమ్మా! మనం యిద్దరము పెండ్లి చేసుకునివుంటే బాగుండేది. కాని మధ్యలో శకుంతల గొంతుకోశాం”

"ప్రపంచంలో ఎన్నో జరుగుతుంటాయి. అయినా ఒకరి కర్మకు మరొకరు బాధ్యులా !" అంది సీతమ్మ వేదాంత మార్గంలో.

"నీ వేదాంతం తగులబడినట్టే వుంది" అనుకున్నాడు కరణంగారు.

కరణం, సీతమ్మగార్ల సంబంధం తెలుసుకోడానికి శకుంతలకు ఆట్టేకాలం పట్టలేదు. కాని ఆ ఏమి చేయ గలదు. యెవరితో చెప్పుకుంటుంది? భర్తాతల్లీ యేకమై ఆమెకు ద్రోహం తలపెట్టారు. ఇక తనబాధ్యత యెవరికి వ్యక్తం చేస్తుంది? వారాలు, నెలలుగడిచాయి. శకుంతల మనో వ్యాధితో మంచంపట్టింది.

సుశీల అన్నీ గమనిస్తూనేవుంది. శకుంతలపట్ల ఆమెకు సానుభూతివుంది. కాని ఆమెమాత్రం యేమి చేయగలదు ? ప్రారంభంలో వొదిగి మదిగి తిరుగుతూవచ్చిన సీతమ్మ యిప్పుడు యింటిలో అధికారం చలాయిస్తుంది. తమ ఇంటికి ఆమే సర్వాధికారిణిలా ప్రవర్తిస్తోంది. సీతమ్మను అదుపులో పెట్టడం తనవల్ల అయ్యేపనికాదు.

సుశీల ఆలోచనలు పరిపరివిధాల పోయాయి. "పిన్న లకు బుద్ధులు గరపవలసిన పెద్దలే పెడమార్గం తొక్కి నప్పుడు ఇక నీతి నియమాలకు తావు ఎక్కడుందీ! పాప పంకిలమైన యీ యమకూపంనుండి బయటపడటం మంచిది" అనుకుంది ఆమె

కాని 'ఎక్కడికి ?' అనే ప్రశ్న ఆమెకు యెదురైంది. "అత్తవారి యింటికి పోతేనో " అనే ఆలోచనపోయింది.

అక్కడ తనను ఆదరించేవారు యెవ్వరూలేరు. పూర్వం ఒకసారి ఆడబిడ్డ పెండ్లికి పోయినప్పుడు మామగారు ఒక సూచన చేశారు. ఆయనగారి పెద్దకొడుకు బిడ్డను దత్తు తీసుకుని అక్కడే వుండిపొమ్మని అడిగారు. కాని ఆ రోజున తను ఆ సూచనను తిరస్కరించింది. తనతండ్రి అసలే వ్యతిరేకించాడు. ఆ తరువాత ఘర్షణకూడా జరిగింది. తను తండ్రి గారితో కలసి వచ్చేసింది.

"నాకు నిండా యిరవై సంవత్సరాలు లేవు. యీ వయస్సులో నేను దత్తత తీసుకోవాలా! ఆయనగారు న్యాయవాది! మొదటిభార్యా పోతే మళ్ళీ వివాహం చేసుకున్నాడు. అరవై సంవత్సరాలు దాటాయి. ఇంకా బిడ్డల్ని కంటూనే వున్నాడు. అబ్బ! యీ మగవాళ్ళు ఎంత స్వార్థపరులు. స్త్రీ-పురుషులమధ్య యింతటి వ్యత్యాసాలు యెవరు కల్పించారు! యేమైనా సరే. యీ అన్యాయాలను యెదుర్కోవటం కంటె వేరే మార్గం లేదు" అనుకుందామె.

సుశీల సన్నగా, బారుగా వుంటుంది. కోలముఖము, సోగగా జారిన కనురెప్పలు, పలుచని చెక్కిళ్ళు, ఎర్రని పెదవులు, లాలిత్యం తొణికిసలాడుతూ అజంతా చిత్రమువులా అగుపిస్తుంది. ఆమె యే దేవాలయానికో పోతూ వీధిలో అగుపిస్తే స్త్రీలు, పురుషులు ఆమెవైపు రెప్పలు వాల్చకుండా చూస్తూ నిలబడిపోతారు.

అలాంటిసమయాలలో సుశీలను చూస్తే సీతమ్మకు కడుపుమంట. ఒకనాడు అక్కసుపట్టలేక అనేసింది. "ఇదిగో! అమ్మాయి! సుశీలా! నీవు వీధిన బయలుదేరితే అంతా నీ

వైపే చూస్తుంటారు. ముండమోపికి శృంగారంకూడా దేని కమ్మా! "ఆ తల వెంట్రుకలు తీయించుకోరాదూ!"

సుశీల సీతమ్మగారివైపు ప్రశ్నార్థకంగా చూచింది. 'తలలు బోడులైనా తలపులు బోడులా!' అన్నారు పెద్దలు. మీకు తెలియంది యేమివుంది సీతమ్మగారూ! మీరుకూడా నాకు సలహాలు యిచ్చేవారేనా!" అంది సుశీల.

సీతమ్మగారు తెల్లబోయి చూచింది. కాని వెంటనే సణుగుతూ అంది. "ఓసి రాలుగాయి, వుండవే!"

శకుంతలస్థితి నానాటికీ దిగజారింది. ఆమె మంచం వదలి బయటటికి రావడంలేదు. కరణంగారు వీధి అరుగు మీద కూచుని మొహం కడుగుతూండగా సుశీలవచ్చి చెప్పింది. "నాన్నగారూ! శకుంతల ఆరోగ్యం యేమీ బాగులేనట్టుంది. రెండురోజులనుండి ఆహారం తీసుకోవడం లేదు. డాక్టరుకు కబురుచేయిస్తారా?" అంది.

"ఆఁ అలానే అమ్మా! నేనే పోయి తీసుకువస్తాను." అన్నారు కరణంగారు.

సీతమ్మగారు కూతురును లేవదీసి మొహం కడిగిరిచ టానికి బయటకు తీసుకువచ్చింది. సుశీల వేడినీళ్ళు తెచ్చి యిచ్చింది. శకుంతల మాటాపలుకూ లేకుండ వారి చేతుల్లో వేళ్లాడిపోయింది. ఇద్దరు కలసి ఆమెను మంచం మీదికి చేర్చారు. ఆమెలో చైతన్యంలేదు. డాక్టరువచ్చి నాడి పరీక్ష చేసి "లాభంలేదు" అన్నాడు. సీతమ్మగారు శోకాలు పెడుతూ నేలమీదపడి దొర్లింది. "శకుంతలా! నీకు ద్రోహం

చేశానా! శకుంతలా! నన్ను క్షమించవా?" అనుకున్నారు కరణంగారు హృదయంలో. ఆయన దుఃఖం ఆపుకోలేకపోయాడు. ఆమె మీదపడి వాపోయాడు.

"కరణం అత్తకు అలవాటుపడితే పెళ్ళాం విషం మింగి చచ్చింది" అంటూ ప్రచారం లేవదీశాడు మునసబు. కరణంగారి యింటి పనిమనుష్యులు, నౌకర్లు ఆ ప్రచారాన్ని ఖండించారు. "అసలు శకుంతలమ్మగారు నెల్లాళ్ళనుండి మంచం దిగటమే లేదు. డాక్టరు వస్తూనే వుండేవాడు. కాని ఆమె మందులుకూడా తాగటం మానేసింది. వారం రోజులుగా డాక్టరు రావటం మానుకున్నాడు. అంతే! ఆమె చచ్చిపోయింది" అన్నారు వాళ్ళు.

కర్మకాండలు ముగిశాయి. సీతమ్మగారు తీర్థయాత్రలకు బయలుదేరిపోయింది కరణంగారియింట్లో మళ్ళీ శాంతం యేర్పడింది.

—:—

ప్రకరణం 4

యేసుదాసు కూతురు మేరీకి ఉద్యోగం దొరకలేదు. యేసుదాసు పనీపాటా మానుకొని నెలరోజులు ఆఫీసులచుట్టూ పాఠశాలలచుట్టూ తిరిగి, తిరిగి వేసారిపోయాడు. కాని ప్రయోజనం లేకపోయింది. "యీ మునసబును నమ్ముకొని అన్ని విధాలా భంగపడ్డాను పిల్ల రెండుసంవత్సరాలనుండి ఇంట్లోనే కూచుండిపోయింది. కాలేజీలో చేర్పించి యింటరన్నా చదివించా లనుకున్నాడు యేసుదాసు. కాని ఆరోజున మునసబు సలహా యిచ్చాడు, "ఒరే! అబ్బాయి, యేసుదాసూ! నేను ఒక సలహాయిస్తాను వింటావా ?" అని అడిగాడు.

"అట్లాగే దొరా!" అన్నాడు యేసుదాసు.

మేరీని యిప్పుడు యింటరులో చేర్పించావంటే యింటరు రెండేళ్ళు చదవాలిగదా! ఆ తరువాత బి. ఏ. మళ్ళీ రెండేళ్ళు చదవాలిగదా! అంటేమొత్తం నాలుగేళ్ళు అవుతుంది. అదికూడా క్లాసులు తప్పకుండా పరీక్షఅయితేను. ఆ తరువాత బి. యిడి. చదవనిదే ఎట్లాగూ వుద్యోగం దొరకదు. యీయాతన అంతా నీవుఎట్లాగూ పడలేవు. నామాట విని నీ బిడ్డను సెంకడరీగ్రేడు ట్రైనింగుకు పంపించావంటే సంవత్సరానికల్లా ఆ ట్రైనింగు అయిపోతుంది. వెంటనే వుద్యోగం చూద్దాం. వుద్యోగం చేస్తూ, యింటరు, బి. ఏ. పరీక్షలకు కూచుంటుంది. తెలిసిందా?" అన్నాడు మునసబు.

మునసబు సలహా అమోఘంగా వుందనుకున్నాడు యేసుదాసు. కాని అనుకున్న ప్రకారం ఏ ఒకటీ సాగలేదు. "పోనీ! పిల్లకు పెండ్లిఅయినా చేశానుకాదు" అనుకున్నాడు యేసుదాసు.

కలుపుతీతలు ప్రారంభమయ్యాయి. మునసబు "మనిషికి రెండుశేర్లకంటె ఒక్క గింజకూడా ఎక్కువ యివ్వను. అందుకు యిష్టమైనవాళ్ళు రండి. లేనివాళ్ళు మానుకోండి." అని చెప్పేశాడు. ఆరోజురాత్రి పల్లెలోని వ్యవసాయ కూలీలంతా సమావేశమయ్యారు. నాట్ల సమయంలోకూడా మునసబు చాలా అన్యాయం చేశాడు. యేమైనాసరే ఆయన చెప్పిన రేటుకు సమ్మతించి కూలీలు ఎవ్వరూ మునసబుకు పోగూడదని నిర్ణయం చేశారు. పూర్వంలాగా యేసుదాసు మునసబు కొమ్ము భుజాన వేసుకుని సమర్థించలేదు. పైగాతను నలుగురితో పాటేనని చెప్పేశాడు.

"మరి మీ కరణంగారేమిస్తారు?" కూలీలలో ఒకరు సుబ్బయ్యను ప్రశ్నించారు. సుబ్బయ్య వెంటనే సమాధానం చెప్పాడు. "ఊళ్ళోనలుగురు ఎట్టాయిస్తే మా కరణంగారు అట్టాగే యిస్తారు."

"ఆ నలుగురు యిచ్చేది యేమిటో మనం తేల్చుకోవాలి" అన్నారు ఇంకొకరు

లచ్చి లేచి నిలబడి అంది "వారుయిచ్చేది యేమిటి? యింతయిస్తేనే కూలికివస్తామని మనమే చెప్పుదాం!"

"ఆ యింత యేమిటో కూడ నువ్వేచెప్పరాదు" అంటూ ఒకరు సూచించారు.

లచ్చి చెప్పింది. డబ్బులైతే మనిషికి రూపాయి పావలా, గింజలైతే మనిషికి కుంచెడు. ఆడామగా తేడాగాని పిల్లాజెల్లా అనే పేచీలు యేమీ వుండకూడదు. అందరికీ ఆ రేటు ముట్టజెప్పాలిసిందే!

నలుగురు "సరి అంటే సరి" అన్నారు.

ఒకరు సుబ్బయ్యను హెచ్చరించారు "యేమ య్యోయ్ సుబ్బయ్యా! మీ కరణంగారు యింటిచుట్టూ దొరగోరండీ, అయ్యగోరండీ, అమ్మగోరండీ అని తిరిగితే సరిగాదు. ఆ రేటుకు ఆయనగారిని ఒప్పించాలి" అన్నాడు.

సుబ్బయ్య కొంచెం చిన్నబుచ్చుకున్నాడు.

"యెవడరా! నువ్వు యెదవనాయాలా! నోటికి యే కూతవస్తే అది కుయ్యటమే నంటశ్నా." "కరణంగారు మాకు ఫలానా అప్పుడు అన్యాయంచేశారు" అని మన పల్లెలో ఒకమగాడుగాని. ఆడదిగాని ముందుకు వచ్చిచెప్పితే తల్లి ముండమొయ్యా నామూతిమీద మీసం గొరిగించేస్తా. లేక పోతే నాపేరు సుబ్బయ్య కాదు" అన్నాడు రోషంతో.

నలుగురు ముఖ ముఖాలు చూచుకున్నారు. "పాపం, ఆ మారాజును అంటే పురుగులు పడతయ్యి"

"నాట్లు వత్తిడప్పుడు దక్షిణ పొలం నాట్లకి రెండు రూపాయల కాడికిచ్చాడు, మారాజు"

"మునసబు రూపాయిస్తే నోరు ఎత్తినాడులేదు. పైగా కరణంగారిని ఆడిపోసుకోటమా"

నలుగురు నాలుగువిధాల విమర్శించారు.

"అయితే రేపు మా పల్లపు పొలంలో కలుపులు తియ్యాలనుకుంటున్నాం, ఒక వందమంది దాకా పడతారు. మరి అంతా బయలుదేరుతారా ? లేక మునసబుగారికి మాట యిచ్చాము, పుల్లయ్యగార్కి మాట యిచ్చాము, అంటారా యేదో తేల్చి చెప్పండి" అంటూ అడిగాడు సుబ్బయ్య.

"మరి రేటు సంగతిచెప్పరేం" అందులో ఒకరు అడిగారు.

"నీ యమ్మా! రెడ్డొచ్చే మొదలాడరా! అన్నట్టుగా వుంది. యీాళ్ళపని. యింతకుముందు లచ్చి చెప్పింది గాదంటయ్యా" ఒకరి సమాధానం.

"ఆ రేటు మునసబుగారిస్తారేమో" కృపాదానం సందేహం వెలిబుచ్చేడు.

"యిస్తే తెచ్చుకోండయ్యా" అన్నారు ఒకరు.

"యేమయ్యోయ్! కృపాదానం! మునసబుగారి చేత ఆ రేటు యిప్పించడానికి నీవు యేమైనా పూచీపడతావా ?" యేసుదాసు ప్రశ్నించాడు.

"నేను మాట్లాడింది నీ తరపునేనయ్యా స్వామీ" కృపాదానం సమాధానం.

"నేను నీకు వకాలత్తు యివ్వలేదు గాదంటరా"

"నీ యమ్మ, మధ్యలో నాకెందుకు వచ్చిన మేళం బాబు"

పల్లె అంతా యేకంగా కరణంగారి చేలో దిగారు. యేసుదాసు ఇంటిదగ్గరే వుండిపోయాడు. పట్టుమని పదిమంది కూడా మునసబుగారి కూలికి పోలేదు.

కరణంగారిచేలో వందమందికి పైగా కలుపుతీస్తున్నారని తెలిసి మునసబు మండిపడ్డాడు.

"నా పనిలోకి వచ్చే కూలీలను కరణం అడ్డుతగిలాడు అంటూ ప్రచారం లేవదీశాడు" మునసబు.

"రేపు కరణం కూలీలకి మనం అడ్డంకొడితే సరిపోతుందిగా" దిబ్బమీది వెంకయ్యకొడుకు సుబ్బారావు అన్నాడు.

"కరణం పల్లపు చేలో కలుపు యీ రోజుతో పూర్తి అవుతుందిగా, యింకా ఆయనకి కూలీలు యెందుకు?" పిచ్చయ్యగారి రామారావు అన్నాడు.

"యెప్పుడో సమయం దొరుకుతుందిలే, చేతికి చిక్కాడా! నొక్కిపారెయ్యాలి." అన్నాడు మునసబు ఉక్రోషంతో.

పన్నెండు గంటలవరకు పనిచురుకుగా సాగలేదు. కూలీలు కబుర్లలోపడి నెమ్మదిగా కదులుతున్నారు. సుబ్బయ్య హుషారుచేశాడు. "ఒరేయి అబ్బాయిలూ! పనేమీ సాగటంలేదురోయ్! ప్రొద్దువాటారుతోంది. ఇంకా ఒకమూలన్నా కదలలేదు. కాస్త హుషారు తెచ్చుకొని సాయంకాలానికి పూర్తి చేశారా అంటే పాతిక కొబ్బరి కాయలు, వీశెడుబెల్లం యిప్పిస్తాను. పల్లెకుపోయి ఫలారం చేసుకుందురుగాని" అన్నాడు సుబ్బయ్య.

"ఒక్క వీశెడు సాలదుమామో! రెండువీశెలు యిప్పించు" అడిగారు ఒకరు.

"సరే! అట్టాగే యిప్పిత్తాలే" సుబ్బయ్య హామీ యిచ్చాడు.

"సుబ్బయ్యమామకుజై" అన్నారు కుర్రాళ్ళు.

ఒకరినొకరు హుషారు చేసుకున్నారు.

"ఓలమ్మా పదం అందుకోండే" ముసలి అచ్చమ్మ సూచించింది. అటుయిటూ జోడీలు మారారు.

నీలం, సుందరమ్మా, జ్యోతి పదం మొదలుపెట్టారు.

"యేటిమీదా నీరువచ్చే పిల్లవాడా!
నన్ను యేరుదాటించవోయి పల్లెవాడా.
నన్ను యేరూ దాటించవోయి పల్లెకారూ"

వాళ్ళు చరణం ముగించగానే కుర్రాళ్ళు అందుకున్నారు.

"యేటిమీదా నీరువస్తే పిల్లదానా!
తెరచాప ఎత్తి పట్టుతానే చిన్నదానా
"నే తెరచాప యెత్తిపట్టు తానే పిల్లదానా!"

మళ్ళీ ఆడపిల్లలు అందుకున్నారు.

కొంటె మాటలాడబోకు పిల్లవాడా
తెరచాపయెత్తి యేమిపడతావు పల్లెకారు
తెరచాపయెత్తి యేమిపడతావు పల్లెకారూ!"

మగపిల్లల సమాధానం.

"కొంటెమాట లేమికాదు పిల్లదానా
తెరచాపయెత్తి లంగరు పడతా చిన్నదానా
నే తెరచాపయెత్తి లంగరు కాస్త పల్లవాధరీ!"

ఒలేయి! నీలమ్మా, సినిమాపాట ఎత్తుకోరాదంటే!"

"యేమి సినిమా పాట"

"పెళ్ళికూతురులో పాట"

"అబ్బో నాకు సరిగా రాదు"

"ఒరేయి చిన్నోడా! కొత్తహాలులోకి వచ్చిన సినిమా చూశావంటరా నువ్వు"

"ఆ చూశానుగాని యేమిబాగుండలేదశ్శా"

"నీ యమ్మా, బాగానే వుందిగాదంటరా?"

"ఆఁ, యేం బాగుందీ, ఆ పెళ్ళికూతురు యేసం ఏసింది ముసిల్ది. యీతల గొడ్డల్లే వుంది"

"అబ్బో! ఆ పెళ్ళికొడుకు ఏసినోడు మాత్రం. కార్లు గడిసిన ఎద్దల్లే లేడూ" ఆడపిల్లల్లో ఒకరన్నారు.

"ఒలే! అచ్చవ్వా కాటంరాజుకథ అందుకోవే నువ్వు. నేను, లచ్చి వంతపాడతాం." చిన్నమ్మ సూచించింది.

సుబ్బయ్య హెచ్చరించాడు. "అదుగో మళ్ళీకబుర్లు మొదలు పెట్టారు. పని సాగటంలేదు గబగబాజరిగిపోవాలి. ఒలే! అచ్చెమ్మా నీయనకాల కలుపుమొక్కలు దిగబడతుండాయి. ఒరేయి! చిన్నోడా అవికూడా కలుపుకురారా"

మరునాటి ఉదయం సుబ్బయ్య వీధివెంట పోతుంటే మునసబు ఆయనను నిలబెట్టి ఘర్షణ పెట్టుకున్నాడు.

"యేరా! సుబ్బాయ్! నీ కళ్ళు అంతనెత్తిమీదకి వచ్చాయంటరా. నువ్వు ఎంతకరణం పాలేరువైతే మాత్రం"

"నా దేముందిదొరో! నేను చేసిన నేరమేమిటో కాస్త సెలవు యివ్వండిదొరో"

"నీ యమ్మా! నిన్న నా పనిలోకి వచ్చేకూలీలకు అడ్డుతగిలి యిప్పుడేమో వంగివంగి దణ్ణాలుపెడితే తప్పిపో తుందనుకుంటున్నావంటరా? లంజా……"

"ఎందుకుదొరా! అట్టానోరు పారేసుకుంటావు నీకు వచ్చేకూలీలకు నేనేమీ అడ్డుతగులలేదు. యీ కలుపుల్లో మాకరణంగారు యిచ్చేరేటు ఏమిటో నేను పల్లెలో చెప్పాను. ఏ ఒక్కళ్ళను బొట్టూ, కాటుకపెట్టిపిలవలేదు. పల్లెఅంతా వాళ్ళంతకువాళ్ళే ఎగబడి వచ్చారు. అందులో నాతప్పే ముందీ?. నామీద అనవసరంగా తమరు అంత కాకపడ తారు యెందుకు?"

"నోరు ముయ్! లంజా …………" అంటూ మునసబు ముందుకు వచ్చాడు.

సుబ్బయ్య కరుకు మోపాడు. "పెద్దమనిషిగా చెపు తూంటే! నీకు గేణంలేనేలేదే. దేనికి అట్టానోరు పారేసు కుంటావు?"

"ఒరే! గోపాలం ఆ కర్ర యిట్టాపట్టుకు రారా, యీ నాకొడుకు నోరు మహాలేస్తూంది".

సుబ్బయ్య కర్రపట్టి నిలబడ్డాడు. వెనకవైపునుండి మున సబు తరపుమనుష్యులు యిద్దరువచ్చి సుబ్బయ్యను పట్టు కున్నారు. మునసబు సుబ్బయ్యను జుట్టువంగదీసి రెండు గుద్దులు గుద్దాడు. తరువాత సుబ్బయ్యను ముందుకుతోసి "ఫో! లంజాకొడకా నీకు దిక్కున్నచోటచెప్పుకో! మళ్ళీ నోరుయెత్తావంటే నీ ఎముకలు విరుగుతాయి." అన్నాడు.

సుబ్బయ్య తలకాయ వంచుకొని కరణంగారింట్లోకి వెళ్ళాడు.

కరణంగారు అప్పుడే భోజనంముగించి చుట్టకాలుస్తూ ముందు వరండాలో కూచున్నాడు. సుబ్బయ్యను చూచి "యేమిటి సుబ్బాయ్, మళ్ళీవచ్చావు?" అని అడిగారు.

సుబ్బయ్య సమాధానంచెప్పలేదు. పైపంచతీసి మొహం కప్పుకుంటూ బావురుమన్నాడు. కరణంగారు కంగారుగా లేచివచ్చాడు. సుబ్బయ్య సమాధానం చెప్పకముందే చుట్టూ పదిమందిచేరారు. కరణంగారి చిన్నపాలేరు రామ కోటి చెప్పాడు. "దారిని పోయేవాడిని మునసబు నిలేసి జుట్టు వంగదీసి కొట్టాడండీ!"

కరణం మండిపడ్డాడు. "దేనికి కొట్టాడటా?"

సుబ్బయ్య తేరుకొని "ఆయన కూలీలను తిరగదీసి మనం కలుపు తీయించుకున్నామంట! వట్టిపుణ్యానికి కొట్టాడుదొరో! యీ రోజువరకు ఎవ్వరిచేతా ఒక్క మాటైనా పడి యెరగను" అంటూ సుబ్బయ్య కళ్ళు తుడుచుకున్నాడు.

"ఓరి! నీ అఘాయిత్యం మండిపోను! వీడికూలీలు యెక్కడా! మనం అడ్డుతగిలింది ఎవరికీ? యిదెక్కడిసాగుబడి. అంతా మొగలాయి ప్రభుత్వంగావుందే! సరే అదేదో తెల్సుకుందాం" అంటూ నలుగిరి ముఖాల్లోకిచూస్తూ "ఒరేయి రామకోటీ, నీవుపోయి ఆ పెత్తందారు రామారావుగారిని, ఆ క్రిష్ణారావుగారినీ అర్జంటుపని వుందనిచెప్పి పిలుచుకురా" అన్నారు కరణంగారు.

పదినిముషాలలో ఇంటినిండా జనం పోగయ్యారు. కరణంగారు ముందుచావడిలో చాపలు పరిపించారు.

"యేమయ్యా, పెత్తందారూ! ఏమిటి యీ మునసబు అఘాయిత్యం? దారిని పోయేవాడిని పిలిచి కొడతాడటయ్యా" అన్నారు కరణంగారు.

"ఏదో! వుడుకుబోతు తనంతో యేడ్చి వుంటాడు లెండి. అది సరేగాని మునసబుకు పోయే కూలీలను మీరు తిరగదీసుకు పోయారని అంటూన్నారేమిటీ?" పెత్తందారు అడిగాడు.

సుబ్బయ్య లబలబ లాడాడు. "రామరామ! అవన్నీ వట్టిమాటలే దొరగారూ. మునసబుగారి కూలీలను మేము అసలు పిలవనేలేదండి. రూపాయిపావలా రేటు యిస్తున్నామని తెలిసి వాళ్ళంతవాళ్ళే యెగబడి వచ్చారండీ."

కరణంగారు అందుకున్నారు. "సరే! యిప్పుడు మనం యేమి చెయ్యవలసివుంటుందో నీవే చెప్పవయ్యా! పెత్తందారూ!"

"నలుగురంకలసి ఆలోచించాలిగాని నేను మాత్రం యేమి చెబుతానండీ" పెత్తందారు సందేహం వెలిబుచ్చాడు.

క్రిష్టారావు కల్పించుకొని చెప్పాడు. "ఈ మునసబు దుండగాలు రోజురోజుకు బాగా సాగిపోతున్నాయండీ! ఎవరికివారు మనకు ఎందుకులే అని తప్పుకు పోవడంతో అతనికి మరీ లోకువయ్యాం. బోడె తగాదాఅప్పుడు పెత్తందారుగారి మనుష్యులను పట్టుకు కొట్టాడు. మనం సహించి వూరు

కున్నాం. నాట్లు తరుణంలో కరణంగారి కూలీలను అడ్డం కొట్టి నాట్లు వేయించుకున్నాడా! అప్పుడుకూడా సర్దుకుని పూరుకున్నాం. పైగా కూలీలకు ప్రభుత్వం నిర్ణయించిన రేటుకూడా యివ్వలేదు. ఇప్పుడు మళ్ళీ తగాదాకు సిద్ధమయ్యాడు. మనం అందరం యేకమై అతనిమీద చర్య తీసుకోవడం అవసరం అని నేను అనుకుంటున్నా" అన్నాడు.

"నీవు తీసుకునే చర్య యేమిటో! అదికూడా బయట పెట్టు" అని అడిగాడు పెత్తందారు.

"సమయంచూచి నలుగురం కలసి మునసబును పట్టుకుని నాలుగు తన్నడమే" అన్నాడు క్రిష్ణారావు.

"హాశ్నర! మొనగాడా! మనకు నలుగురువుంటే వాడికీ పదిమందివున్నారు. అయినా గోటితో చీరేదాన్ని గొడ్డలితోచీరాలనుకోవడం యేమాత్రం మంచిదికాదు. నేనొక సలహా చెబుతాను బాగా ఆలోచించుకోండి – మనం నలుగురినీ పోగుచేస్తే వాడూ అంతకంటె యెక్కువమందినే పోగుచేస్తాడు. రైటింగులు, కూనీలు, తరువాత ఎవరు వుంటారో, ఎవరుచస్తారో చెప్పలేం. మిగిలినవాళ్ళం కోర్టుల చుట్టూ,జైళ్ళచుట్టూ తిరగకతప్పదు.అందుకు నేను మాత్రం సిద్ధంగాలేను. ఇకపోతే యిప్పుడు సుబ్బాయిని కోర్టుకు పంపించి మునసబుమీద కేసుపెడదాం. గట్టివాళ్ళను నలుగురిని చూచి సాక్ష్యం వేసుకుందాం. కోర్టుద్వారా మునసబు కొంత అల్లరి పాలుకాక తప్పదు. ఆ తరువాత కూడా మున

సబు విజృంభిస్తే అప్పటిసంగతి సందర్భాలనుబట్టి మళ్ళీ ఆలోచిద్దాం" అన్నాడు పెత్తందారు.

తరువాత మెవ్వరూ మాట్లాడలేదు.

♦ ♦ ♦ ♦

సుబ్బయ్యను పట్టుకుని మునసబుకొట్టాడనేవార్త పల్లెకు అందింది. మొట్టమొదటగా ఆవార్తవిన్న ముసలి అచ్చమ్మ నాలుగువీధుల కూడలిలో నిలబడి శోకం పెట్టింది. "ఓలమ్మో! యింకేముందే తల్లో! మన సుబ్బయ్యను పట్టుకొని మునసబు చంపేశాడంటే అమ్మో!" అంటూ లబలబలాడింది. మరుక్షణలో ఆవార్త పల్లెఅంతటా పాకిపోయింది. చిన్నా, పెద్దా అంతాపోగయ్యారు ఒకతను ముందుకు వచ్చి అచ్చమ్మను వివరాలుఅడిగాడు. "ఓ, అయ్యమ్మోయ్ నీకు ఎవరు చెప్పారే యీ కబురు!"

"మన లచ్చికొడుకు రామిగాడు లేడు! ఆడు చెప్పాడురా బాబా"

రాముడుచుట్టూ పదిమంది పోగయ్యారు "ఒరే, రాముడూ! నువ్వు సుబ్బయ్యను చూశావంటరా?"

"యహే! నేను చూడలా"

"మరి సుబ్బయ్యను కొట్టారని ఎవరు చెప్పారు?"

"ఊళ్ళో అంతా చెప్పుకుంటున్నారు"

"యేమని చెప్పుకుంటున్నారన్నా!"

"సుబ్బయ్యను పట్టుకొని మునసబు తన్నాడని"

"మరి అచ్చమ్మ చంపేశాడని అంటందేంటి?"

"యేమో ! నాకు తెలవదు."

"నీయమ్మా ! పిల్లనాయాలా ! పోరా."

పల్లెఅంతా పోగై గ్రామంలో జొరబడ్డారు. చాలా మంది మునసబుయిల్లు చుట్టుముట్టారు. ఎవరినోటికి వచ్చిన తిట్లువారుతిట్టారు. మునసబుగారు ఇంటితలుపులు లోపల బిగించుకున్నారు.

కరణంగారింటికి కబురుఅందింది. క్రిష్టారావు, పెత్తందారు, సుబ్బయ్యా అంతా యేకంగా పరుగు, పరుగున మునసబు యింటికి వచ్చారు. సుబ్బయ్యానుచూచి పల్లెవారంతా తెల్లబోయారు. "నీయమ్మా ! ముసిలి అచ్చెమ్మ ఎంతపని చేసిందిరా" అన్నారు ఒకరు.

"ఒరేయి ఆరామిగాడిని పట్టుకొని రెండు వ్రత కండిరా" అన్నారింకొకరు.

సుబ్బయ్యా అందరినీ పోగుచేసి "పల్లెకు పోదాం పదండి. అక్కడికి పోయిన తరువాత అంతా విందురుగాని" అంటూ దారితీశాడు. అంతా అతనివెనక నడిచారు.

పెత్తందారు కరణంగారితో అన్నారు.

"యేమండీ ! కరణంగారూ ! మునసబుకు కావలసిన పరాభవం జరిగిపోయింది. ఇంక మనమేమీ తలపెట్ట నవసరం లేదనుకుంటాను"

కరణంగారు చిన్నగా నవ్వాడు. "కాగల కార్యం గంధర్వులే జరిపిరి" అన్నాడాయన.

కొద్ది దినాలు గడిచాయి. మాలలను సాధించటానికి మునసబు విశ్వప్రయత్నాలు చేశాడు. పొలిమేరలో నున్న

తుమ్మపీకెలు ఎవరో కొట్టుకుపోతే మాళ్ళలమీద కేసు పెట్టించాడు. వారిపశువులను పట్టుకొని బందెల దొడ్డికి తోలించాడు తనకు కొద్దో గొప్పో బాకీలు వున్నవారి పద్దులు ప్లయింటుచేసి జప్తులు పెట్టించాడు. అంతటితో ఆగక తన రౌడీ ముఠాను పురికొల్పి మాలలను విడివిడిగా తన్నించాడు. మాలలు తనను కొట్టడానికి ప్రయత్నిస్తున్నారని ముందుగానే పిటీషను పెట్టుకున్నాడు. ఫలితంగా కొందరిమీద బైండోవరు సెక్షను పెట్టారు.

మాలలంతా ఒకచోట సమావేశమై మునసబు నెదుర్కొనడానికి ఆలోచనలు జరిపారు. మునసబు రౌడీముఠాను చీలదీసి తన్నడానికి ఆలోచనలు జరిపారు. కాని వారి ప్రయత్నాలు ఫలించలేదు. పైపెచ్చు ఒకరు యిద్దరు మునసబు రౌడీల చేతులలో మళ్ళీ దెబ్బలు తిన్నారు. ఆ పరిస్థితులలో క్రిష్ణారావు జోక్యం కల్పించుకుని వ్యవసాయ కూలీల సమావేశం జరిపి, మునసబును, అతనిరౌడీముఠాను యెదుర్కొవలసిన అవసరాన్ని వివరించాడు. అందుకు తగిన సన్నాహాలు కూడా చేశారు.

తెల్లవారక పూర్వమే మాలలు రహస్యంగా కరణంగారి చావడిలోకి చేరుకున్నారు. కరణంగారి ఇంటినుండి మునసబుయిల్లు యాభై గజాల దూరంలోవుంది. కాని మునసబు యిల్లు ఉత్తరవైపు బజారుమీదవుంది. అక్కడ వీధి మలుపు తిరుగుతుంది.

ఉదయం ఏడుగంటల సమయంలో మునసబు వీధి అరుగుమీద కూచుని మొహం కడుగుతున్నాడనే కబురు

మాలలకు అందింది. మునసబుతోపాటు అతని అనుచరులు కూడా నలుగురైదుగురు వున్నారు. వ్యవసాయకూలీ యువకుడు రంగడు కర్ర పుచ్చుకుని మునసబు ఇంటి ముందుగా పోతుంటే మునసబు తన అనుచరులకు కన్ను గిలిపాడు. రౌడీ గోపాలం అరుగుదిగి రంగడిని నిలవేశాడు. "ఎక్కడికిపోతావు లంజా......... .... అంటూ రంగడిమీదికి పోయాడు. రంగడు తప్పుకుని రండిరా, కాపుసారాతాగే నా కొడుకుల్లారా!" అంటూ సవాలుచేశాడు. మునసబుతోసహా అందరు అరుగుదిగి రంగడిమీదికి వురికారు. రంగడు తప్పుకుని కరణం యింటివైపు పరుగెత్తాడు. మునసబు, రౌడీలు అతనిని వెంటాడారు.

కరణం ఇంట్లోనుండి వ్యవసాయ కూలీలు పరుగు, పరుగునవచ్చి మునసబును, అతని అనుచరులను చుట్టు ముట్టి చెత్త చెత్తగా కొట్టారు. మునసబుకు కాళ్ళూ, చేతులు, పట్టుతప్పాయి. అతను లేవగలిగిన స్థితిలో లేడు. లచ్చి అతని ముందుకువచ్చి "ఏరా సిగ్గుమాలిన కుక్కా! నాభర్తను ఆనాడు అన్యాయంగా ఖూనీ చేయించావు. యిప్పుడు నిన్ను పందిని చంపినట్లు పొడిచి చంపితే నీకు దిక్కేముంది. తాగుబోతు వెధవా! అంటూ ఆమె అతనిమొహాన వుమ్మేసింది.

మునసబుమనుష్యులు కొందరు రంగంలోకి వచ్చారు. వ్యవసాయ కూలీలలోకూడా కొందరికి దెబ్బలు తగిలాయి. కరణంగారువచ్చి వ్యవసాయ కూలీలనుఅవతలకుతోసివేశారు. మునసబును లేవదీసి కూచోబెట్టాడు. పోలీసులకుకబురు వెళ్ళింది. వ్యవసాయ కూలీలందరూ ఎక్కడివాళ్ళక్కడ సర్దుకున్నారు.

మునసబును, అతని అనుచరులను వారి బంధువులు వచ్చి తీసుకు పోయారు.

గంటతరువాత పోలీసు వ్యానులు వచ్చాయి. మునసబు, కరణం యిద్దరు స్టేటుమెంట్లు యిచ్చారు.

మాలలు తన యింటిమీదికి దొమ్మీకి వచ్చారని మునసబు స్టేటుమెంటు యిచ్చాడు. కూలీలెక్క చూచుకోడానికి వ్యవసాయకూలీలు తనయింటికివస్తే మునసబు తన అనుచరులతోవచ్చి వారిమీద పడ్డాడని కరణం స్టేటుమెంటు యిచ్చాడు.

ఇరుపక్షాల వారికి తగిలిన దెబ్బలను పోలీసులు రికార్డు చేసుకున్నారు. కరణంగారింటి ముందే దెబ్బలాట జరిగినట్టు యే పార్టీకి చెందనివారు చెప్పారు. రెండువారాల వరకు మునసబు హాస్పిటలు వదలి రాలేదు. పోలీసులు ఉభయ పార్టీలను బైండోవరు చేశారు. మొత్తం వందమందికిపైగా కోర్టుకు పోవలసి వచ్చింది.

కోర్టుకు వచ్చేటప్పుడు, పోయేటప్పుడు పార్టీలకు ఘర్షణలు జరుగుతూ వచ్చాయి. ఒకసారి ఒక వ్యవసాయ కూలీకి బలమైన దెబ్బేతగిలింది. అతనితల చిట్లి రక్తం చిమ్మింది. అతని దుస్తులు రక్తంతో తడిశాయి. అతను సరాసరి మేజస్ట్రేటుముందుకుపోయి తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పుకున్నాడు.

మేజస్ట్రేటు పార్టీనాయకులను పిలిచి గట్టిగా మందలించాడు. అయినా ప్రయోజనం లేక పోయింది. కోర్టు విశ్రాంతి సమయాలో కోర్టు ముందే యిరుపక్షాల వారూ

తారస పడ్డారు. పోలీసులు కలుగ జేసుకోవలసి వచ్చింది. మేజస్ట్రేటు మండిపడ్డాడు. అందరినీ రిమేండులో చేశాడు. మునసబు కరణాలకు కూడా తప్పలేదు. మూడు రోజులు రిమేండులో భూస్వాములు, వ్యవసాయ కూలీలు నానా యాతనలు పడ్డారు. ఆ చీకటి కొట్లలో భూస్వాములు కొట్టు మిట్టాడారు. పోలీసుల జేబులు నిండాయి.

వారిని బెయిలుమీద వదలడానికి మేజస్ట్రేటు షరతు పెట్టాడు. ఒకో పార్టీనుండి లక్ష రూపాయలకు బాండ్లు తీసుకున్నాడు. మళ్ళీ ఘర్షణ పడితే ఆ రెండు లక్షలను ప్రభుత్వం స్వాధీనం పరచుకొని మళ్ళీ కొత్త కేసులను బనాయిస్తుందని చెప్పాడు.

భూస్వాములు ఆలోచనలో పడ్డారు. ఉభయ పార్టీలకు మధ్య సంప్రతింపులు జరిగాయి. మొత్తంమీద అంగీకారానికి వచ్చారు. వ్యవసాయ కూలీలమీద మునసబు పెట్టిన పాత కేసులన్నీ ఎత్తివేసుకోవాలి. ఎవరి ఖర్చులు వారే భరించాలి. క్రొత్త తగాదాలు పెట్టుకోరాదు. వారం దినాలు తరువాత జైలునుండి బయటపడ్డారు. మునసబుకు చావుతప్పి కన్ను లొట్టపోయి నట్టయింది. అతను గ్రామం వదలి పట్టణంలో కాపురం పెట్టాడు.

—:—

ప్రకరణ 5

క్రిష్టారావుకి లచ్చిని వివాహం చేసుకోవా లనే అభిలాష చాలాకాలంగా వుంది. కాని తీరా ఆమె ముందు తన అభిప్రాయాం వ్యక్తం చేస్తే ఆమె కాదంటుందేమో ననే అనుమానంకూడా వుంది. ఒక రోజన అతను మాటల సందర్భంలో ఆమెను అడిగాడు. "లచ్చీ! వెంకటేశు పోయి చాలా కాలమైంది గదా! నీవు మళ్ళీ తిరిగి వివాహం చేసుకో లేదు. ఎందుచేత?"

"ఏం నాపెళ్ళి గొడవ దేనికయ్యా?" ఆమె కొంచెం కటువుగానే అంది. అతను చిన్నగా నవ్వాడు.

"ఇంతకాలంనుండీ మనం స్నేహితులుగా వుంటు న్నాము గదా! నీ సాధక బాధకాలు తెలుసుకోవా లనే అభిలాషతో అడుగుతున్నా. వేరే ఏమీలేదు లచ్చీ!

లచ్చి ప్రశ్నార్థకంగా అతని కళ్ళల్లోకి చూసింది. అతను తలవంచుకున్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. అతను మళ్ళీ ప్రశ్నించాడు.

"ఏం లచ్చీ, చెప్పవూ! నీ కష్టసుఖాలను గురించి నేను తెలుసుకో కూడదూ?"

"నా కష్టసుఖాలు యీ అయిదారేళ్ళ నుండీ నీవు చూస్తూనే వున్నావు గదయ్యా యింకా నేనేమి చెప్పేది?"

"అవును! నీ కష్టసుఖాలు తెలుసుకున్నాను గనుకనే యిప్పుడు అడుగుతూంటా. నీవు మళ్ళీ పెళ్ళి చేసుకో వచ్చుగా. ఎందుకు చేసుకోలేదూ అని."

రెండు నిమిషాలు మౌనంగా గడిచాయి. లచ్చి నేల వంక చూస్తూ నెమ్మదిగా చెప్పుకుపోయింది.

"క్రిష్ణారావుగారూ! ఎవడినైనా చేసుకుంటే వాడు నా పిల్లాడిని సరిగా చూస్తాడనే నమ్మక మేముంది?" పై పెచ్చు నామీదా, నా బిడ్డమీదా పెత్తనం చలాయిస్తాడు. పరాయి వాడు నాబిడ్డ వంటిమీద చెయ్యివేస్తే నేను సహించలేను. ఆ కారణంచేతనే యింతకాలంగా నేను ఎవ్వరినీ చేరదియ్య లేదు. పెళ్ళి చేసుకుంటా మంటూ ఎంతోమంది ఎగబడి వచ్చారు. కాని అందరినీ దూరంగా కొట్టాను. ఆ కొండపల్ల వాళ్ళ గోపి రెండుసంవత్సరాలు నాయింటి చుట్టూ తిరిగాడు. నాకోసం ప్రాణాలు వదలుతా నన్నాడు. అయినా వాడికీ లోబడలేదు. కాని పల్లె అంతా అప్పట్లో నాకూ, గోపీకి సంబంధం వుందని పుకారు లేవదీశారు. అప్పుడు మాత్రం నేను అతనితో "గోపీ! పల్లె అంతా మన యిద్దరికీ సంబంధం అంటగడుతున్నారు. నేను భరించలేకుండా వున్నాను. మంచి రోజు చూసి పెండ్లి చేసుకుందామా!" అని అడిగాను.

"నా సూచనకు గోపీ ఎంతగానో సంతోషిస్తాడని నేను అనుకున్నాను. కాని అలా జరుగలేదు. అతను చిన్న బుచ్చుకున్నట్లు అగుపించాడు. నేను వెంటనే అడిగాను. 'అదేమిటి గోపీ! రెండు సంవత్సరాలనుండీ నాచుట్టూ తిరుగు

తూంటివి. ఇప్పుడు పెండ్లి చేసుకుందామని నేను తీరా చెపితే అలా వెర్రిమొహం వేస్తావేమిటే?' అని."

"అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతను నెమ్మదిగా అన్నాడు. 'లచ్చి! నిన్ను నేను మనసారా ప్రేమించాను. నీకోసం నా ప్రాణాలను సైతం వదలుకుంటాను. మన ఇద్దరికీ సంబంధం వున్నదని ఎవరో అనుకుంటున్నారనే సాకుతో నీవు నన్ను పెండ్లి చేసుకోనవసరంలేదు. నేను నిన్ను ప్రేమిస్తున్నట్లుగా నీవు కూడా నన్ను ప్రేమిస్తేనే నన్ను వివాహం చేసుకో. లేకపోతే మనం దూరంగానే వుండిపోదాం' అంటూ అతను కళ్ళు తుడుచుకున్నాడు."

"ఆ స్థితిలో గోపీని చూస్తే నాకూ చాలా జాలి వేసింది. అయినా స్థిమితంగా ఆలోచించ లేకపోయాను. అతనికి వెళసరంగానే సమాధానం చెప్పాను"

"గోపీ! నేను మా రాముడి తండ్రి ఎంకటేశు బావను మాత్రమే మనసారా ప్రేమించాను. మా దాంపత్య జీవితం కొద్ది నెలలే అయినా మాబావ నన్ను స్వర్గానికి ఎత్తాడు. అతన్ని నేను మరిచిపోలేను. ఆ స్థానంలో మరొక మగవాడిని తీసుకోవడమంటే మా బావకు ద్రోహం చెయ్యడమే నన్న మాట. కాబట్టి నేను నిన్ను ప్రేమించే సమస్యలేదు"

"అంతే. గోపీ లేచి వెళ్ళిపోయాడు. రోజులు, వారాలు గడిచాయి. గోపీ బంధువులు అతనికోసం వూళ్ళు, వాడలు గాలించారు. కాని ఎక్కడా ఆచోకీ లేదు. నాలుగు నెలలు గడచిన తరువాత నాపేర ఒక మనియార్డరు వచ్చింది. అది గోపీ దగ్గరనుండే. అతను మిలిటరీలో చేరేననీ, ప్రతి నెలా

డబ్బు పంపుతుంటాననీ దానిలో వ్రాశాడు. కాని ఆ మని యార్డరు నేను తిరుగగొట్టాను. ఆ అడ్రసు తెలుసుకుని అతని బంధువులు అక్కడికి వెళ్ళారు. కాని గోపీ అక్కడా లేడు. ఎక్కడికో బదిలీఅయి వెళ్ళిపోయాట్ట. ఇది జరిగి ఏడు సంవత్సరాలు అయింది. ఈ రోజుకీ గోపీ ఏమయ్యాడో ఎవ్వరికీ తెలియదు.” అంది లచ్చి.

క్రిష్ణారావు దీర్ఘంగా నిట్టూర్చాడు. “లచ్చీ! నీ జీవితమంతా ఒక ప్రేమకావ్యంలా వుందే” అన్నాడు.

“ఏమి వుందనుకుంటే మాత్రం యిప్పుడు లాభమేమి వుంది క్రిష్ణారావుగారూ! నేను అంటే పడిచచ్చే మగాళ్ళను నిలుపుకోలేకపోయాను. అది అంతా నా దురదృష్టం” అంది లచ్చి నిరాశగా.

నాలుగు నిమిషాలు మవునంగా గడిచాయి. క్రిష్ణారావు మళ్ళీ అందుకున్నాడు.

“సరే లోగడఏదో జరిగిపోయింది. ఇప్పుడు వివాహం చేసుకునేందుకు నీకు అభ్యంతరం ఏమిటే?”

లచ్చి అతనివైపు ప్రశ్నార్థకంగా చూచింది. ఇప్పుడు నన్ను ఎవరు చేసుకుంటారటా?”

“ఎవరో కాదు లచ్చీ! నేను.”

లచ్చి ఆశ్చర్యంగా అతనివైపు చూసింది. ఆ మరుక్షణంలో ఆమె విరగబడి నవ్వింది.

క్రిష్ణారావు చిన్నబుచ్చుకున్నాడు. “అదేమిటి లచ్చీ! నీవు అంతగా నవ్వవలసిన అవసరం నాకు ఏమీ అగుపించదు.”

"ఇక చాల్లే వెర్రి క్రిష్ణారావుగారూ! అంతటితో ఆపవయ్యా బాబూ"

క్రిష్ణారావుకు పౌరుషం వచ్చింది. అతను నిష్కర్షగానే అడిగాడు. "లచ్చీ! యిందులో నా వెర్రితన మేమిటో కాస్త చెప్పు"

ఆమె మళ్లీ నవ్వింది. "పాపం క్రిష్ణారావుగారికి కోపం వచ్చినట్టుందే!"

"అదిగో విషయం దాటవేస్తున్నావు! "

"నేను అంత పిరికిదానిని కాదులేవయ్యా నాయనా"

"అయితే చెప్పు. నా ఓటమిని ఒప్పుకుంటున్నాను."

"అయితే విను. మీరు కమ్మనారు. మీది సమిష్టి కుటుంబం. నీకు యింకా వివాహం కాలేదు. రేపు ఒకవేళ మీ కులంలో అమ్మాయిని, చదువు, డబ్బు, అందమూవున్న అమ్మాయిని చూచి మీవాళ్ళు నీకు పెండ్లి చేస్తారనుకో. అప్పుడు నీకు కాబోయే భార్యను మీ కుటుంబం అంతా చక్కగా ఆహ్వానిస్తారు. మేడమీది గదిలో కూచో పెడతారు. ఆదరిస్తారు. నీకూ సరదాగా గడచిపోతుంది. ఇక నేనో కూలీ, నాలీచేసి నీతిగానే బ్రతుకుతున్నా. కాని నాకు ధనమూ, దర్పమూ లేవు. ఒకవేళ నన్ను నీవు వివాహం చేసుకుంటే మీవాళ్లు నన్ను మీ ఇంట్లో అడుగు పెట్టనిస్తారా. రేపు మీ చెల్లిలి పెండ్లి జరిగితే ఊరివెంట ముత్తయిదువలను పిలవడానికి నన్ను పంపుతారా! యిందులో ఒక్కదానికి అవును అని నీవు సమాధానం చెప్పినా నేను నిన్ను వివాహం

చేసుకోడానికి సిద్ధమే. యేదీ చెప్పుచూదాం" అంటూ నిల దీసి అడిగింది లచ్చి.

క్రిష్టారావు తెల్లబోయాడు. కాని వెంటనే సర్దుకుని "లచ్చీ! మా వాళ్ళు అంతా నాతోపాటు వుండాలంటే అది ఎలా సాధ్యం. ఎవరియిష్టం వారిది. వ్యక్తి స్వాతంత్ర్యం కావాలని మనము చెపుతాముగా" అన్నాడు.

లచ్చి ధీమాగా అంది. "అవన్నీ చేతకాని కబుర్లు క్రిష్టారావుగారూ? మీ శాస్త్రిగారు వున్నారు చూడు. ఆయనా ఒక పెద్ద నాయకుడు. శ్రావణ మంగళవారం, శుక్రవారాలు వచ్చాయంటే ఆయనగారి సతీమణి దర్వాజాలకు పసుపు కుంకుమ పెట్టి పూజలు చేస్తుంది. సాయంకాలం ఠీవిగా ముస్తాబుఅయి వూరువెంట పేరంటానికి బయలుదేరు తుంది. అవునంటావా! కాదంటావా చెప్పు." అడిగింది లచ్చి.

క్రిష్టారావు తాపీగానే సమాధానం చెప్పాడు.

"అదేమీ కాదని నేను అనను లచ్చీ. వ్యక్తిస్వాతంత్ర్యం అని నేను ముందుగానే చెప్పానుగా" అన్నాడు.

లచ్చి వ్యగ్యంగా నవ్వింది. "మీలో అసలు లోపం అక్కడే వున్నదయ్యా. ఇంట్లో మీ భార్యలకు మీరు నచ్చ చెప్పలేరు. ఇక ప్రపంచాన్ని బాగుచేస్తామని అంటారు. అది సాధ్యమా! చెప్పండి. ఇంట గెలిచి రచ్చ గెలవాలన్నారు పెద్దలు. ఇక మీరేమో వ్యక్తిస్వాతంత్ర్యం సాకుతో అన్నీ కప్పదాటులు వెయ్యాలని చూస్తున్నారు. మిమ్మలను

చూస్తుంటే మీ ఆశయాలమీద మీకే విశ్వాసం లేదేమో ననిపిస్తుంది. ఇది నిజమా! కాదా" అడిగింది లచ్చి.

"ప్రస్తుతం అమలులో వున్న ఆర్థిక, సాంఘిక, రాజకీయ వ్యవస్థలు మారితేగాని నీవు చూపే లోపాలు తొలగిపోవు లచ్చీ!"

"అయితే అవి మారలేదని తెలిసి కూడా నన్ను ఎందుకు పెండ్లి చేసుకోవాలనుకుంటున్నావు?"

"మనకు అవి అడ్డురావు-లచ్చీ!"

"ఎందుకు రావు. తప్పకుండా వస్తాయి. ఈ సమాజం యిలా వున్నంతకాలం మనం ప్రతి నిముషం బాధ పడక తప్పదు. చివరకు మళ్ళీ విడాకులతో సరిపెట్టుకోవలసి వస్తుంది. నీవు గ్రహించావో లేదో!" అంది లచ్చి.

క్రిష్టారావు ఆలోచనలో పడ్డాడు. లచ్చిముందు అతను ఓటమిని అంగీకరించక తప్పలేదు. "తరువాత మరొకసారి సావకాశంగా మాట్లాడుకుందాం లచ్చీ" అంటూ అతను లేచి నిలబడ్డాడు.

క్రిష్టారావువైపు లచ్చి జాలిగాచూసింది. అతను చిన్నగా నవ్వాడు.

లచ్చి అతనివైపుచూస్తూ "క్రిష్టారావుగారూ! రెండు నిమిషాలు కూచోండి. ఒకగ్లాసుకాఫీ చేసియిస్తాను." అంటూ ఆమె అతని సమాధానం కొరకు చూడకుండా లోపలికిపోయి పొయ్యి వెలిగించింది. అతనుకూడా లేచి ఆమె ప్రక్కకుపోయి కూచున్నాడు.

"లచ్చీ! గేదె పాలు బాగా యిస్తోందా!"

"ఆ యిస్తానే వుంది. కాని పాలు ఖర్చుకావటం లేదు."

"వెన్నపూస వేసుకో వచ్చుగా"

"అదిమాత్రం యెవరు కొంటారు. ఆ తురకాయన వచ్చి వేయించుకు పోతాడు. ఊళ్ళో యిచ్చిన ధరకంటే సవాశేరుకు రెండణాలు తక్కువ యిస్తున్నాడు."

"వారానికి ఒక వీశెడు వేస్తున్నావా?"

"అబ్బే, ఎక్కడా! మూడు సవాశేర్లు లోపే. ఏదో దాని చిట్టుకు, తవుడుకు సరిపోతుంది."

"అయితే గేదెను అమ్మకో రాదూ!"

'అబ్బో! ఎందుకూ, ఆ గేదె పుణ్యమా అంటూ నా పందులు రెండూ బాగుపడ్డాయి. గేదె తాగగా మిగిలిన కుడితి వాటికి ఎక్కాతక్కాగా వుంటాంది."

"పందులు ఏమాత్రం ధర పడతాయి"

"పోతు పందిని యాభై రూపాయలు అడిగారు. యివ్వలేదు. రెండోది చూడిది. దానిని అమ్మే సమస్యే లేదు."

"నీవే నయం, స్వేచ్ఛగా బ్రతుకుతున్నావు"

"అయితే మీరుకూడా ఆ భూములు. లోగిళ్ళు వది లేసి మా మాదిరిగా జీవించ కూడదూ!"

అతను చిన్నగా నవ్వాడు. "నీవు యింతకరకుగా మాట్లాడం ఎక్కడ నేర్చుకున్నావు లచ్చి!"

"మా బ్రతుకే నేర్పుతుంది బాబూ!"

ఆమె పాలలోనే కాఫీపొడివేసి దించింది.

"అదేమిటే! డికాషను నీళ్ళతో పెట్టుకుంటారు."

"అబ్బే నాకు అది బాగోదు. ఆ నీళ్ళకాఫీ సవ్వగా వుంటుంది." ఆమె గ్లాసు అందించింది. అతను కాఫీచప్ప రిస్తూ అన్నాడు. "కాఫీ, బ్రహ్మాండంగా వుంది లచ్చీ"

"సరే గాని నేను ఒక సలహా చెపుతా వింటావా ?"

"తప్పకుండా"

"నీకు మా వాళ్ళ పిల్లనే చేసుకోవాలనే వుంటే చక్కని పిల్లను మాట్లాడతా !"

అతను ఆశ్చర్యంగా ఆమె కళ్ళల్లోకి చూశాడు. ఆమె మందస్మితం చేసింది.

"ఇంతకు ముందు యిన్ని అభ్యంతరాలు చెప్పిన దానివి యిప్పుడు మళ్ళీ యీ సూచన ఏమిటి ?"

"క్రిష్ణారావుగారూ ! నా మీద మీకు బాగా కోపం వచ్చివుంటుంది. కాని నా ఉద్దేశ్యం వేరు. మీరు సుకుమా రులు, నేను మీకు తగను బాబూ"

"ఆ విషయం ఆలోచించవలసింది నీవుగాదు లచ్చీ !"

"నేను అంత స్వార్థపరురాలిని కాదు బాబూ !"

క్రిష్ణారావు కాఫీ తాగి గ్లాసుక్రింద పెడుతూ అన్నాడు "లచ్చీ ! నీవు నన్ను సరిగా అర్థం చేసుకోలేదు. నేను వివాహం చేసుకో దలచుకుంటే ఏ మహారాజు బిడ్డనైనా చేసుకునే అవకాశం వుంది. కాని నన్ను బాగా అర్థంచేసు కోగల వాళ్ళను, నా భావాలతో ఏకీభవించి నాతో సహక రించ గలవాళ్ళను వివాహం చేసుకోవాలనే నా అభిమతం. అందుకు నీవు అన్నివిధాలా తగిన దానివి. నీ నిరాడంబర జీవితము, నీతి నిజాయితీ అన్నింటిని మించిన నీలోని

విప్లవ చైతన్యము నన్ను ఎంతగానో ఆకర్షించాయి. నీవు కాదూ అంటే నేను యిప్పట్లో వివాహం చేసుకునే సమస్య లేదు.”

రెండు నిమిషాలు మవునంగా గడిచాయి. క్రిష్ణారావు లేచి నిలబడి “నేనుపోయి వస్తాను లచ్చీ!” అన్నాడు.

లచ్చికళ్ళు నిండారులైనాయి. ఆమె కొంగుతో కళ్ళు వత్తుకుంది. క్రిష్ణారావు దీనంగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ “లచ్చీ! నిన్ను నొప్పించానా?” అన్నాడు. ఆమె సమాధానం చెప్పలేదు. క్రిష్ణారావు గుమ్మంవైపు నడిచాడు. అతను గుమ్మం దాటుతూవుండగా లచ్చి వచ్చి అతని చెయ్యి పుచ్చుకొని గద్గద స్వరంతో అంది. “క్రిష్ణా రావుగారూ! రెండు నిమిషాలు కూర్చోండి. నేను చెప్ప వలసింది కూడా వుంది విందురుగాని” అంటూ ఆమె మంచం వాల్చింది. అతను కూచున్నాడు. ఆమె అతని పాదాలకు దగ్గరగా నేలమీద కూచుని చెప్పుకు పోయింది.

“క్రిష్ణారావుగారూ! మీ పట్ల నాకు గురుభావం, సోదరభావం కూడా వున్నాయి. మిమ్మలను నాయిష్ట దైవంగా ఆరాధిస్తాను. మీ ఆజ్ఞలను నేను శిరసావహిస్తాను. అవసరమైనప్పుడు మీరు నన్ను అగ్గిలో దూకమన్నా నేను వెనుకాడను. మీ ఆశయ సిద్ధికి నా ప్రాణాలనుసిహితం యివ్వగలను. కాని......” తరువాత ఆమె యిక మాట్లాడ లేకపోయింది. తల కిందికి దించుకుంది. నేలమీద కన్నీటి బొట్లు రాలాయి.

క్రిష్ణారావు నిర్ఘాంత పోయాడు, "లచ్చిది ఎంత సున్నితమైన హృదయం! నేను పెద్దపొరపాటు చేశాను." అనుకున్నాడు. లోలోపల బాధ పడ్డాడు. "ఫరవాలేదు. నీవు చెప్పదలచుకున్నదేదో పూర్తిగా చెప్పు లచ్చీ!" అన్నాడు.

నాలుగు నిమిషాల తర్వాత లచ్చి తేరుకొని "నేను చెప్పదలచుకున్న దేదో చెప్పేశాను. కాని ఎట్టిపరిస్థితులలోను నేను మీకు భార్యను కాలేను. కాను. ఆ విధంగా చేయడమంటే నా బిడ్డకు, నా వెంకటేసుబావకు ద్రోహంచేయడమే నన్నమాట. అయినా మా వెంకటేసుబావను, నా గోపీని దూరం చేసుకున్నట్టుగా మిమ్ముల్ని కూడా దూరం చేసుకోలేను. క్రిష్ణారావుగారూ! మీ పాదాలు పట్టుకుంటా. నన్ను క్షమించరూ!" ఆమెకు దుఃఖం పొర్లి వచ్చింది. క్రిష్ణారావు పాదాల ముందు వాలి వలవల విలపించింది.

కృష్ణారావు ఆమెను లేవదీశాడు. "లచ్చీ! నేను నిన్ను క్షమించవలసిన అవసరంలేదు. కాని నీవే నన్ను క్షమించాలి నేను పొరబడ్డాను. నిన్ను సరిగా అర్థం చేసుకోలేకపోయాను. నా పొరపాట్లను మన్నించు లచ్చీ!" అన్నాడు.

ఆమె మాట్లాడ లేదు. పొరుగింటి కోటమ్మ కేక పెట్టింది. "ఒలే! లచ్చీ! ఎక్కడా అయిపూ, ఆనా లేకుండా మాయమయ్యావు, ఏమి చేస్తున్నావే తల్లీ!"

లచ్చి బయటికి తొంగి చూసి "ఏమిటి కోటమ్మత్తా! నేను ఎక్కడికి పోతాను. ఇంట్లోనేవున్నా. క్రిష్ణారావు దొర వస్తే మాట్లాడుతూ కూచున్నా. ఏమిటి పనీ" అంది.

"ఓలమ్మా! పనీలేదు, గినీలేదు. మా వామి ఎనకాల నీ పంది యీనిందల్లేవుందే. పోయి చూసుకోయా" అంద కోటమ్మ.

"ఓలమ్మో! అది నాకు వశం అవుతుందా! ఎట్టా కోటమ్మత్తా? ఏమి చేసేది!"

"ఇప్పుడు నువ్వేమి చేత్తావులేయే! ఆనక కుడితిపెట్టే యాలకిపోయి పిలువు. అదే యంటపడి పరుగెత్తుకు వత్తంది" కోటమ్మ ఉపాయం చెప్పింది.

"మా రాముడొచ్చే యాలయింది. ఆడికి అన్నంపెట్టి పోయి చూసివస్తాను అత్తా" అంది లచ్చి.

కృష్ణారావు మంచంమీాద పడుకున్నాడు. లచ్చి ఆతురతగావచ్చి "మంచంమీాద పడుకున్నారా! పక్క వేస్తాను లేవండీ" అంది.

"వద్దు లచ్చీ! నేను పోతాను" అంటూ అతను లేచి నిలబడ్డాడు.

"మళ్ళీ దర్శనం ఎప్పుడూ" అంది ఆమె.

అతను చిన్నగా నవ్వుతూ ఎప్పుడు దయ కలిగితే అప్పుడు.

"అబ్బో! అంతమాట ఎందుకంటారు"

"అనకుండా వుండలేను లచ్చీ!"

ఇద్దరూ యేకమై నవ్వుకున్నారు.

⁂

యేసుదాసు కూతురు మేరీ దీర్ఘవ్యాధితో మంచం పట్టింది. ఏసుదాసు ఆమెకు వైద్యాలు చేయించాడు. కాని

రోగం తిరుగుముఖం పట్టలేదు. పిల్ల నానాటికి క్షీణించింది. ఏసుదాసు దిగులుపడ్డాడు, "ఒక్కగాను ఒక్కబిడ్డ. పువ్వుల్లో పెట్టి పెంచాను. చదువు చెప్పించాను. ఉద్యోగం దొరకలేదు. పెండ్లికూడా చేయలేక పోయాను. పైగా ఈ దీర్ఘవ్యాధి. నాతల్లి నన్ను ఏమి చేస్తుందో!" అనుకుని అతను కుమిలిపోయాడు.

పట్టణం ఆసుపత్రికి తీసికెళ్ళి పరీక్ష చేయించమని కొందరు సలహా యిచ్చారు. కాని చేతిలో డబ్బు లేదు. ఏమి చెయ్యాలి, పట్టణం డాక్టర్లంటే మాటలా! ఫీజు క్రింద పాతిక రూపాయలు చెల్లించాలి. ఆ తరువాత పరీక్షలకు యింకా చెల్లించాలి. అతని కేమీ పాలుపోలేదు, మునసబు దగ్గరకెళ్ళాడు. కాని ఆయన ఇంట్లో లేడు. వచ్చే వరకు అక్కడే కూచున్నాడు. గంటలు గడిచాయి. ఏసుదాసు యోచనలు పరిపరి విధాల పోయాయి. "ప్రొద్దునే లేచి యీయన వాకిట్లోకి ఎందుకు వచ్చానురా దేముడా" అనుకున్నాడు. "మరోచోట ఎక్కడైనా ప్రయత్నం చేయాలి" అనుకుని అతను లేచాడు. మునసబు రానేవచ్చాడు.

"యేమిటి యేసుదాసు, యిలా వచ్చావు?" అన్నాడు మునసబు.

"మా మేరీకి జబ్బుగా ఉంది దొరో"

"ఏమి జబ్బట!"

"ఏమో దొరో! వారంపైన కాడనించీ మంచం దిగటంలేదు దొరో!"

"మరి అవుషధం యిప్పించటం లేదూ!"

"ఇప్పించకేం దొరో! నలుగురైదుగురు వైద్యులకు చూపెట్టాను. మందులుకూడా వాడారు. గుణం అగుపించ లేదు"

"అయితే యిప్పుడు ఏమి చేస్తావు"

"యేమో దొరో! రేపు పట్టణం తీసుకుపోయి పెద్ద డాక్టరుచేత పరీక్ష చేయించా లనుకుంటున్నాను"

"పట్టణం దేనికిరా! వూళ్ళో యింతమంది వైద్యు లుండగా!"

పట్టణం తీసుకుపోయి పరీక్ష చేయించమని వారే చెప్పారు దొరా!"

"అయితే తీసుకు వెళ్ళు"

"డబ్బు కావాలి దొరా"

"నా దగ్గర ఎక్కడవుందిరా డబ్బు! ప్రస్తుతం ఏమీ దొరకదు"

"అట్టా అంటే యీలుపడదు దొరో! ఈ ఆపద కాయాలి"

"ఒరేయి! ఏసుదాసూ! ఆ రోజున నా పనిలోకి వచ్చే కూలీలు కరణంగారికి పోతుంటే నీవు చూస్తూ కూచున్నావు. ఇప్పుడు డబ్బు కావలసి వచ్చేసరికి నేను జ్ఞాపకం వచ్చానా?"

"అందులో నా తప్పు ఏమీలేదు దొరా!"

వారు ఎక్కువ కూలీ యిస్తామంటే అంతా ఏకంగా వారి పనిలోకి పోయారు.

"ఇప్పుడు డబ్బుకోసం కూడా అక్కడికే పోలేక పోయావా?"

ఏసుదాసు ఖిన్నుడై లేచి నిలబడ్డాడు. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతను బయలుదేరి పోతుంటే మునసబు వెనకకు పిలిచాడు.

"లోగడ తీసుకున్న బాకీ సంగతి ఏమి చేశావు?"

"తీర్చుకుంటాను దొరా"

"ఎప్పుడు"

"వచ్చే పంటల్లో"

"బాకీ ఎంతో గుర్తుందా?"

"లేకేం దొరా! రెండు సంవత్సరాల క్రితం నూట యాభై, పోయిన సంవత్సరం వందా, మొత్తం రెండువందల యాభై"

"దానిమీద వడ్డీ"

"అంతాకలిపి యిచ్చుకుంటాను దొరా"

యేసుదాసు వీధిలో నిలబడి ఆలోచించాడు. ప్రొద్దు నెత్తిమీదికి వచ్చింది. మునసబు మొండిచెయ్యి చూపెట్టాడు. ఇక యిప్పుడు ఏదీ దారీ అనుకున్నాడు అతను. అతని దృష్టి కరణంగారి ఇంటిమీదికి పోయింది. సందేహిస్తూ అతను కరణంగారి ఇంట్లోకి నడిచాడు.

కరణంగారు ముందు సావట్లో మంచంమీద కూచుని చుట్ట కాలుస్తున్నాడు. ఏసుదాసునిచూచి-

"ఏసుదాసూ! ఇలారా! కూచో! ఏమైనా పనిమీద వచ్చావా?" అంటూ పరామర్శ చేశాడు.

ఏసుదాసు ఆవేదనతో కరణంగారికి సాష్టాంగ నమస్కారం చేసి "బాబుగారూ! వల్లమాలిన ఆపదలో ఉన్నాను. తమరు ఆదుకోవాలి" అన్నాడు.

"విషయ మేమిటో చెప్పు ఏసుదాసూ"

"చెప్పటానికి ఏముంది దొరగారూ! ఇక్కడికి రెండు నెలలనుండి పిల్లదానికి కాయిలా! ఇంట్లోను బయట కూడా ఆదుకునే దిక్కు లేదు. పిల్లను రేపు పెద్ద డాక్టరు దగ్గరకు తీసుకుపోవా లంటున్నారు. చేతిలో పైసా లేదు. తమరు ఈ ఆపద కాయాలి దొరగారూ"

"ఇంట్లో నీభార్య వున్నదిగదయ్యా! దిక్కు లే దంటా వేమిటీ?"

"లేదు, దొరా! మేరీ తల్లి చచ్చిపోతే రెండో పెళ్ళి చేసుకున్నాను. దానికి నాపిల్ల పొడ గిట్టలేదు. పేచీ పెట్టుకుని వెళ్ళిపోయింది దొరా!"

"నీకు ఏ మాత్రమో భూమి ఉండాలనుకుంటాను"

"ఎందుకు లేదూ! ఉండడానికి రెండు యకరాలు ఉంది. కాని అది ఎప్పుడో మునసబుగారికి తాకట్టు రాశాను"

"అయితే యిప్పుడు డబ్బు ఏమాత్రం కావాలంటావు"

"ఒక వందరూపాయి లిప్పించండి దొరో! మీ మేలు మరచిపోను"

కరణంగారు ఇంట్లోకిపోయి వంద రూపాయలు తెచ్చి ఏసుదాసుకు ఇచ్చారు.

ఏసుదాసు డబ్బు అందుకుంటూ "దొరా! నోటు కూడా రాయండి, సంతకం చేస్తాను"

"ఫరవాలేదు ఏసుదాసూ! రేపు ఎప్పుడైనా తీరిక చూచుకుని వ్రాసుకుందాం"

ఏసుదాసు కరణంగారికి మళ్ళీ సాష్టాంగ నమస్కారం చేసి "ధర్మమూర్తులు, కరుణించారు" అన్నాడు.

మరునాడు ఏసుదాసు మేరీని పట్టణం తీసుకుపోయి డాక్టరుతో పరీక్ష చేయించాడు. రెండు రోజుల తరువాత డాక్టరు సహాయంతో ఆమెను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించాడు. కొద్ది దినాలు గడిచాయి. ఏసుదాసు మందులషాపుకు పోతుండగా దారిలో ఆనంద్ అగుపించాడు. ఇద్దరి మధ్య నుండీ బస్సు పోయింది. ఆనంద్ తప్పుకుని మరోదారి పట్టాడు. "అబ్బాయ్, ఆనందం, ఆనందం అంటూ ఏసుదాసు అతని వెనకాల పడ్డాడు. ఆనంద్ నిలబడి "ఏమిటీ, ఏసుదాసు మామయ్యా! ఎప్పుడొచ్చావు" అన్నాడు.

"ఏమి చెప్పమంటావు బాబూ! మేరీకి బాగా జబ్బు చేసింది. ధర్మాసుపత్రిలో చేర్పించాను. మేము వచ్చి వారం రోజులుపైగా అయింది. నాలుగు రోజుల నుండి నీకోసం గాలిస్తున్నారా! ఎంతమందిని అడిగినా నీ జాడే తెలియలేదు. నీ బస ఎక్కడా?" అన్నాడు ఏసుదాసు.

"నేను హాస్టల్లో ఉంటున్నాను మామయ్యా! సరేగాని మేరీకి ఏమి వ్యాధి?"

"అదేదో ఊపిరితిత్తుల జబ్బు అంటున్నారురా బాబూ!"

ఆనంద్ నిర్ఘాంతపోయాడు. "మేరీకి యీ వ్యాధి ఎంతకాలంనుండీ మామయ్యా?"

"ఊడ్పుల్లో ప్రారంభ మయ్యిందనుకో. అప్పటి నుండి మంచం దిగటంలేదురా."

"డాక్టర్లు ఏమంటున్నారు మామయ్యా"

"ఏమంటారు? మందులు ఇస్తున్నారు. అప్పుడప్పుడు నా చేతకూడా కొన్ని ఇంజక్షన్లు కొనిపిస్తున్నారు"

"అయితే మామయ్యా! నేను హాస్టలుకుపోయి పుస్తకాలు అక్కడ పడేసి వస్తాను"

"తొందరగా వెళ్ళిరా నాయనా! మేరీ నీ కోసం కలువరిస్తూంది"

ఆనంద్ ముఖం వికసించింది. అతను ముందుకు సాగిపోతుండగా ఏసుదాసు కేకపెట్టి చెప్పాడు.

"ఒరే! అబ్బాయి. నీవు తొందరగా వస్తే నేను మందుల షాపులోనే వుంటా"

"ఆ! సరే!"

ఆనంద్ హాస్టలుకు పోయేసరికి అక్కడ సుబ్బయ్య కూచుని ఉన్నాడు. ఆనంద్ సంతోషంతో తండ్రి వైపు చూస్తూ "ఎంత సేపైంది నాన్నా నీవు వచ్చి" అన్నాడు.

"ఇంతకు ముందేనయ్యా"

"డబ్బు తీసుకు వచ్చావా?"

"ఆ తెచ్చాను"

"ఎంత తీసుకు వచ్చావు?"

"నీకు ఎంత కావాలనీ రాశావు మన దొరగారికి"

"వంద"

"యాభైతో సరిపెట్టుకోలేవూ"

"సెలవలదాకా యిదే సరిపోతుంది నాన్నా"

"ఏమోరా! ఆ మారాజును ఇబ్బంది పెడతన్నాం"

"వారిఅంతట వారు నన్ను చదువుకు పంపితే మనం పెట్టడం ఏమిటి, నాన్నా! సరేగానీ డబ్బు ఈసారి ఆలస్యంగా పంపించారు ఎందుచేతా?"

"నీ కోసం వుంచిన డబ్బు ఏసుదాసుకు అవసరమైతే దొరగారు అతనికి సర్దారంట"

"నాన్నా! ఏసుదాసు మునసబుగారి తాలూకు మనిషిగా! మన కరణంగారు ఎందుకు యిచ్చారు?"

"వాకిట్లోకిపోయి అడిగితే ఆ మారాజు కాదని అన లేడు గాదంటరా. అయినా మునసబుకు, ఏసుదాసుకు చెడి పోయింది"

"యేసుదాసు నాకు యింతకు ముందే మందులషాపు దగ్గర అగుపించాడు నాన్నా!"

"నిన్ను పలుకరించాడా?"

"ఆ, ఆ."

"ఆడికూతురుకి యెట్టా వుందంట?"

"క్షయ వ్యాధి అట నాన్నా"

"సరే గాని నీవు మాత్రం వాళ్ళ దగ్గరకు పోబోక"

"ఒకసారి వెళ్ళి మేరీని చూసివస్తాను నాన్నా"

"ఆరి తెలివి తక్కువవాడా! ఆ పిల్ల నీకు వుత్తరాలు రాస్తే ఏసుదాసు మనను పట్టుకుని తిట్టాడు. నీకు గుర్తు లేదూ?"

"లేకేం, నాన్నా! మేరీ జబ్బులో వుందిగా"

"సరే! యీ డబ్బు జాగ్రత్త చేసుకో!" అంటూ సుబ్బయ్య పంచె కుచ్చెళ్ళల్లో మూట వూడతీసి కొడుకు చేతిలో పెట్టాడు. పన్నెండు పదిరూపాయల చెక్కులు వున్నాయి. అతను తండ్రివైపు ప్రశ్నార్థకంగా చూశాడు"

"యేం! అట్లా చూస్తావు" అన్నాడు సుబ్బయ్య.

"నూట యిరవై వున్నయ్యి నాన్నా"

"ఆ పై యిరవయ్యి రూపాయిలు అమ్మాయిగారిచ్చారు." ఆనంద్ విస్తుపోయాడు.

"అదేమిటిరా అట్టా చూస్తావు! మన కరణంగారి అమ్మాయి సుశీలమ్మగారు యిచ్చారు."

"అదే నాన్నా! యెందుకుగాను యిచ్చినట్లు"

"ఆమెగారికి ఏవో పుస్తకాలు కావాలంట! తరవాత వుత్తరం రాస్తామన్నారు."

"అమ్మాయి గారికి నా అడ్రసు తెలుసునా"

"ఆమె గారికి ఎట్టా తెలుస్తుందిరా, నీఖాదస్తం గానీ! నువ్వు ఒక కాగితం ముక్కమీద రాసిస్తే నేను తీసుకుపోయి యిస్తాను."

అడ్రసు వ్రాయించుకుని సుబ్బయ్య బయలుదేరి వెళ్ళిపోయాడు.

ఆనంద్ హాస్పిటల్‌కి పోతూ మధ్య మందులషాపులోకి తొంగిచూశాడు. అక్కడ ఏసుదాసు లేడు. అతను హాస్పిటలు చేరేసరికి అయిదుగంటలు దాటింది. ఏసుదాసు గేటుముందు కలిశాడు. ఇద్దరు కలసి మేరీ దగ్గరకి నడిచారు.

ఆనంద్‌ను చూడగానే మేరీకి దుఃఖంపొర్లుకువచ్చింది. ఆమె కళ్ళుమూసుకుంది. పెదవులు వణికాయి. ఆనంద్ ఆమెకు దగ్గరగా నిలబడి "మేరీ" అని పిలిచాడు. ఆమె కళ్ళు విప్పి చూచింది. కాని మాట్లాడలేదు. ఆనంద్ ఆమె చేతిని తన చేతులలోకి తీసుకుంటూ "ఎలావుందిమేరీ" అన్నాడు. ఆమె నీరసంగా అంది. "యేమీ తగ్గినట్టులేదు ఆనంద్" రెండునిమిషాలు మవునంగా గడిచాయి. ఆమె మళ్ళీ అందుకుంది. "మేము యిక్కడికి వచ్చిన నాటినుండీ నీ కోసం నిరీక్షిస్తున్నాను ఆనంద్."

ఆనంద్ ఆమె చేతివ్రేళ్ళను సవరిస్తూ

"మీరు యిక్కడ వున్నట్టు నాకు తెలియదు మేరీ!"

"అప్పుడప్పుడు వస్తూవుండు ఆనంద్"

"రోజూ వస్తూవుంటాను మేరీ"

"సాయంకాలం నాలుగున్నర నుండి అయిదున్నర వరకు రోగులను చూడనిస్తారు ఆనంద్."

"తప్పకుండా వస్తూ వుంటాను మేరీ"

ఏసుదాసు కొయ్యలా నిలబడి వారి యిరువురి వైపు చూస్తూ వుండిపోయాడు. ఆనంద్ వెళ్ళిన తరువాత అతను ఆలోచనలో పడ్డాడు. మేరీకి వ్యాధి తగ్గితే ఆనంద్ తప్పని సరిగా ఆమెను వివాహమాడి తీరుతాడని అనుకున్నాడు.

హాస్పిటల్‌లో నున్న రోగులను చూడడానికి వచ్చే వారు పళ్ళు, పువ్వులు, తినుబండారాలు తీసుకురావడం ఆనంద్ గమనించాడు. రెండోరోజు సాయంకాలం అతను కూడా రెండు చక్కని గులాబీలు, ఒక ద్రాక్షగుత్తి తీసుకు వెళ్ళాడు. అతని చేతిలోని గులాబీలను మేరీ అందుకుని పెదవులకు ఆన్చి ముద్దుపెట్టుకుంది. తరువాత ఆ గులాబీలను కళ్ళకు వత్తుకుంటూ "ఆనంద్! నేను ధన్యురాలను. ఇక నేను చచ్చినా, బ్రతికినా నిర్విచారమే." ఆమె నవ్వుతూ అతని కళ్ళల్లోకి చూచింది. అతను మందస్మితం చేశాడు.

ఆనంద్ స్టూలు ఆమె మంచానికి దగ్గరగా లాగి కూర్చుంటూ అన్నాడు. "నీవు, బ్రతుకుతావు మేరీ, క్షయ వచ్చినంత మాత్రాన అందరూ చచ్చిపోతున్నారా? ఎక్కడో ఒకరో, యిద్దరో సరయిన ఔషధాలు లేక చనిపోతున్నారు. నీవు పూర్తిగా కోలుకున్న తరువాతకదా హాస్పిటల్ నుండి విడుదల అయ్యేది! హాస్పిటలులో వున్నంత కాలం వాళ్ళే చూస్తుంటారు. అధైర్యపడకు మేరీ!"

"నాకు యిప్పుడిక అధైర్యం ఏమాత్రం లేదు ఆనంద్. నిన్నటి వరకు నీవు అగుపించలేదే అని విచారిస్తూండేదాన్ని. నిన్ను చూచాను. నాకు యిక ఏ విచారమూ లేదు."

"మీ నాయన ఎక్కడికి వెళ్ళాడు?"

"మందులషాపుకు పోయివుంటాడు."

నాలుగు నిమిషాలు గడిచాయి. రోగులను చూడ టానికి వచ్చిన వారితో హాస్పిటల్ అంతా గజిబిజిగావుంది. వరండాలోనిలబడివున్న నర్సు ఆనంద్‌వైపు రెప్పవాల్చకుండా

చూస్తూంది. ఆనంద్ అది గమనించాడు. అతను లేచినిలబడి "నేను పోయివస్తానుమేరీ" అన్నాడు.

"ఇంకా కాసేపుకూచో ఆనంద్. నీతోమాట్లాడాలి"

"ఏమి మాట్లాడ దలచుకున్నావో చెప్పు"

"మనం యిద్దరం వివాహం చేసుకునివుంటే నాకు యీ వ్యాధి వచ్చివుండేదికాదు."

"అది నీవు ఎలాచెప్పగలవు"

"నీకోసం నేను ఉపవాసాలు, ప్రార్థనలుచేసి కృశించి పోయాను."

"అప్పట్లో మీ నాయన వ్యతిరేతికించాడుగా"

"అవును అదే మనకు వచ్చిన చిక్కు. నన్ను ఇంట్లో పెట్టుకుని మానాయన అయినా సుఖపడుతున్నాడా అంటే అదీలేదు. మా పిన్నాంకూడా పోట్లాట పెట్టుకుని వెళ్ళి పోయింది.

మందుసీసా పుచ్చుకొని ఏసుదాసు వచ్చాడు. అతని వెనక నర్సుకూడా వచ్చింది నర్సు ఆనంద్ వైపు చూస్తూ ఇంగ్లీషులోఅంది. "ఆమె క్షయరోగి. మీరు ఆమెకు దూరంగా వుండటం మంచిది" అని చెప్పివెళ్ళిపోయింది.

ఆనంద్ జాలిగా మేరీ కళ్ళల్లోకి చూశాడు. ఆమె చికాకుగా అంది "యీ నర్సు వట్టిపేచీకోరు. చప్పనాతి ముండ. దానికి యిష్టంకాకపోతే అందరినీ విదిలిస్తూ తిరుగు తుంది."

"అయితే నేను డాక్టరుగారితో మాట్లాడనా?"

"యేమి లాభం. ఆ డాక్టరు కూడా దానిమనిషే. అందుకే దానికి ఆ పొగరు."

ఆనంద్ చిన్నగా నవ్వాడు.

యేసుదాసు అడిగాడు. "ఒరే అబ్బాయ్, ఆ నర్సు ఏమని పోయిందిరా ?"

"మన మేరీ క్షయరోగనీ, ఆమెతో ఎక్కువగా మాట్లాడకూడదనీ."

"ఓరి దీని తస్సాచెక్కా ! ఎప్పుడు మాట్లాడుతున్నామట మేరీతో మనం? అయినా యీ నర్సు వుందే ! వత్తి రేచిక్క గొడ్డులాంటిదిరా బాబూ !" అన్నాడు ఏసుదాసు.

ఆనంద్ మేరీ యిద్దరూ నవ్వుకున్నారు.

రోజులు గడిచాయి. మేరీ ఆరోగ్యం ఏమీ కుదుటబడలేదు. ఆనంద్ రోజూవచ్చి చూచిపోతున్నాడు. ఒకరోజున మేరీని అకస్మాత్తుగా ఆ వార్డునుండి మరోవార్డుకు మార్చారు. ఆనంద్ అనుమానించాడు. అతను డాక్టరును కలుసుకుని మేరీ విషయం అడిగాడు.

డాక్టరు ఆనంద్ వైపు పరీక్షగా చూశాడు. "ఆ రోగి మీకు ఏమికావాలి ?" డాక్టరు ప్రశ్నించాడు.

"మా బంధువే డాక్టర్ !"

"మీకు యింకా వివాహం కాలేదనుకుంటాను."

"లేదు డాక్టర్" ఆనంద్ రెండునిమిషాలాగి "నేనూ, ఆమే వివాహం చేసుకోవాలని లోగడ నిర్ణయించుకున్నాం డాక్టర్! ఆమెకు వ్యాధి తగ్గుతుందంటారా ?"

డాక్టరు పెదవి విరిచాడు. "లేదు, మిస్టర్! తగ్గినా ఆమెను వివాహం చేసుకోవడం శ్రేయస్కరం కాదు. ఆమె ఊపిరి తిత్తులు రెండూ దెబ్బతిన్నాయి. పై ఆసుపత్రికి పంపించడానికి ప్రయత్నిస్తున్నాం. అక్కడనుండి యింకా సమాచారం రాలేదు. అసలు ఆమె అట్టే కాలం జీవించక పోవచ్చు."

ఆనంద్ దీర్ఘంగా నిట్టూర్చాడు. మేరీని గురించి అతను పెట్టుకున్న ఆశలన్నీ నిరాశ లయ్యాయి. అతను తల దించుకుని హాస్పిటలు గేటు గాటి బయటికి నడిచాడు.

—:—

ప్రకరణం 6

ఒకరోజు మధ్యాన్నం లచ్చి కరణంగారి యింటికి వచ్చింది. కాని సమయానికి కరణంగారు ఇంట్లో లేరు. సుశీల లచ్చిని కూచోమని కబుర్లు ప్రారంభించింది.

"లచ్చీ! నీవు కమ్యూనిస్టుపార్టీ నాయకురాలి వటగా!" లచ్చి నవ్వుతూ "అబ్బో! అమ్మాయిగారూ! ఆ కబురు మీదాకా వచ్చిందా?"

"అవును లచ్చీ! నీవు నాయకురాలివి అవగాలేనిది మాకు ఆ కబురుకూడా తెలియ కూడదంటావా!"

"అబ్బో అమ్మాయిగారూ! అంతమాట ఎందుకండీ! నేను నాయకురాలినీ కాదు, పాడూ కాదు. ఎప్పుడో నాలు గేళ్ళనాడు క్రిష్ణారావునార ఆ పార్టీలో చేర్పించాడు. అంతే. నలుగురితోపాటు నేనూ పార్టీపని వస్తే చేస్తూవుంటాను."

"ఏమి పనులు అవీ?"

"ఆఁ ఏమి పనులు లెండి! వ్యవసాయకూలీలసంఘంలో సభ్యులను చేర్పించడం, మహిళా సంఘాలలో సభ్యులను చేర్పించడం, ఎక్కడైనా పెద్దసభలు జరుగుతూంటే నలుగురితో పాటు పోయి చూచి రావడమూ, యింతకంటే నావల్ల ఏమి అవుతుంది అమ్మాయిగారూ! అయినా యీ మాత్రానికి నేను నాయకురాలిని అవుతానా? మీరే చెప్పండి, బాగా తెలిసినవారు."

సుశీల పేలవంగా నవ్వింది. "అదికాదు లచ్చీ! నీవు మీా సెల్లు సెక్రటరీవటగా?"

లచ్చి గుండె బాదుకుంది. "అమ్మబాబో! మీాకు ఎట్లా తెలిసిందీ యీా విషయం."

సుశీల మళ్ళీ నవ్వింది. "ఏమిటి లచ్చీ! అంత కంగారు దేనికీ? ఆ విషయం అంతరహస్యమా, నేను తెలుసుకో కూడదా?"

"మీాకు ఎవరు చెప్పారో చెపితే నేను ఆ తరవాత మాట్లాడతా."

"పోనీ మాట్లాడవద్దులే! నీవు ఎంతవరకు చదువు కున్నావో చెప్పు."

"ఆఁ నాదెంత చదువులే అమ్మాయిగారూ. వానా కాలపు చదువు."

"చాలా పుస్తకాలు చదివా వటగా లచ్చీ!"

"ఆఁ మా కెక్కడ తీరిచస్తుందండీ, పుస్తకాలు చదవడానికి!"

"పోనీలే! నీవు చదివిన పుస్తకాలపేర్లు కూడా మేము వినకూడదు కాబోలు" సుశీల నిష్ఠురంగా అంది.

"అమ్మాయిగారూ! ఎందుకండీ అంతమాట! మొట్ట మొదటగా గోర్కీగారు వ్రాసిన "అమ్మ" చదివాను. ఆ తరువాత లక్ష్మీనారాయణగారు వ్రాసిన "మాలపల్లి" చదివాను. ఇంకా అనేకమంది విప్లవవీరుల గాథలుచదివాను"

"లచ్చీ! నీకు తీరిక వుండదన్నావుగా యిన్ని పుస్తకాలు ఎలా చదవ గలిగావు?"

లచ్చి చిన్నబుచ్చుకుంది.

"ఏదో మాటవరసకు నేనంటే యీ ప్లీడరుకూపీలు ఎందుకు అమ్మాయిగారు."

సుశీల సంతృప్తిగా నవ్వింది "పోనీలే లచ్చీ! ఆ విప్లవ వీరులగాథలలో నీకు బాగా నచ్చిన ఒక పుస్తకంపేరు చెప్పు"

లచ్చి రెండునిమిషాలు ఆలోచించింది. "జెక్ దేశపు విప్లవనాయకుడు జైల్లోవుండగా వ్రాసిన "రక్తాక్షరాలు" అనే పుస్తకం చాలాబాగుంది అమ్మాయిగారూ!"

"ఆ పుస్తకం తెచ్చిపెడతావూ?"

"అయ్యో దేముడా! నాకుపుస్తకాలుఎక్కడయ్యాండీ! మీకు కావాలంటే క్రిష్టారావుదొరను అడిగి పట్టుకొస్తా."

"అయ్యయ్యో! ఆ పనిమాత్రం వద్దు. నేనువేరే తెప్పించుకుంటానులే! సరేగాని లచ్చీ! మీ పార్టీవారంతా కామ్రేడ్సుగామరి! నీవు క్రిష్టారావుదొర అంటావు దేనికి?"

"ఏదో ఒకవూళ్ళోనే పుట్టి పెరిగాం. యివ్వాళ పార్టీలో చేరిన మాత్రాన కామ్రేడ్సు అని యెలాపిలవగలుగుతాను. అదీగాక తరతరాలనుండివస్తున్న దొర-పాలేరు సంబంధం యింకాపోలేదుగా! ఆ యలవాటు-చొప్పునయింకా దొర అని అంటూవుంటాను. సరేగాని అమ్మాయిగారూ! మాపార్టీవిషయాలు మీకు ఎవరు చెప్పారు?" అంది లచ్చి జాలిగా సుశీల కళ్ళల్లోకిచూస్తూ.

సుశీల మళ్ళీ నవ్వింది. "నాకు చెప్పినవారిపేరు నేను చెపుతాననుకో. వాళ్ళమీద మీరు ఏమైనా చర్య తీసుకుంటారా ?"

"అబ్బె అదేమీలేదు అమ్మాయిగారూ! వూరికినే తెలుసుకుందామని."

"నాకు మీ నీలం చెప్పింది. అదికూడా మీ పార్టీ విషయాలేమీ నాకు చెప్పలేదు. ఒక్క నీ విషయం మాత్రమే. నీవు బాగా చదువుకున్నావనీ, చాలా పుస్తకాలు చదివి వున్నావనీ పార్టీ సెల్లు సెక్రటరీవనీ చెప్పింది"

"ఆ నీలం వట్టి వాగుడుగాయి అమ్మాయిగారూ! దానినోట్లో నువ్వుగింజ కూడా దాగదు."

"లేదు లచ్చీ! నీలం చాలా మంచిది."

"దాని మంచితనం మండిరి లెండి"

"నీలంకూడా యీ సంవత్సరం ట్రైనింగుకు పోతానందిగా, పోలేదేమో ?"

"ఆనందు చదువుతున్నాడు గదండీ! ఇద్దరికీ ఎవరు చెప్పించగలుగుతారు ?"

"ఆనంద్ చదువు బాధ్యత వాళ్ళ కేమి వుంది. అది అంతా నాన్నగారే చూస్తున్నారుగా !"

"ఆనందు చాలా బుద్ధిమంతు డమ్మాయిగారూ! మా పల్లెలో అతని కెవ్వరూ సాటిరారు. అందం, ఆరోగ్యం, చదువు, అన్నింటినీ మించిన గుణమూ వున్నాయి అతనిలో."

సుశీల నవ్వుతూ అంది. "అంతేనా, యింకా ఏమీ లేవూ! అవికూడా ఏకరువుపెట్టు."

"యింకేమి కావాలి అమ్మాయిగారూ! మనిషికి వుండవలసిన మంచి లక్షణా లుంటే చాలదూ!"

"ఆనందులో యింకా ప్రత్యేకత ఏమిటో నన్ను చెప్పమంటావా?"

"చెప్పండి వింటాను."

"ఆరు అడుగుల బారూ, నొక్కు నొక్కుల క్రాపూ, కోలముఖమూ, సన్నని ముక్కూ, చిన్నిమూతీ, చక్కని పలు వరుసా, నిడివైన కంఠమూ, విశాలమైన ఛాతీ, కండరాలు తేలినజబ్బలూ, యింకా, యింకా... ..."ఇద్దరూ విరగబడి నవ్వుకున్నారు.

ఇంట్లోనుండి వంటామె పిచ్చమ్మగారు వచ్చి గుమ్మంలో నిలబడింది. "ఇదిగో అమ్మాయి సుశీలా! కాఫీ చల్లారిపోతూంది లోపలికివచ్చి అది తీసుకో అమ్మా!"

"ఇక్కడికి తెచ్చి పెట్టు మామ్మా!"

పిచ్చమ్మగారి దృష్టి లచ్చిమీద పడింది. "ఇదిగో అమ్మా! ఎవరివే నీవూ! మాలదానివేనా? అయితే యిక్కడేమిపనే నీకూ? పోయి ఆ బయట వాకిట్లో నిలబడ రాదూ!" అంటూ అదమాయించింది

లచ్చి నవ్వి వూరుకుంది.

సుశీల లబ లబ లాడింది. "అయ్యో, అయ్యో, ఎంత మాట మామ్మా! ఆవిడ కాపుమనిషి. నాన్నగారితో మాట్లాడ్డానికి వచ్చింది. అలా అనవచ్చా?"

"అయ్యో గ్రహచారమా ! నాకు ఏమి తెలుసు నమ్మా ! నీవు లచ్చి, గిచ్చి అంటూంటే మాలమనిషేమో ననుకున్నాను."

"ఆవిడపేరు లక్ష్మి మామ్మా !"

"యేమో లక్ష్మో, పార్వతో. నా కెలా తెలుస్తుందిలే తల్లీ !"

"ఇకముందు ఎప్పుడూ తెలుసుకోకుండా మాట జార వద్దు మామ్మా"

"నాకేమి పట్టిందమ్మా ! మాట జారడానికి !"

"సరిలే ! నాకు కాఫీ తెచ్చి పెడతావా ?"

"తెచ్చిపెట్టక ఏమి చేస్తానమ్మా ! నీవు ఎక్కడికి తెమ్మనమంటే అక్కడికే తీసుకువస్తాను" అంటూ పిచ్చమ్మ గారు లోపలికి పోయింది. కరణంగారు తలుపు తీసుకుని లోపలికి వచ్చారు. సుశీలలేచి యింట్లోకిపోయింది.

కరణంగారు వస్తూనే లచ్చిని పలుకరించారు. "ఓహో లచ్చి ! ఏదో పనిమీద వచ్చినట్టున్నావు ?"

"అవును దొరో, పనుండే వచ్చాను."

కరణంగారు కుర్చీలోకూర్చుంటూ "యేమిటి ఆపని?"

"ఇల్లు కప్పించు కుంటున్నా నండి. ఆకులు తక్కు వయ్యాయి. రెండుమోపుల గడ్డి అడుగు దామని వచ్చా"

"సరే ! అలాగే పట్టుకుపో ! సరేగాని లచ్చి ! గడ్డి భాగ్యానికి నీవు నాదాకా రావాలా ?"

"మరి యింకెక్కడికి పోగలను దొరో !"

"కాకితో కబురుపెడితే మీ క్రిష్టారావు గారు బండితో తోలిపెట్టరూ !"

లచ్చి చిన్నగా నవ్వింది. "దొరో, ఈ వూళ్ళో ఎవరైనా తమరి తరువాతే. క్రిష్టారావుగారిని అడిగితే మాట తీసివేయలేక వారి జీతగాళ్ళతో పంపుతారనుకోండి. కాని పైన వారి నాన్నగారు వున్నారు గదా ! తండ్రితో చెప్పకుండా ఆయనగారు యే పనీ చెయ్యరు. అదీగాక తమరి దగ్గర వున్న చనువు నాకు మరొకరి దగ్గర లేదు దొరా !"

"చాలా మాటలు నేర్చావు లచ్చీ !"

"మాటలకు పేదరికం లేదంటారుగాదొరా !"

"ఓసి, నీ దుంపతెగా ! నీవు ఎక్కడో అసాధ్యురాలిలా వున్నావే ! సరేగాని లచ్చీ ! నేను నిన్ను ఒక విషయం అడుగుతాను. యదార్ధం చెబుతావా ?"

"తెలిసివుంటే ఎందుకు చెప్పను దొరా ?"

"నీవు అబద్ధమాడవని నాకు తెలుసు."

"ముందు కాళ్ళకు బంధాలు వేస్తున్నారు దొరా"

కరణంగారు సంతృప్తిగా నవ్వుకున్నారు. ఆయన సుశీలను "అమ్మాయీ ! ఆ అలమారలో నా పొగాకుపెట్టె వుంటుంది. యిలా పడెయ్యవమ్మా ?" సుశీల గుమ్మంలో అగుపించి "ముందు కాఫీ తీసుకువెళ్ళండి నాన్నగారూ! తరువాత చుట్ట వెలిగిద్దురుగాని"

"ఆఁ, అయితే ఆ కాఫీ యిక్కడికే తెచ్చిపెట్టు" సుశీల కాఫీగ్లాసు తెచ్చి అందించింది. లోపల పిచ్చమ్మగారు

సణుగుతూంది. అది కరణంగారి చెవిన పడింది. ఆయనగారు నవ్వుకుని "యేమమ్మాయ్ పిచ్చమ్మగారూ! ఒకసారి కాస్త బయటికివచ్చి చూడు" అన్నారు.

ఆమె నెత్తిమీద ముసుగు సవరించుకుంటూ గుమ్మంలో నిలబడి "ఏమిటి నాయనా!" అంది.

"లోపల ఏదో సణుగు కుంటున్నట్టున్నారు!"

"నా సణుగుడు కేమి వచ్చెలే నాయనా!"

"అలా కాదమ్మా! అసలు విషయ మేమిటో చెప్పు"

"ఏముంది నాయనా చెప్పేందుకు! ఆ మాలదానిని ఎదురుగ్గా పెట్టుకుని నీ కుమార్తె కాఫీతాగే! నీవూ తాగు తూంటివి! ఇక నా సణుగు డేమిటీ, నా బొంద ఏమిటీ!"

తండ్రీ కూతురూ యిద్దరూ విరగబడి నవ్వారు. కరణంగారు చెప్పుకపోయారు. "ఇదిగో పిచ్చమ్మగారూ! యీ లచ్చి వుందే! యీవిడ సామాన్యురాలేమీ కాదు. కమ్యూనిస్టుపార్టీ నాయకురాలు, వ్యవసాయ కూలీ సంఘ నాయకురాలు, మహిళాసంఘ నాయకురాలు. ఇక నీవూ, నేను ఎంతకాలం అఘోరిస్తే నాయకులం కాగలుగుతామో, ఆలోచించు. పైగా లచ్చిబాగా చదువుకుంది. నీతీ, నిజాయితీ గల మనిషి. అన్నింటినీ మించి గొప్ప సంస్కారం కలది కూడాను. అలాంటివాళ్ళు మాలవాళ్ళయినా, మాదిగ వాళ్ళయినా మనం గౌరవించవలసిందే."

"ఏమో నాయనా! మనస్సు నచ్చినవాళ్ళు ఎలాగైనా సరిపెట్టుకుంటారు. అందుకే పెద్దలన్నారు. 'తా వల

చింది రంభా, తా మునిగింది గంగా' అని లోకోక్తులు వట్టినే పుట్టాయూ నాయనా!" అంది పిచ్చమ్మగారు.

"సరే లేవమ్మా, ఎవరి ఛాదస్తం వాళ్ళది" అన్నారు కరణంగారు - కొంచెం కటువుగా. పిచ్చమ్మగారు లోపలికి జారుకుంది.

కరణంగారు చుట్ట వెలిగించి మళ్ళీ అందుకున్నారు. "అయితే లచ్చీ! క్రిష్ణారావు మీ పల్లెలో ఎవరినో వివాహం చేసుకుంటా డనే వదంతి బయలుదేరిం దేమిటీ!"

"ఏమో దొరో! నాకు తెలియదు."

"నీకు తెలియకుండా క్రిష్ణారావు పల్లెలో వివాహం చేసుకుంటాడంటే ఎవరు నమ్ముతారు లచ్చీ! నిప్పులేనిదే పొగరాదుగదా! ఆ వదంతికి ఏమీ ఆధారం లేదంటావా?"

లచ్చి వెంటనే సమాధానం చెప్పలేకపోయింది. ఆమె రెండు నిమిషాలు తటపటాయించింది. కరణంగారు ప్రశ్నించారు.

"ఏమిటి లచ్చీ! ఆలోచిస్తున్నావు?"

ఆమె చిన్నగా నవ్వింది. "క్రిష్ణారావుగారికి ఆయనతోపాటు రాజకీయ చైతన్యంగల స్త్రీ కావాలట. మా పల్లెలో అలాటివాళ్ళు ఎవరున్నారు దొరగారూ!"

"నీవు"

"నాకు అలాటి ఆలోచన లేదుదొరా!"

"మరి క్రిష్ణారావు నిన్ను అడగలేదూ?"

"అడిగాడు కాని లాభంలేదని చెప్పేశాను."

"సిరి రా మోకా లొడ్డుతారచే పిచ్చిదానా! హాయిగా వివాహం చేసుకుంటే నీ కష్టాలు తీరుతాయిగా!"

"ఆ మాట అనవద్దు దొరో! నాకు అసలు వివాహం చేసుకోవాలనే అభిప్రాయంలేదు."

కరణంగారు దీర్ఘంగానిట్టూర్చాడు. "లచ్చీ! నిన్ను తరచి తరచి ప్రశ్నలు అడుగుతూన్నందుకు నీవు నొచ్చుకోవడంలేదుగదా!"

లచ్చి చిన్నగా నవ్వింది. "లేదు దొరో! తమరు తండ్రిలాంటివారు. నేను నొచ్చుకో వలసిన అగత్యం లేదు."

"క్షేమైన మాట అన్నావు లచ్చీ! నీ బోటివాళ్ళు ఎవరైనా నన్ను తండ్రిలాంటివాడు అనుకుంటే నేను నిజంగా గర్వపడతాను లచ్చీ!"

నాలుగు నిమిషాల తరువాత లచ్చి బయలుదేరి వెళ్ళిపోయింది.

♦ ♦ ♦ ♦

సుశీల ఆనందుకు జాబు రాసింది. కాని ఆ జాబు పోస్టు చెయడం సందర్భపడలేదు. నాలుగు రోజులు గడిచాయి. సుశీల జాబు చించి పారేసింది. నౌకరుతో నీలాన్ని రమ్మనమని పల్లెకు కబురు చేసింది. కాని నీలం రాలేదు. కొద్దిరోజులు గడిచాయి. కరణంగారు పనిమీద పట్టణానికి వెళ్ళారు. నీలం వస్తే బాగుండునని సుశీల ఎదురు చూసింది. నౌకరు గడ్డిమోపు తెచ్చి సావిట్లో పడేశాడు. సుశీల అతనిని

పిలచి "రామకోటీ! నీలాన్ని నే రమ్మనమన్నానని చెప్పావుటరా!" అని అడిగింది.

అతను తెల్లబోయాడు. "అమ్మాయిగారూ! మరచి పోయానండీ" అన్నాడు.

"అయితే యిప్పుడు పోయి వెంటపెట్టుకొని తీసుకు రావాలి." అంది.

"అలానే అమ్మాయిగారూ! నేను యిప్పుడు అన్నానికి పోతున్నానుగా. వచ్చేటప్పుడు పిలుచుకు వస్తాను."

"మళ్ళీ మరచి పోయాననవుగదా!"

"లేదు అమ్మాయిగారూ, తప్పకుండా పిలుచుకు వస్తాను."

నీలం వచ్చింది. సుశీల సావిట్లోనే ఆమెతో బాతాఖానీ వేసింది.

"నీలం! ఎక్కడా అగుపించడంలేదే?"

"నేను యీ మధ్య వూళ్ళోకి రావటంలేదు అమ్మాయిగారూ!"

"ఏమి చేస్తున్నావేమిటే?"

"ఏముంది అమ్మాయిగారూ చెయ్యడానికి? కలుపులు అయిన దగ్గరనుండి రోజూ గడ్డికి పోతున్నాను. రెండుతట్టలు తెస్తేగాని మా గేదెకూ ఆవుకూ రెంటికీ చాలదు."

"నీ అమ్మ తీసుకు రాదూ!"

"మా అమ్మ రెండేళ్ళనుండి పచ్చగడ్డికి పోవడం మానేసిందండి."

"ఎందుకనీ ?"

"మా అమ్మ ఆరోగ్యం సరిలేదు. ఉబ్బలోకిపోతే ఆయాసం వస్తుంది. ఇంటి దగ్గరేవుండి అన్నం కూరా వండుతుంది."

"నీవు చదువు చాలించుకున్నట్టేనా ?"

"ఆ, మా అయ్య పెళ్ళిళ్ళు చెయ్యాలంటున్నాడు, యీ సంవత్సరం"

"ఆనంద్ యింకా చదువు కుంటున్నాడుగా"

"మా అన్నయ్య పెళ్ళికి యిష్టపడకపోతే నా పెళ్ళి చేస్తానంటున్నాడు."

"సంబంధాలు కుదిరాయా ?"

"యిప్పు డెక్కడ అమ్మాయిగారూ ! లగ్నాల రోజులు రావాలిగా !"

"ఇదివరకు మీ అన్నయ్య మేరీని వివాహం చేసు కుంటాడని చెప్పావుగా"

"అబ్బే ! యింకెక్కడ మేరీ ! చచ్చిపోయింది అమ్మాయిగారూ !"

"అయ్యో పాపం ! ఎప్పుడూ ?"

"మొన్నపట్టణం ఆసుపత్రిలో చచ్చిపోయిందట"

సుశీల సంభాషణ మార్చింది. "నీలం ! నాకు కొన్ని పుస్తకాలు పంపించమని ఆనందుకు కబురు చేశాను. మీ ఇంటికి ఏమైనా పంపించాడా!"

"లేదు ! అమ్మాయిగారూ !"

"అయితే నేను ఆనందుకు ఉత్తరం రాస్తానుగాని, నీవు పోయేటప్పుడు అది టపాలో వేసి పోతావా ?"

"అట్టాగే ! అమ్మాయిగారూ !"

సుశీల లోపలకుపోయి జాబు వ్రాసి కవరులో పెట్టి అంటించి పైన అడ్రసు వ్రాసింది. పిచ్చమ్మగారు తొంగిచూచి "ఏమమ్మా యేమి చేస్తున్నావు లోపల. బయట సుబ్బాయి కూతురు కూచునివుంది" అని చెప్పింది

"నాకు తెలుసులే మామ్మా! నీవుపోయి నీ పని చూచుకో !"

"దానికి చీరెలు, జాకెట్లు కట్టబెట్టాలి కాబోలు!"

"పాత గుడ్డలేగద మామ్మా ! నీవు ఎందుకు అంత బాధ పడతావు ?"

"పాత గుడ్డలైతేమాత్రం వట్టినే పారేసు కుంటా రటమ్మా ! దానికి యిచ్చేగుడ్డలతో బోలెడు స్టీలుసామాన్లు కొనుక్కోవచ్చు."

"సరేలే ! రేపటినుండి ఆ పనే చేదాం"

"అమ్మాయి, నేను ఒకమాటచెబుతాను వింటావూ!"

"చెప్పు మామ్మా !"

"కులం తక్కువ వాళ్ళను మన ఇళ్ళకి చేరదీయ కూడదమ్మా"

సుశీల నొసలు చిట్లించింది. "మామ్మా ! మీచెల్లెలి కొడుకు శివరావు యోగ్యుడే నంటావా ?"

"వాడి కేమమ్మా, స్వచ్ఛమైన బ్రాహ్మణ పుటక పుడితేనూ !"

"ఒక్కరోజు ఇంట్లోవున్నాడో లేదో! నాన్నగారి జేబులోపర్సు, గడియారం ఎత్తుకు పోయాడు."

"వాడి దుంప తెగిరిలే! ఏదో తెలివి తక్కువ పని చేశాడు. అయితే మాత్రం వాళ్ళ పెద్దలు కల్పించుకొని మీ సొమ్ము మీకు వప్ప జెప్పారుకదా!"

"కులాన్నిబట్టి మనిషియొక్క గుణగణాలు నిర్ణయించటం అవివేక మనుకుంటాను మామ్మా!"

"అమ్మాయీ! నీవు ఎన్నయినా చెప్పూ, హంస హంసే, కాకి కాకే. బాగా ఆలోచించి చూడు. నీకే తెలుస్తుంది"

"సరేలే. అలానే ఆలోచిస్తాను. నీవుపోయి నీ పని చూచుకో" సుశీల విసుగుదల వెల్లడించింది.

పిచ్చమ్మ వంట ఇంట్లోకి పోయింది. సుశీల బయటికి పోయి జాబు నీలం చేతికి అందించింది. "నీలం, నీవు పోస్టాఫీసుకు ఎలానూ పోతున్నావుగా. ఒకరూపాయి కవర్లు కూడా తీసుకురా."

సుశీల రూపాయి యిచ్చింది. నీలం ఆమె కళ్ళల్లోకి చూస్తూ "ఎన్నివస్తాయి అమ్మాయిగారూ?" అంది. సుశీల నవ్వుతూ "అదికూడా నేనే చెప్పాలా! యిన్‌లాండు కవర్లు పదివస్తాయి. పోయితీసుకురా" అంది.

పిచ్చమ్మవచ్చి మళ్ళీ గుమ్మంలో ప్రత్యక్షమయింది.

"యీ పిచ్చిముండ నాకు కాపలా కాస్తున్నట్లుంది!" అనుకుంది సుశీల.

పిచ్చమ్మగారు తాపీగా "అమ్మాయీ, రాత్రికి నాన్నగారు రారుగా, ఏమికూర చెయ్యమంటావు.?" అని అడిగింది.

"నీ ఇష్టం వచ్చింది చెయ్యి మామ్మా!"

"దోసకాయ పచ్చడిచేసి, వడియాలు వేపుతాను."

"సరే! అలాగే చెయ్యి!"

పిచ్చమ్మగారు గుమ్మంలోనుండి కదలలేదు. సుశీల ఆమెను తప్పుకుని లోపలికి పోయింది. పిచ్చమ్మ మళ్ళీ ప్రశ్నించింది.

"అమ్మాయీ! ఆ మాలదానికి ఏమిటో యిచ్చి నట్టున్నావు?"

"పోస్టాఫీసుకు పోయి కవర్లు తీసుకురమ్మని డబ్బులు యిచ్చాను మామ్మా!"

"ఏదో వుత్తరంకూడా యిచ్చి నట్టున్నావు?"

"ఓసి, నీ దుంప తెగ! పీడాకారపు ముండా!" అనుకుంది సుశీల. కాని వెంటనే సమాధానం చెప్పింది. "అవును మామ్మా! మా స్నేహితురాలికి జాబు వ్రాశాను."

"ఎవరమ్మా ఆ స్నేహితురాలు?"

"నీ యక్షప్రశ్నలు కూలిపోను, నీవు ఎక్కడ దాపురించావే!" అనుకుంది. కాని పైకి "బందరు మామ్మా!" అనేసింది.

"ఎవరటా, బందరులో?"

"ఓసి నీ ఆకారం మండా ! ఎన్ని అబద్ధాలు చెప్పిస్తున్నావే నాచేతా !" మనసులో అనుకుని, "తల్లావఝుల వారి కోడలు మామ్మా !" అంది పైకి.

"ఎవరూ ! తల్లావఝుల రామచంద్రరావుగారి కోడలా ?"

"అవును మామ్మా ! నీకు తెలుసునా ?"

"అయ్యో ! నాకు తెలియక పోవడ మేమిటమ్మా ! నేను మూడు సంవత్సరాలు వుంటేను వారి యింట్లో !"

ఇక అంతటితో పిచ్చమ్మగారి ప్రశ్న పరంపరలు ఆగి పోతాయనుకుంది సుశీల. కాని పిచ్చమ్మ మళ్ళీ అందుకుంది.

"అందులో ఏ కోడలి కమ్మా, నీవు జాబు రాస్తా !"

"ఎవరికో నీవు చెప్పుకో చూద్దాం !"

"ఆ విశాలాక్షికా ?"

"కాదు."

"హైమవతికా ?"

"అబ్బే కాదు."

"ఇకనైతే వనజేగా మూడోకోడలు. ఆవిడకు రాసి వుంటావు. అవునా ?"

"అవును మామ్మా !"

"అబ్బో ! అయితే బాగానే వుంది. ఆ వగలాడికే నీవు జాబు వ్రాయడ మేమిటమ్మా !"

"అయ్యో ! పాపం వనజ చాలా మంచిది మామ్మా ! నీవు ఆవిడను వగలాడి అంటావు ఏమిటీ ?"

"అయ్యో! తల్లీ వనజ సంగతి నాకు ఆ మాత్రం తెలియదనుకున్నావా?"

"ఆవిడలో లోపమేమిటో చెప్పు!"

"ఒఖ్ఖలోపమేమిటే, సవాలక్ష! సాయంకాలం అయ్యేసరికి కాళ్ళకు బూట్లు తగిలించి భర్తతో కలసి టెన్నిసు ఆటకు పోతుంది. క్లబ్బులో కూచుని పరాయి మగాళ్ళతో పేకలాడుతుంది. ఇంకా ఏమి కావాలి, అంతకంటే? నీవే చెప్పు!"

"కాలం మారిపోయింది. ఈ రోజుల తరహాయే అంత మామ్మా! పట్టణాలలో ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళు క్లబ్బులకు పోరా మరి?"

పిచ్చమ్మగారు స్వరం తగ్గించి రహస్యంగా అంది. "ఇదిగో అమ్మాయీ! అంతే ననుకున్నావా! ఆ వనజ అప్పుడప్పుడు మేడమీదికి పోయి చాటుగా సిగరెట్లు కాల్చేది!"

సుశీల విరగబడి నవ్వింది. "మామ్మా! నీవుకూడా చాటుగా నశ్యం పీలుస్తుంటావుగా?"

"అయ్యో తల్లీ! నా నశ్యానికీ ఆవిడగారి సిగరెట్లకూ పోలిక పెట్టావా? ఎంత వెర్రితల్లివమ్మా! అయినా యీ పాడు నశ్యం నేను కావాలని అలవాటు చేసుకున్నాననుకుంటున్నావా? ఆ మహారాజు పోయి ఎక్కడవున్నారో! పార్శ్వనొప్పితో బాధపడుతూంటే చూడలేక రోజూ చిటికెడు చేతిలోవేసి 'పీల్చవే, పీల్చవే' అని నిర్బంధించేవారు.

ఆ ధర్మరాజు పోయారు. యీ పాడు అలవాటు వుండి పోయింది.

బయట గుమ్మంలో నీలం అగుపించింది. సుశీల లేచి నీలం దగ్గరకు పోయి కవర్లు తీసుకుంది.

"నీలం! నా పాత వోణీలు వున్నాయి. తీసుకు పోతావా!"

"ఇవ్వండి అమ్మాయిగారూ! మీరు కట్టే చీరెలు, వోణీలు అన్నీ నా వంటిమీదే చిరగాలి"

సుశీల లోపలికి పోయింది. పిచ్చమ్మగారిని ఏడిపించాలనే ఉద్దేశ్యంతో ఒక చీరె, రెండు జాకెట్లు పుచ్చుకుని బయటికి వస్తూంటే పిచ్చమ్మగారు గుమ్మానికి అడ్డంగా నిలబడి "అయ్యో! అయ్యో! మెరుగైనా మాయలేదు. యీ సిల్కుచీరె దానికి పారవేస్తావటమ్మా!" అంది.

"ఏం! మీరు కట్టుకుంటారా!"

పిచ్చమ్మ నోరు పిసుక్కుంది. "అవ్వ, అవ్వ! ఎంత మాట అన్నావూ! నా గ్రహచారం కాలిపోయింది." అంటూ ఆమె లోపలికి నడిచింది.

సుశీల చీరా, జాకెట్లూ నీలానికి యిచ్చి "మీ అన్నయ్య దగ్గరనుండి పుస్తకాలు గాని, జాబులు గాని వస్తే తెచ్చి నాకు యిస్తావుకదూ!" అంది

నీలం తల యెగురవేసి సంతోషంగా వెళ్ళిపోయింది.

—:—

ప్రకరణం 7

గ్రంథాలయం

నీలం సుశీల యిచ్చిన సిల్కుచీర కట్టి నైలాన్ జాకెట్టు తొడిగి బిందె భుజాన పెట్టి వయ్యారంగా బావికి బయలుదేరింది. దారిలో రాఘవులు ఎదురై ఆమెను నిలవేశాడు. ఆమె తప్పుకుని పోబోయింది. అతను అడ్డుతగిలాడు. ఆమె అమాయకంగా నవ్వింది. అతను చిలిపిగా ఆమె కళ్ళల్లోకి చూశాడు.

"వుండు బావయ్యా! నేనుపోవాలి."

"నీలం! యింత చక్కగా వున్నావు.సినిమాల్లోకి పోరాదంటే బోలెడు డబ్బులు వస్తాయి."

"అబ్బో! నీ కూతురిని పంపుకోరాదూ, ఆ సినిమాల లోకి!"

"నా కూతురు చిన్నపిల్లలేయే.అదేమి బాగుంటుంది."

"చిన్నపిల్లయితే మాత్రమేం బావయ్యా! దానికేం, చక్కనిచుక్క, చిన్నారి చిలుక, అందాలరాణి!"

"నీ యమ్మ, ఎన్ని మాటలు నేర్చావే నీలం!"

"నీకంటెనా బావయ్యా!"

రాఘవులుభార్య కోటమ్మ కడవ, చేంతాడు పుచ్చుకుని బావికిపోతూ వారిని చూచి నిలబడిపోయింది. "ఒసే నీలం, మగాడితో ఆ కోడిగాలు ఏమిటే నీకు?" అంది కోటమ్మ.

నీలం చిన్నబుచ్చుకుంది. "విన్నావా బావయ్యా, నీ పెళ్ళాం మాటలు! నేను నీతో కోడిగా లాడుకున్నానట!"

కోటమ్మ చరచరా వాళ్ళముందుకు నడిచింది. "ఒలేయ్ నా సయితీ! మోర ఎగబెట్టుకుని ఎదయిన గొడ్డల్లే నా మొగోడి ఎదురుగా నుంచున్నా వెందుకే?" అంది నీలంవైపు చూస్తూ.

నీలం ఆవేశంతో ఉక్కిరిబిక్కిరి అయింది. కాని ఆమె వెంటనే తమాయించుకొని "ఇదిగో కోటమ్మోయ్! పిచ్చిపిచ్చిగా వాగావంటే పళ్ళు రాలతాయ్! ఎవరు నిలుచున్నారే నీ మగోడి ముందు? మహాలావు మగోడు నీకే కాగా దొరికాడు. అయినా రాఘవులు బావయ్య నీకు మొగుడు అయితే నాకు మేనత్త కొడుకే లేయే! మా బావయ్యతో నేను మాట్లాడేది మాట్లాడేదే! నీ ఏడుపు ఏమిటో నువ్వ ఏడ్చుకో!" అంది నీలం.

"ఓలమ్మో! ఈ నా సయితి చూడండి, ఎట్టా తెగించిందో!" అంటూ నీలం మీదికి పోయింది కోటమ్మ.

"అదుగో. సయితీ, గియితీ అన్నావంటే చెప్పు తీసుకు కొడతా, తప్పుడుదానా!" నీలం మొరాయించింది. యిద్దరూ మాటీ మాటీ పోడుచుకున్నారు. కోటమ్మ కడవా, చేంతాడు దూరంగా పడేసింది. నీలం బిందె పక్కగా పెట్టింది. చేతులు చేతులు కలిశాయి. జుట్టూ జుట్టూ పట్టుకున్నారు. నీలం తొడిగిన నైలాను జాకెట్టు బదాబద లయింది. పమిట జారి పోయింది. ఆమె స్తనాలు, పొట్టా బయట పడ్డాయి. యిద్దరూ

కిందపడి దొర్లారు. నీలానిదే పైచెయ్యి అయింది. కోటమ్మ జుట్టు పట్టుకొని ఆ గడ్డలమీద బరబర యీడ్చింది.

వాళ్ళను విడతియ్యడానికి రాఘవులు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. నలుగురూ పోగయ్యారు. ఇద్దరినీ విడదీశారు. ఆ సందట్లో ఒకడు నీలం స్తనాలమీద చెయ్యి వేశాడు ఆమె చాచి వాడి చెంపమీద కొట్టింది వాడు గిలగిలలాడుతూ "నీ యమ్మా, యిది నన్ను పట్టుకకొడతది ఏంటిరో బాబోయ్!" అన్నాడు.

నీలం పమిట సర్దుకుని, బిందె తీసుకుని ఇంటిదారి పట్టింది. రాఘవులు కర్రతో భార్యను రెండు చరిచాడు. "నీ యమ్మా! తప్పుడుదానా! పొద్దున్నే లేనిపోని అల్లరి తీసుకు వచ్చావు" అన్నాడు.

కోటమ్మ పల్లే, వాడా అంతా వినిపించేట్టు శోకాలు పెట్టింది. భర్తను నోటికి వచ్చినట్టు తిట్టింది. "ఒరే, ఎదవా! నీ మేనమామ కూతుర్ని ఎనకేసుకుని కట్టుకున్న పెళ్ళాన్ని పట్టుకు కొడతావంటరా? పోయి ఆ లంజనే కట్టుకో. నేను నీతో కాపురం చెయ్యనే చెయ్యను. నీ మొహం చూడనే చూడను. ఇదిగో నువ్వు కట్టిన తాళి నీ మొహానే వేసుకో. అది తీసుకుపోయి ఆ లంజ మెడలో కట్టు" అంటూ తాళి తెంచి రాఘవులు మీదికి విసిరింది. రాఘవులు పుస్తె తీసి జేబులో వేసుకున్నాడు.

ముసలి అచ్చమ్మ నోరు పిసుక్కుంది. "అవ్వ! యిది ఎక్కడి ఆడదిరా నాయనా! ఒలే, కోటమ్మో! ఇక శానగాని, నోరు మూసుకోవే! ఆ పెళ్ళికాని పిల్లను పట్టుకు

యేమిటే యీ యాగీ? యవడైనావింటే నోట్లో వూస్తాడే!" అంది.

"అబ్బో! అచ్చమ్మో! నీ సక్కట్టు నేను శానా యిన్నాలే, యిక నోరు మూసుకో?" అంది కోటమ్మ.

"ఒరే రాఘవులూ! నీలో సరుకుంటే దీనినోరు యిట్టా తెరుస్తుందంటరా?" అన్నాడొక మధ్యవయస్కుడు.

"నీ యమ్మా! నేను ఏమి చెయ్యానురా కోటయ్యా! రెండు, మూడు రోజులకు ఒకసారి అయినా ఎముకలు యిరగ గొడతూనే వుంటా. అయినా సిగ్గా, సెరమా! మొండి సిఖండిముండ!" అన్నాడు రాఘవులు.

నీలంతండ్రి సుబ్బయ్యా, తల్లి మాలక్ష్మి వచ్చారు. సుబ్బయ్య వస్తూనే అన్నాడు. "ఒరే రాఘవులూ! ఏమిటిరా యీ అల్లరి?"

"నే నేమి చేశాను మామయ్యా! నీలం బావికి పోతుంటే నేను సరదాగా పలకరించాను. నీ యమ్మా! అంతలోనే యీ తప్పుడిది వచ్చి పడింది. ఇద్దరూ కలబడ్డారు. కొట్టుకున్నారు." అన్నాడు రాఘవులు.

"యిక శానగాని యింట్లో దూరండిరా! నీయమ్మా! చిల్లర మేళాం అనిపిచ్చారురా" అన్నాడు సుబ్బయ్యా.

మాలక్ష్మి కోటమ్మను చెయ్యిపట్టుకుని ఇంట్లోకి తీసుకుపోయింది. కోటమ్మ శోకాలు పెట్టింది.

"ఓలమ్మో, ఇక వూరుకోయే! ఏలూమందే, కన్నామందేనూ. ఇట్టాఅయితే కాపురాలు ఎట్టా గడతేరతయ్యో తల్లీ!" అంది మాలక్ష్మి.

"నాతప్పు ఏమీలేదు పిన్నాం. అంతా నీఅల్లుడు నుదనష్టపోడు చేశాడు. యిదుగో చూడు ఎట్టాకొట్టాడో" అంటూ వీపుమీద పమిటతొలగించి దెబ్బలు చూపెట్టింది కోటమ్మ.

"అబ్బో! వాతలు తేలినయి. ఆడదాన్ని అంత లావు దెబ్బలు కొట్టడానికి యీడికి చెయ్యి ఎట్టా ఆడిందీ అంటా!" మాలక్ష్మి జాలిపడింది.

రాఘువులు గుమ్మంలో తొంగిచూచి "ఇదిగో అత్తమ్మా!" అంటూ జేబులోనుండి పుస్తెతీసి ఆమెకు అందించాడు.

మాలక్ష్మి విస్తుపోయిచూచింది. "ఏంటిరా అయ్యా యిదీ?" అంది ఆమె.

"ఆ తప్పుడుది పుస్తె తెంచి నామీద పారేసింది" అన్నాడతను.

మాలక్ష్మి నోరు పిసుక్కుంది. "అవ్వ! ఎంత తప్పు, ఎంత తప్పు! ఒలేయి కోటమ్మా! బావి కాడకి పోయి కాళ్ళూ, చేతులూ కడుక్కురాయే. నేను తాడు పేని యిస్తాను, కాస్త పసుపురాసి అది మెళ్ళో ఏసుకుందువుగాని. అట్టా వుండకూడదమ్మా, కీడు!" అంది ఆమె.

కోటమ్మ సమాధానం చెప్పకుండా ముసుగు పెట్టింది. రాఘువులు కడవలు పుచ్చుకుని నీళ్ళు చేరబోశాడు. మాలక్ష్మి పొయ్యి రగిలించింది.

అక్కడ నీలంచుట్టూ పదిమంది చేరారు. "ప్రొద్దున్నే దానితో జగడ మెందుకు పెట్టుకున్నావు నీలం?" అంది పంతులుభార్య సుందరమ్మ.

"ఆ కోటమ్మ అసలే కయ్యానికి కాలు దువ్వుతుంది కదా! దాని జోలికి పోవడం మనదే పొరపాటు" అంది లచ్చి.

"సిలుకుచీరకట్టి, బిందె బుజానపెట్టి బావికిపోతుంటే నా తల్లి తెరమీది బొమ్మల్లేవుంది. ఆ కోటమ్మకళ్ళు మాడి పోను. దాన్ని మారెమ్మ మింగ" అంది ముసిలి అచ్చమ్మ.

నీలం నలుగురి ముఖాల్లోకి చూస్తూ "ఆ తప్పుడు దాన్ని నే నెందుకు పలుకరించానూ? పొద్దుటే బావికి పోతుంటే మా బావయ్య దారిలో అడ్డంగా నిలబడి సరదాగా పలుకరించాడు. నేను నవ్వుతూ సమాధానం చెప్పాను. ఎక్కడ చూచిందో ఏమో కోటమ్మ. సయితీ, గియితీ అంటూ రేణుకాశక్తి మాదిరిగా వచ్చి పడింది. యింకా నేను ఏమి చేస్తాను? అది నన్ను రెండు తన్నితే నేను దాన్ని నాలుగు తన్నాను. సరిపోయింది" అంది ఆమె.

నీలం బట్టలు మార్చుకుంది. ఆమె తీసిన జాకెట్టు పరీక్షగా చూస్తూ సుందరమ్మ "నీలం! ఆ జాకెట్టు ఎప్పుడు కుట్టించావు. పాపం చిరిగిపోయింది." అంది.

నీలం చిన్నగా నవ్వింది. "అది నేను కుట్టించుకున్నది కాదు వదినా! నిన్న మా కరణం గారింటికిపోతే అమ్మాయి గారు యిచ్చింది. కాసేపు నావంటిమీద వుందో లేదో కోటమ్మ మొహాన పెట్టాను. పోతేపోయిందిలే! యిదిగో

లచ్చి వదినా! నిన్న మా కరణం గారింటికాడ బలే తమాషా జరిగిందిలే!" అంటూ మళ్ళీ నవ్వింది నీలం.

"ఏమిటే ఆ తమాషా?" అడిగింది లచ్చి.

"అమ్మాయిగారు నాకు యివ్వటానికి ఒక చీరె, రెండు జాకెట్లు పట్టుకవస్తుంటే వంటామె లేదూ, ఆ పిచ్చమ్మ. 'అయ్యో! అయ్యో! మెరుగైనా మాయలేదు! యీ కొత్త గుడ్డలు దానికి పారవేస్తావా?' అంటూ అడ్డు తగిలింది. అప్పుడు అమ్మాయిగారు ఏమందో తెలుసా? 'పోనీ మీరు కట్టుకోదలిస్తే కట్టుకోండీ!' అంది. ఇక పిచ్చమ్మగారు గుండె, గుండె బాదుకొని 'నా గ్రహచారం కాలిపోయింది. నన్ను ఆ గుడ్డలు కట్టుకోమంటావా!' అంటూ లబలబ లాడింది."

"ఆ పిచ్చమ్మకి మన మాలవాళ్ళ పొడగిట్టదు. ఒక సారి నన్ను కూడా 'ఒసే అమ్మో, బయటికి పో, ఫో!' అంటూ తరిమిందిగా" అంది లచ్చి.

"కరణం గారింట్లో చేరి శుభ్రంగా మేస్తోందిగా! ఇక మన పొడ ఎలా గిడుతుందీ!" అంది సుందరమ్మ.

"ఇదుగో వదినోయ్! ఆమె మొదట వచ్చినపుడు సన్నగా బద్దకరలావుండేది. ఇప్పుడు చూశావా? అమ్మో! దర్వాజా పట్టకుండా బలిసిపోయింది." అంది నీలం.

మాలక్ష్మి నీళ్ళబిందె దింపుతూ "ఒలే, అమ్మాయిలూ! కోటమ్మను పట్టుకుని రాఘువులు చావ చితకొట్టాడే తల్లుల్లారా" అంది.

"దాన్ని కొట్టినా ఒకటే, కోసినా ఒకటే! రాఘవులు చేతులు నొప్పిపెడతాయే గాని కోటమ్మకు జ్ఞానంరాదు." అంది లచ్చి.

"ఓలమ్మో! అదెక్కడి ఆడదేతల్లో! పుస్తె తెంచి మొగుడు మొహానకొట్టింది." అంది ముసలి అచ్చమ్మ.

((((

మేరీనిగురించి ఆనంద్ కొద్దిరోజులు విచారించాడు ఆమె అంత త్వరలో చనిపోతుందని అతను వూహించలేదు. రేపు చనిపోతుంది అనగా, అతను ఆమెతో మాట్లాడి వచ్చాడు. అప్పుడుకూడా ఆమె అతనితో నవ్వుతూ మాట్లాడింది. బహుశా అది ఆఖరిసారి అని ఆమె తెలుసుకుని వుండాలి. అందుకే "నేను యింక ఎంతోకాలం జీవించను ఆనంద్! నీవు ఒక చక్కని అమ్మాయిని ఎంచుకుని వివాహం చేసుకుంటే నా ఆత్మ సంతోషిస్తుంది" అంటూ చెప్పింది.

ఆనంద్ వంటరిగా వున్నప్పుడు మేరీ పలికిన ఆఖరి వాక్యాలు గుర్తుకు తెచ్చుకుంటూ వుంటాడు.

క్వార్టర్లీ పరీక్షలు సమీపించాయి. ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే వుత్సాహంతో ఆనంద్ పట్టుదలగా చదువుతున్నాడు. ఒక సాయంకాలం అతను కాలేజీ నుండి తిరిగి వచ్చేసరికి గదిలో జాబు పడివుంది. అతను పుస్తకాలు బల్లమీదపెట్టి జాబు తీసి చదవడం ప్రారంభించాడు. మధ్యలో ఆగి అతను జాబు చివరనున్న సంతకం చూశాడు 'సుశీల' అనివుంది. అతను ఆనందంతో పొంగి

పోయాడు. "అమ్మాయిగారు నాకు జాబు వ్రాసింది" అనుకున్నాడు. మళ్ళీ జాబు మొదటినుండీ శ్రద్ధగా చదివాడు.

ఆనంద్,

క్షేమం. నీవూ క్షేమమేనని తలుస్తాను. నీ యోగక్షేమాలు తరచు మీ నాన్నా, మీ చెల్లెలూ తెలియజేస్తూవుంటారు. శ్రద్ధగా చదివి బి. ఏ లో కూడా క్లాసు తెచ్చుకోగలవని ఆశిస్తాను. మీ నాన్నతో పంపించిన పైకముపెట్టి నీకు నచ్చినవి మంచి పుస్తకాలు కొని పంపించు. ముఖ్యంగా "రక్తాక్షరాలు" అనే పుస్తకం తప్పకుండా తీసుకోవాలి. మిగిలినవి గోర్కీ, టాల్‌స్టాయ్, టాగూర్ రచనలు దొరికితే కొను. తెలుగులోవచ్చిన పుస్తకాలు నేను చాలవరకు చదివేశాను. విప్లవవీరుల చరిత్రలు లభ్యమైతే సాధ్యమైనంతవరకు అవే కొను. మీ నాన్నద్వారా మరికొంత పైకం పంపించగలను. శెలవల్లో వచ్చినప్పుడు తప్పక కలుసుకోగలవని ఆశిస్తాను.

నీ శ్రేయోభిలాషి,
సుశీల.

ఆనంద్ జాబు మడిచి పెట్టెలో పదిలపరిచాడు. ఆ జాబే పెన్నిధిగా భావించాడు అతను. ఆ సాయంకాలం పుస్తకాలషాపులకు పోయి సుశీలకు కావలసిన పుస్తకాలు కొన్ని కొన్నాడు.

ఆనంద్ ఆ రాత్రి సరిగా నిద్రపోలేదు. అతని ఆలోచనలన్నీ సుశీల మీదనే వున్నాయి. సుశీలను అతను చిన్న

తనంనుండీ చూస్తూనే వున్నాడు. ఆమెను ఒక దేవతగా భావించేవాడు ఆనంద్. నాటి సమాజంలో సుశీల ఒక అతీతమైన వ్యక్తి అని అతని భావన. ఆమెకు అసలు స్త్రీ వాంఛ అంటూ లేదనే అతని నమ్మకం.

ఒకసారి అతను తన స్నేహితులతో పిచ్చాపాటీ మాట్లాడుతూండగా సామిఏలు అనే అతను ప్రశ్నించాడు. "ఒరే ఆనంద్! మన వూళ్ళో అందరికంటే అందంగావుండే ఆడది ఎవరో చెప్పరా ?"

ఆనంద్ దృష్టి ప్రథమంలో పల్లెలోని వాళ్ళ పైకి పోయింది. అతను "యేసుదాసు కూతురు మేరీ" అన్నాడు.

"అబ్బే! మేరీలో ఏమంత పెద్ద అంద చందాలు వున్నాయి ? కాదు" అన్నాడు సామిఏలు.

"పంతులు భార్యా సుందరమ్మ." అన్నాడు మళ్ళీ ఆనంద్.

"ఓరి ఎర్రిమొఖమా! రాను రాను సుందరమ్మ కూడా ఒక అందగత్తే నన్నమాట నీ దృష్టిలో" ఒక అతను హేళనగా మాట్లాడాడు. ఆనంద్ చిన్న బుచ్చుకున్నాడు. కాని వెంటనే సర్దుకుని "ఒరేయ్! మనది అసలే పల్లెటూరు. ఇక ఆ పల్లెటూళ్ళో మనది మరీ చిన్నపల్లె. ఇక్కడ వుండేవాళ్ళమంతా చాకిరీ చేసుకుని బ్రతికేవాళ్ళమేగా. అలాంటప్పుడు సినిమాస్టార్లు వైజయంతిమాల, పద్మిని, రాగిణి, నర్గీస్, నూతన్లు లాగా అందమైనవాళ్ళు మనకు కావాలంటే ఎలా అగుపిస్తారు" అన్నాడు అతను.

"మన పల్లెసంగతి వదిలెయ్యండి. వూళ్ళో ఎవరైనా వున్నారేమో! చెప్పండి చూదాం" అన్నాడొకడు.

"సావుకారుగారి చిన్నకోడలు బాగుంటుందిరా!"

"యహె! తెల్లమొహం" అన్నాడు ఇంకొకడు.

"మునసబుగారి ముండ సంగతి ఏమిటిరా?"

నలుగురూ గొల్లున నవ్వారు. "ముసలమ్మ అయినాక ఆమెను యింకా అందగత్తె అని ఎవడంటాడు?"

ఆనంద్‌తోపాటు నలుగురూ కలిసి "అయితే, మన వూళ్ళో అందగత్తె లేదు" అన్నారు. కాని ప్రథమంలో ప్రశ్నించిన సామియేలు:

"నేను చెప్పనా?" అన్నాడు.

"చెప్పు చూదాం" అన్నారు నలుగురూ.

"కరణంగారమ్మాయి, సుశీల" అన్నాడు.

ఆనంద్ తెల్లబోయాడు.

"ఆమె విధవగా?" అన్నారొకరు.

"విధవ అయినమాత్రాన అందగత్తె కాకూడదని ఎక్కడ వుంది?" సామియేలు సమాధానం.

"ముండమోపులకు అందం ఎందుకు?"

"ఏమో! మళ్ళీ పెళ్ళి చేసుకుంటుందేమో!"

ఆనంద్ సహించలేక పోయాడు. గట్టిగా అరిచాడు. "ఒరేయ్! ఆమె చాలా పవిత్రమైనది. ఆమె శీలాన్ని ఎవడైనా శంకిస్తే వాడికి కళ్ళు రెండూ పోతాయి. ఆమెను గురించి మీరు యే ఒక్కమాట అన్నా నేను సహించను" అన్నాడు.

మిగిలిన వాళ్ళందరూ యేకమై వ్యంగ్యంగా నవ్వారు. "ఆమె పవిత్రమైనదే కావచ్చు. కాని ఆమెకూడా ఒక మనిషే. ఆమెకూ అందరిలాగే రక్త మాంసాలున్నాయి. అంటే అందరివలెనే కోరిక లుంటాయి. ఈ విషయం నీవు అంగీకరిస్తావనుకుంటాను" సామియేలు ప్రశ్నించాడు.

ఆనంద్ బిరుసుగా సమాధానం చెప్పాడు. "ఆమె మనిషే కావచ్చు. కాని ఆ మనుష్యులలో ఆమె ఒక అతీత మైన వ్యక్తి. అందరిలాగా ఆమెకూ కోరికలు వుండవచ్చు. కాని ఆమె తుచ్ఛమైన కోరికలను జయించింది. ఆమె ఏంజిల్ (దేవత). ఆమెను విమర్శించే తాహతు మనలో ఏ ఒకరికీ లేదు.

తరువాత ఎవ్వరూ మాట్లాడలేదు. నాలుగు నిమిషాలు మౌనంగా గడిచాయి. సామియేలు అందుకున్నాడు.

"మనకు వచ్చిన ప్రశ్న - ఆమెగారు అందగత్తె అవునా, కాదా? అని. ఆమె అప్సరసలా వుంటుందని నా అభిప్రాయం. నీవు అంగీకరిస్తావా, ఆనంద్!" సామియేలు ప్రశ్నించాడు.

ఆనంద్ మందస్మితం చేశాడు.

రాత్రి ప్రొద్దుపోయేవరకు ఆనంద్ చదువుతూ కూచున్నాడు. గడియారం పన్నెండు గంటలు కొట్టింది. అతనికి బద్ధకం తోచింది. పుస్తకాలు సర్ది అతను కిటికీ దగ్గర నిలబడి శూన్యంలోకి చూచాడు. తూర్పు దిక్కుగా బహుళ చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. నక్షత్రాలు కాంతిహీనంగా

అవుపించాయి. వీధిగోడలకు సినిమా పోస్టర్లు అంటిస్తూ ఒక కుర్రాడు పాడుతున్నాడు.

"నీకు నాకూ జోడీ అయితే - నీళ్ళమీదా తెప్పగట్టీ
తెప్పమీదా తేలిపోదాము పదవే - చల్ మోహన రంగీ!
ఆఁ ఆఁ తెప్పమీద తేలిపోదాం పదవే॥

క్రిందవున్న కుర్రాడు హెచ్చరిక చేశాడు. "ఒరేయ్, రంగా! అక్కడినుంచి జారిపడ్డావంటే బాగానే తేలిపోతావు, యదవనాగన్నా !"

"ఒరే క్రిష్ణా ! యీ కాగితానికి జిగురు చాలలేదురా! సరిగా అంటలేదు."

"అయితే అది కింద పడెయ్యి, యింకొకటి అందిస్తాను."

"పొద్దు పోతాందిరా, చప్పున కానియ్యరా బాబూ !"

"రోజూ తెల్లవారు ఝామున నాలుగింటిదాకా వుండే వాళ్ళముగా, యివ్వాళ అప్పుడే పొద్దుపోతూంది అంటున్నా వేమిటీ ?"

"పని వుందిలేరా."

"యేమిటో అర్ధరాత్రివేళ పని !"

"మా రంగితో నేను ఒంటిగంటవేళ వస్తానని చెప్పాను. నా కోసం ఎదురు చూస్తూ వుంటుంది."

"కొట్టొరంగా ! ఒరేయి! సరేగాని దానిభర్త చూస్తే మీరు ఏమవుతారురా ?"

"వాడు వూళ్ళో లేడు."

దూరంగా కుక్కలు మొరిగాయి. బీటు కానిస్టేబుల్సు యిద్దరు బూట్లు టకటకలాడిస్తూ విసురుగా నడుస్తూ పోయారు. అందులో ఒక అతను కాగితాలు అంటించే కుర్ర వాళ్ళను అడిగాడు.

"ఒరేయ్! మీరు యిక్కడ ఎంతసేపటినుండి వున్నారు?"

"ఇప్పుడే వచ్చాం బాబూ!"

"యీ దారిని ఎవరైనా వచ్చారా?"

"ఎవరూ రాలేదు బాబూ!"

ఆనంద్ పోయి పక్క పరచుకొని లైటు ఆర్పి పరు న్నాడు. కాని అతనికి నిద్రపట్టలేదు. అతను లేచి లైటు వేశాడు. పెట్టె తెరచి దానిలో దాచిన జాబు పైకి తీశాడు. పక్కమీద కూచుని లైటు వెలుతురులో జాబు బిగ్గరగా చదివాడు. చివరవున్న "నీ శ్రేయోభిలాషి; సుశీల" అనే మాటలు పూర్తిచేసి, అతను జాబు హృదయానికి అదుము కున్నాడు.

"అమ్మాయిగారు నా శ్రేయోభిలాషి అయితే తప్ప కుండా యీ రాత్రికి కలలోకి రావాలి" అనుకున్నాడు.

రెండురోజుల తరువాత సుబ్బయ్యవచ్చి "ఒరే అయ్యా! బాగా చదువుతున్నావా?" అని అడిగాడు.

"ఆఁ! బాగానే చదువుతూ వున్నా నాన్నా!"

"మీ పరీక్షలు ఎప్పటితో ముగుస్తాయి?"

"వచ్చే శనివారంతో అయిపోతాయి నాన్నా! ఆ తర్వాత కాలేజికి శెలవలు యిస్తారు."

"శెలవలు ఎన్ని రోజులురా ?"

"దసరాపండుగ వెళ్ళిన మూడోరోజు వరకు"

"అయితే రేపు ఆదివారం యింటికి వస్తావుగా ?"

"ఆఁ. వస్తాను నాన్నా !"

"అమ్మాయిగారు మళ్ళీ యిరవయి రూపాయలు పంపారు. ఇంకా ఏవో పుస్తకాలు కావాలంట !"

"చీటీ ఏమైనా ఇచ్చారా నాన్నా ?"

"మేఘూ యివ్వలేదురా ! సరే నేను పోతున్నాను." అంటూ సుబ్బయ్య లేచి నిలబడ్డాడు. ఆనంద్ పుస్తకాలు పార్శెలుచేసి అమ్మాయిగారికి అందజెయ్యమని అతనికి యిచ్చాడు.

—:—

ప్రకరణ 8

దసరా శెలవులకు ఆనంద్ ఇంటికి వచ్చాడు. నీలం భావి దగ్గర నలుగురికి కబురు అందజేసింది. "రాత్రి సామియేలు కూడ వచ్చినట్టున్నాడు." అంది సుందరమ్మ.

దశరా శెలవులు యిచ్చారుగా, చదువులకు వెళ్ళిన వారంతా దిగుతారు. అంది లచ్చి.

చంద్రమ్మ బిందె బావిదగ్గర పెట్టి అంది. "అమ్మల్లారా! యేమిచదువులో, యేమిపాడో నా బిడ్డ సగం అయిపోయాడు."

"ఎందుకని వదెనా!" లచ్చి ప్రశ్నించింది.

"యేందు కేముందీ! ఆస్టల్లో తిండి."

"యేం, ఆస్టల్లో బాగా పెట్టరా?"

"బాగా పెడితే నా బిడ్డ అట్టా యెందుకు వుంటాడు! ఆడి జిమ్మడ! ఆ డెవడో ఆస్టలు మేనేజరంట. కూరలకు వచ్చే డబ్బులన్నీ ఆడు కాజేసి పిల్లలకు తోటాకు, దొగ్గలాకు, గోంగూర యేసి పెడతాడంటా!"

"యే హాస్టలు చూచినా అదే తంతు వదెనా!" సుందరమ్మ చెప్పింది.

"ఆళ్ళు పెట్టే కూటినిండా సగం వడ్లగింజలూ, రాళ్ళూనంటా. ఆడి తిండి మండిపోనూ! అట్టాటికూడు తిని పిల్లలు యేమి చదువుతారూ! అయ్యో! అయ్యో! సగానికి

సగం అయిపోయాడు నా బిడ్డ. యీడి సంపాదనా యీడు ఊరుత్తరాన కలవా !" చంద్రమ్మ అక్కసు వెళ్ళబోసింది.

లచ్చి బిందె భుజాన పెట్టి నీలంవైపు చూస్తూ అంది. "నీలం ! ఆనందాన్ని ఒకసారి యింటికి రమ్మన్నాననని చెప్పు."

సుందరమ్మ నీలంవైపుచూచి మందస్మితం చేసింది.

"యెందుకో ?" నీలం ప్రశ్నించింది.

"ఎందుకేముందీ ? కాసేపు కబుర్లు చెపుతాడు. నేను ఒక గ్లాసు కాఫీ చేసి యిస్తాను."

"అయితే నేనుకూడా వస్తాను వదినా !"

"రా నీలం ! ఎవరు వద్దంటారు నిన్ను ?"

"మరి నాకుకూడా కాఫీ యిస్తావా ?"

"ఓలమ్మో ! నా యింటో పంచదార తక్కువగా వుంది"

"అయితే పంచదార నేను తెచ్చుకుంటానులే !"

"అబ్బా ఎంత వడిగలదానివి నీలం! ఆ పంచదారతో పాటు కాస్త కాఫీపొడికూడా తీసుకురా"

"మా యింట్లో కాఫీ పొడి లేదమ్మా"

"కోమటి కొట్లో కావలసినంత దొరుకుతుంది."

నలుగురూ యేకమై నవ్వుకున్నారు.

లచ్చి గేదెనుపాలు తీస్తుండగా ఆనంద్ వచ్చాడు. పైజామా,లాల్చీ తొడుగుకున్నాడు. కాళ్ళకు బాటాచెప్పులు వేసుకున్నాడు. "వదినా ! యింకా పాలు పిండటందగ్గరే

వున్నావా ? కాఫీతయారయి వుంటుందని వచ్చానే!” అన్నాడు అతను.

“అయిపోయింది మరిదీ ! రెండునిమిషాలు ఆ వసారాలో మంచంవుంది వాల్చుకు కూచో” లచ్చి అక్కడ నుండే సమాధానం చెప్పింది.

ఆనంద్ ఇంటిముందు అటూ యిటూ రెండుసార్లు పచార్లు చేశాడు. లచ్చి పాలచెంబు తీసుకొని లోపలికి పోయింది. కొద్ది నిమిషాలు గడిచాయి.

లచ్చిఆనంద్‌ను లోపలికిపిలిచి కాఫీగ్లాసుఅందించింది. గ్లాసువంక చూస్తూ అతను అన్నాడు. “అబ్బ! ఎంతచిక్కగా వుంది కాఫీ ! యేమి వేశావు వదినా ! యిందులో”

“చెప్పుకో చూదాం”

ఆనంద్ కాఫీ చప్పరిస్తూ అన్నాడు“చిక్కని పాలలో కాఫీపొడి వేశావు”

లచ్చి మందస్మితం చేసింది. “నీకు ఒకశుభవార్త చెప్పనా మరిదీ !”

“చెపితే వద్దంటానా వదినా”

“నీ రొట్టె నేతిలోపడింది మరిదీ”

ఆనంద్ విస్తుపోయిచూచాడు. “వివరంగా చెప్పాలి వదినా!”

“మా కరణంగారి అమ్మాయి సుశీలను గురించి నీ అభిప్రాయం యేమిటీ”?

“ఆమెను గురించి నాకు ఒకే ఒక అభిప్రాయంవుంది వదినా! అదికూడా సదభిప్రాయమే”

"ఆమెను గురించి నీకు సదభిప్రాయంగాక దురభిప్రాయం వుంటుందని నేను ఎలా అనుకుంటాను మరిదీ!"

"నాకు తెలిసినంతవరకు సమాజానికి అతీతమైన వ్యక్తుల్లో ఒకరని నా అభిప్రాయం."

"కావచ్చు. ఆమెకూడా మానవ మాత్రురాలే"

"ఆమెలో బలహీనతలు వున్నాయని యెవ్వరూ అనలేరు."

లచ్చి చిన్నగా నవ్వింది. "ఆమె నీకు జాబు వ్రాసిందని అంగీకరిస్తావా మరిదీ!"

ఆనంద్ తెల్లబోయాడు. కాని వెంటనే తేరుకుని "వ్రాసింది వదినా! కాని ఆ జాబులో విశేషమేమీ లేదు. ఆమెకు కావలసిన పుస్తకాలు కొని పంపించ వలసిందని మాత్రమే దానిలో ఉదహరించింది."

"అంతే నంటావా! ప్రేమలేఖ అయివుంటుందనుకున్నానే!"

అతను పైజామా జేబులోనుండి జాబు బయటికితీసి ఆమె చేతికి అందించాడు.

లచ్చి జాబుతీసి చదివింది. ఆమె మందస్మితంచేస్తూ అంది. "మరో విశేషం కూడావుంది. చెప్పమంటావా?"

"చెప్పు."

"ఆమె నిన్ను ప్రేమిస్తోంది!"

ఆనంద్ నిర్ఘాంతపోయాడు. "అసంభవం. ఆమెకు అలాంటి కోర్కెలు వున్నాయని నేను అనుకోను."

"నీవు అనుకోక పోవచ్చు మరిదీ! అదిమాత్రం యదార్థం."

"నీవు అలా అనుకునేందుకు ఆధారాలేమైనా వున్నాయా?"

"కొద్ది రోజుల్లో నీకే తెలుస్తుంది మరిదీ."

"అది లాభంలేదు వదినా! ఆమెను గురించి పూర్తి వివరాలు చెపితేనేగాని నేను యిక్కడనుండి కదలను" ఆనంద్ మొండిపట్టు పట్టాడు.

లచ్చి నీరసంగా నవ్వింది. "మరిదీ! మనం సినిమాలు చూస్తున్నాం. నవలలు, కథలు చదువుతూన్నాం. వాటిలో మనం గ్రహిస్తున్నదేమిటి? సంఘ సంస్కారం పేరుతో ఒక శ్రీమంతులబిడ్డ ఒక బీదవిద్యార్థిని ప్రేమిస్తుంది. అలాగే యింకోచోట విదేశాలు తిరిగివచ్చిన ఒక యువకుడు ఒక అనాధ వనితను ప్రేమిస్తాడు. పెద్దలు అభ్యంతరం చెప్పినా వినకుండా పెళ్ళిళ్ళు చేసుకుంటారు. అలాగే సుశీలమ్మగారు కూడా నిన్ను ప్రేమిస్తూందేమోనని నేను అనుకుంటున్నాను. అదీకాక మన కరణంగారు సంఘంలో సంస్కారం రావాలని అంటూవుంటారు. మరి ఆ విషయంలో ఆయనగారు యెంత వరకు నిలబడతారో నేను చెప్పలేను. ఆమె నిన్ను ప్రేమించడం అసంభవం మాత్రంకాదు." అంది ఆమె.

అతను దీర్ఘంగా నిట్టూర్చాడు. రెండు నిమిషాల తరువాత "వదినా! నీవు కమ్యూనిస్టువి. పార్టీ వాఙ్మయము, యితర పుస్తకాలు చాలా చదివావు. ప్రతివిషయం నీవు నిశితంగా పరిశీలిస్తావు, విమర్శిస్తావు. సూటిగా మాట్లాడతావు. కాని సుశీలగారి విషయంలో నీ అంచనాలు పూర్తిగా పొరపాటని నేను అనుకుంటాను. ఆమె వివాహం చేసుకోవాలనే

అభిప్రాయమే వుంటే యే ఐ. ఏ. యస్. నో, లేక విదేశాలలో వున్నత డిగ్రీలు పొందిన మరొకరినో వివాహం చేసుకునే అవకాశంవుంది. అలాంటప్పుడు నామీద దృష్టి కేంద్రీకరించవలసిన అగత్యం ఆమెకు యెందుకు కలుగుతుంది? నేను నమ్మను. నమ్మలేను వదినా" అన్నాడతను.

లచ్చి వెంటనేఅంది. "అదేమిటబ్బాయ్ నీవు అట్లా ఎందు కనుకోవాలి? ఆ కాలేజీ ప్రొఫెసర్ స్వచ్ఛమైన బ్రాహ్మణుడుకాడూ? ఆయనగారు కావాలని తనకూతురిని మన పక్కవూరి పల్లెలో హరిజనయువకుడికిచ్చి పెండ్లి చేయటం మనం అందరం యెరిగిన విషయమేగా! కరణంగారు కూడా అలా చేయదలచుకుంటే యెవరు ఆపుతారు? పోనీ ఆమె జీవితమంతా అవివాహితగానే వుండిపోతుందని నీవు చెప్పగలవా ?"

"ఆ విషయం నేను ఎట్లా చెప్పగలుగుతాను? కాని లోగడ కరణంగారు ఆమెకు గొప్ప సంబంధాలే చూచారు. కాని అప్పుడు ఆమె వాటిని నిరాకరించింది." అన్నాడు ఆనంద్.

"సరే మరిదీ! ముందు ముందు చూస్తాముగా " అంది ఆమె.

ఆనంద్ ఇంటికిపోయి చెల్లెల్ని పిలిచి అడిగాడు. "నీలం! అమ్మాయిగారు నాకు జాబురాసిందని లచ్చితో యెందుకు చెప్పావు ?"

నీలం నిర్ఘాంత పోయింది. కాని ఆమె సమాధానం చెప్పలేదు.

"యింకా యెవరితోనైనా చెప్పావా?" ఆనంద్ చెల్లెల్ని కటువుగానే ప్రశ్నించాడు.

"లేదు అన్నయ్యా!"

"సుందరమ్మతో కూడ చెప్పేవుంటావు."

నీలం తల వంచుకుంది. ఆమె కళ్ళల్లో నీళ్ళుతిరిగాయి.

అతను చెల్లెల్ని మందలిస్తూ అన్నాడు. "అబద్ధాలు కూడా నేర్చావన్నమాట."

నాలుగు నిమిషాల తరువాత నీలం తేరుకుని నెమ్మదిగా అంది "యేదో మాటల సందర్భంలో చెప్పాను అన్నయ్యా! అందులో నాకు తప్పు యేమీ అగుపించలేదు."

"నీకు అగుపించకపోవచ్చు నీలం! కాని అవతలివాళ్ళు విపరీతార్థాలు తీస్తారు. కథలు అల్లుతారు. ఇకముందు యెప్పుడూ నావిషయంగాని, అమ్మాయిగారి విషయంగాని ఇతరులముందు ప్రస్తావించవద్దు. కరణంగారు నాకు చదువు చెప్పిస్తున్నారు. మనను గురించి యేమైనా అపవాదులు ప్రచారం అయితే కరణంగారు మనకు సహాయం చెయ్యరు. నా చదువుకు స్వస్తి చెప్పాలసి వస్తుంది. అంతేకాదు. పవిత్రమైన అమ్మాయిగారి జీవితానికి కళంకం యేర్పడుతుంది. కాబట్టిమనం జాగ్రత్తగా మెలగడం, మాట్లాడడం మంచిది" అన్నాడు ఆనంద్.

"సరే, అన్నయ్యా"

సాయంకాలం ఆనంద్ కరణంగారి ఇంటికివెళ్ళాడు. కరణంగారు యింటిదగ్గర లేరు. ఆనంద్ పదినిమిషాలు అటూ యిటూ తచ్చాడాడు. సుశీలవచ్చి గుమ్మంలో నిలబడింది. ఆనంద్ ఆమెకు యెదురుగా నిలబడి "అమ్మాయిగారూ! క్షేమమా!" ఆమె మందస్మితం చేసింది.

"యెప్పుడు వచ్చావు ఆనంద్?" అంది.

"నిన్న సాయంకాలం వచ్చాను అమ్మాయిగారూ!"

సుశీల తివాసి తెచ్చి వరండాలో పరిచింది. "కూర్చో ఆనంద్" అంది.

అతను చిన్నగా నవ్వుకున్నాడు. "ఫరవాలేదు అమ్మాయిగారూ" అంటూ పుస్తకాల పార్సెలు తివాసీమీద పెట్టాడు.

సుశీల పార్సెలు విప్పి పుస్తకాలు తిరగ వేసింది. టాగూరు, టాలస్టాయి, గోర్కీ, మాం మొదలగువారి రచనలు వున్నాయి. ఆమె అతనివైపు చూస్తూఅంది.

"ఆనంద్, ఇంగ్లీషు పుస్తకాలు సాఫీగా చదవలేక పోతున్నాను. అనువాదాలైనా తెలుగు పుస్తకాలే పంపించు. ఇకముందు ఇంగ్లీషు పుస్తకాలు కొనవద్దు."

"ఇంగ్లీషు నవలలు చదవడానికి అలవాటు పడితే ముందు ముందు మీరు సాఫీగానే చదవగలుగుతారు అమ్మాయిగారూ! డిక్షనరీ దగ్గరపెట్టుకుని కృషి చెయ్యండి. భాషకూడా అభివృద్ధి అవుతుంది." అన్నాడు ఆనంద్.

సుశీల నీరసంగా నవ్వింది. "నాకు కూడా పరీక్షకు కట్టాలని వుంది ఆనంద్"

"అయితే యీ సంవత్సరం మెట్రిక్‌కు కట్టండి"

"ఏమో, నాన్నగారు యేమంటారో ?"

"మీరు అడిగితే నాన్నగారు కాదని అనరు."

ఆనంద్ జేబులోనుండి పదిరూపాయలు, కొద్దిగా చిల్లర తీసి తివాసీ మీద పెట్టాడు. "మీ డబ్బులో యింకా మిగిలిందండీ !"

ఆమె చిన్నగా నవ్వింది. "నీదగ్గర వుండనీ ఆనంద్. పుస్తకాలేమైనా కావలసివస్తే కొందువుగాని."

పిచ్చమ్మగారు ఇంట్లోనుండి బయటికివచ్చి ఆనంద్‌ను చూచి ఆగిపోయింది. "యెవడురా అబ్బీ ! నీవు సుబ్బాయి కొడుకువే కదూ !" అంది పిచ్చమ్మగారు.

"అవును అమ్మగారూ !"

"అక్కడ యెక్కడో పట్టణంలో చదువులు వెలగబెడతున్నావట. ఇక్కడికి యెందుకు వచ్చావూ ?"

సుశీల పిచ్చమ్మగారివైపు వురిమిచూచింది "మామ్మా! నీకు యిక్కడ యేదైనా పనివుంటే అది చూచుకుని ముందు అవతలకి నడువు. వాకిట్లోకి వచ్చిన వాళ్ళను అసందర్భంగా నోటికి వచ్చినట్లువాగి వాళ్ళను కించపరచడం మంచిదికాదు" సుశీల కోపంతో అంది.

"అయ్యో! తల్లీ! అంత కోపమైతే యెలానమ్మా చచ్చేది! వాకిళ్ళు చిమ్మిదామని వచ్చేను. ఇక్కడ నేనేమీ బంతు లాడడానికి రాలేదు."

సుశీల నవ్వేసింది. "మామ్మా! మీరు చిన్నతనంలో బంతులాటలు ఆడారా యెప్పుడైనా?"

"నా బ్రతుక్కి అవి కూడానా?"

"మామ్మా, కోపం వచ్చిందా? వాకిళ్ళు నేను చిమ్మితానులే. మీరు పోయి వంటపని చూడండి"

పిచ్చమ్మగారు శాంతించింది. ఆనంద్ సుశీలవైపు చూస్తూ "అమ్మాయిగారూ వెళ్ళి వస్తానండీ" అన్నాడు.

"ఆ తివాసీమీద పెట్టిన డబ్బు తీసుకుపో ఆనంద్!"

ఆనంద్ వీధి గుమ్మం దాటుతూవుండగా కరణంగారు యెదురయ్యారు. "యేరోయ్, ఆనంద్ ఎప్పుడు వచ్చావు? అప్పుడే పోతున్నావేం? రా, రా, కూర్చో! కాసేపు కబుర్లు చెబుదువుగాని" అంటూ కరణంగారు వరండాలో వున్న కుర్చీలో కూచున్నారు.

ఆనంద్ ఆయనగారికి యెదురుగా చేతులు కట్టుకుని నిలబడ్డాడు. కరణంగారు అతనిని పిలిచి తివాసీమీద కూర్చో మన్నారు.

"ఫరవాలేదు దొరా!" అన్నాడు ఆనంద్.

"ఒరే ఆనంద్! నేనూ మీనాన్నా ఒకతరంవాళ్ళం. మీ నాన్న గోచీ పెట్టినప్పటినుండి మా కమతంలో వున్నాడు. మీ నాన్న నన్ను దొరా అన్నా, నేను మీ నాన్నను

సుబ్బారాయ్ అని పిలిచినా చలామణీ అయింది. కాని నీవో బి. ఏ. చదువుతూన్నావు. అదృష్టం బాగుంటే రేపు నీకు మంచి ఉద్యోగమే దొరకవచ్చు. అలాంటప్పుడు నీవు నన్ను దొరా అని పిలవడం యేమి సబబుగా వుంటుందో చెప్పు? అదీగాక రేపుఎప్పుడైనా మీ కమ్యూనిస్టుపార్టీ అధికారంలోకి వస్తే మాకు మీరే దొరలవుతారు. అవునా—కాదా" అంటూ ప్రశ్నించాడు కరణంగారు.

ఆనందు తలవంచుకున్నాడు. అతను తిరిగి సమాధానం చెప్పలేదు.

సుశీల నవ్వుతూఅంది." నాన్నగారూ! వాళ్ళు దొరలు కాదు నాన్నగారూ, కామ్రేడ్సు"

కరణంగారు సంతృప్తిగా నవ్వారు.

ఆనందు చదువు సంధ్యలను, ఆరోగ్యాన్ని గురించి కరణంగారు అడిగిన ప్రశ్నలకు అతను వినయంతో సమాధానం చెప్పాడు.

కొద్దిదినాలు గడిచాయి. ఆనందు కరణంగారి ఇంటికి రెండు మూడుసార్లు పోయి వచ్చాడు.ఒకసారి అతను లచ్చితో అన్నాడు. "వదినా! సుశీలగారిని గురించి నీవు యిచ్చిన అభిప్రాయం సరియైనదికాదు."

లచ్చి నిరుత్సాహంగా అంది "యెందుకని మరిదీ?"

"నేను యిక్కడకు వచ్చిన తరువాత వారి ఇంటికి నాలుగు అయిదుసార్లు పోయివచ్చాను. రెండుసార్లు మాత్రమే. ఆమెగారు నాకు అగుపించి మాట్లాడింది. అది

కూడా చాలా క్లుప్తంగానే మాట్లాడిందని చెప్పవచ్చు. ఆమె చూపుల్లోగాని, మాటలలోగాని ఆ ప్రేమలక్షణాలు యే కోశానా అగుపించలేదు. ఆమెను గురించి నీవు పొరపాటు పడివుంటావు వదినా!" అన్నాడు ఆనందు.

"యేమో! అబ్బాయి. నేను ఒకసారి ఆమెగారితో మాట్లాడుతూండగా ఆమాట సందర్భంలో నీ ప్రస్తావన వచ్చింది. నీ యోగ్యతలను, నీ గుణగుణాలను గురించి నేను చెబుతూంటే ఆమె ముఖంలో ఎంత ఆనందం అగుపించిందో నేను మాటలతో చెప్పలేను. అంతటితో ఆగిందనుకున్నావా! నీ రూపురేఖలను వరూధిని ప్రవరాఖ్యుని వర్ణించినట్టుగా యేకరువు పెట్టింది. ఇక దానినిబట్టి నేను యేమనుకోవాలో చెప్పు మరిదీ!" అంది లచ్చి.

ఆనంద్ నిరుత్సాహంగానే అన్నాడు. "యేమో వదినా! ఆమెగారిలో అలాంటి లక్షణాలు నాకు యే మాత్రము అగుపించలేదు. యేమైనా ఆ విషయం మనం యింతటితో మరచిపోవడం మంచిది. అయినా మనకూ వారికీ మధ్య హస్తిమశకాంతరం తేడా వున్నప్పుడు పొత్తు కుదరడం యెలా సాధ్యం? అసంభవం వదినా!"

లచ్చి ఆలోచనలో పడింది. రెండు నిమిషాల తరువాత "యేమో మరిదీ! అంతేనేమో! నేనే పొరపాటు పడ్డానేమో?" అంది ఆమె.

((((

మేరీ మరణానంతరం యేసుదాసును అతనితోబుట్టువు సంతోషం వెంటపెట్టుకుని తనఇంటికి తీసుకుపోయింది.

సంతోషం ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయిని. ఆమెకు సంతానం లేదు. ఆమెభర్త డేవిడ్ శాస్త్రరు. కొన్ని సంవత్సరాలుగా ఆ భార్యాభర్తలు వేరువేరుగా ఉంటున్నారు. బిడ్డపోయిన విచారంతో యేసుదాసు మంచం పట్టాడు. సంతోషం స్కూలుకు శెలవుపెట్టి అన్నకు పరిచర్యలు చేసింది. ఆ స్థితిలోకూడ అతనిభార్య నిక్కి చూడలేదు. నెలరోజుల తరువాతగాని యేసుదాసు తేరుకోలేదు. సంతోషం అన్నగారిని తనదగ్గర వుంచుకునేందుకు యేర్పాటుచేసుకుంది. అది గమనించిన యేసు ఒకనాడు చెల్లెలితో అన్నాడు.

"అమ్మా సంతోషం! నీకు మినహా నాకు మాత్రం యెవరున్నారుగనుక! మనం తిరిగి మన గడ్డమీదకేపోదాం. యీ అద్దెకొంపల్లో యెందుకు పడివుండాలి? మన అమ్మా, నాయనా సంపాదించిందది కొద్దో, గొప్పో మనకు మిగిలింది. నీ ఉద్యోగం మనవూరికి మార్పించుకునేందుకు ప్రయత్నించు. త్వరలో అక్కడకుపోదాం."

"అలాగే పోదాం అన్నయ్యా! కాని నీ ఆరోగ్యం బాగుపడేవరకు యిక్కడనుండి కదలవద్దు."

"మన వూరిమీద నాకు గాలి తిరిగిందమ్మా"

"అయితే అన్నయ్యా! నీ తల బాగా మాసివుంది. రేపు క్రాపు చేయించుకుని తల స్నానంచేసి యెల్లుండి పోదువుగాని."

"లేదమ్మా! అక్కడికి పోవాలని నాకు చాలాబెంగగా వుంది. గ్రాపు జేమి వుందిలే. యెప్పుడో ఒకసారి వేయించుకుంటాను."

సంతోషం మరిమాట్లాడలేదు. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

యేసుదాసు సరాసరి తనయింటికిపోయి గుమ్మం ముందు నిలబడ్డాడు. అతని గెడ్డం గుబురుగా పెరిగివుంది. పై పంచ నెత్తికంటా ముసుకుపెట్టాడు. అతనిని చూచిన ఒకరు ఇద్దరు గుర్తుపట్టలేదు. అతను ఇంటితాళం తీస్తుండగా యెదురింటి పున్నమ్మ పరీక్షగా చూచి "ఓలమ్మో! యేసుదాసుబావయ్య వచ్చాడే" అంటూ కేక పెట్టింది. మరుక్షణం చిన్నా, పెద్దా ఆ యింటిముందు పోగయ్యారు.

యేసుదాసు చేతులు వణికాయి. తాళం రాలేదు. "బావయ్యా! నువ్వు తప్పుకో బావయ్యా!" అంటూ పున్నమ్మ యేసుదాసు చేతిలోని తాళంచెవి తీసుకుంది. ఇరుగుపొరుగునుచూచి యేసుదాసు బావురుమన్నాడు. "నీ మేరీని యెక్కడ దాసుకు వచ్చావురో, అయ్యో!" అంటూ పొరుగింటి అచ్చమ్మ శోకం పెట్టింది. యేసుదాసు ముందు వసారాలో చతికిలబడ్డాడు. ఒకరు మంచందులిపి పక్క వేశారు. పున్నమ్మ చీపురుపుచ్చుకుని ఇల్లూ వాకిలీ చిమ్మింది. మంగమ్మ కుండతో నీళ్ళుచేరబోసింది. అచ్చమ్మ పొయ్యి వెలిగించింది. పదినిముషాలలో నీళ్ళు కాగాయి.

ఆ హడావుడిచూచి సుబ్బయ్య అన్నాడు "ఒలే! అచ్చప్పా, ఇక్కడ వణ్ణం, గిణ్ణం వండకాకండి. ఏసుదాసును మాఇంటికి తీసుకుపోతాను. నాలుగురోజులు మా ఇంటికాడ వుంటాడు.

అచ్చమ్మ దవడలు నొక్కుకుంది. "ఓరయ్యోవ్, సుబ్బయ్యా! నువ్వు యెంత పెదమాలకొడుకువైనా ఇక్కడ మేమందర ముండగా మమ్మల్నికాదని యేసుదాసును నువ్వు యెట్టా తీసుకుపోదాం అనుకుంటున్నావురా అయ్యా! అదేం యీలు పడదు. ఇయాల, రేపు నా ఇంటికాడ ఉండాలిసిందే ఆ తరువాత యెవరు తీసుకెల్లినా" అంది అచ్చమ్మ.

"పోనీలే అచ్చప్పా! నీ యిట్ట ప్రకారమే పోనియి" అన్నాడు సుబ్బయ్య.

యేసుదాసు స్నానం చేస్తుండగా ఆనంద్ పోడి బట్టలు తెచ్చాడు. యేసుదాసు బట్టలు కట్టుకుని మళ్ళీ మంచంమీద కూచున్నాడు. అచ్చమ్మ అడిగింది.

"ఓరయ్యా యేసుదాసూ! నువ్వు మీచెల్లెలి యింటికాడ ఉండగా నీ పెళ్ళాం యెప్పుడన్నా వచ్చి చూచిపోయిందంటరా?"

"లేదు పిన్నాం! అది రానేలేదు" అన్నాడు యేసుదాసు.

"ఓరిదాని సిగ్గుచితకా. దానికేంపోయేకాలంవచ్చింది! కట్టుకున్న మగాడు ఆపదలవుంటే వచ్చి చూచి పోకూడదూ! ఇదెక్కడి ఆడదిరా బాబూ!" అంది అచ్చమ్మ.

అచ్చమ్మ లోపలికెళ్ళివంటపని పురమాయించి తను చిన్న బుట్ట పుచ్చుకుని బయలుదేరింది. పల్లె వెలుపలికి పోయి కాలువ అవతలవున్న మనుమడి కోసం కేకలు పెట్టింది.

"ఓరి కోటయ్యో... వూహూ... వూహూయ్"

అవతలనుండి సమాధానం లేదు ఆమె కేకలు అవతల తాటి తోపులో ప్రతిధ్వనించాయి. ఆమె గొంతు ఎత్తి మళ్ళీ కేకలు పెట్టింది.

"ఓరి కోటిగో... వూహూ... య్... ఓరి నీ జిమ్మడ, యేడవుండావురా! దిక్కుమాలినోడా!"

కోటయ్య కాలువలో యీత పందెంలో వున్నాడు. అతనికి ఆ కేకలు వినిపించలేదు. తోటికుర్రాడు చెప్పాడు. "ఒరేయ్ కోటిగా! మీ అయ్యమ్మ కేకలు పెడతాందశ్నా" కోటయ్య చెవి ఒక ప్రక్కగా పెట్టి ఆలకించాడు "అరేయ్ నీ యమ్మా! నిజమేరోయ్" అంటూ అతను గట్టు పైకి వచ్చి అచ్చమ్మను చూచి "ఓలయమ్మో!" అంటూ మారు కేక పెట్టి ఆమె దగ్గరకు వచ్చాడు.

అచ్చమ్మ అతన్ని బుజ్జగిస్తూ అంది. "ఓరయ్యా! మన గేదెని యివతలగట్టుకు యెక్కేయ్. నేను యింటికి తోలుకు పోయి కట్టేస్తా."

"నేను వత్తాగా అయ్యమ్మా?"

"వద్దువుగాని లేరా! నామాట చెప్పనియ్"

"సరే చెప్పు"

"ఇదిగో యీ బుట్ట తీసికెళ్ళి ఆ పల్లపుబోదె లేదూ! అక్కడ పెట్టిన చిన్నమావు దులుపుకురా"

"నీయమ్మ పాములుంటయ్యేమో అయ్యామ్మా!"

"ఆరి పిరికి చచ్చినోడా, పోయిరారా! పాములుండవు, పాడూ వుండవూ!"

"ఇప్పుడు యెందుకు అయ్యామ్మా, పొద్దున్నే దులుపుకొచ్చాగా!"

"యేసుదాసు బాబాయి వచ్చాడురా! కూర యేమీ లేదు."

కోటయ్య మాట్లాడకుండా బుట్ట పుచ్చుకొని బయలుదేరాడు. అచ్చమ్మ గేదె వెనుక నెమ్మదిగా యింటి వైపు నడిచింది.

సాయంకాలం భోజనాలకు ముందు పొరుగింటి రంగదాసు అచ్చమ్మను పలుకరించాడు.

"ఓ అచ్చమ్మత్తో! యేసుదాసు బావయ్యకు యేమేమి వంటలు చేశావు"

"ఓరయ్యా! నావల్ల యేమి అవుతుందిరా ఆవంటలు, గింటలు! రేపు నీపెళ్ళాంచేత పప్పు పాశాలు బాగా చేయించి పెట్టుదువుగాని మీ బావయ్యకి" అంది అచ్చమ్మ.

"నువ్వు ఏమి వంట చేశావంటే నీయమ్మా! ఆసదువంతా యెందుకే నీకు" అన్నాడు రంగదాసు.

"ఓరయ్యా, యేముందిరా సెయ్యడానికి? కాసిని చిన్న చేపలు దొరికితే అయ్యి యిగరేశాను. కాసినన్ని పప్పుచారు పెట్టాను"

"నీయమ్మా, యింకేమికావాలి అచ్చమ్మత్తా. ఆటితోటి కుండెడుకూడు యెగరగొట్టెయ్యొచ్చు"

పండుగ మూడు దినాలు వుందనగా సంతోషం వచ్చింది. వచ్చిన రోజునే ఆమె యిల్లు, వాకిలి అన్నీ అలికి శుభ్రం చేసింది. ఆమె ఇంట్లోకి, బయటికి తిరుగుతూ ఉంటే మేరీ తిరుగుతూన్నట్టుగానే భావించాడు ఏసుదాసు. సంతోషం రూపురేఖలలో చాలవరకు మేరీ పోలికలు ఉన్నాయి. ఆమె హయ్యరు గ్రేడు పరీక్ష అయి ఆరు సంవత్సరాలుగా ఉద్యోగం చేస్తూంది. భర్త పట్టణంలో ఫాస్టరు. అతని దగ్గరగా ఉండాలనే అభిప్రాయంతో ఆమె అక్కడి ప్రాథమిక పాఠశాలలో ఉద్యోగం వేయించుకుంది. కాని అభిప్రాయ భేదాలతో వారి సంసారం అంతంతమాత్రంగా కొంతకాలం యీడ్చింది. ఆ తరువాత అదీ సాగలేదు. ఎవరికి వారే అయ్యారు.

సంతోషం వచ్చిన మరుసటి ఉదయం బిందె పుచ్చుకుని బావికిపోతే అక్కడ అందరూ ఆమెచుట్టూ చేరారు.

లచ్చి ముందుగా పలుకరించింది.

"యెప్పుడు వచ్చావు సంతోషం. కులాసాగా ఉన్నావా!"

"ఆ, కులాసాగానే ఉన్నాను. అక్కా"

"ఈ వూరు మార్పించుకున్నావా!"

"ఇంకా లేదు అక్కా"

"మరి మార్పించుకుంటే బాగుండేదిగా! అన్నయ్యకు కాస్త తోడుగా ఉండేదానివి"

"అవును అక్కా! నేనూ అదే చూస్తున్నాను. యేదీ, మేరీ పోయినప్పుడు సెలవు పెట్టాను. ఇప్పుడు మళ్ళీ ఆ సెలవు

యింకో నెల పొడిగించాను. యీ లోపున ట్రాన్స్ఫరు కొరకు ప్రయత్నించాలి"

నీలం కళ్ళు ఆర్పకుండా చూచింది సంతోషం వైపు.

సుందరమ్మ ప్రశ్నించింది "ఏమిటి నీలం! అంత పరీక్షగా చూస్తున్నావు సంతోషం వైపు"

"సంతోషాన్ని చూస్తుంటే సరిగ్గా మేరీని చూచినట్టుగానే ఉంది వదెనా"

"అవును నీలం! మేనత్త పోలికలు మేనకోడలిలో ఉండటం సహజమేగా" అంది సుందరమ్మ.

లచ్చి నీళ్ళ బిందె యెత్తుకుని బయలుదేరింది. సంతోషం ఆమెను ఆపి "అక్కా! నీ పని అయ్యాక మా యింటికి ఒకసారి రా అక్కా!" అంది.

"వస్తాను సంతోషం" అంటూ లచ్చి సాగిపోయింది నీలం వెంటనే ప్రశ్నించింది. "సంతోషం వదెనా! మీ అక్కను వంటరిగా ఆహ్వానించడం చూస్తే ఆమెకోసం ఏదో దాచిపెట్టినట్టున్నావే!"

"అవును నీలం, మా అక్కతోపాటు నీవూ వస్తే ఆ దాచిందేదో నీకూ కాస్త పెడతాను. మరి వస్తావా నీవు కూడా!"

"అబ్బో! నాకేమీ వద్దులే. అయినా మీ అక్కా చెల్లెళ్లు యిద్దరూ తినగా అక్కడ యింకా మిగులుతుంది గనకనా !" యిద్దరూ కలసి నవ్వుకున్నారు.

లచ్చి సంతోషంకంటె వయస్సులో ఒకటి, రెండు సంవత్సరాలు పెద్ద. నాలుగవ తరగతి వరకు యిద్దరూ కలసి

చదువుకున్నారు. తరువాత లచ్చి చదువుకి స్వస్తి చెప్పింది. అయినా యిద్దరు జంట కవులవలె అంటుకు తిరిగేవారు.

లచ్చి వచ్చేసరికి ఏసుదాసు ఇంటిముందు వసారాలో మంచంమీద నిద్రలోవున్నట్టు అవుపించాడు. ఆమె లోపలికి నడిచింది. సంతోషం కంచం ముందుపెట్టుకుని కూచుంది. లచ్చినిచూచి "రా అక్కా" అంటూ ఆమె లేచి నిలబడింది.

"అదేమిటి సంతోషం! లేస్తున్నావెందుకు! భోజనం అయిందా!"

"ఆ, అయిపోయింది అక్కా! కంచం కడిగి అక్కడ పడేసి వస్తా" అంటూ ఆమె రెండో గుమ్మంలోనుండి బయటికి నడిచింది.

లచ్చి ఇల్లుఅంతా పరీక్షగా చూచింది. ఇంటికి రెండు వైపులా వసారాలు ఉన్నాయి. మధ్యభాగంలో ఒక గది ఉంది. గది వెలుపలి గోడలకు రెండు ఫోటోలు తగిలించి ఉన్నాయి. ఒకటి మేరీది. రెండోది మేరీ సెకండరీగ్రేడు పరీక్షకు చదువుతూండగా విద్యార్థినులందరు కలసి తీయించుకున్నది. లచ్చి మేరీ ఫోటో ముందు నిలబడి పరీక్షగాచూస్తూ "అయ్యో తల్లీ! పాడు క్షయరోగం నిన్ను దూరం చేసిందా! నిండా పద్ధెనిమిదేళ్ళు లేవు. యెంతలో మాయమైపోయావు" అనుకుంది.

సంతోషం చాప తెచ్చి పరచింది. ఇద్దరూ దానిమీద కూచుని కబుర్లలో దిగారు.

"సంతోషం! యిక్కడ ఉండిపోతావా యిక!"

"అవును అక్కా! ఉండిపోవాలనే ఉంది"

"మరి నీ భర్త?"

"ఆ విషయం నీకు తెలియదా అక్కా!"

"వివరాలు తెలియవు సంతోషం"

సంతోషం చెప్పుకుపోయింది "అక్కా! మావివాహం అయిన మొదటి సంవత్సరం మాత్రం మా సంసారం సాఫీగా గడచింది. ఆ తరువాత ఆయన ఒక నర్సుతో స్నేహంగా తిరగడం సాగించారు. ఆమె అప్పుడప్పుడు మా ఇంటికికూడా వస్తుండేది. వారిని గురించి నాకు లోపల అనుమానాలు వున్నప్పటికీ పైకి మాత్రం వారితో మామూలు ధోరణిలో మాట్లాడేదాన్ని–

–మా వదెన (మేరీ తల్లి) పోయినప్పుడు నేను ఈవూరు వచ్చి నాలుగు రోజులు వుండి వెళ్లాను. నేను వెళ్ళేప్పటికి వాళ్ళు ఇంట్లో వున్నారు. నాలుగు దినాలనుండి వాళ్ళు అక్కడే ఉంటున్నట్లు ఇరుగుపొరుగు చెప్పగా విన్నాను. నేను వాళ్ళను పలుకరించ లేదు. ఆయనగారు అడిగిన ప్రశ్నలకు క్లుప్తంగా సమాధానాలు చెప్పాను. నర్సు ఆ సాయంకాలం వెళ్ళిపోయింది–

–ఆ తరువాత కొన్ని రోజులవరకు ఆమె మా యింటి వైపు రాలేదు. కాని పొరుగువారు చెప్పగా విన్నాను. స్కూలుకు పోయిన తరువాత మా ఆయన ఆమెను వెంట పెట్టుకు వచ్చి నేను తిరిగి వచ్చే సమయానికి వెళ్ళి పోతూన్నారట. నేను భరించలేకపోయాను. బయటపడి అడిగాను. కానీ ప్రయోజనం నా వళ్ళంతా నజ్జు, నజ్జు చేశాడు. ఆ స్థితిలో నేను అనుకోకుండా ట్రాన్సుఫరు వచ్చింది. బహుశా ఆ

ట్రాన్సుఫరుకూడా ఆయనే చేయించి వుంటాడని నేను అనుకున్నాను. అది జరిగి రెండు సంవత్సరాలైంది. అ తరువాత మళ్ళీ మేము కలుసుకోలేదు అక్కా !"

లచ్చి జాలిగా ఆమెవైపు చూచింది. "యీ విధంగా యెంతకాలం వుంటారు? విడాకులు యిచ్చుకుంటే తీరిపోనుగా" అంది ఆమె.

"యేమో, అక్కా ! అ మాట అంటేనే నాకు భయంగా వుంది. భర్తను విడిచిపెట్టింది అంటారుగా!"

"మరొకదాని పెట్టుకుని అతను కులుకుతూంటే వాడిని నీ భర్త అనుకుని నీవు సంతృప్తి పడటంకంటె తెలివితక్కువ ఇంకొకటి లేదు. ముందు విడాకులు యిప్పించమని నోటీసు చెయ్యి. ఆ తరువాత యేమి జరుగుతుందో చూడాం" అంది లచ్చి.

సంతోషం యేమీ సమాధానం చెప్పలేదు. లచ్చి కొంచెం సేపు ఏసుదాసుతో మాట్లాడి వెళ్ళిపోయింది.

పల్లెలో గొంతెమ్మను నిలబెట్టారు. దీపాలు పెట్టిన తరువాత ఆడవాళ్ళు పదిమంది పోగై పాటలు పాడారు.

ఆదెమ్మ, కోటమ్మ, పదం అందుకుంటే మిగిలినవాళ్ళు అదే తిరిగి పాడారు.

పాండవులు, పాండవులు, తుమ్మెదా!
పంచపాండవులే తుమ్మెదా!
పంచపాండవులే తుమ్మెదా!

తూరుపున మబ్బుపట్టె బద్రుడా
స్వాతి వానలు కురవగా, స్వాతి వానలు కురవగా
దక్షిణాన మబ్బుపట్టె బద్రుడా
దాక్షి వానలు కురవగా, దాక్షి వానలు కురవగా

... ...

"ఒలేయ్ పున్నప్పా! నువ్వు ఇంకోపదం అందుకోయే" చిన్నమ్మ సూచించింది.

"ఒసే అమ్మాయిలూ! పదాల కేమొచ్చెగాని రేపు ఊళ్ళోకి పోయివద్దాం బయలు దేరతారంట్రా?" అంది మంగమ్మ.

"ఆఁ, ఆఁ" అన్నారు నలుగురూ.

"ఆఁ ఆఁ అంటే యీలుపడదు. ఆ బయలుదేరే అమ్మలక్కలపేర్లు చెప్పండి ముందు" అంది మంగమ్మ మళ్ళీ.

ఆదెమ్మ చెప్పింది "ఒలే మంగప్పా! మా ఇంటో నేనూ, మా కోడలూ, మా కమల ముగ్గురం బయలు దేరతాం."

"కొండపల్లోళ్ళ ఇంటోనో?" మంగమ్మ అడిగింది.

చంద్రమ్మ, ఆమెకూతురు శశిరేఖ, చంద్రమ్మ తోటికోడలు పున్నమ్మా మొత్తం యిరవయి పేర్ల వరకూ చెప్పారు.

"మరి సీలం రాదంటే మంగప్పా" అందులో ఒకరు అడిగారు.

"ఓలమ్మో, సీలం వస్సద్దీ! ఆ సుందరమ్మ బేదెల్లి తేసేగని ఆ సీలం కదలదు." ఇంకొకరి సమాధానం.

"సరే! యిట్టమయినాళ్ళు వత్తారు, లేనోళ్ళు మానుకుంటారు. కాత్త పెందలాడే లేచి కూళ్లొండుకోండి. మళ్ళీ మీరు సింగారించుకొనేతలికి మిట్టమద్దేన్నం అవుతుంది" అంది మంగమ్మ. తరువాత యెవరియిళ్ళకు వారు బయలుదేరిపోయారు.

మరుసటి ఉదయం బావిదగ్గర నీలం సంతోషంతో అంది. "వదెనా! ఈ రోజు గొంతెమ్మ ఊళ్ళోకి పోతుంది. మనంకూడా పోదాం వస్తావా!"

"నేనా!" అంది సంతోషం.

"యేం! నీవు రాగూడదా?"

"లచ్చిఅక్కాయి వస్తోందా?"

"అబ్బో! ఆ లచ్చి అక్కాయి వస్తుందా! ఆవిడ కమ్యూనిస్టు నాయకురాలుగా"

సంతోషం నీరసంగా నవ్వింది. "అయితే నీలం, నేనూ కమ్యూనిస్టునే."

"ఓలమ్మో! పల్లెలో సగంమంది కమ్యూనిస్టులు, మిగిలినవాళ్ళు మతస్థులు. ఇక గొంతెమ్మ ఎవరికి కాబట్టింది?" నీలం సందేహం వెల్లడించింది.

"గొంతెమ్మ పేరు చెప్పుకుని ఊరివెంటపడి అడుక్కోడం మంచిదంటావా నీలం?" సంతోషం ప్రశ్నించింది.

"నాకెందుకు వదినా అదంతా? మీరు రాకపోతే నేనూ పోను"

"మనం పోకుండా వుండటమే కాదు నీలం, మిగిలిన వాళ్ళుకూడా పోకుండా చూడాలి."

"అబ్బో ! అదంతా లచ్చివదెనపని. నీవూ, నేనూ యేషిూ చూడనవసరంలేదు." అంది నీలం.

మరునాటి ఉదయం కోటమ్మ ఇల్లు, ఇల్లూ తిరి గినలు గురికీ చెప్పిపోయింది. "అమ్మల్లారా ! వూళ్ళోకి వచ్చే వాళ్ళే వళ్ళో తొందరగా పనులు తెముల్చుకుని, సింగారించుకుని బయలుదేరండమ్మా ! మళ్ళీ ఆలస్యమైతే యెండలో పడతాం. అసలే చిత్తఉబ్బ. బిరాన కానియ్యండి తల్లుల్లారా !" అంది.

గొంతెమ్మదగ్గర పదిమంది పోగయ్యారు. లచ్చి కూడా ప్రత్యక్షమైంది.

"ఒలే లచ్చీ ! నువ్వూకూడా వత్తన్నావా యేంటే ?" మంగమ్మ ప్రశ్నించింది.

"లేదు అత్తా ! నేను రావటం లేదుగాని మీారు యిప్పుడు యెక్కడికి బయలుదేరుతున్నారు ?"

"ఊళ్లోకి పోయి వద్దామనుకుంటండామే లచ్చీ !"

"కిందటేడు ఊళ్లోకి పోవద్దనుకున్నాముగా అత్తా ! మీారు అంతా అది మరచిపోయూరా !"

కోటమ్మ కల్పించుకుంది. "మరిచిపోలా, గిరిచిపోలా! వూరంతా తిరిగితే పదికుంచాలు గింజలు దొరుకుతయి, పండగ చేసుకుందామని ఆశపడ్డాం."

"అడుక్కు వచ్చి పండగ జేసుకోవటం మంచిదేనంటావా? కోటమ్మ పిన్నీ!"

"ఓలమ్మో, ఇందులో, అడుక్కోటం యెక్కడ కని పెటావేనువ్వు? గొంతెమ్మ వాకిట్లోకిపోతే తలా కాసిని

వడ్లు పెడతారు. ఇది అడుక్కోటం యెట్లావుతుంది. ఊళ్ళో దేముడు ఊరేగింపు బేదెల్తితే యింటింటికి ఆగితిపట్టి, బియ్యమూ, పళ్ళూ యివ్వటంలేదూ! అట్టాగే మన గొంతెమ్మకీనీ" అంది కోటమ్మ.

"పిన్నీ! వూళ్ళోవాళ్ళ దేముడు మన పల్లెకి రావటం లేదుగా. మనగొంతెమ్మమాత్రం ఎందుకు వూళ్ళోకి పోవాలి? నువ్వే బాగా ఆలోచించి చెప్పు!" అంది లచ్చి.

"ఓలమ్మో! గుళ్ళో దేముడు పల్లెకు రావటం యే నాడన్నా విన్నామా!" అంటూ చెంపలు రెండూ వాయించుకుంది కోటమ్మ. చుట్టూ వున్నవారంతా పకపక లాడారు.

లచ్చి మళ్ళీ అందుకుంది. "ఇదిగో అమ్మల్లారా! నేను ఒకమాట చెపుతాను వింటారా?" అంటూ ఆమె అందరి ముఖాలలోకి చూచింది. అంతా తలలు ఆడించారు. కోటమ్మ చిరచిరలాడింది. "ఓలమ్మ! పానకంలో పుడకల్లే నువ్వెందుకు వచ్చావే" అంటూ గొణుక్కుంది ఆమె. మంగమ్మ మూతి ముడిచింది.

లచ్చి చెప్పుకుపోయింది. "అమ్మల్లారా! గొంతెమ్మ పేరుచెప్పుకొని ఊళ్ళోకిపోయి యిల్లిల్లు తిరిగి అడుక్కోవటం మంచిదికాదు. వాకిట్లోకివచ్చిన బిచ్చగాళ్ళకు యిన్నిగింజలు దులిపినట్టుగానే వూళ్ళోవారు మనమొహాన మరి కాసినిగింజలు దులిపితే దులపవచ్చు. ఆ కాసినిగింజలు మనకేదో మెహర్బానీ యిచ్చినట్టు చూస్తారు. అంతేకాని మన గొంతెమ్మకు యిస్తున్నట్టు యెవ్వరూ అనుకోరు.

మనం కూలీ నాలీ చేసుకునే వాళ్ళమైనా గౌరవం గానే బ్రతకాలి. అంతేగాని అభిమానాన్ని చంపుకొని అడుక్కోడానికి పోవద్దు. మీకు వేడుక చేసుకోవాలనివుంటే మనకు వున్నదానిలోనే తలా కాస్త వేసి మన ఓపికకొద్దీ వేడుకచేసుకుందాం. అంతేగాని అడుక్కునైనా ఆరగించాలనుకోవటం కష్టజీవులపద్ధతిగాదు. మీరు కావాలంటే మరో రోజు కష్టంచేసి ఆ వచ్చిన డబ్బులతో సరదాగా మన గొంతెమ్మను సాగనంపుకుందాం. అడుక్కోవటం మన అందరికీ అవమానకరం. బాగా ఆలోచించుకోండి తల్లుల్లారా!'' అంది లచ్చి.

ఒకరి మొహంలోకి ఒకరు చూచుకున్నారు. చిన్నమ్మ గబగబాపోయి క్రొత్తచీరె మార్చి పాతచీర కట్టుకువచ్చింది. ఆమెనుచూచి పున్నమ్మ లేచి ఇంటిలోపలికి వెళ్ళింది. ఒకొక్కరుగా అంతా జారుకున్నారు. కోటమ్మ ధుమ ధుమలాడింది. మంగమ్మ వుసూరుమంటూ నిలబడింది. బట్టలు మార్చుకుని ఒకొక్కరు మళ్ళీ వచ్చారు.

''ఒలే మంగప్పా! పదం అందుకోయా'' అన్నారు అందులో ఒకరు.

''పదమా, సింగినాదమా'' మంగమ్మ కోపంగా విదిలించింది. లచ్చి చిన్నగా నవ్వుకుంది. ''ఇదిగో మంగమ్మ అత్తా! నీకు అంతకోపం యెందుకు? నీ గొంతెమ్మ వేడుకలకు కావలసిన మొత్తం నేను పోగుచేసి పెడితేనేసరి అను'' అంది ఆమె. ఆ తరువాత లచ్చి ఒక లిస్టు పుచ్చుకుని తను ముందుగా రెండురూపాయిలు వేసింది.

సంతోషం రెండురూపాయిలు అంది. "మీతో పాటే నేనూను" అంది సుందరమ్మ. మొత్తం పధ్నాలుగు రూపాయిలు, పదిహేను కుంచాల ధాన్యం పోగయ్యాయి. మంగమ్మ సంతోషంతో పదం అందుకుంది.

దీవించు గొంతెమ్మ దీవించ వమ్మా.
కోటివేల కొడుకుల్ని కలగ దీవించు.
బంగారు పంటలే పండ దీవించు.

ప్రకరణం 9

సీతమ్మగారు తీర్థయాత్రలకుపోయి నాలుగుమాసాలకుపైగా అయింది. ఆమె కరణంగారికి అప్పుడప్పుడు జాబులు వ్రాస్తూ వుండేది. కరణంగారు ఆ జాబులు చదివి పదిలంగా తన బీరువాలో భద్రపరుస్తున్నారు. సీతమ్మగారు తనతండ్రిపేర జాబులు రాస్తుందనే విషయం సుశీలకు తెలుసు. కాని వాటిలోని విషయాలు తెలుసుకునేందుకు ఆమె యేనాడూ ప్రయత్నించలేదు.

సీతమ్మగారు వ్రాసిన ప్రతిజాబులోను సుశీల యోగక్షేమాలను గురించి అడుగుతూంది. తన ఆశీస్సులను ఆమెకు అందజెయ్యమని కోరుతూంది. కాని సుశీలమాత్రం యేనాడూ సీతమ్మపేరు తలచిన పాపానపోలేదు. చివరికి సీతమ్మగారి యోగక్షేమాలను గురించిగూడా సుశీల తండ్రిని అడగలేదు.

"అబ్బ! సుశీలది యెంత కఠినహృదయం!" అనుకున్నారు, కరణంగారు.

ఒకరోజున సీతమ్మగారి దగ్గరనుండి వచ్చిన జాబు చదివి కరణంగారు ఆ జాబు సుశీలకు యిస్తూ అన్నాడు. "అమ్మా! సుశీలా! సీతమ్మగారు రెండు సంవత్సరాలకాలం మనతో గడిపింది. అంతేకాదు. మన కుటుంబంలోవ్యక్తిగా కలసి మెలసిపోయింది. ఆమెలో లోపాలు వుండవచ్చు. తెలిసో తెలియకో ప్రతివారూ అప్పుడప్పుడు చిన్నవిగాని, పెద్దవిగాని పొరపాట్లు చేయటం కద్దు. అట్టివారిని సరిదిద్దటం

విజ్ఞులవంతు. అంతేగాని వాళ్ళను ధూర్తులనీ, దుష్టులనీ మనం ఖండించడం సరిగాదుతల్లీ! సీతమ్మగారికి నీపట్ల సదభిప్రాయమేవుంది. నీవుకూడా ఆమెను క్షమించు అమ్మా! ఈ జాబు చదివితే తానుచేసిన పొరపాటుకు ఆమె యెంతగా పశ్చాత్తాపపడుతూందో నీవే తెలుసుకుంటావు." అనిచెప్పి కరణంగారు సుశీల సమాధానంకొరకు చూడకుండా బయటకి నడిచారు. పదినిముషాల తరువాత ఆమెలేచి తనగదిలోకి పోయి పట్టెమంచంమీద పడుకుని జాబుతీసి చదివింది.

రమణాశ్రమం.

కరణంగారికి సీతమ్మ అనేక నమస్కారములు చేసి వ్రాయునదేమనగా! మీరూ, మీ బిడ్డ సుశీలా క్షేమమేనని తలుస్తాను. ఉత్తర దేశయాత్రలు పూర్తిచేసుకుని యిటీవలనే యిక్కడకు వచ్చాను. నాఆరోగ్యం పూర్తిగా చెడిపోయింది. ఏకభుక్తాలతో, వుపవాసాలతో నా శరీరమంతా శుష్కించి పోయింది. ఇటీవల దగ్గుకూడా ప్రారంభ మయింది. నిన్న డాక్టరు పరీక్షచేసి ఆశ్రమానికి దూరంగావుండి ప్రకృతి చికిత్స చేయించుకోవలసి వుంటుందని తెలియజేశారు. అంతేకాదు "మీ ఆప్తులెవరైనా వుంటేవారికి తెలియజేసుకోండి" అని కూడా చెప్పారు. ఆమాట విన్నప్పుడు నాహృదయం చక్కలైనట్టు అనిపించింది. భరింపరాని ఆవేదనచెందాను. దుఃఖం పొర్లివచ్చింది. అయినా అదంతా దిగమింగి 'నాకు ఆప్తులంటూ యెవ్వరూ లేరుబాబూ,' అని మొండిసమాధానం చెప్పాను. మీరూ, సుశీలా నాహృదయంలో మెదిలారు.

మీ ఇరువురినీ ఈ క్షణంవరకు నా ఆత్మీయులుగానే భావిస్తున్నాను.

"కరణంగారూ! చేజేతులా నాబిడ్డను నేను దూరం చేసుకున్నాను! ఆనాడు నేనుచేసిన పొరపాట్లకు యీనాడు నాహృదయం యెంతగా ఘోషిస్తూందో నేను యెవరికి చెప్పుకోగలను! నాపాపాలకు ప్రాయశ్చిత్తము అంటూ వుండదు కరణంగారూ! నేను ఎక్కడికిపోయినా శకుంతల ప్రేతం నన్ను వెంటాడుతూనేవుంది. నాకిక జీవించాలనే ఆశ యేమాత్రమూ లేదు. ఆట్టేకాలం జీవించనుకూడా. కాని, నాజీవితం చాలించేముందు ఒక్కసారి మీ దర్శనం చేసుకోవాలనివుంది. నా యీ కడసారికోరిక తీరుస్తారని ఆశిస్తున్నా."

సెలవు,

సీతమ్మ.

..జాబు చదువుతూన్నంత సేపూ సుశీలకళ్ళమ్మట నీళ్ళు ప్రవహించాయి. ఆమె దుఃఖం ఆపుకోలేక పోయింది. చనిపోయిన తల్లిని తలచుకొని "అమ్మా! నువ్వు యెక్కడ వున్నావు అమ్మా!" అంటూ దిండులో తలదూర్చి రోదించింది.

కరణంగారు తలుపుతోసుకుని లోపల ప్రవేశించారు. సుశీల చంగున మంచం మీదనుండి గెంతి "నాన్నగారూ! నన్ను క్షమించరూ!" అంటూ ఆయన చేతులలో వాలింది.

ఆయన బిడ్డను ఓదారుస్తూ "ఊరుకోతల్లీ! అన్నారు. తరువాత ఆయన పక్కకు తిరిగి కళ్ళు తుడుచుకున్నారు.

నాలుగు నిమిషాల తరువాత సుశీల తేరుకుని "నాన్న గారూ! మన జీవితాలు యింతదుర్భరంగా నెందుకు తయారయ్యాయి. మనం చేసిననేరమేమిటో! ఎందుకు మన కీ శిక్ష ?" అంది సుశీల.

"విచారపడకుతల్లీ! యీ చిక్కునుండి బయటపడడానికి మార్గం ఆలోచిద్దాంతల్లీ" అన్నారు ఆయన.

కరణంగారు వెంటనే బయలుదేరి పట్టణంపోస్టాఫీసుకు పోయి అయిదువందల రూపాయిలు టెలిగ్రాం మనియార్డరు ద్వారా ఆ శమానికి పంపించారు. సీతమ్మగారికి అవసరమైన చికిత్స చేయించవలసిందనీ తను బయలుదేరి వస్తున్నాననీ ఆ టెలిగ్రాములో తెలియజేశారు.

ఆరాత్రి కరణంగారు రైలులో ప్రయాణంచేస్తూ "సీతమ్మ యేమయ్యిందో! నేను అక్కడకు పోయేసరికి అన్నీ అయిపోతయ్యేమో!" అనుకున్నారు ఆయన. ఆమరుసటిరోజు ఆశ్రమంలో సీతమ్మను కలుసుకున్నప్పుడు "ఇప్పట్లో ప్రమాద మేమీవుండదు." అనుకున్నారు.

సీతమ్మ తను ఆశ్రమంలో వుండలేక పోతున్నాననీ, మరోచోట యెక్కడనైనా చికిత్స చేయించ వలసిందనీ కరణంగారితో చెప్పి గోలగా యేడ్చింది. కరణంగారు ఆమెను శానిటోరియంలో చేర్పించి అప్పుడప్పుడూవచ్చి చూచిపో తుంటానని మాట యిచ్చారు. సీతమ్మ సంతృప్తి చెందింది.

కరణంగారు ఇల్లు చేరినతరువాత సీతమ్మగారిని గురించిన వివరాలు ఆయన సుశీలకు తెలియజేశారు. సీతమ్మకు వాటిల్లిన దురవస్థలకు సుశీల విచారించింది. "నాన్నగారూ,

అమెను ఇక్కడికే తీసుకువచ్చి వుంటే మన ఇంట్లోనే వుంచి చికిత్స చేయించే వాళ్ళముగా!" అంది.

"ఆమెవున్న స్థితినిబట్టి ఆమెను ఇంట్లో పెట్టుకోవడం యేమంత మంచిదికాదమ్మా" అన్నారు ఆయన.

"ఆమె జీవించే ఆశ యేమైనా వుందంటారా? నాన్నగారూ!"

"డాక్టర్లు యేమీ చెప్పలేక పోతున్నారమ్మా! కొంత కాలం అలానే యీడుస్తుందనే అభిప్రాయం వెల్లడించారు."

"అయితే యీసారి మీరు వెళ్ళేప్పుడు నేనుకూడా వస్తాను నాన్నగారూ!"

"అలాగే పోయివద్దాంతల్లీ" అన్నారు కరణంగారు.

కొద్ది దినాలు గడిచాయి. ఒకరోజున కరణంగారు చదువులు, పరీక్షలను గురించి సరదాగా మాట్లాడుతూన్న సమయంలో సుశీల అంది "నాన్నగారూ! నేనుయీసంవత్సరం మెట్రిక్ పరీక్షకు కట్టాలనివుంది."

ఆయన చిన్నగా నవ్వారు. "అలాంటి అభిప్రాయం వున్నదానివి యింతకాలం యెందుకు వేచి వున్నావమ్మా?" అన్నాడు ఆయన.

"నాకు ఆ అభిప్రాయం కలిగింది ఇటీవలే నాన్న గారూ!"

"అయితే చదువమ్మా! రేపు యెవరితోనైనా చెప్పి పుస్తకాలు తెప్పిస్తాను."

ముందు దరఖాస్తు ఫారాలు తెప్పించండినాన్నగారూ"

"మరి ట్యూషను ఏర్పాటు చేసుకోవడం మంచిదేమో!"

"మనవూళ్ళో యెవరున్నారు నాన్నగారూ!"

"క్రిష్ణారావునువచ్చి రోజూ రెండుగంటలు చెప్పిపొమ్మనమని అడుగుతాను."

"క్రిష్ణారావునా ?" సుశీల ఆశ్చర్యం వెల్లడించింది.

"అవునమ్మా, క్రిష్ణారావునే! అతను చాలా యోగ్యుడు. అలాటి గుణవంతుడు ఈ తరంవాళ్ళలో లేరనే చెప్పగలను." అన్నారు కరణంగారు.

సుశీల మరి మాట్లాడలేదు.

మరునాటి ఉదయం కరణంగారు స్వయంగా క్రిష్ణారావు గారింటికి వెళ్ళారు. క్రిష్ణారావుగారిది రెండుఅంతస్తుల మేడ. ఆసమయానికి క్రిష్ణారావు ముందు వరండాలో గడ్డం చేసుకుంటున్నాడు. కరణంగారు రావటంచూచి అతను హడావుడిగా లోపలికిపోయి కుర్చీ తెచ్చివేశాడు.

"మీఇంటిదగ్గర నాకు మర్యాద యెందుకులేవయ్యా" అంటూ కరణంగారు క్రిష్ణారావుతో పాటు చాపమీద కూర్చున్నారు.

క్రిష్ణారావు లోపలికి వినిపించేటట్టు కేకపెట్టాడు.

"అమ్మా! మనకరణంగారువచ్చారు, ఒకగ్లాసుకాఫీ పంపించు" అన్నాడు.

వెంకాయమ్మ తలుపుచాటున నిలబడి "యేసుండీ బాబూ! క్షేమమేనా?" అంటూ కుశలప్రశ్నలు వేసింది.

"ఆ, క్షేమమే వెంకాయమ్మ అక్కా !"

"అమ్మాయిగారు కులాసాగా వున్నారా!"

"ఆ, కులాసాగానేవుంది"

క్రిష్ణారావుతండ్రి గోపయ్య లోపలినుండి వస్తూ "ఓరే, అమ్మా! కరణంగారిని కిందకూచోబెట్టావేమిటిరా!" అన్నాడు.

"లేదు నాన్నా! వారురాగానే కుర్చీ తెచ్చివేశాను. మనఇంట్లో వారికి మర్యాద అక్కరలేదట"

"అయ్యో, యెంతమాటా! కరణంగారు! యెన్న డైనా మన ఇంటికి వస్తారా, పెడతారా!" అన్నాడు గోపయ్యగారు.

క్రిష్ణారావు తమ్ముడు సుధీర్ గ్లాసుతో కాఫీ తెచ్చి కరణంగారి ముందుపెట్టాడు. కరణంగారు కాఫీచప్పరిస్తూ అన్నారు" క్రిష్ణారావ్! నీవు త్వరగా తెముల్చు. నీతో మాట్లాడిపోదామని వచ్చాను.

"మాట్లాడేందుకు యిప్పుడు అభ్యంతరమేమి వుందండీ! మాట్లాడవచ్చుగా!"

అబ్బే! యిక్కడవద్దు. అలా బయిటికి పోదాం."

క్రిష్ణారావు గెడ్డం చేసుకోవడం పూర్తిచేసి చొక్కా వేసుకుని బయలుదేరాడు.

"అలామాయింటిదాకా పోయివద్దాము రా" అన్నారు కరణంగారు.

కరణంగారి వరండాలో కుర్చీలో కూర్చుని యిద్దరూ సంభాషణలోకి దిగారు.

"క్రిష్ణారావ్ ! నీకోసం నేను పనికట్టుకుని వచ్చాను. యెందుకో తెలుసునా ?"

"తమరు చెప్పనిదే నాకెలా తెలుస్తుందండీ ?"

"మాఅమ్మాయి మెట్రిక్ పరీక్షకు కడతానంటూంది"

"మంచిదండీ!"

"మంచిదని నీవుఅంటే ప్రయోజనంలేదు. ఆమెకు పాఠాలు చెప్పే బాధ్యత నీవుతీసుకోవాలి"

క్రిష్ణారావు కరణంగారివైపు ఆశ్చర్యంగా చూచాడు. రెండునిముషాలు మౌనంగా గడిచాయి. "నేను బి. ఎ. పరీక్షకు కట్టాను కరణంగారూ"

కరణంగారు చిన్నగా నవ్వారు. "నీబండి మళ్ళీగాడి మీదికి వచ్చిందన్నమాట!"

"ఇంతకాలం నేను గాడి తప్పాననేనా మీ అభిప్రాయం?"

"అయ్యో, క్రిష్ణారావు బాబూ, యెంతమాట! నా బోటివాళ్ళకు నీతులు బోధించగల సమర్థుడివి. నిన్ను అంత మాట అంటాననేనా ?"

క్రిష్ణారావు పేలవంగా నవ్వాడు. "మీరుపెద్దలు. నన్నుమందలించే అధికారం మీకువుంది."

"అది సరేగాని ప్రస్తుతం అమ్మాయికి పాఠాలు చెప్పటం సాధ్యపడదంటావా ?"

"ఆలోచిద్దాంలెండి"

"ఆలోచిద్దామంటే అదిమళ్ళీ చాలాదూరంపోతుంది"

"పోనియ్యనులెండి. మా చిన్నమ్మాయి ప్రమీల కూడా మెట్రిక్ చదువుతూంది. ఇద్దరికీకలిపి మీ ఇంటిదగ్గరే చెపుతాను"

కరణంగారి సంతోషానికి మేరలేదు. "భేష్, ఆమాట అన్నావు చాలాబాగుంది." అన్నారు ఆయన.

ఆ ఉత్సాహంలో ఆయన సుశీలను "అమ్మాయి, సుశీలా!" అని కేకపెట్టారు.

సుశీలవచ్చి గుమ్మంలో నిలబడి "యేమిటి నాన్న గారూ?" అంది.

"నీ చదువు బాధ్యత క్రిష్ణారావుగారికి అప్ప జెప్పానమ్మా"

సుశీలముఖం ఆనందంతో వికసించింది. "చాల సంతోషం" అంది ఆమె ఇరువురి ముఖాల్లోకి చూస్తూ.

కరణంగారు మళ్ళీ అందుకున్నారు. "క్రిష్ణారావు చెల్లెలుకూడా మెట్రిక్ పరీక్షకు చదువుతూందట. ఆ అమ్మాయి కూడా మనఇంటికే వస్తుంది నీతోసాటు చదువు కునేందుకు. వింటున్నావా అమ్మా!" అన్నారు కరణంగారు.

"యే చెల్లెలు? పుష్పావతేనా! నేనూ, పుష్పావతీ చిన్నతనంలో ఒకే తరగతి చదివాం."

"పుష్పావతి కాదండీ! మా చిన్నమ్మాయి ప్రమీల" అన్నాడు క్రిష్ణారావు.

కరణంగారు ఉత్సాహంతో లేచి నిలబడ్డారు. "అబ్బాయి క్రిష్ణారావు! యికనేను చెప్పవలసినదియేమీ

లేదు, నీ చెల్లెలితోపాటు మా సుశీలకు కూడా దరఖాస్తు ఫారాలు, పుస్తకాలు, చదువు వగైరాల బాధ్యతలన్నీ నీవే చూచుకోవాలి.”

క్రిష్ణారావు చిన్నగా నవ్వాడు “అలాగే కానీండి” అన్నాడు.

క్రిష్ణారావు ఇంటికి తిరిగివెళ్ళి తల్లికి ఆ కబురు అందజేశాడు. వెంకాయమ్మగారు సందేహం వెలిబుచ్చింది. “అయ్యో! యీడేరినపిల్ల వీధినపడి రోజూ కరణంగారింటికి పోవటం యేమి బాగుంటుందయ్యా!”

“అదేమిటమ్మా! మనచిన్నమ్మాయి కంటే పెద్దపిల్లలు కాలేజీలకుపోయి చదువుకోవటంలేదూ! అయినా కరణంగారి ఇంట్లో ఎవరున్నారు గనుక! వారిఅమ్మాయితోపాటు మనఅమ్మాయి కూడా రోజూ రెండుగంటలు అక్కడ చదువుకుంటుంద. కరణంగారు అడిగితే నేను కాదని అనలేక పోయానమ్మా!”

“పోనీలే నాయనా! అట్టాగే తీసుకెళ్ళు” అంది వెంకాయమ్మగారు.

కొద్ది దినాలు గడిచాయి. మునసబు పార్టీవారిలో గుసగుసలు బయలు దేరాయి.

“ఒరే! క్రిష్ణారావు కరణంఇల్లు పట్టేడురోయ్!”

“నెమ్మదిగా సుశీలను మంచిచేసుకుంటాడు.”

“వాడి పుణ్యాం పుచ్చింది.”

"పుణ్యం పుచ్చుట మేమిటిరా! కరణంకూతురిని పెండ్లి చేసుకుంటాడు."

"ఓరిబాబోయ్! ఆ డెభ్భయి, యెనభై యెకరాలూ కాజేస్తాడన్నమాటే!"

"ఒరే! ఆమధ్య మునసబు ఒక పుకారు లేపాడు మీకు తెలుసునంటరా!"

"యేమిటి ఆ పుకారు? యెవరిని గురించీ!"

"ఆ కరణం పాలేరు సుబ్బాయి లేడూ, వాడికొడుకుకి కరణం చదువు చెప్పిస్తున్నాడు. దానిమీద మునసబు కరణం కూతురిని సుబ్బాయి కొడుకుకు యిచ్చి పెళ్ళిచేస్తాడని పుకారు లేపాడు.

"ఒరేయి ఆకరణానికి యేమితక్కువరా! కావాలనుకుంటే ఇంగ్లండులోనో, అమెరికాలోనో చదివిన వాడికి తన కూతురుని యిచ్చి వివాహం చేయగలడు"

యీ మునసబుది అంతా గురివిందతంతు అన్నా!" నలుగురూ యేకమై నవ్వుకున్నారు.

♦ ♦ ♦ ♦

ఒకటి రెండు నెలలు గడిచాయి. క్రిష్ణారావు పరీక్షలకు శ్రద్ధగా చదువుకున్నాడు. సుశీలకు, చెల్లెలికి కోర్సు పూర్తి చేశాడు. అతను వ్యవసాయ పనులకు పోవడం మానుకున్నాడు. పార్టీకార్యక్రమాలకు తాత్కాలికంగా స్వస్తి చెప్పాడు.

క్రిష్ణారావు పెండ్లిసమస్య మళ్ళీ బయటికి వచ్చింది. యితరచోట్లనుండి రెండు, మూడు సంబంధాలు వచ్చాయి.

క్రిష్ణారావు అయిష్టతను వెల్లడించాడు. చిన్నమేనమామ కుమార్తెను చేసుకోవలసిందని బంధువులందరూపట్టుబట్టారు. కట్నం కానుకలక్రింద యిరవైవేలు యిస్తామని తెలియ జేశారు. కాని క్రిష్ణారావు తాను కొంతకాలంవరకు వివాహం చేసుకోనని చెప్పాడు. అయినా వారు వదలి పెట్టలేదు. పిల్ల తండ్రి నిష్కర్షగా అడిగాడు. "పోనీలేరా! నీయిష్టంవచ్చి నప్పుడే పెండ్లి చేసుకుందువుగాని. మాబేబీని నీవు చేసు కుంటానని మాటయిస్తే నీకోసం ఆగుతాంరా!"

"మీ బేరసారాలకు నేను తగిన వాడిని కాను మామయ్యా! ముందెప్పుడో వివాహం చేసుకుంటానని చెప్పి యిప్పుడే మీ అమ్మాయిని రిజర్వు చేయించుకొనేంతటి మూర్ఖుణ్ణి కాదు. మీరు వేరే సంబంధం చూసుకుని మీ అమ్మాయికి వివాహం త్వరలో చేసుకోవడం మంచిదని నా సలహా" అన్నాడు క్రిష్ణారావు.

"మేనమామకు కష్టంతోచింది." ఒరే క్రిష్ణా, మేనల్లుడువి, అయినవాడివిగదా అని పిల్లనిస్తామని అంటే యివేనా నీవు యిచ్చేసలహాలు!

"అదేమిటి మామయ్యా! నీకు అయినవాడు, మేన ల్లుడే కావాలనుకుంటే పిన్నిగారి అబ్బాయిలు వున్నారుగా! అందులో ఒకరికి మీ అమ్మాయిని యిచ్చి వివాహం చెయ్యవచ్చుకదా!" అన్నాడు క్రిష్ణారావు.

"ఒరేయ్! నీ సలహాలను తీసుకోడానికి నేను ఇక్కడకు రాలేదురా!"

"నేను ఆ మాట అనలేదుగా మామయ్యా!"

"సరే! యేదో ఒకటి తేల్చిచెప్పరా నాయనా!"

"చెబుతూనే వున్నానుగా మామయ్యా! నేను యిప్పట్లో వివాహం చేసుకోను"

మేనమామ కోపంతో లేచిపోయాడు.

క్రిష్ణారావు వివాహ విషయంలో వెంకాయమ్మగారు ఏమీ కల్పించుకో దలచుకోలేదు. అయిన వాళ్ళతో సంబంధం ఆమెకు అంతగా ఇష్టమూలేదు. రాత్రి క్రిష్ణారావు చదువుకుంటూన్న సమయంలో వాళ్ళ అమ్మమ్మ వెళ్ళి అతని పక్కనే వున్నకుర్చీ యెదురుగా లాగి దానిలో కూర్చుంది. క్రిష్ణారావు తల పైకియెత్తి ఆమెవైపుచూచి "యేమిటి అమ్మమ్మా యిలావచ్చావు?" అని అడిగాడు.

"ఊరికే వచ్చానురా అయ్యా! యేం నేను రా కూడదా?"

క్రిష్ణారావు పేలవంగా నవ్వాడు. నీవు రాకూడదని యెవరు అంటారు అమ్మమ్మా!

"అది సరేగాని నేను ఒకమాట చెపుతా వింటావా?"

"చెప్పు అమ్మమ్మా"

"చిన మామయ్య ఒట్టిపిచ్చాడురా అయ్యా"

"నీవూ పిచ్చిదానివేగ అమ్మమ్మా!"

"నేను పిచ్చిదానను గనుకనే యీ రోజువరకూ అటు కొడుకులతో, ఇటు కూతుళ్ళతో, మధ్యలో కోడళ్ళతో కూడా నానా మాటలు పడుతున్నానుఅయ్యా"

"సరేగాని అసలు విషయం ఏమిటో చెప్పుఅమ్మమ్మా"

"చిన్నమామయ్య ఈపూట అన్నం తినలేదురా!"

"యెందుకని అమ్మమ్మా!"

"యెందుకేముంది? వాడు పిల్లను యిస్తానంటూ మీ వాకిట్లోకి వస్తే నువ్వు, మీ అమ్మా కూడా వీలులేదు పొమ్మన్నారటగా!"

వెంకాయమ్మ అందుకుంది "ఒసే అమ్మా! నీ యేళ్ళు యెత్తుబారంగాను. ఆ పిచ్చివాగుడు వాగవద్దు అనే నేను చెప్పేది. నీకొడుకులు పాడినపాటే నువ్వూ పాడుకున్నావన్న మాట! అమ్మా, బాబూ చెప్పినమాట వింటే నాబిడ్డకు యే నాడో పెళ్ళిఅయ్యేది. యిప్పటిదాకా యెందుకు వుండేవాడు? నీతోను, నీకొడుకులతోను మాటలు యెందుకు పడేవాళ్ళం? నాబిడ్డ కమ్యూనిస్టు అనేగదా, ఆరోజున మీకు ఎవ్వరికీ పనికి రాకుండాపోయాడు? పైగా నీ పెద్దకొడుకు నాబిడ్డ కొర గానివాడనీ, యే మాలదాన్నో కట్టుకుంటాడని పిచ్చిపిచ్చిగా వాగిపోయాడు. అన్నీ అన్నవాడు మళ్ళీ యీరోజున యీ రాయబారాలు యెందుకూ? మీకు సిగ్గులేకపోతేమాకు సిగ్గూ అభిమానాలూ లేవనుకున్నావా!

"నువ్వు వూరుకోఅమ్మా! పాపం అమ్మమ్మ దగ్గర యెందుకూ ఆ సాధింపు?"

ముసలమ్మ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమె గొంతు గద్గదమయ్యింది ఆమె కొంగుతో కళ్ళు తుడుచుకుంటూ అంది. "చూడరా అయ్యా! నన్ను యెంత హీనంగా చూస్తున్నారో! పెద్దముండ ననే గౌరవం లేకపోగా ప్రతి వాళ్లూ నన్ను విదిలించేవాళ్ళే. వీళ్ళమాటలతో చీకిచీకి చస్తు న్నాననుకో! ఆ మాయిదారి దేవుడు నాకు ఆయువుకూడా

యెక్కువపోశాడు. మీ తాతతోపాటు నేనుకూడా పోయి వుంటే యీ నాడు యింత ఉదాసీనం పాలు అయ్యేదాన్ని కాదుగా!” అంటూ ఆమె పక్కకు తిరిగి చీదివేసింది.

క్రిష్టారావుకు జాలి వేసింది. “పోనీలే అమ్మమ్మా! నీ కొడుకులు, కూతుళ్ళు నిన్ను మాటలు అంటారని అనుకుంటే నాదగ్గర వుండిపో. నిన్ను యెవ్వరూ ఒక్క మాటకూడా అనకుండా చూస్తా” అన్నాడు అతను.

ముసలమ్మకు సంతోషం అయింది.

“అట్టాగేలే అయ్యా! నీదగ్గరేవుంటా. చినమామయ్య గారి బేబీని పెండ్లిచేసుకో” అంది.

క్రిష్ణారావు గట్టిగా నవ్వాడు. ముసలమ్మ చిన్నబుచ్చుకుంది. “నేను యేమి తప్పు మాట అన్నానురా అయ్యా, అట్టా నవ్వుతావు!”

“అమ్మమ్మా నేను ఒకమాట చెపుతాను వింటావా!”

“చెప్పు బాబూ!”

“నీకు నేను యెలాంటి మనుమడినో మన పిన్నిగారి అబ్బాయిలుకూడా అలాంటి మనుమలే. మీకు అయినవాళ్లు, మేనల్లుడే కావాలనుకుంటే మీ అమ్మాయిని పిన్నిగారి అబ్బాయిలలో ఒకరికిచ్చి యెందుకు చెయ్యరూ?”

“పిన్నిగారి అబ్బాయిలకు వీళ్ళు ఎందుకు చేస్తారు! చెయ్యరయ్యా! వాళ్ళకు ఆస్తి తక్కువ వుందిగా!”

“మరి మధ్యలో నీకు దేనికి తాపత్రయం!”

“ఆఁ ఆ పిల్లమోడుని చిన్నతనంనుండి పెంచి కూలబడ్డాగా! వుండలేక అడుగుదామని వచ్చా!”

"ఆ పిల్లను నీవు చిన్నతనంనుండీ పెంచానంటున్నావు గదా! పిన్నిగారి అబ్బాయిని చేసుకోమని పిల్లకు నచ్చచెప్ప లేవూ"

"నేను చెపితే వింటుందా అదీ! దాని అమ్మా, బాబూ పడనిస్తారా! ఎందుకువచ్చిన మాటలురా నాయనా!"

"అయితే అమ్మమ్మా! మీ అమ్మాయిని పిన్నిగారి అబ్బాయిలకు యివ్వడానికి మీకు అభ్యంతరం అయితే మీ పిల్లను చేసుకోడానికి నాకూ చాల అభ్యంతరా లున్నాయి. కాబట్టి నేను అసలు మీ పిల్లను చేసికోను" నిష్కర్షగా చెప్పాడు క్రిష్ణారావు.

ముసలమ్మ కుర్చీలో నుండి లేచింది. "మీ అమ్మా కొడుకులు పడనియ్యరని వాళ్ళు అననే అన్నారు. తెలివి తక్కువదాన్ని వుండలేక అడిగి పోదామని వచ్చా" అంది ముసలమ్మ.

వెంకాయమ్మ కల్పించుకుంది. "నీ వాగుడూ నువ్వూ ఊరుత్తరాన కలవా! నన్నుకూడా కలుపుతావెందుకే!"

"ముసలమ్మతో ఏమిటి పోనియ్యి అమ్మా" అన్నాడు క్రిష్ణారావు.

ముసలమ్మ పోవడానికి ఉద్యుక్తురా లయింది. "చీకటిగా వుంది అమ్మమ్మా! యీ పూటకు యిక్కడ ఉండిపోరాదూ!" అన్నాడు క్రిష్ణారావు.

"ఆ. వుండేట్టే చేశారు అమ్మా, కొడుకూ!" ముసలమ్మ నిష్టూరం వేసింది.

"నాబిడ్డ పెళ్ళి విషయంలో మా జోక్యం యేమీలేదే అని నీకు యెన్నిసార్లు చెప్పినా ఆ వాగుడుమాత్రం మాన వేమిటే ముదనష్టపుదానా!" వెంకాయమ్మ తల్లిని మందలించింది.

"ఇక అంతటితో కట్టిపెట్టు అమ్మా" క్రిష్ణారావు చికాకుగా అన్నాడు.

ముసలమ్మ తడుముకుంటూ ద్వారం దాటింది. క్రిష్ణారావు బ్యాటరీలైటు తీసుకుని ముసలమ్మకు దారి చూపాడు.

క్రిష్ణారావుకు ఆరాత్రి సరిగా నిద్ర పట్టలేదు. ప్రమీల వివాహం, తన పరీక్ష, సుశీల, ప్రమీలల పరీక్షలు అతని మనస్సులో మెలిగాయి. తన వివాహం విషయంలో బంధువులు తెస్తున్న వత్తిడికిలొంగకూడదనే నిర్ణయించుకున్నాడు. తన పరీక్ష యేమైనా సుశీల, ప్రమీల యిరువురు పరీక్ష అయితే బాగుంటుందని అనుకున్నాడు.

ఆ రాత్రి అతనికి యెన్నో కలలు వచ్చాయి. వకసారి తను సుశీలకు లెక్కలు చెపుతున్నాడు. యెంతసేపు చేసినా ఆమెకు లెఖ్ఖ ఆన్సరు రాలేదు. తను ఆ పుస్తకం తీసుకోబోయాడు. ఆమె యివ్వలేదు. తను బలం ఉపయోగించాడు. ఆమె గట్టిగానే పట్టుకుంది. ఆ లాగులాటలో పుస్తకం రెండు ముక్కలైంది. తన చేతిలోకి వచ్చిన కాగితాలలో సుశీల చేసిన లెక్కలులేవు. వాటికి బదులుగా యేవేవో బొమ్మలు, బొమ్మల గీతలు వున్నాయి? తనకు కోపం వచ్చింది.

"యేమిటి సుశీలా, యిదంతా!" అంటూ తను మందలించాడు. ఆమె కిలకిలలాడుతూ నవ్వింది. తను లేచి "నేను

వెళ్ళిపోతున్నాను'' అంటూ బయలుదేరాడు. ఆమెకూడా లేచి నిలబడి తన దారికి అడ్డు తగిలింది. తను తప్పుకోబో యాడు. ఆమె బాహువులతో తనను గాఢంగా బంధించింది. తను కంగారుతో ఆమెను గట్టిగా తోసివేశాడు. ఆ విసురుకు ఆమె క్రిందపడిపోయింది. ''ఆఁ సుశీలా!'' అంటూ అతను మంచంమీద లేచి కూచున్నాడు. గోడనున్న గడియారం నాలుగుగంటలు కొట్టింది. కోళ్ళ పెట్టెలో కోడిపుంజు కొక్కొరోకో అంటూ కేక పెట్టింది.

ప్రకరణం 10

సుశీలకు యిరవై ఒకటో సంవత్సరం. ఇప్పటివరకు ఆమె దృష్టి పురుషులమీదికి పోకపోయినా తనకు పరిచయులగు వారిని గురించి ఆమె ఇటీవల యెక్కువగా ఆలోచిస్తోంది. ఆమె దృష్టిని ప్రప్రథమంగా ఆకర్షించినవాడు ఆనంద్. ఆనంద్‌కు తన తండ్రి ఉన్నత విద్య చెప్పించనున్నాడని విన్నప్పుడు ఆమె భావాలు పరిపరి విధాల పోయాయి. సంఘ సంస్కారం పట్ల నాన్నగారి సదభిప్రాయాలు వున్నాయి. ఒక వేళ నాన్నగారు తనను అతనికి యిచ్చి వివాహం చెయ్యాలనే తలంపుతోనే అతనికి విద్య చెప్పిస్తున్నారేమోనని ఆమె అభిప్రాయపడింది. అందుకే ఆ దినాలలో ఆమె ఆనందును గురించి యెక్కువగా ఆలోచించింది. అతని రూపురేఖలను మనస్సులో నిలుపుకుంది. కాని ఒకసారి మాటల సందర్భంలో తన తండ్రి క్రిష్టారావుతో "అబ్బాయీ క్రిష్టారావు! ఈ మాలలు యెంతటి విద్యావంతులైనా, యెంత సంస్కారం కలవాళ్ళయినా వాళ్ళలో ఆ యిన్‌ఫీరియారిటీ కాంప్లెక్సు (తక్కువ వాళ్ళమనే భావం) పోలేదయ్యా! అది పోనంతకాలం వాళ్ళు నేటి సమాజంలో ఆర్థికంగా, సాంఘికంగా వున్నతస్థాయికి చెందినవారితో కలసిమెలసి వుండగలుగుతారనుకోవడం భ్రమే నేమో అనుకుంటున్నాను" అన్నారు. అప్పుడు క్రిష్టారావుకూడా ఆ విషయంలో తన తండ్రిని సమర్థిస్తూనే మాట్లాడాడు.

"అవును కరణంగారూ! పరిసరాల ప్రభావంమీదనే మనుష్యులయొక్క మనస్తత్వాలు చాలా వరకు ఆధారపడి వుంటాయి. ఆ తారతమ్యాలు తొలగిపోవాలంటే ప్రస్తుతం అమలులో వున్న ఆర్థిక, సాంఘిక వ్యవస్థలు పూర్తిగా మారాలి కరణంగారూ!" అన్నాడు.

ఆ సంభాషణను అవగాహనచేసుకున్న సుశీల, తండ్రి గారు తనను ఆనందుకు యిచ్చి వివాహం చేయాలనే అభిప్రాయంలో లేరని అర్థం చేసుకుంది. ఆ తరువాత ఆమె క్రమంగా ఆనందును గురించి ఆలోచించడం మానుకుంది. అతని మూర్తిని తన మనస్సునుండి తుడిచివేసుకుంది. కాని ఆనంద్ స్థానంలో క్రిష్ణారావును నెలకొల్పుకుంది.

క్రిష్ణారావుతో పరిచయమైన ప్రథమ దినాలలో సుశీల తన మనస్సులో క్రిష్ణారావును, ఆనందును ఒకరి తరువాత ఒకరిని నిలబెట్టి వారి రూపురేఖలను పోల్చుకునేది. క్రిష్ణారావు, ఆనంద్ యిరువురు ఒడ్డూ పొడవులో సమంగానే వుంటారు. ఆనంద్ క్రాపు అణగి నొక్కులు నొక్కులుగా వుంటుంది. క్రిష్ణారావు క్రాపు గాలిలో రెపరెప లాడుతూ ఉంటుంది. ఆనందుకు నుదురు తక్కువ. క్రిష్ణారావుకు విశాలమైన నుదురు. ఆనందుకు అసలుకనుబొమ్మలు లేనట్టుగానే ఉంటాయి. క్రిష్ణారావు కనుబొమ్మలు దట్టంగా, గుబురుగా కొట్టవచ్చినట్టు అగుపిస్తాయి. ఆనంద్ ముక్కు సన్ననిదే అయినా చివర అణగిపోయింది. క్రిష్టారావు ముక్కు సన్నగా కొసతేలి ఉంటుంది. ఆనందువి చిన్నకళ్ళు. క్రిష్ణారావువి విశాలమైన కళ్ళు. సోగగా చెంపలకంటా ఉంటాయి. ఆనంద్

చామనచాయ. క్రిష్ణారావు మెరుపు. ఆనంద్ కొంచెం మోటు అతనిమీద క్రిష్ణారావు నాజూకు. ఆ విధంగా పోల్చుకుని క్రిష్ణారావే తనకు తగినవాడని అనుకునేది.

క్రిష్ణారావు చదువు చెప్పటం ప్రారంభించిన కొద్దిదినాలకే ఆమె అతనిని 'మాస్టారూ!' అని సంబోంధించింది.అతను నవ్వుకున్నాడు.

"నేనేమీ బడిపంతులును కాదుగా" అన్నాడతను.

"పాఠాలు నేర్పేవారు, పంతుళ్ళుకాక యింకేమవుతారో చెప్పండి"

"అయితే పాఠాలు చదవని పిల్లలను పంతుళ్ళు బెత్తాలతో బాదుతారు"

"అమ్మయ్యో! ఆ పని మాత్రం చెయ్యకండి మాస్టారూ! ఆ మాటకొస్తే ముందు మీ ప్రమీలనే కొట్టవలసి వస్తుంది."

"మా చెల్లెలు నన్ను 'మాస్టారూ' అని పిలవడం లేదుగా"

"అబ్బో! మాటలలో మీరు చాలా గడుసువారే"

"మాటలలోనే కాదు, చేతలలోకూడా"

"మీరు కమ్యూనిస్టులు కదూ!"

"క్రిష్ణారావు చిన్నగా నవ్వాడు. కమ్యూనిస్టులయొక్క ప్రత్యేకత యేమిటో?"

"ఆ విషయం నాకు తెలియదులెండి"

పిచ్చమ్మగారు గుమ్మంలో నిలబడి "అమ్మాయి, సుశీలా! కాఫీ తయారయింది అమ్మా!" అని చెప్పింది.

సుశీల, ప్రమీల లేచి లోపలికి పోయారు. సుశీల ఒక గ్లాసుతో కాఫీ తెచ్చి క్రిష్టారావు ముందు పెట్టింది. అతను కాఫీ చప్పరిస్తూ అన్నాడు "నేను లచ్చి యింట్లో రెండు మూడు సార్లు తాగాను. ఆమె కాఫీ బ్రహ్మాండంగా తయారు చేస్తుంది."

"మా ఇంట్లో కాఫీ బాగుండదు లెండి"

"ఏం? యెందుచేతా?"

"లచ్చి ఇంట్లో కాఫీ బ్రహ్మాండంగా వుందని మీరు యింతకుముందు అన్నారుగా!"

"అవును అలాగే ఉంటుంది"

"అంటే దాని అర్థం మాయింట్లో కాఫీపాడుగా ఉందనేగా!"

"ఆ మాట నేను అనలేదమ్మా!"

"మీరు ప్రత్యేకంగా అనలేదు అనుకోండి. రాజు గారి పెద్దభార్య మహాయిల్లాలు అంటే, చిన్నభార్య పనికి మాలినది అనేగా?"

అతను సంతృప్తిగా నవ్వాడు. "అది కాదమ్మా! లచ్చి కాగే పాలలోనే కాఫీపొడి వేసి దించుకుంది. అందు చేత ఆ కాఫీ బాగుంటుంది."

"నన్ను అమ్మా గిమ్మా అనకండి మాస్టారూ!"

"మరి యేమనాలి?"

"సుశీలా అని పిలవండి"

"ఆ సమయం వచ్చినపుడు అలాగే పిలుస్తాను."

ఆమె పరీక్షగా అతని కళ్ళల్లోకి చూచింది. అతను

మందస్మితం చేశాడు.

క్రిష్ణారావు సమక్షంలో ప్రమీల నోరు విప్పి మాట్లాడదు. అతను వెళ్ళిపోగానే సుశీలా, ప్రమీలా స్వేచ్ఛగా ఆడుతూ పాడుతూ ప్రొద్దుపుచ్చుతారు.

సుశీలకు చిన్నతనంనుండి యిరుగు, పొరుగు ఇళ్ళకు పోయే అలవాటు లేదు. ప్రమీలతో స్నేహం కలిసిన తరువాత సుశీల ఆమెతో కలసి తరచు క్రిష్ణారావుగారి యింటికి వస్తూ పోతూ వచ్చింది. గ్రామంలో వారిని గురించి యెన్నో వదంతులు వ్యాపించాయి. క్రిష్ణారావు, కరణంగార్ల చెవిని కూడా పడ్డాయి. క్రిష్ణారావు జంకాడు. కరణంగారి ఇంటికి పోడానికి వెనకాడాడు. క్రిష్ణారావు, సుశీల పేర్లు గోడలమీద యెక్కాయి. క్రిష్ణారావు కరణంగారి ఇంటికి పోవటం మానుకున్నాడు.

ఒకనాటి ఉదయం క్రిష్ణారావు మంచంమీదనుండి లేవకముందే కరణంగారు వెళ్ళి అతని పక్కమీద కూచుని క్రిష్ణారావుమీద చెయ్యివేసి లేపారు. క్రిష్ణారావు లేచి "నమస్తే కరణంగారూ!" అన్నాడు. ఆయన చిన్నగానవ్వారు.

"అది సరేగాని, యీ మాత్రానికే బెదరిపోతే యెలాగయ్యా?" అన్నారు కరణంగారు అప్యాయంగా క్రిష్ణారావు వీపు తట్టి.

క్రిష్ణారావు మంచం దిగి "తమరు నాలుగు నిమిషాలు కూచోండి. నేను వెంటనే వచ్చేస్తాను." అంటూ అతను తువాలు భుజాన వేసుకుని బయటికి నడిచాడు.

క్రిష్ణారావు తల్లి వెంకాయమ్మగారు వచ్చి తలుపు చాటున నిలబడి "తెల్లవారేసరికి పని కట్టుకుని మరీ వచ్చారు, బాబుగారూ!" అంది కరణంగారిని పలుకరిస్తూ.

"అవును అక్కయ్యా! మన అబ్బాయి రెండురోజులనుండి పిల్లలకు చదువు చెప్పడం చాలించాడు. అవేవో కాంపోజీ షన్లు వ్రాన్నాయి చూడాలని అమ్మాయి రెండుమూడు సార్లు అంది. మన అబ్బాయికి చెప్పి తీసుకుపోదామని నేనే బయలు దేరి వచ్చాను" అన్నారు కరణంగారు.

"యేమో బాబుగారూ! వూరంతా ఒకటే గుప్పు చిప్పులుగా చెప్పుకుంటున్నారు. వినలేక చెవులు మూసుకుం టున్నాం. మాపనే ఇలావుంటే ఇక మీరు ఎంత బాధ పడిపో తున్నారో అని అబ్బాయి మొన్నటినుండి యెంతో యిది అయిపోతున్నాడనుకోండి" అంది ఆమె.

కరణంగారు గట్టిగా నవ్వేశారు. "గాలిమూక యేవో వాగుతుంటారు. ఆలాటి వాగుడుని పట్టించుకునే ఘటంకాదు నాది"

క్రిష్ణారావు అద్దంముందు నిలబడి క్రాపు దువ్వుకుం టున్నాడు. అతని వంటిమీద వదులుగావున్న కట్ బనియను, సన్నని లుంగీమాత్రం వున్నాయి. అతని శరీర సౌష్టవం, రూపురేఖలూ చూస్తూ కరణంగారు ఆలోచనలో పడ్డారు

"ఈ అపర మన్మధుడు నా అల్లుడు అయితే ఇంకా కావలసింది యేముందీ! యేమో! అతని అభిప్రాయాలు ఎలా వున్నాయో!" అనుకున్నారు ఆయన.

క్రిష్ణారావు లోపలికి పోయి కాఫీగ్లాసు తెచ్చి కరణం గారికి అందించాడు. ఆయనగారు కాఫీ తాగుతూ అన్నారు. "అబ్బాయి క్రిష్ణారావు! బట్టలువేసుకో. మాఇంటికిపోదాం"

క్రిష్ణారావు సూటిగా కరణంగారి కళ్ళల్లోకి చూచాడు. "యేమిటయ్యా! అలా చూస్తావు, తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు బెదురుతాయటయ్యా!" అన్నారు ఆయన

క్రిష్ణారావు ముభావంగా నవ్వాడు.

♦ ♦ ♦ ♦ ♦ ♦

కార్తీకమాసం. యెక్కడా పనీ, పాటు లేదు. పల్లెలో చాల కుటుంబాలపని కటకటగా వుంది. కొందరు వేరుశనగ తీతలకు మెరక ప్రాంతాలకు పోయారు. ఒకరోజు ఉదయం లచ్చి క్రిష్ణారావుగారి ఇంటికి వెళ్ళింది. అతను అక్కడ లేడు. కరణంగారి ఇంటికి వెళ్ళాడని ఇంట్లో చెప్పారు. ఆమె సరాసరి కరణంగారింటికి వెళ్ళింది. క్రిష్ణారావు, కరణంగారు ముందు వరండాలో కూచుని మాట్లాడుతున్నారు. లచ్చిని చూచి "కూలీ సంఘం నాయకురాలు వస్తూంది" అన్నారు కరణంగారు. క్రిష్ణారావు మందస్మితంచేస్తూ "లచ్చీ! యేదో పనిమీద వచ్చినట్టున్నావు" అన్నాడు.

"కరణంగారి ఇల్లు దొరికింది. క్రిష్ణారావు దొర మా పల్లె మరచిపోయాడు అంది లచ్చి."

క్రిష్ణారావు చిన్నగా నవ్వాడు.

"మీ క్రిష్ణారావుదొరను మేము పట్టుకుని కట్టేశామనుకుంటున్నావా, లచ్చి!" కరణంగారు అడిగారు.

"అంతమాట యెందుకు దొరా!"

"యేదో పనిమీదే వచ్చినట్టున్నావు!"

"కూలీ, నాలీ చేసుకు బ్రతికేవాళ్ళకు దొరలతో పని రాకుండా వుంటుందా!"

"సూటిగా చెప్పు, లచ్చీ!" అన్నాడు క్రిష్ణారావు.

"యేమి చెప్పమంటావు దొరా! రెండు నెలలుగా ఒక్కసారైనా పల్లె మొహం చూడవైతివి"

"నేను పరీక్షకు కట్టాను లచ్చీ! చదువులోపడి యెక్కడికీ పోవటంలేదు."

"తమరు పరీక్షలతో, చదువులతో కూచుంటే, పల్లెలో వాళ్ళు పస్తులతో చస్తున్నారు"

"నేను మధ్యాహ్నం పల్లెకు వస్తాను లచ్చీ! వివరాలు మాట్లాడుదాం" అన్నాడు క్రిష్ణారావు.

క్రిష్ణారావును పల్లెకు పోకుండా ఆపు చెయ్యాలని కరణంగారు ఆలోచించారు. ఆయనపైకి "నువ్వు ఆగవయ్యా బాబు! ఆ విషయం యేమిటో నేను యిక్కడే తేలుస్తాను" అన్నారు. ఆ తరువాత ఆయన లచ్చివైపు తిరిగి "లచ్చీ! నీ రాయబార మేదో బయటపెట్టు" అన్నారు.

ఆమె చెప్పుకు పోయింది "పల్లెలో సగంమంది వేరుశనగ తీతలకు పోయారు దొరా! మిగిలిన వాళ్ళలో చాలా కుటుంబాలకు గిద్దెడు గింజలు లేవు. ఆ చెరువు గట్టునవున్నయి చూడండి పదిఇళ్ళు! ఆ ఇళ్ళల్లో యిప్పటికి మూడు రోజుల నుండీ పొగ రాజ లేదు. కటిక పస్తులతో కాలం గడుపుతున్నారు. తమ బోటివారు అప్పు రూపంలో ఇస్తే మళ్ళా కళ్ళాల రోజుల్లో తీర్చుకుంటాం" అంది ఆమె.

"ఇదుగో లచ్చీ! నేను ఒకమాట చెబుతా వింటావా?" అన్నారు కరణంగారు.

"ఆ, చెప్పండి దొరా!"

"లోగడ మీ వాళ్ళు ఇలాగే యిబ్బంది పడుతూంటే నేను చూడలేక రెండు సంవత్సరాలు వరసనే ఇంటికి బస్తా ధాన్యం చొప్పున యిచ్చాను. అప్పుడు మీ వాళ్ళు నాకు తిరిగి యెంత యిచ్చారో నీకేమైన గుర్తుందా?

లచ్చి మొహం వెలవెల పోయింది. "లేకేం దొరా! మీకు తిరిగి యిచ్చినవాళ్ళు చాలా తక్కువ"

"తక్కువ అని నెమ్మదిగా చెబుతావేం. నేను మొత్తము ముప్ఫయి బస్తాలు యిస్తే, నాకు తిరిగి వచ్చినవి అయిదు బస్తాలు"

"ఛా, ఘోరం" అన్నాడు క్రిష్ణారావు.

లచ్చి మళ్ళీ అందుకుంది. "ఆ రోజులు వేరు దొరా! ఇప్పుడు మీరు యిచ్చే అప్పులకు మేం పూచీ పడతాం దొరా!"

"యెవరటా! ఆ పూచీదార్లు"

లచ్చి చిన్నగా నవ్వింది. "మీ పాలేరు సుబ్బయ్య, వీరాస్వామి, ఏసుదాసు, నేనూ"

"సరే, మొత్తం ఏమాత్రం కావాలో చెప్పు"

"ఒక ఇరవై బస్తాలు యిప్పించండి"

"అయితే రేపు ఉదయం పది గంటలకు కొట్టు తీయిస్తాను. వచ్చి కొలిపించుకు పొండి" అన్నారు కరణంగారు.

లచ్చి సంతోషంతో వారిదగ్గర శెలవు తీసుకుని వెళ్ళిపోయింది.

కరణంగారి ఔదార్యంచూచి క్రిష్ణారావు ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు. ఆయనగారిని అభినందించాలని అనుకున్నాడు కాని అతనికి సరియైన మాటలు దొరకలేదు. అతను రెండు నిమిషాలు తటపటాయించి "కరణంగారూ! తమరిది చాలా విశాలమైన హృదయమండీ!" అన్నాడు.

కరణంగారు సంతృప్తిగా నవ్వుకున్నారు. "యేమో, బాబూ! యీ కూలీ నాలీ జనానికి యెంత చేసినా విశ్వాసం లేదు బాబూ!"

"కారణ మేమిటంటారు?"

"యేమి కారణమని చెప్పమంటావు! తొక్కిపట్టి చేయించుకునే వాళ్ళకు చచ్చినట్టు చాకిరీ చేస్తారు. మనబోటి గాళ్ళకు ముడ్డి చూపుతారు."

కృష్ణారావు ముభావంగానవ్వాడు. "అంత అన్యాయం చెయ్యరనుకుంటా నండీ" అన్నాడు.

"నన్ను కొన్ని ఉదాహరణలు చెప్పమంటావా!"

"చెప్పండి వింటాను"

"యీ సంవత్సరం నాట్లలో మా గూడెంపక్క చేను కొంచంముందుగాతడిసింది. అదిపదిఎకరాలచేను. ఎనభై మంది కూలీలను పిలవమనిచెప్పాను. కాని తీరా చేలో లెక్కబెడితే వందమందిదాకా ఉన్నారు. ఉంటే ఉన్నారులే అని సరిపెట్టుకున్నా. సాయంకాలం నాలుగున్నరకే చేలోనుండి బయటికి వచ్చేశారు. కొద్దిగా కుని పదలిపెట్టారు. ఆ మరునాడు మా

పాలేళ్ళు నలుగురుపోయి అది పూర్తి చేయాల్సి వచ్చింది. మా నాట్లు అయిన మరుసటిరోజు మునసబు ఉత్తర పొలం పూడ్చాడు. అదీ పది యకరాల చేనే. ఆయన డెభ్భైమంది కూలీలనే పిలిపించాడు. సరిగ్గా డెభ్భైమంది పోయి సాయంకాలం ఆరుగంటలవరకూ ఉండి అది పూర్తిచేసిమరీవచ్చారు. ఇంతా ఏడిస్తే ఆయన రూపాయికాడికే లెక్కకట్టి ఇచ్చాడు. నా దగ్గర మాత్రం రూపాయిన్నర చొప్పున టకాయించి వసూలు చేశారు"

క్రిష్ణారావు కరణంగారి వైపు జాలిగా చూచాడు. "ఇలాంటివి జరుగుతూనే ఉంటాయిలెండి" అన్నాడు.

"అందుకే మీచౌదర్యంతా మాది బ్రాహ్మణ వ్యవసాయం అంటారు. దానితో 'మొగుడు కొట్టినందుకు కాక తోటికోడలు దెప్పినందుకు ఏడ్చినట్టు' నాబోటిగాళ్ళు ఇరుకున పడవలసి వస్తూంది." అన్నారాయన.

సుశీల కాఫీగ్లాసులు తెచ్చి ఇద్దరికీ అందించింది. క్రిష్ణారావు కాఫీ చప్పరిస్తూ అన్నాడు. "ఓహో, స్పెషలు కాఫీ తయారుచేశాగే" అన్నాడు సుశీలవైపు చూచి. ఆమె మందస్మితం చేసింది.

"యేమిటి ఆ స్పెషలు?" అడిగారు కరణంగారు.

"రుచి చూడండి. మీకే తెలుస్తుంది " క్రిష్ణారావు సమాధానం.

కరణంగారు గ్లాసు నోటిదగ్గరికిపోనిచ్చి "కాఫీ భేషుగ్గా ఉందమ్మా! రోజూ ఇలా ఎందుకు తయారు చేయకూడదు?" అన్నారాయన సుశీలవైపు చూస్తూ.

ఆమె ముభావంగా నవ్వింది. "నీళ్ళు లేకుండా పాల లోనే కాఫీ పొడి వెయ్యాలి నాన్నగారూ! పూటకు అర్ధశేరు పాలు అయితేనే గాని మనకు చాలవు."

"పడితే పట్టనీ అమ్మా! మనకు పాలకు కొదవేముంది?"

"అయితే మాత్రం. మన పిచ్చమ్మగారికే పూటకు మూడుగ్లాసులు కావాలి నాన్నగారూ!"

క్రిష్ణారావు, కరణంగారూ నవ్వుకున్నారు. సుశీల అందుకుంది. "నాన్నగారూ! క్రిష్ణారావుగారికి లచ్చిఇచ్చేకాఫీ ఇలానే తయారుచేస్తుందటండీ!"

కరణంగారు సందేహంగా క్రిష్ణారావువైపు చూచాడు. క్రిష్ణారావు నవ్వుతూ అన్నాడు. "యెప్పుడో పల్లెకుపోతే ఒకటిరెండు సార్లు మాత్రం లచ్చి కాఫీ యిచ్చిందనేగా నేను చెపుతా!" అన్నాడు అతను.

"అయినా! ఆ మాలవాళ్ళ కొంపలలో కాఫీ యెలా తాగగలిగారండీ మీరు?" మళ్ళీ ప్రశ్నించిది.

"యే మాలల కొంపల్లో తాగాను అంటారు? ఒక్క లచ్చి ఇంట్లోమాత్రమే తాగాను. అదికూడా ఒకటి రెండు సార్లు. లచ్చిది ఇల్లు చిన్నదే అయినా చాలా పరిశుభ్రంగా వుంచుతుంది" అన్నాడు క్రిష్ణారావు.

సుశీల కాళీ గ్లాసు తీసుకుంటూ అతని కళ్ళల్లోకి చూచింది. అతను ముభావంగా చూచాడు. అతనికి కష్టం తోచి వుంటుందని సుశీల అనుకుంది. ఆమె గ్లాసులు పుచ్చుకుని లోపలికి నడిచింది.

కరణంగారు సంభాషణ మార్చాడు. "క్రిష్ణారావు బాబూ! ఒకసారి హైదరాబాదు పోయి రావాలనుకుంటు న్నాను. నీవుకూడా వస్తావా!"

"అక్కడ పని యేమిటో చెబితే!"

కరణంగారు సూటిగా క్రిష్ణారావు కళ్ళల్లోకి చూస్తూ "అమ్మాయికి సంబంధం మాట్లాడడానికి" అన్నారు.

క్రిష్ణారావు ముఖం వెలవెల పోయింది. అతను నేల వంక చూస్తూ మీరు వెళ్ళిరండీ!"

కరణంగారు తనలో తాను నవ్వుకున్నారు. ఆయన క్రిష్ణారావు భుజంమీద చెయ్యివేసి "క్రిష్ణారావు బాబూ! నీ అభిప్రాయం తెలుసుకోవాలనే నేను ఆ మాట అన్నాను. దొరికిపోయావు. నా బిడ్డకు నీకంటే యోగ్యుడెవరు దొరుకు తాడు నేను ధన్యుణ్ణి" అన్నారు ఆయన.

క్రిష్ణారావు నేలవంక చూస్తూ "మరి అమ్మాయిగారి అభిప్రాయమో!"

అమ్మాయికి నిన్ను గురించి స్థిరమైన అభిప్రాయాలే వున్నాయని నేను అనుకుంటున్నా. నిద్రలో సైతం ఆమె నీ పేరు కలవరిస్తూ వుంటుంది. అదీగాక నీతో మాట్లాడినంత సన్నిహితంగా ఆమె యే పరాయి మగాడితో మాట్లాడటం నేను చూడలేదు. దానినిబట్టి ఆమె నిన్ను ప్రేమిస్తోందనే నేను అభిప్రాయ పడుతున్నా"

"మా పెద్దవాళ్ళతో కూడ మీరు ఒకసారి మాట్లాడితే మంచిదేమో అనుకుంటున్నా"

"యేం, వాళ్ళు వ్యతిరేకిస్తున్నారని భయపడుతున్నావా?"

"నాకదేమీలేదు. అయినా వాళ్ళు వ్యతిరేకిస్తారని నేను అనుకోను. సుశీలగారి పట్ల మా అమ్మకు చాలా సదభిప్రాయమూ, సానుభూతీవున్నాయి. ఆమె ఒకోసారి అంటూ వుంటుంది. 'మన కరణంగారికి కావలసినంత ఎస్టేటు వుంది. తగిన సంబంధం చూచి పిల్లకు మళ్ళీ పెళ్ళి చేయకుండా యెందుకు వుంచినట్టు అని' యేమైనా వాళ్ళు పెద్దలుగదా! మీరు ఒకసారి వాళ్ళకుకూడా చెపితే బాగుంటుందని నా అభిప్రాయం" అన్నాడు క్రిష్ణారావు.

"సరే బాబూ! రేపు యెప్పుడైనా మంచిరోజు చూచి, మీ ఇంటికి పోయి అమ్మతో, నాన్నగారితో మాట్లాడుతాను" అని చెప్పి కరణంగారు లేచి బయటికి వెళ్ళాడు.

క్రిష్ణారావు లోపలికి తొంగి చూచాడు. అక్కడ ఎవ్వరూ లేరు. సుశీల గది తలుపులు దగ్గరగావేసి వున్నాయి. అతను తలుపు దగ్గరకుపోయి "సుశీలగారూ!" అని పిలిచాడు. లోపలినుండి సమాధానం లేదు. అతను తలుపు గొళ్ళెం కదలించాడు. సుశీల లోపలినుండి "యెవరూ!" అంది.

అతను తలుపు వారగాతీసి లోపలికి చూచాడు. సుశీల మంచంమీద పండుకొని వుంది. "అదేమిటమ్మా! ఇప్పుడు పండుకున్నావు?" అని ప్రశ్నించాడు. ఆమె దిగ్గున మంచం దిగి నిలబడింది. ఆమె కళ్ళు యెర్రగా వున్నాయి.

"యేడుస్తున్నారా?"

ఆమె తల కిందికిదించి కాలితో నేలరాస్తూ "లేదండీ" అంది.

"మీరు రాసిన కాంపోజిషన్లు యిస్తారా? చూచి పోతాను" అన్నాడతను.

"వ్రాయలేదు మాస్టారూ!"

"మీరు బయటికి రండి, మీతో మాట్లాడాలి"

"మీరే లోపలికి వచ్చి మాట్లాడ వచ్చుగా"

అతను గదిలోపల అడుగుపెట్టాడు. ఆమె కుర్చీ చూపించింది. అతను నిలబడే అన్నాడు. "మీ నాన్నగారు నన్ను హైదరాబాదు రమ్మంటున్నారు"

ఆమె అతని వైపు పరీక్షగా చూచింది "దేనికో" అంది.

"మీకు వరుణ్ణి చూడటానికి"

"అవసరంలేదు వద్దన్నానని చెప్పండి" ఆమె గట్టిగా అరచింది.

మరుక్షణంలో ఆమె మంచంమీద వాలి దిండులో తలదూర్చి బిగ్గరగా యేడ్చింది.

అతను చిన్నగా నవ్వుకున్నాడు. "సుశీలగారూ! ఆ యేడుపు మాని నేను అడిగే ప్రశ్నకు సమాధానం చెపుతారా?" అతను బింకంగా అడిగాడు.

ఆమె యేడుపు దిగమింగి లేచి కూచుంది. అతను ప్రశ్నించాడు. "మీకు అంగీకారమైతే మనం ఇద్దరం వివాహం చేసుకోవచ్చునని మీ నాన్నగారు ఇప్పుడే చెప్పారు"

ఆ యేడుపులో ఆమె నవ్వింది. "ఆ మాట చెప్పడానికి నన్ను యింతగా యేడిపించాలా?" ఆమె బుంగ మూతి పెట్టి అంది.

ఆమెను చూస్తుంటే అతనికి జాలేసింది. అతను మంచం దగ్గరగా జరిగి అన్నాడు. "మరి అమ్మాయిగారికి ఇష్టమేనా?"

"అబ్బాయిగారికి యిష్టమైతే, అమ్మాయిగారికీ యిష్టమే!"

"ఓహో! అదా సంగతి" అంటూ అతను ఆమెను మంచంమీదనుండి కిందికి లాగి నుంచోబెట్టాడు. ఆమె అతనికి దగ్గరగా జరిగింది. అతను ఆమె నడుంచుట్టూ చెయ్యివేసి దగ్గరకు తీసుకుని ఆమె పెదవులమీద ముద్దు పెట్టుకున్నాడు. ఆమె సిగ్గుతో తల కిందికి దించుకుంది. అతను ఆమె గెడ్డం పుచ్చుకుని ముఖం పైకియెత్తి సూటిగా ఆమె కళ్ళల్లోకి చూస్తూ "ఇంకా సిగ్గు పడుతున్నావా?" అన్నాడు. ఆమె అతని పట్టు విడిపించుకుని బయటికి నడిచింది.

వర్జ్యం ఘడియలు లేకుండాచూచి కరణంగారు క్రిష్ణారావుగారి ఇంటికి వెళ్ళాడు. వెంకాయమ్మ వంట ఇంటి గుమ్మంముందు కూచుని బియ్యం జల్లిస్తూంది. కరణంగారు సరాసరి ఆమె ముందుకుపోయి "వెంకాయమ్మ అక్కా! మీకు ఒక శుభవార్త చెప్పిపోదామని వచ్చాను" అన్నారు.

ఆమె కంగారుగా లేచి తలుపు చాటుకు వెళ్ళింది. బాబుగారూ, లోపలికి దయచేయండి కుర్చీలో కూచుందురు గాని" అంది వెంకాయమ్మగారు.

"ఫరవాలేదు అక్కా! మీకు శుభవార్త చెప్పిపోదామనివచ్చానని ముందే చెప్పానుగా. మా అమ్మాయికి వివాహం చెయ్యదలచుకున్నాను"

"మంచిది బాబూ! తల్లిలేని పిల్లను ఇలావుంచారేమా అని నేను అప్పుడప్పుడు అనుకుంటూ వుంటాను. అదృష్టం కలిసిరావాలిగా!"

"పిల్లవాడు యెవరో తెలుసునా?"

"లేదు బాబూ! తమకేం కొదువా! మీ తాహతుకు తగినవాడినే తెచ్చుకుంటారు"

"యెవరో యెందుకు? మన క్రిష్ణారావుకే యిచ్చి చేస్తాను."

వెంకాయమ్మగారు తలుపు చాటునుండి కరణంగారి యెదుటపడి చేతులు రెండు జోడించి నమస్కరించింది.

"బాబుగారూ! మీ మేలు యెన్నటికీ మరువను. నా బిడ్డ బ్రహ్మచారిగా వుండిపోతాడేమోనని యింతకాలంగా విచారంతో కుమిలిపోతున్నా. మీ ధర్మమా అంటూ వాడో యింటివాడవుతాడు చాలా సంతోషం బాబూ!"

ప్రకరణం-11

యేసుదాసు తనకున్న రెండు యకరాల భూమిలోనూ అర యకరం భూమి అమ్మకానికి పెట్టాడు. కాని మునసబు ఆభూమి తనకు తాకట్టులోవుందనీ అది ఎవ్వరూ కొనేందుకు వీలుకాదనీ అభ్యంతరం చెప్పాడు. బేరం యెక్క రాలేదు. లచ్చి లోగడ భూమి అమ్ముకున్న తాలూకు సొమ్ము వెయ్యి రూపాయలకుపైగా కరణంగారి ద్వారా వున్నాయి. కరణం గారు లచ్చిని ప్రోత్సహించారు. తాకట్టు డబ్బు మునసబుకు చెల్లించి ఆ అరయకరం ఆమెను కొనవలసిందని చెప్పారు.

లచ్చి ఆమోదించి వెంటనే ఏసుదాసును పంపించి మునసబు బాకీలన్నీ తీర్చి తాకట్టు పత్రం, మిగిలిన నోట్లు అన్నీ వసూలు పెట్టించి తెప్పించింది. ఏసుదాసుతో అ అర యకరం తను రాయించుకుంద లచ్చి.

సంతోషం ఉద్యోగం ప్రక్క గ్రామానికి మార్పించుకుంది. లచ్చి ప్రోద్బలంతో ఆమె తన భర్తతో విడాకులు పుచ్చుకునేందుకు ప్రయత్నించింది. కాని విడాకులు యివ్వడానికి ఆమె భర్త ప్రథమంలో నిరాకరించాడు. దానితో లచ్చి కల్పించుకోవలసి వచ్చింది. ఆమె సలహాతో సంతోషం భర్తకు ఒక రిజిష్టరు నోటీసు యిచ్చింది. విడాకులు ఇవ్వని పక్షంలో కోర్టు ఎక్కవలసి వస్తుందనీ, నర్సుతో అతనికి సంబంధం వున్నట్టు తను కోర్టులో రుజువు పరచగల

నని ఆమె ఆ నోటీసులో స్పష్టం చేసింది. దాని తరువాత సంతోషం భర్త కంగారుగా పరుగెత్తుకువచ్చి విడాకులపత్రం యిచ్చి వెళ్ళాడు.

ఒకరోజున లచ్చి సంతోషాన్ని అడిగింది. "సంతోషం! మళ్ళీ వివాహం చేసుకుంటావా?"

"యేమో, అక్కా! యిప్పుడిప్పుడే చేసుకోవాలని లేదు"

"ఇంకెప్పుడు చేసుకుంటావు? ముసలమ్మవు అయిన తరువాతనా?"

సంతోషం చిన్నగా నవ్వింది. "నేను అప్పుడే ముసలి దాన్ని అయానా! నాకు ఇప్పుడు ఇరవైమూడో సంవత్సరం జరుగుతూంది అక్కా!"

"అవునులే. నాకు ఆ మాత్రం తెలియదంటావు. నీవు నాకంటే మూడు సంవత్సరాలు చిన్నదానివి"

"మరి ఇప్పుడే ముసలమ్మను చేస్తున్నావే!"

లచ్చి పేలవంగా నవ్వింది. "సరే గాని నేను ఒక సంబంధం కుదురుస్తాను నీకు అంగీకారమైతే!"

"అతను ఏవరో చెపితే నేను ఆలోచించుకుంటాను"

"నీవు అంతగా ఆలోచించవలసిన అవసరం లేదు"

"అతను ఏవరో చెప్పు"

"ఆనంద్"

సంతోషం ఆశ్చర్యం వెల్లడించింది. "అక్కా! ఆనంద్ బి. ఏ. చదువుతున్నాడు. నన్ను ఎందుకు వివాహం చేసుకుంటాడు?

"నీకు అదంతా అనవసరం సంతోషం! నేను ఆనందుతో మాట్లాడి ఒప్పిస్తాను"

"కాని అక్కా! నేను ఆనందును గురించి ఒక వార్త విన్నాను. అది ఎంతవరకు నిజమో నీకు ఏమైనా తెలుసా!"

"ఏమిటది?"

"కరణంగారి కుమార్తె ఆనందుకు జాబులు రాసిందనీ, వారిద్దరూ పెండ్లి చేసుకుంటారనీ ఆ మధ్య చెప్పుకున్నారు"

లచ్చి నీరసంగా నవ్వింది. "అది అంతా వట్టి గాలి సంతోషం! మొదట్లో నేనూ అట్లాగే అనుకున్నా. కాని వాళ్ళకు అట్లాటి అభిప్రాయాలు లేవు. అయినా కరణంగారి అమ్మాయి, క్రిష్ణారావుగారు ఇద్దరూ త్వరలో వివాహం చేసుకోబోతున్నారు. అది నిశ్చయమైనట్లే"

"అయితే వారిద్దరికీ యీడూ, జోడూ ఎంత చక్కగా కుదిరింది అక్కా! అందంలో వారు ఒకరిని మించి ఒకరు వుంటారు."

"వారి విషయం అంతే ననుకో! నీవు ఆనంద్‌ను వివాహం చేసుకుంటే మీరుకూడా, యీడూ - జోడూ బాగానే వుంటారు సంతోషం!"

"ఏమో అక్కా! నాకు ఇంకా అనుమానంగానే వుంది. ఆనంద్ అంగీకరిస్తాడా? అని"

"నీకు ఎందుకు సంతోషం! ఆనందును ఒప్పించే బాధ్యత నాదిఅని చెపుతూంటినిగా"

"మరి వాళ్ళ పెద్దవాళ్ళు అంగీకరించ వద్దూ!"

"వాళ్ళ అభ్యంతరం వుండదనే అనుకుంటాను"

"అక్కా, నీ భరోసా చూస్తే, నీవు ఇదివరకే వారితో మాట్లాడినట్లు వున్నావే"

"అబ్బే లేదు సంతోషం!"

"సరే నీ ఇష్ట ప్రకారం కానియ్యి అక్కా!"

ఆతరువాత లచ్చి ఏసుదాసును కలుసుకుని సంతోషం, ఆనంద్‌లు వివాహంచేసుకుంటే ఎలావుంటుందీ!అని అడిగింది.

ఏసుదాసుకు వెంటనే మేరీ గుర్తుకు వచ్చింది. అతని కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అతని గొంతు గద్గదమైంది. "లచ్చీ! ఆనంద్‌ను ఒకసారి కాదని మేరీని దూరం చేసుకున్నాను. అతను సంతోషాన్ని చేసుకుంటే ఆ లోటు తీరుతుంది. నాకు అంతకంటే కావలసింది యేముందమ్మా! ఆ యకరమున్నర భూమీ ఎప్పటికైనా సంతోషానికే చెందుతుంది. తొందర్లో పెళ్ళిచేసే బాధ్యత నాదే లచ్చీ!" అన్నాడు ఏసుదాసు.

◆ ◆ ◆ ◆ ◆

సుశీల తనను వివాహం చేసుకునే అవకాశాలు లేవని వాదించిన ఆనంద్ సుశీలను గురించి ఆలోచించకుండా వుండలేక పోతున్నాడు. ఆమెనుండి మళ్ళీ ఏదైనా జాబు వస్తుందేమో నని అతను రోజూ పోస్టుకొరకు ఎదురు చూచాడు.

లచ్చి వాదనల ప్రభావం అతనిమీద బాగా పని చేసింది. సంఘసంస్కారం పేరుతో కరణంగారు సుశీలను తనకు ఇచ్చి వివాహం చేస్తాడనే విశ్వాసం అతనిలో రోజు రోజుకీ పెరుగుతూ వచ్చింది.

కాలేజీకి వారం రోజులు సెలవులు ఇచ్చారు. అతను మొదటిరోజునే బయలుదేరి ఇంటికి వచ్చాడు. పది నిమిషాలు ఇంటిదగ్గర గడిపి ఆ తరువాత లచ్చి ఇంటికి వెళ్ళాడు. కాని ఆ సమయానికి ఆమె ఇంట్లో లేదు. గంటకుపైగా చూచాడు. ఆమె వచ్చే సూచనలు లేవు. బాగా చీకటి పడింది. అతను సహనం కోల్పోయాడు. అతను బయలుదేరి పోతుండగా లచ్చి దారిలో ఎదురైంది.

ఆమె ముందుగా పలుకరించింది. "ఎవరదీ, మరిదీ! ఎప్పుడు వచ్చావు" అంది.

"సాయంకాలం వచ్చాను వదెనా! ఇప్పటివరకు ఎక్కడ వున్నావూ? అతను" ఆతురతగా అడిగాడు.

"ఊళ్ళోనుంచి వస్తున్నాను అబ్బాయీ! మా రాముడికి జ్వరం వస్తుంటె వూళ్ళో డాక్టరు దగ్గరకు తీసుకుపోయాను. ఆయనగారేమో వాడిని రెండు రోజులవరకు కదిలించవద్దని చెప్పారు. క్రిష్టారావుగారు రాముడిని వారి ఇంటికి తీసుకెళ్లారు. ఇంటికి తాళంపెట్టి నేనుకూడా ఊళ్ళోకి పోవాలి" అంది ఆమె.

"ఏమి జ్వరమని చెప్పారు వదెనా!"

"అదేమీ చెప్పలేదు అబ్బాయీ!"

"నేనుకూడా రానా ఊళ్లోకి?"

"యీచీకట్లో నువ్వుకూడా దేనికయ్యా! వద్దు" అంది లచ్చి.

క్రిష్టారావు ముందు చావడిలో గది తుడిపించి రాముడ్ని దానిలో పెట్టాడు. వెంకాయమ్మగారు ఒక గ్లాసు కాఫీచేసి యిచ్చింది. తెల్లవారేసరికి రాముడికి జ్వరం తగ్గింది. ఏడుగంటల తరువాత డాక్టరువచ్చి చూచాడు. సాయంకాలం జ్వరం రాకుండా వుంటే ఇంటికి తీసుకుపోవచ్చు నని చెప్పాడు. వెంకాయమ్మగారు లచ్చిని భోజనానికి వుండమని చెప్పింది. "లేదు అమ్మగారూ! గేదెకు కుడితిపెట్టి పాలు తియ్యాలి. నన్ను తప్పితే అది రెండోవాళ్ళను చచ్చినా పాలు పితకనివ్వదు. ఇల్లూ, వాకిలీ చిమ్ముకుని, కాస్త అక్కడే తిండి తిని వస్తానండీ!" అని చెప్పి లచ్చి పల్లెకు వెళ్ళిపోయింది.

ఆనందుకు ఆ రాత్రి సరిగా నిద్ర పట్టలేదు. అతని ఆలోచనలన్నీ సుశీలమీాదనే వున్నాయి. తండ్రిగాని. చెల్లెలుగాని సుశీల ప్రమేయం ఎత్తలేదు. ఆనంద్ ఉదయం లేచి తొందర తొందరగా స్నానం ముగించి బట్టలు వేసుకుని కరణంగారి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఎవ్వరూ అగుపించలేదు. కరణంగారు బయటికి వెళ్ళారని చెప్పారు. గదిలోనుండి మాటలు వినిపిస్తున్నాయి. బహుశా బంధువు లెవరో వచ్చి వుంటారని అనుకున్నాడు అతను.

ద్వారంలోకి పిచ్చమ్మగారు తొంగిచూచింది. వాకిట్లో నిలబడివున్న ఆనందుని చూచి "నువ్వు వచ్చావటరా?" అను

కుంది లోపల. ఆమె గది గుమ్మంముందు నిలబడి "అమ్మాయి సుశీలా! సుబ్బాయి కొడుకు వచ్చాడమ్మా!" అని చెప్పి పోయింది.

గది లోపలనుండి క్రిష్ణారావు వచ్చాడు. అతనికి వెనుక సుశీలకూడా వచ్చింది. ఆనంద్ తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. అతను ఒక్కసారిగా కుంగిపోయాడు. అతని బుర్ర పని చెయ్యలేదు. అతను వెనుకకు తిరిగి పరుగెత్తి పోవాలనుకున్నాడు. కాని ప్రతిమలా నిర్జీవంగా నిలబడి పోయాడు.

క్రిష్ణారావు మందస్మితం చేస్తూ "యెప్పుడు వచ్చావు ఆనంద్!" అన్నాడు. ఆనందుకు ఆ మాటలు వినిపించలేదు. అతను వెర్రివాడిలా చూచాడు. సుశీల ముందుకు వచ్చి—

"అలా వున్నావేమిటి ఆనంద్! జబ్బు చేసిందా?" అంటూ అడిగింది.

ఆనందుకు కళ్ళు బైర్లు కమ్మాయి. అప్రయత్నంగా అతను చతికిలబడ్డాడు.

క్రిష్ణారావు ముందుకువచ్చి ఆనందును పట్టుకున్నాడు. ఆనంద్ శరీరంనుండి చమటలుదిగజారాయి. సుశీల దిగ్భ్రాంతి చెంది చూస్తూ నిలబడిపోయింది. అప్పుడే లోపలికి వచ్చిన కరణంగారు గాభరాగా "ఏమి జరిగింది" అని ప్రశ్నించారు. క్రిష్ణారావు వివరాలు చెప్పాడు. కరణంగారు స్వయంగా చావట్లో మంచం వాల్చి పక్క పరచారు. క్రిష్ణా

రావు ఆనందును అక్కడకు చేర్చి మంచంమీద పరుండ బెట్టాడు.

నాలుగు నిముషాల తరువాత "నేనుపోయి డాక్టరును తీసుకురానా?" అన్నాడు క్రిష్ణారావు

"బహుశా పైత్యగించి వుంటుంది. మరి కొంచెం సేపు చూదాం" అన్నారు కరణంగారు.

ఆనంద్ మంచంమీద లేచికూచుని పెదవులు తడి చేసుకుంటూ అన్నాడు. "డాక్టరు అవసరం లేదండీ! ఇందాక కళ్ళు తిరిగాయి. ఇప్పుడు మామూలుగానే వుంది" అంటూ అతను మంచం దిగి నిలబడ్డాడు.

కరణంగారు ఆనందును మంచంమీద కూచోబెట్టి "మరి కొంచం సేపు విశ్రాంతి తీసుకోవోయ్! ముంచుకుపోయింది ఏమీ లేదూ" అన్నారు తరువాత ఆయన సుశీల వైపు తిరిగి "అమ్మాయీ! లోపలికిపోయి ఒక గ్లాసు కాఫీ తెచ్చియివ్వమ్మా వాడికి"అని చెప్పారు.

కాఫీ తీసుకన్న తరువాత ఆనంద్ పూర్తిగా తేరుకుని మామూలుగా మాట్లాడాడు. క్రిష్ణారావు, కరణం గార్లు చూపిన ఆప్యాయతకు అతను ముగ్ధుడయ్యాడు లోలోపల వారికి కృతజ్ఞత తెలిపాడు. కరణంగారు పల్లెకు కబురుచేశారు. తండ్రివచ్చి ఆనంద్‌ను వెంటబెట్టుకుని తీసుకు పోయాడు. రెండు దినాలు ఆనంద్ మంచంమీదే గడిపాడు.

ఒకనాటి సాయంకాలం లచ్చి వచ్చి "మా ఇంటికి పోదాం రా మరిద్!" అంది. ఇద్దరూ కలసి లచ్చి ఇంటికి వెళ్ళారు.

లచ్చి మంచం వాల్చి పక్క వేసింది. ఆనంద్ మంచంమీద కూచున్నాడు. ఆమె అతనికి దగ్గరగా నేలమీద కూచుంది.

"రాముడు అగుపించడేం వదినా?" ఆనంద్ అడిగాడు.
"వాడికి యెక్కడ కాలు కుదురుతుంది? ఆటలకు పోయాడు"

"జ్వరం తగ్గిందా"

"తగ్గిందికాని డాక్టరుగారు నాలుగు రోజులవరకు యెక్కడకూ కదలనియ్యవద్దని చెప్పారు."

"వదినా! మొన్న కరణంగారి ఇంటిదగ్గర యెంతపని జరిగిందో విన్నావా?"

"ఆ విన్నాను. అట్లా యెందుకు జరిగిందీ! నీ కేమైనా జబ్బు చేసిందా?"

"అదేమీ లేదు వదినా!

"మరి?"

ఆనంద్ దీర్ఘంగా నిట్టూర్చాడు. రెండు నిముషాలు మవునంగా గడిచాయి. అతను నెమ్మదిగా ప్రారంభించాడు. "వదినా! నీ వాదనలను ఆధారంచేసుకుని సుశీలగారిమీద లేనిపోని భ్రమలు పెంచుకున్నాను. యీ నెల దినాలనుండి అహర్నిశలు నేను ఆమెను గురించే ఆలోచిస్తున్నాను. మొన్న కరణంగారి ఇంటిదగ్గర చూచిన దృశ్యంతో నా భ్రమలన్నీ చెదరిపోయాయి. నా మనస్సు వికలమైంది. శరీరమంతా చెమటలు క్రమ్మి నేను పడిపోయాను. అదిఅంతా నాకు తెలియకుండానే జరిగి పోయింది. పరీక్షలలో తప్పిపోయిన కుర్రాళ్ళు ఆ విధంగా

పడిపోవటం నేను చూశాను. ఇప్పుడు నా పనికూడా సరిగ్గా అలాగే జరిగింది. సుశీలగారి పరీక్షలో కృష్ణారావునెగ్గాడు. నేను తప్పిపోయాను."

లచ్చి నీరసంగా నవ్వింది. "మరదీ! మీ అమ్మాయి గారు దేవతఅనీ, అన్నింటికీ అతీతమైన వ్యక్తి అనీ ఆ రోజున నీవువాదించావు. ఆమె ఈ రోజున కృష్ణారావును వివాహం చేసుకోడానికి సిద్ధంగావుంది. ఇప్పుడు ఆమెను గురించి నీ అభిప్రాయమేమిటి?"

"ఆమెను గురించిన అభిప్రాయాలు నాకిక అనవసరం. సాధ్యమైనంత త్వరలో ఆమె విషయం పూర్తిగ మరిచిపోవడం ఒక్కటే నాకు కావలసింది."

"మరదీ! ఆ రోజున నీవు మాట్లాడుతూ వాళ్ళకూ మనకూ, హస్తి మశకాంతరం తేడా వున్నదని నీవే చెప్పావు గదా! మళ్ళీ ఆమె మీద భ్రమలు యెందుకు కల్పించుకున్నావు?"

"యేమి చెయ్యమంటావు? అదంతా నీచలవే. సంఘ సంస్కారం ముసుగుక్రింద సుశీలతో వివాహం అసాధ్యమేమీ కాదని నీవు ఆ రోజున వాదించావుగా! దానిమీద నేను ఆమెనుగురించి భ్రమలు పెంచుకున్నాను."

"సంఘసంస్కారం, సంఘసంస్కారం అంటూ పెద్దగా కబుర్లు చెప్పెడమేగాని, ఆ సంస్కారం కోసం జరిగిన వివాహాలు చాలాచోట్ల విఫలమవుతున్నాయి మరదీ! ఆ మధ్య భూస్వాముల అబ్బాయి ఒక అతను హరిజన

బాలికను వివాహం మాడాడు. వాళ్ళ పెద్దవాళ్ళు వారిని తమలో కలవ నివ్వలేదు. చాలా అవస్థలు పడ్డారు. వారికి యిద్దరు సంతానం కలిగారు. తరువాత విడాకులు పుచ్చుకున్నారు.

ఒక బ్రాహ్మణయువతిని ఆమెతండ్రి కేవలం సంస్కారం కోసం హరిజన యువకుడికి యిచ్చి వివాహం చేశాడు. యేమిలాభం? ఆ యిద్దరిమధ్యా ఎప్పుడూ తగవులు, మూకలే. ఒకబిడ్డ పుట్టాక విడాకులు పుచ్చుకున్నారు. ఆమె అనాధ శరణాలయానికి పోయింది. వాడు మళ్ళీ తనకులంలో మరొక అమ్మాయిని పెండ్లి చేసుకున్నాడు. సమాజంలో ఆర్థిక సమానత్వంవస్తేతప్ప యీ కులాంతర, మతాంతర వివాహాలు పైకిరావనుకుంటాను, అబ్బాయీ!" అంది లచ్చి.

"ఇక ఆ విషయం వదిలెయ్యి వదినా!" అన్నాడు ఆనందు చికాకుగా.

"సరేగాని మరదీ! నీకు ఒక సంబంధం చూశాను. నీకు యిష్టమైతే రేపు కలుసుకుని మాట్లాడుదువుగాని"

"యెక్కడ చూచావు? యెవరు వాళ్ళు?"

"మన పల్లెలోనే. మనవాళ్ళే!"

"యెవరో చెప్పు"

"సంతోషం"

ఆనంద్ ఉత్సాహం అగుపరచలేదు. "సంతోషం నాకంటే పెద్దదికాదూ!"

"అదేమిటయ్యా! వయసువచ్చిన మగాడివి. పెద్దది, చిన్నది అంటావేమిటీ! మహాఅయితే సంతోషం నీకంటె

ఒక సంవత్సరం పెద్దదేకావచ్చు. వయస్సులో వున్నవాళ్ళకి అదేమంత పెద్దతేడా కాదు.'' అంది లచ్చి.

''ఆమె భర్తను యేమిచేసింది?''

''యెప్పుడో విడాకులు యిచ్చుకున్నారు''

''నాకు యిప్పట్లో వివాహం చేసుకునే ఉద్దేశ్యంలేదు వదెనా!''

''అబ్బో! యిలాంటి పెద్దకబుర్లు చెప్పినవాళ్ళను చాలామందిని చూచాను మరదీ! మేరీని చేసుకునేందుకు ఒకప్పుడు సిద్ధపడ్డావుగదా! సంతోషం, యేసుదాసు నీమీద చూపుపెట్టుకుని వున్నారు, ఆనంద్!''

''మేరీ పోవడం నా దురదృష్టం వదెనా!''

''సంతోషంలో నీవు మేరీని చూడగలుగుతావు ఆనంద్!''

''మా నాయనతో సంప్రతించాలిగా!''

''మీ పెద్దవాళ్ళతో నేను మాట్లాడుతానులే!''

ఆనందుకు హృదయభారం తగ్గినట్టనిపించింది. అతను మళ్ళీ మామూలు ధోరణిలో పడ్డాడు. కాలేజీకి వెళ్ళేముందు అతను ఒకసారి యేసుదాసు ఇంటికివెళ్ళాడు. ఆనందును చూడటంతోనే యేసుదాసు అతనికి యెదురుగాపోయి ''ఆనందం రానాయనా! రా! నీతో మాట్లాడాలిరా! నువ్వువచ్చి వారం రోజులు అయిందట. ఒకనాడైనా యీ యేపుకి రాలేదేమిరా! మేరీ పోయాక మేము అంతమారం అయ్యాం అన్నమాట!'' అన్నాడు యేసుదాసు.

"అదేమీలేదు యేసుమామయ్యా! నాకు యీ మధ్య ఆరోగ్యం సరిలేదు అందుకనే మీ యింటికి రాలేక పోయాను."

యేసుదాసు మంచం వాల్చాడు. యిద్దరూ దానిమీద కూచున్నారు.

"యేమిటిరా అయ్యా! యేమన్నా జబ్బుచేసిందా?" అన్నాడు యేసుదాసు.

"పెద్దజబ్బు యేమీలేదు మామయ్యా! కొద్దిగా పైత్యగించింది."

"పైత్యం యేమిచేత్తుందిలేరా! పొద్దున్నేలేచి రెండు రోజులు నిమ్మకాయరసం తాగు. పైత్తం గియిత్తం యెగిరిపోద్ది."

ఆనంద్ చిన్నగా నవ్వాడు. "రేపు మళ్ళీ కాలేజీకి వెళ్ళిపోవాలి, మామయ్యా!"

"ఓహో! అట్టాగా! అదిసరేగాని నీతో ఒక యిసయం మాట్లాడాలని అనుకుంటున్నారా అబ్బాయీ!"

"అదేమిటో చెప్పు మామయ్యా!"

"చెబుతా యిను. యిప్పుడు నాకింద యకరంన్నర పొలంవుంది. అందులో ఒకయకరం మాసంతోషానికి యియ్యాలనివుంది. యకరంపోతే యింకా అరయకరం మిగులుద్దిగా! అది నాపేరనే వుంచుకుంటాను. నాకుమాత్రం ఇంకా యెవరున్నారు గనకా! నా అనంతరం ఆ అర యకరంకూడా మా సంతోషానికే చెందేట్టు కాయితం

రాత్తన్నా!" అంటూ యేసుదాసు ఆనంద్ ముఖంలోకి చూచాడు. ఆనంద్ మందస్మితం చేశాడు.

"మంచిదే మామయ్యా, అట్టాగే రాసెయ్యి!" అన్నాడు అతను.

"ఇంకా చెబుతా యిను" అంటూ యేసుదాసు మళ్ళీ అందుకున్నాడు.

"ఒరే అయ్యా, ఆనందం! మన మేరీ బతికివుంటే నీవు దాన్ని పెళ్ళి చేసుకునేవాడివి. నువ్వు ఆసుపత్రికివచ్చి మేరీతో మాట్లాడుతూనుంచున్నంత సేపూ మిమ్మల్ని చూసి మీరు తప్పకుండా పెళ్ళి చేసుకుంటారని అనుకునేవాడిని. కాని దాని బతుకు తెల్లార్చుకుని అది పోయింది. ఇక ఇప్పుడు సంతోషం మిగిలింది. సంతోషమే మేరీ అనుకుని దానిని పెళ్ళి చేసుకున్నావా, నాకష్టాలు తీరినట్టేరా అయ్యా! మీరు యిద్దరూ ఉద్యోగాలు చేస్తుంటే మిమ్ములను చూచుకుని మేరీని మరిచి పోగలుగుతానురా, నాయనా! నా మాట తీసెయ్యబాకరా బాబూ!" అన్నాడు యేసుదాసు. అతని కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఆనందుకు జాలివేసింది. "అట్టాగేలే, మామయ్యా! మరి సంతోషం అభిప్రాయంకూడా తెలుసుకోవాలిగా?"

"మొన్న లచ్చివచ్చి అన్నీ మాట్లాడిపొయ్యింది లేరా! నువ్వు చేసుకుంటానంటే సంతోషం అడ్డంచెప్పుతుందనేనా! అమ్మో! అది యెగిరి గంతెయ్యదురా!"

ఆనంద్ చిన్నగా నవ్వుకున్నాడు.

"నేను ఆనక మీయింటికి వెళ్ళి మీ అయ్యతో మాట్లాడి వస్తాలే!"

"యెందుకు మామయ్యా! లచ్చివదెన మాట్లాడతానందిగా!"

"లచ్చి వదెన యెందుకులేరా! మనం యేమన్నా పరాయివాళ్ళమా! మీ అయ్యా, నేనూ సాయంగా మేనత్త మేనమామ బిడ్డలం. యేదో పాడుపార్టీలువచ్చి యిప్పుడు యిట్టావుండాంగాని మొదట్లో మేము అంతా ఒక యింట్లో పెరిగినాళ్ళము గాదంటరా! నేను వాకిట్లోకివచ్చి బావయ్యా, మా పిల్లను మీ ఆనందానికి చేసుకో బావయ్యా! అని అడిగితే మీ అయ్య యీలుపడదు అని అనగలడంటరా! యెప్పుడూ అనలేడు!" అన్నాడు యేసుదాసు.

"సరే మామయ్యా! నేనుపోయి వస్తాను" అంటూ ఆనంద్ లేచి నిలబడ్డాడు.

"సంతోషం వచ్చేయాల అయ్యింది. కాసేపు కూకోరా అయ్యా!"

"సాయంకాలం మళ్ళీఒకసారి వస్తాను మామయ్యా!"

ఆనంద్ గుమ్మంవైపుకు నడిచాడు. యెదురుగా సంతోషం. అతను పక్కకు తప్పుకున్నాడు. ఆమె లోపలికి వచ్చింది.

"అమ్మా సంతోషం! ఆనంద్ ఇప్పుడేవెళ్ళిపోతానంటన్నాడమ్మా!" అన్నాడు యేసుదాసు చెల్లెలివైపు చూస్తూ.

సంతోషం వారగా ఆనంద్ వైపు చూచింది. "ఆనంద్! రెండునిముషాలు కూర్చో. యిప్పుడే వస్తాను" అంటూ ఆమె లోపలికిపోయి స్టౌ వెలిగించి టీకి నీళ్ళు పెట్టింది. సబ్బుతో చేతులు, ముఖము కడిగి బట్టలు మార్చుకుంది. నీళ్ళు మసమసలాడుతూంటే టీపొడివేసి డికాషను వడపోసింది. పాలుకూడా చేర్చి రెండుగ్లాసులు టీ తెచ్చి ఆనందుకు, యేసుదాసుకు అందించింది.

యేసుదాసు టీ తాగుతూ "ఒరే, అబ్బాయి ఆనందు! మా మేరీకి ఒక్కపని చేతయ్యేదికాదు. మరి అది బతికే వుంటే దానికాపరం యెట్టాగడతేరేదో! కాని మా అమ్మ సంతోషం వుంది చూశావా! అన్నిపనులు చకచకా చేసుకుపోతుందిరా! తెల్లవారిలేస్తే గబగబా నీళ్ళు చేరబోసి, బట్టలుతికి ఆరేసి, వంటచేసి నాకుయింత పెట్టి తను ఇంతతిని బడికి పరుగెడుతుంది. మళ్ళీ సాయంత్రం రాగానే టీ పెట్టి నాకు కాస్త యిచ్చి తానుకాస్త తాగి వంటచేసి, తరువాత కాసేపు పుస్తకాలు పుచ్చుకుని కూచుంటుంది. మా అమ్మ బంగారమే అనుకో" అన్నాడు యేసుదాసు.

"అవునుమామయ్యా! మీ చెల్లిల్ని గురించి నువ్వు ఆమాత్రం చెప్పకపోతే ఏమి బాగుంటుందిలే" అన్నాడు ఆనందు నవ్వుతూ.

"ఒరేయ్, నేను అబద్దం చెబుతున్నా ననుకుంటు న్నావా? నామాట నట్టిదేమో మన అచ్చప్పను అడుగు తెలుసుద్ది." అతను పొరుగింటి అచ్చమ్మను కేకలు పెట్టాడు.

"ఒలేఅచ్చప్పా! ఒకతడవ యిట్టారాయా!"

అచ్చమ్మ గొణుక్కుంటూ వచ్చింది. "యేసుదాసూ! యేంటిరా. అట్టా కేకలు పెడతాండావు?" అంది ఆమె.

"సి యమ్మా, రాయా! మన ఆనందం వచ్చాడే!"

"ఓరయ్యాయ్! ఆనందంటే నీ మేనమామ మనమడు వచ్చాడని నీకేమన్నా లావేసో! నాకేం ఒరిగిం దిరా అయ్యా"

"సియమ్మా సిగతరగా, కూకో యా! మాంచిమాట చెపుతాను."

యెదరింటి పున్నమ్మకూడా వచ్చింది. "యేంటి ఏసుదాసు బాయ్యా! అచ్చప్పని కేకలు పెడతాండా వెం దుకు!" పున్నమ్మ అడిగింది.

"అది మా పిన్నాంగా! దానికి ఒకమాంచి కబురు చెప్పాలిలే!"

"నేను యినగూడదా ఆ కబురు బాయ్యా!"

"అందరు యినే కబురేలేయా! అందులో దాపరికం ఏమీలేదు" అంటూ అతను ఆనంద్ వైపు చూచాడు. సంతోషం గుమ్మంలో నిలబడివుంది. ఏసుదాసు తడబడుతూ చెప్పాడు.

"ఆనందం మా...మా...సంతోషాన్ని పెళ్ళిచేసుకో డానికి వొప్పుకున్నాడు, అచ్చప్పా!"

అచ్చమ్మ మొహం వికసించింది. "ఆళ్ళిద్దరు పెళ్ళి చేసుకుంటే సిలకా, గోరింకలల్లే వుంటారు" అంది ఆమె.

ఆ తరువాత అచ్చమ్మ ఆనంద్ వైపు తిరిగి "ఒరే, అబ్బాయీ పెదమాలసుబ్బయ్య కొడుకా! నేను ఒక మాట సెపుతాను యింటావా! సంతోషంమాదిరిపిల్ల మన పల్లెలో కాదుగదా ఏడు పల్లెలు తిరిగినా నీకు దొరకదురా! ఆ ముదనష్టపోడు నిలుపుకోలేక పొయ్యాడుగాని దానికేమిరా మాణిక్యంలాంటి పిల్ల! దాన్ని చేసుకుంటే నువ్వు సుకపడతావు. పెద్దదాన్ని సెపుతూంటా. బాగాయిను" అంది. ఆనందు చిన్నగా నవ్వాడు.

పున్నమ్మ అందుకుంది "యిదుగో ఏసుబాయ్యా! నేను యింకోమాట చెపుతా యింటావా! మీ చెల్లెలేమో సంతోషం, మా తమ్ముడేమో ఆనందం. యిందులో ఏ పేరు గొప్పో సెప్పండి చూద్దాం" అంది.

"నీ యమ్మా! పున్నాం, నువ్వూ శానామాటలు నేరిచావే" అన్నాడు ఏసుదాసు.

"ఓలమ్మో, ఆ రెండుపేర్లు ఒకటేలేయే" అంది అచ్చమ్మ.

ఆ రాత్రి లచ్చి, ఏసుదాసూ ఇద్దరూ సుబ్బయ్య ఇంటికి పోయి పెండ్లి విషయం సంప్రదించారు. సుబ్బయ్య ప్రథమంలో ఆ వివాహానికి అంత సుముఖంగా లేడు. కాని లచ్చి చెప్పినమీదట అతను ఏసుదాసు పరిస్థితి అంతా గమనించి "సరే లేవయ్యా, ఏసుదాసూ! అట్టాగే చేద్దాం. మా వాడికి పరీక్షలయాక లగ్గాలు పెట్టుకుందాం" అన్నాడు.

ఏసుదాసు వెళ్ళిపోయిన తరువాత ఆనందు తల్లి మాలక్ష్మి అభ్యంతరం చెప్పింది. "యేం,యీ రెంటో పెళ్ళి

దాన్ని కట్టుకోడానికి నాబిడ్డ కేమి పట్టింది? ఆడికి కావాలిసినంత చదువుంది. పిల్ల నిచ్చేవాళ్ళు దొరకరా యేంటి?"

సుబ్బయ్య విసుక్కున్నాడు. "నీయమ్మా, నా యాలదానా! మద్దిలో నీ సణుగుడు ఏంటే! ఆళ్లమాత్రం యెక్కడోళ్ళే! ఆళ్ళు మనాళ్ళు కాదా!" అన్నాడు సుబ్బయ్య.

మాలక్ష్మి దవడలు నొక్కుకుంది. "ఓలమ్మో! ఆళ్ళు నీయమ్మపపు వాళ్ళయితే నీకేమన్నా ఒరిగిందేమో! నాకేమి పట్టిందీ! నా అబ్బేపువాళ్ళా, నా అమ్మేపువాళ్ళా! యీ సంబంధానికి నేను ఒప్పుకోను" అంది నిష్కర్షగా.

ఆనందు, నీలం యిద్దరూ తల్లిని మందలించారు. "అన్నయ్య ఒప్పుకున్న తరువాత మధ్య నీగోల ఎందుకమ్మా; సంతోషంవదెనకంటే మంచిదానిని నీవు మాత్రం యెక్కడ తీసుకురాగలవు" అంది నీలం.

మరునాటి ఉదయం ఆనందు కాలేజీకి పోతూ సంతోషంతో చెప్పి పోడానికి ఏసుదాసు ఇంటికి వెళ్ళాడు. అతను నీలం రంగు పేంటూ, తెల్లటి బుష్షర్టు వేసుకుని నీటుగా తయారయ్యాడు. సంతోషంకూడా నీలం బోర్డర్ వాయిల్ చీరకట్టి కెంపు రంగు సిల్కు బ్లౌజు వేసుకుంది. రోడ్డు చీలే వరకు వారు యిద్దరు జంటగా కలసిపోయారు. పల్లెలో అమ్మలక్కలు దవడలు నొక్కుకున్నారు. "ఓలమ్మో! పెళ్ళి కాకముందే జోడడి తిరుగుతున్నారుతల్లో!" అంది ఒక ముసలమ్మ.

♦ ♦ ♦ ♦ ♦

పిచ్చమ్మగారు బియ్యం చేట ముందుపెట్టుకుని రాళ్ళు ఏరుతూ ముందు గుమ్మంలో కూచుంది. గది తలుపులు తీసుకుని క్రిష్ణారావు బయటికి వచ్చాడు. అతని వెనక సుశీల కూడా వచ్చింది. క్రిష్ణారావు వెళ్ళిపోతుంటే అతని వైపు చూస్తూ సుశీల గుమ్మంలో నిలబడింది. అచ్చమ్మగారు అనుమానాస్పదంగా సుశీలవైపు చూచింది.

ఆమె మందస్మితంచేసి "ఏమిటి మామ్మా, నా వంక అలా చూస్తావ్?"

"ఆ! ఏముందిలే! నేనుఒకమాట చెపుతా వింటావా?"

"తప్పకుండా వింటాను, మామ్మా"

"ఆ అబ్బాయి క్రిష్ణారావు నీకు ఎంత చదువు నేర్పుతున్నా అతన్ని పెట్టుకుని వంటరిగా గదిలో కూచోడం మంచిదికాదమ్మా! ఒకవేళ మీ నాన్నగారు చూచికూడా చూడనట్టు ప్రవర్తిస్తున్నారేమో! నేను మాత్రం చూడలేక పోతున్నాను, అమ్మాయీ"

సుశీల చిన్నగా నవ్వింది "మామ్మా, నేను క్రిష్ణారావుగారిని వివాహం చేసుకుంటాను"

పిచ్చమ్మ సుశీలవైపు నిర్ఘాంతపోయి చూచింది. ఆమె దవడలు నొక్కుకుంది. "అవ్వ, ఆ శూద్రవాడిని చేసుకుంటావా!"

"ఆయన చాలా మంచివారు మామ్మా"

"శూద్ర పుటక పుట్టిన తరువాత యింకా మంచేమిటమ్మా"

లోపల "నీవు ఎక్కడి దూలగొండి ముండవే" అనుకుంది సుశీల. పిచ్చమ్మగారిని బోల్తా కొట్టించాలనుకుని ఆమె నెమ్మదిగా "ఆ విషయం నీకు దేనికి గాని మామ్మా! నావివాహానికి నీకు యేమి బహుమతి కావాలో కోరుకో!"

పిచ్చమ్మగారి మొహం చాటంత అయింది "నీవు ఏమి యిస్తే నేను కాదంటాను తల్లీ! కన్నబిడ్డకంటే ఎక్కువగా చూస్తుంటినిగదా!"

"అందుకే చెప్పు మామ్మా! నీవు ఏమి కోరుకున్నా నేను కాదని అనను"

"అదేమి బాగుంటుంది తల్లీ! నీవే ఏదోవకటి, నీనోటి మీదుగా అంటే, నేను అదే పదివేలుగా భావిస్తాను"

"నీచేతులు బోసిగా వున్నాయిగా!వక జత మురుగులు చేయిస్తాను మామ్మా!"

"మాతల్లే! అలానే చేయించు. కాని అమ్మా! యీ ఉంగరం వేలికి ఒక్క చిన్నఉంగరంకూడా చేయించుతల్లీ!"

"అలాగే చేయిస్తాను మామ్మా!"

"ఇదిగో అమ్మాయ్, మీ మేనత్త శాంతమ్మగారి చేతులకు వున్నాయి చూచావుగా పలకల మురుగులు! అలాంటివే చేయించు అమ్మా! ఘట్టిగా పది కాలాల పాటు వుంటాయి"

"ఓ! అలానే మామ్మా"

"కాని అమ్మాయి, బంగారం ధర మండి పోతూంది గదా!

"మండిపోతే మనకేం! నావి ఆరు జతల గాజులు న్నాయి. వాటిలో రెండు జతలు చెడగొడితే నీకు మురుగులు, వుంగరంకూడా అవుతాయి"

"అయితే అమ్మాయీ, మరి నీకో!"

"నేను నగలు పెట్టుకోలే!"

"యెందుకనమ్మా!"

"మా క్రిష్ణారావుగారు నగలు పెట్టుకోవద్దంటున్నారు"

"అదేమి మాటమ్మా? నీవీ, మీ అమ్మవీ, శకుంతలవీ తట్టెడు బంగారం వుందికదా! అదంతా ఏమిచేస్తారమ్మా!"

"అవన్నీ మార్చి ఊళ్ళో హాస్పిటలు కట్టిద్దా మంటున్నారు క్రిష్ణారావుగారు".

"మంచిదే తల్లీ! మీ పేరు కలకాలం వుంటుందితల్లీ!"

"సరే కాని మామ్మా! క్రిష్ణారావుగారు మంచివారే నంటావా!"

"అయ్యో తల్లీ! ఆయన కేమమ్మా, మన్మథు డిలా వుంటాడు"

"అది సరే మామ్మా! ఆయన మంచివారేనా?"

"శ్రీరామచంద్రుడి లాంటివాడు, ఆయనకు ఆయనే సాటి."

"అయ్యో బాబోయ్! రామచంద్రుడు సీతను అడవికి పంపించాడుగా మామ్మా?"

"అయ్యో, యెంతమాట! ఆయన సాక్షాత్తూ విష్ణు స్వరూపమేగా! ధర్మ సంరక్షణార్థం ఆయన అలా చేశారు

గాని మరొక విధంగా మనం అరుకోరాదు తల్లీ!" అంటూ పిచ్చమ్మగారు చెంపలు వేసుకుంది.

సుశీలమ్మ చిన్నగా నవ్వింది. "ఎవ్వరి స్వరూపమైతే మాత్రం, కట్టుకున్న పెళ్ళాల్ని కారడవ్రలపాలు చేయడం ఘోరం కాదా మామ్మా!"

అచ్చమ్మ మళ్ళీ చెంపలు వాయించుకుంది. "అయ్యో నేను చెప్పలేనమ్మా నీకూ!" అంటూ ఆమె చేట తీసుకుని వంట ఇంట్లోకి పోయింది.

ప్రకరణం 12

పల్లెకు ఉత్తరవైపున చెఱువు వుంది. ఆ చెరువును ఆనుకుని స్మశానాలు వున్నాయి. ఆ స్మశానాల వైశాల్యం నాలుగు అయిదు యకరాలకు పైగా వుంది. స్మశానంకోరకు కొంత మినహాయించి మిగిలిన బంజరు భూమి సాగులోకి తేవాలనే అభిప్రాయం లచ్చికి తట్టింది. ఆమె పెద్దలందరినీ సమావేశపరచి స్మశానాలకు కొంత విడగొట్టి మిగిలినది సాగు లోనికి తేడానికి ఉపాయాలు ఆలోచించింది. లచ్చి సూచన లను కొందరు బలపరిచారు. మరికొందరు వ్యతిరేకించారు. కొద్దిమంది తటస్థంగా వుండిపోయారు.

అయినా లచ్చి వదలిపెట్టలేదు. అది సాగు చేసినందు వలన కలిగే సాధక బాధకాలను ఆమె వివరించింది. పెట్టుబడి కావాలిస్తే ఊళ్ళో ఆసాములనుండి తను స్వయంగా తీసుకు వస్తానని చెప్పింది. ఇంటకి ఒక యనిషి చొప్పున పల్లెలోవున్న అరవై యిళ్ళకు అరవైమంది ఆ బంజరులో చాకిరీ చేస్తే నాలుగు రోజులలో అద చదును అవుతుందని చెప్పింది. అవసరమైతే గ్రామంలోకి పోయి పది అరకలు తోలించుకు వచ్చి అది అంతా దున్నుదామని సూచించింది. ఆ నాలుగు యకరాలూ సాగులోకి తీసుకు రాగలిగితే కరువుకాలంలో పల్లెకు కాస్త ఆధారంగా వుంటుందని చెప్పింది.

మధ్యలో ఒకరు లేచి ప్రశ్నించారు. "వరి పైరులన్నీ పొట్టకు వచ్చాయి గదా, ఇప్పుడు దానిలో నువ్వు సాగు చెయ్యబోయే దేమిటి?"

ఆమె వెంటనే సమాధానం చెప్పింది. "మనం వరే నాటాలని యెక్కడవుంది? యీ సంవత్సరానికి మెట్ట పైర్లు వేద్దాం. వచ్చే వేసవిలో గడ్డతీసి అంతా నాట్లు వేద్దాం. ప్రస్తుతం పనీ పాటూ లేకుండా పల్లెలో చాలామంది ఖాళీగానే తిరుగుతున్నారుగా! అట్లా తిరిగే బదులు ఆ భూమిలోకి పోయి, అందరం నిలబడి అది చదును చేద్దాం. ఒకవేళ యీ సంవత్సరం యేటూ పైరు కాకపోయినా, ఆ మూలాన మనకు పోయేదేమీ లేదు. కాకిపోతే ముందునాటికైనా పండకుండా వుండదుగదా! బాగా ఆలోచించండి" అంది ఆమె.

నలుగురూ సరిఅంటే సరి అన్నారు. వ్యతిరేకించిన వారు లేరు మరునాడు పల్లెఅంతా పలుగులు, పారలు గొడ్డళ్ళు పుచ్చుకుని బయలు దేరారు. ముందునడుస్తున్న యువకులు పాట అందుకున్నారు.

చెట్టుచేమా గొట్టి మిట్టలు-పల్లాలు
మట్టముగ చేదాము రారండోయి.॥
పుట్టలన్నీమార్చి, గట్టులన్నీ పేర్చి
దిట్టముగ పండించు దామండోయ్
నాసామి దిట్టముగ పండించు దామండోయ్
"జై, వ్యవసాయ కూలీసంఘానికి, జై॥"

జేజేలుకొడుతూ హుషారుగా అంతా పనిలో వంగారు. కొందరు చెట్టూ చేమాకొట్టారు మరి కొందరు

కంపా గట్టా తీశారు. కొందరు మిట్టలు, పుట్టలు తవ్వారు. మరికొందరు పల్లాలు పూడ్చారు.

నాలుగు రోజులలో మూడు యెకరాలకు పైగా చదును చేశారు. లచ్చి గ్రామంలోకిపోయి కరణంగారిని, క్రిష్ణారావును అడిగి అరకలు తోలించుకు వచ్చింది. రెండు యకరాలలో జొన్న చల్లారు. అరయకరంలో జనుము వేశారు. మరో అరయకరంలో గోగులు వేశారు.

జాయివర్షాలు పడ్డాయి. రోజులు, వారాలు గడిచాయి. పైరు యేపుగా పైకివచ్చింది. పల్లెవాసుల ఆనందానికి మేరలేదు. పంట అంచనాలు కట్టారు. జొన్న బాగా పండితే యేడెనిమిది బస్తాలకు తక్కువకావు. గోంగూరకు అయిదు బస్తాలు యిస్తారు. పైగా జనుములు, ఆ పైగా గోగునార. "మనకట్టం మళ్ళిద్ది." అనుకున్నారు అంతా. ఒకాయన అన్నాడు.

"మన లచ్చిఅసలు యే రష్యా దేశంలోనో పుట్టాలిసిందిరా! యేదో మన అదృష్టంకొద్దీ మనపల్లెలో పుట్టింది."

గ్రామంలోని భూస్వాముల కళ్ళుకుట్టాయి. "ప్రభుత్వ బంజరుభూమిని కమ్యూనిస్టులు ఆక్రమించుకున్నారు." అంటూ మునసబు రిపోర్టు పంపాడు

దరియాప్తు చేయడానికి అధికార్లువచ్చి పల్లెలో పెద్దల నందరినీ పిలిపించి స్టేటుమెంట్లు తీసుకున్నారు.

లచ్చి ముందుపీఠీలో నిలబడింది. అధికారి ప్రశ్నించాడు. "యేమమ్మా! మీరు పైరులేసిన బంజరు భూమి ప్రభుత్వానిది. ప్రభుత్వ అనుమతిలేకుండా దానిలో

యెవరు ప్రవేసించినా వారు నేరస్తులుగా పరిగణించబడతారు. ఆ భూమిలో ప్రవేసించినవారిని కోర్టు విచారించి శిక్ష విధిస్తుంది. అందుకునువ్వు చెప్పుకునేదేమైనా వుంటే చెప్పుకోవచ్చు." అన్నాడు ఆయన.

లచ్చి చెప్పుకు పోయింది. "అయ్యా! మేము సాగు చేసిన బంజరుభూమి మా మాలపల్లె స్మశానాలకు సంబంధించినదని మాతాతలు, తండ్రులు చెప్పగా విన్నాం. యీపల్లె యేర్పడిననాటినుండీ యీ బంజరు మాపల్లెవాసులకు హక్కు-భుక్తాలలోనే వుంటూ వచ్చింది. పల్లెలోవున్న పసువుల మేతకు ఆభూమి బీడుగా వుపయోగపడుతూంది. ఆ విషయం మా కరణంగారు కూడా స్పష్టంచేశారు. ప్రభుత్వానికి యీ బంజరుతో యేవిధమైన సంబంధములేదు. సంవత్సరాలుగా బీడేసివున్న ఆ బంజరును మా సాముదాయక వినియోగం నిమిత్తం అందరం కలసి సాగుచేసుకున్నాం. ఆ భూమి మీదా పైరుమీదా హక్కు పల్లెవాసులదేగాని ప్రభుత్వానిది మాత్రంకాదు" అంటూ ముగించింది ఆమె.

ఆతరువాత చింతయ్య ముందుకువచ్చాడు. చింతయ్య డెభ్భైయేళ్ళ వృద్ధు. అధికార్లకు దణ్ణంపెట్టి అతను చెప్పుకు పోయాడు.

"అయ్యా! యీ వల్లకాట్లోవున్నబంజరు మా చిన్నతనంలో పది ఎకరాలకు పైగానే వుండేది. కాని దానిచుట్టూ వున్న రైతులు యేటా కాస్త గదుముకుంటూ వచ్చారు. యీనాటికి అది సగానికి తగ్గింది. మేము అట్టా చూస్తూ కూకుంటే యింకో నాలుగైదు ఏళ్ళలో అదికూడా లేకుండా

పోయేదేకాని నేటి కాలానికి మా లచ్చి పున్నెమా అంటా అది కాత్తా యవసాయం చేయగలిగాం. యేమైనా పండితే పల్లెలో తలా మానెడు తింటాం. ఆ బంజరు మా వల్లకాళ్ళ భూమే బాబూ!" అన్నాడు చింతయ్య.

మునసబు ముందుకువచ్చి అధికారితో "అయ్యా! యిది ప్రభుత్వ పోరంబోకుల లెఖ్ఖలో వుందండీ! కావాలంటే లెఖ్ఖలు చూపగలను" అన్నాడు ఆయన.

పల్లెవాసులలో ఒకరు అన్నారు. "నోవండోయ్ బాబూ! ఈ మునసబువి అన్నీ తిరకాసు లెక్కలండీ! ఆయనమాట నమ్మబోకండి దొరలు."

లచ్చి ముందుకువచ్చి అధికారికి నమస్కారం చేసింది. యీలోగా మునసబు అందుకున్నాడు.

"యిదేనండి కమ్యూనిస్టునాయకురాలు! యీపోరంబోకు సాగుచేయించిందికూడా యిదేనండీ!" అన్నాడు.

లచ్చి కొరకొరలాడుతూ మునసబువంక చూచింది. ఆమె అధికారివైపు తిరిగి చేతులు కట్టుకుని నిలబడి చెప్పుకుపోయింది. "అయ్యా! నేను కమ్యూనిస్టునేనండీ. కమ్యూనిస్టుగా వుండటం నేరంకాదనుకుంటాను. కాని ఈ మునసబువున్నాడే యీయన యిక్కడ కాపుసారా తాగే ముఠాకు నాయకుడు. ఈయన బ్రతుకంతా దెబ్బలాటలు, ఖూనీల, లోనేగడిపాడు. నాభర్తను పట్టపగలే కూనీ చేయించాడు అప్పట్లో ప్రభుత్వం కేసుకూడా పెట్టింది. దాన్లో ఈయనేమొదటిముద్దాయి. కాని పదివేలదాకా ఖర్చుపెట్టి తనమీద కేసులేకుండా చేసుకున్నాడు.

మా మాలలమీద యెన్నో అక్రమ దొంగతనం కేసులు పెట్టాడు ఒక్కటీ ఋజువు కాలేదు చివరకు అవన్నీ యెత్తి వేసుకున్నాడు. నెలరోజుల క్రితం మా మాలలను యెక్కడ పడితే అక్కడ తన రౌడీగుంపుతో కొట్టించాడు. అదిచాలక పెద్ద రైటింగు జరిపాడు. దానిలో మాత్రం చచ్చేదెబ్బ తిన్నాడు. చివరకు అదికూడా రాజీపడి యెత్తివేసుకున్నాడు. ఈయన మునసబు అన్నమాటేగాని ఈమనిషికి నీతీ, నిజాయితీ లేదండి! కాకపోతే చేతినిండా ఆస్తివుంది. అదికూడా అయనదికాదులెండి. ఆడబ్బుతో అందరినీ ఆకట్టుకొని జయించుకు వస్తున్నాడు. ఈమునసబు మాటలువిని మాకు అన్యాయం చేయవద్దని నేను మనవిచేస్తున్నాను." అని చెప్పి లచ్చి ముగించింది.

"మునసబుగారిని గురించి తెలుసుకోడానికి నీదగ్గరకు రాలేదమ్మా మేము!" అన్నాడు అధికారి

"నేను కమ్యూనిస్టునని మునసబు మీకు యెరుకచేసి నప్పుడు మునసబు వృత్తాంతం నేను చెప్పడం పొర పాటంటారా అధికార్లు!" అంది లచ్చి.

లోపల "ఈవిడ యెక్కడో అసాధ్యురాలిలావుందే" అనుకున్నాడు అధికారి. పైకి మాట్లాడలేదు.

కొద్దిరోజులు గడిచాయి. మళ్ళీయింకో అధికారి వచ్చాడు. బంజరుభూమి కొలతలు వేస్తుంటే పల్లె అంతా అక్కడ పోగయ్యారు. లచ్చి పోయి అడ్డం తగిలింది.

"అడ్డం వచ్చినవాళ్ళను అరెస్టుచేసి తీసుకుపోతాను" అధికారి బెదరించాడు. అయినా లచ్చి జంకలేదు. అధికారి చేసేదిలేక కొందరిపేర్లు వ్రాసుకుని వెళ్ళిపోయాడు.

లచ్చి ఆలోచనలో పడింది. స్మశానాలు బాగుచేసి పైరువేస్తే అదితమకు దక్కకుండా చెయ్యడానికి గ్రామస్తులు, అధికార్లు యెందుకుగాను కుట్రలు పన్నుతున్నారో ఆమెకు అర్థంకాలేదు. "మాలల స్మశానాలమీద హక్కు మాలలదేగా! మరొకరికి యెలా వుంటుందీ! వాళ్ళ తాతలు దిగివచ్చినా అది వదిలేదిలేదు." అనుకుందామె.

ఆమె ఆలోచనలు క్రిష్ణారావు, సుశీల, ఆనంద్, సంతోషం గార్లమీదికి పోయాయి. క్రిష్ణారావు,ఆనంద్ వివాహాలు చేసుకుంటారు. తను వంటరిదానిని అయ్యాను అనుకుందామె. "ఇప్పుడుగనక గోపీ తిరిగివస్తే అతనినికాదని అనగలనా! యేమో అతని భావాలు యెలావున్నాయో! అసలు అతను వున్నాడో, లేడో?" అనుకుందామె.

కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఒకరోజున కూలీలు బాగా చీకటి పడినతరువాత పల్లెకువచ్చేసరికి స్మశానంబంజరు రాజకీయబాధితుడు గోపాలానికి యిచ్చారనీ, ప్రభుత్వ అధికార్లువచ్చి హద్దుపెట్టి పోయారనీ తెలిసింది.

వెంటనే పెద్దలంతా ఒకచోట సమావేశమయ్యారు. యేమైనా సరే ఆభూమి రాజకీయ బాధితునికి స్వాధీనం చెయ్యకూడదని నిర్ణయించు కున్నారు. కాని ఆరాత్రి పల్లె

అంతాపోయి దానిలోవున్న పైర్లు వేళ్ళతోసహా పీకి తెచ్చుకున్నారు.

రెండుదినాలు' గడిచాయి. తెల్లవారేసరికి పోలీసు బందోబస్తుతో అధికార్లు వచ్చి పల్లెలోని పెద్దలను పిలిపించి స్మశానాలపక్కనవున్న బంజరుభూమి రాజకీయ బాధితుడు గోపాలంగారికి మంజూరు చేయబడిందనీ, యితరులు ఎవరైనా దానిలో ప్రవేశిస్తే చట్టప్రకారం వారు శిక్షింప బడతారనీ తెలియ జేశారు.

లచ్చి ముందుకువచ్చి అధికార్లను అడిగింది. "అయ్యా! యీ గోపాలానికీ, కాంగ్రెసుకూ యేనాడూ పొత్తులేదుగదా! యీయన రాజకీయ బాధితుడు యెట్టా అయ్యాడండీ! లోగడ ఒకసారి జిల్లాబోర్డు యెన్నికలువస్తే యీ గోపాలమే కాంగ్రెసుజండాలు పీకిపారేసి, కాంగ్రెసు వాలంటీర్లను పట్టుకుని కొట్టాడు. అప్పుడు పోలీసులు వీరిమీద కేసు కూడా పెట్టారు. తరువాత 1952 యెన్నికలలో ఈ గోపాలం కాంగ్రెసుతోపోటీచేసిన జమీందారు జండావేసుకు తిరిగాడు. అప్పటిదాకా ఈయన కాంగ్రెసువాడూకాదు, రాజకీయ బాధితుడూకాదు. ఇప్పుడు ఈయన రాజకీయ బాధితుడు యెట్టా అవుతాడండీ!" అంటూ నిలదీసి అడిగింది.

"మాకు అవన్నీ అనవసరమమ్మా! పైనుండి వచ్చిన ఉత్తరువులను అమలు జరపడానికి మాత్రమే మేము యిక్కడకు వచ్చాము."

లచ్చి చిరచిర లాడింది. "అయ్యా! కళ్లూ, చెవులూ వున్నవాళ్ళను యెవరినైనా అడగండి. ఈ రాజకీయ బాధితుడి బండారం యేమిటో మీకే తెలుస్తుంది. ఈయన అసలు కాపుసారా మనిషిఅయ్యె. అయినా మాస్మశానాల భూమే దొరికిందా ఈ నకిలీ రాజకీయ బాధితుడికి కట్టబెట్టడానికి ఈ ప్రభుత్వం యివ్వదలచుకుంటే యెన్నిలక్షల యకరాల బంజర్లు లేవు? రాజకీయబాధితుడు అయ్యేది, వాడి తాత అయ్యేది మాస్మశానాలలో మాత్రం యెవరినీ కాలు మోపనీయం" అంది లచ్చిఆవేశంగా.

అధికార్లు విస్తుపోయి చూచారు.

"ఈవిడ యెవరో అసాధ్యురాలిలావుందే!" ఒక ఆఫీసరు గొణిగాడు.

"లాయరులాగా వాదిస్తోంది." యింకొకరు అన్నారు.

"కమ్యూనిస్టటండీ!" పోలీసు యినస్పెక్టరు అన్నాడు.

"అరెస్టుచేసి తీసుకుపోదామా?" అందులో ఒకరు సూచించారు.

"ఇప్పుడు అనవసరం. భూమిగోపాలానికి స్వాధీనం కాకుండా అడ్డుపడినప్పుడు చూదాం" అన్నాడు ఒకఅధికారి.

కొద్ది దినాలు గడిచాయి. పల్లెలో చీలికలు తీసుకు రావడానికి మునసబుముఠా విశ్వప్రయత్నాలు చేశారు. కాని ప్రయోజనం లేక పోయింది.

కోతలు అయిపోవచ్చాయి. కట్టివేతలు ముమ్మరంగా సాగుతున్నాయి. కూలీలు పగలంతా శ్రమచేసి శీతాకాలపు చలికి తలుపులు బిగించుకొని పడుకున్నారు. రాత్రి రెండు

ర఼్ామములు దాటింది. లచ్చి ఇంటికి నలువైపులా మంటలు అలుముకన్నాయి. పల్లెఅంతా లేచారు. యెటు చూచినా కేకలు, బొబ్బలు. లచ్చి ఇంటికి బైట గొళ్ళెంపెట్టి తాళం బిగించివుంది. పలుగులు పెట్టి తలుపులు పగులగొట్టారు. అప్పటికే అంతా భస్మం అయిపోయింది.

మంటలు యితరపాకలకు పాకకుండా కొందరు జాగ్రత్తపడ్డారు. తలుపులమీద నీళ్ళుకుమ్మరించి లోపలికి చూచారు. తల్లీబిడ్డల శవాలు తలుపు దగ్గరేపడి వున్నాయి.

తెల్లవారేసరికి యిరుగు పొరుగు గ్రామాలనుండి వచ్చినవారితో పల్లె అంతా కిటకిటలాడింది. అధికార్లు వచ్చి దర్యాప్తుచేసి వెళ్ళారు. లచ్చికి పిరోచితంగా అంత్య క్రియలు జరిపారు. అప్పటివరకు పల్లెలో యే ఇంట్లోనూ పొగరాజలేదు. ఒక్కరుకూడా కూలికి, నాలికి పోలేదు. రెండోరోజు ఉదయం బావిదగ్గర పదిమంది పోగయ్యారు. అందరి ముఖాలూ విచారంలో మునిగిపోయాయి.

కోటమ్మ బిందె భావిదగ్గర పెట్టి అంది. "ఒలే, చిన్నమ్మాయ్! నిన్న సందెవేళ ఆ గోపీ వచ్చాడేయ్! ఒకకాలు విరిగిపోయింది. కొయ్యకాలుతో కుంటుతూ నడుస్తున్నాడు."

"మిలటరీలో పోయింది గామోసు."

"అబ్బో! లచ్చిగోతిమీదపడి ఆ గోపీయేమి యేడిచాడు, ఏమి యేడిచాడు! మనందరికంటె యెక్కువ యేడిచాడు."

"అబ్బో, పిన్నమా! గోపీ యేడుపుచూస్తే నా కడుపు చెరువై పోయిందనుకో!"

"ఆ దుమ్ములోపడి దొర్లాడే, తల్లో!"

"మళ్ళీ ఒక రేతిరికాడే లేచి యెళ్ళి పోయాడంటా"

"ఎక్కడికి పోయాడో - ఎటుపోయాడో?"

"యేమో ఎవరికి తెలుస్తుందీ!"

కుండలు, బిందెలు భుజాల కెత్తుకుని నలుగురూ నాలుగు వైపులా పోయారు.

సమాప్తం

[illegible] గ్రంథాలయం తేలప్రోలు కృష్ణాజిల్లా

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA113B136
పుస్తకం పేరు	పల్లెవాసి
తారీఖు	26/10/24
ముందు అట్ట	no
వెనుక అట్ట	no
మొత్తం పేజీలు	225
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	no
లేని పేజీలు	1 to 4
తయారు చేసినది	Rehana
పేజీలు విడదీసినది	Rehana
స్కాన్ చేసినది	Aswini
పరీక్ష చేసినది	pragathi
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good